సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 202

సోమవారం 13-10-2025



'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు పాడిపంటలతో పులకించాలి'

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



330 సరిపోలేదు

మహిళల ప్రపంచకప్‌లో భారత్‌పై విజయం సాధించిన ఆస్ట్రేలియా -14లో



అప్పుతో 'ఐపీవో' ఆట

రుణాలకు పెరుగుతున్న డిమాండ్ అదృష్టం తోడైతే మంచి లాభం -15లో



ఉద్రిక్తంగా పాక్-అఫ్గాన్ పోరు

పాకిస్తాన్-అఫ్గానిస్తాన్ సరిహద్దు వెంట దాడుల పర్వం కొనసాగుతోంది. భారీ నష్టం కలిగించినట్లు ఇరుదేశాలు ప్రకటించాయి.

వివరాలు 6లో ▸



మీ బెదిరింపులకు భయపడం

రేర్ ఎర్త్ మినరల్స్ సరఫరాలో నెలకొన్న వివాదంపై అమెరికా బెదిరింపులకు భయపడబోమని చైనా స్పష్టం చేసింది.

వివరాలు 6లో ▸



గాజాలో సాయానికి ఏర్పాట్లు

గాజాలో కాల్పుల విరమణ అమల్లోకి రావడంతో పాలస్తీనియన్లకు తక్షణ సాయం అందించే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి.

వివరాలు 6లో ▸



అర్ధరాత్రి బయటికెందుకు?


గ్యాంగ్‌రేప్‌కు గురైన వైద్యవిద్యార్థిని అర్ధరాత్రి బయటకు ఎందుకు రావాల్సి వచ్చిందని బెంగాల్ సీఎం మమత ప్రశ్నించారు.

వివరాలు 6లో ▸

లోటు.. లక్ష కోట్లు

గత ఐదేళ్లలో కేంద్రం నుంచి రాష్ట్రం ఆశించిన స్థాయిలో రాని గ్రాంట్ ఇన్ ఎయిడ్

- వార్షిక బడ్జెట్‌లో ఏటా పెద్ద సంఖ్యలో గ్రాంట్లను చూపిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- మార్చి నెలాఖరుకు కేంద్రం ఇస్తోంది అందులో 30 శాతం లోపే
- 2020-21లో చివరిసారి బడ్జెట్ ప్రతిపాదనకు మించి గ్రాంట్ ఇన్ ఎయిడ్
- 2021-22 నుంచి 2025 వరకు ఆశించింది రూ.1,65,349 కోట్లు.. కేంద్రం ఇచ్చింది రూ.41,114 కోట్లు..
- ఈ ఏడాది తొలి ఐదు నెలల్లో వచ్చింది రూ.1,673 కోట్లే



సాక్షి, హైదరాబాద్

కేంద్రం నుంచి తెలంగాణ రాష్ట్రం ఆశించిన గ్రాంట్ ఇన్ ఎయిడ్ గత కొన్నేళ్లుగా అతి తక్కువగా వస్తోంది. 2021-22 ఆర్థిక సంవత్సరం నుంచి గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో కేంద్రం నుంచి వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం ఆశించి వార్షిక బడ్జెట్‌లో ప్రతిపాదిస్తున్న నిధులకు, ఆ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి కేంద్రం ఇచ్చే మొత్తానికి పొంతన ఉండటం లేదు. గత ఐదేళ్లలో రాష్ట్రం ఆశించిన మొత్తంలో రూ.లక్ష కోట్లకు పైగా లోటు ఉండడం గమనార్హం. గ్రాంట్ ఇన్ ఎయిడ్ నిధులను 2020-21లో చివరిసారి రాష్ట్రం ఆశించిన మేరకు కేంద్రం ఇచ్చింది. ఆ ఏడాదిలో రూ.10 వేల కోట్లు ఈ పద్దు కింద వస్తాయని అంచనా వేస్తే రూ.15 వేల కోట్ల వరకు ఇచ్చింది. దీంతో మరుసటి ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా రూ.38 వేల కోట్లు వస్తాయని అంచనా వేసి వార్షిక బడ్జెట్‌లో ప్రతిపాదించింది. కానీ, ఆర్థిక సంవత్సరం ముగిసే మార్చి 31 నాటికి కేంద్రం నుంచి వచ్చింది రూ.8 వేల కోట్లు మాత్రమే. అప్పటి నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వరకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ నిధుల విషయంలో భారీ అంతరం కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఆశించినదాంట్లో గరిష్టంగా 30 శాతం నిధులు కూడా ఈ పద్దు కింద రావడం లేదని కాగ్ గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద రూ.22,782.50 కోట్లు వస్తాయని రాష్ట్ర

మిగతా 2వ పేజీలో ▶

కాగ్ నివేదికల ప్రకారం గత ఐదేళ్ల గ్రాంట్ ఇన్ ఎయిడ్ లెక్కలివి.. (రూ. కోట్లలో)

సంవత్సరం	బడ్జెట్‌లో పెట్టింది	కేంద్రం ఇచ్చింది
2021–22	38,669.46	8,619.26
2022–23	41,001.73	13,179.21
2023–24	41,259.17	9,729.91
2024–25	21,636.15	7,913.08
2025–26	22,782.50	1,673.43



(నోట్: 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 5 నెలల కాలంలో వచ్చింది)

'సాక్షి'పై ఏపీ సర్కారు కక్ష సాధింపు

ఎడిటర్‌కు నోటీసుల పేరుతో విజయవాడలోని 'సాక్షి' ప్రధాన కార్యాలయంలో పోలీసుల దాష్టీకం

- నకిలీ మద్యంపై వార్తలు ప్రచురించినందుకు సిబ్బందిని భయభ్రాంతులకు గురి చేస్తూ వేధింపులు
- నకిలీ మద్యం దారుణాలను కప్పిపుచ్చేందుకే ఎడిటర్, విలేకరులపై అక్రమ కేసులు
- సోదాల పేరుతో విలేకరుల ఇళ్లలో చొరబడి దౌర్జన్యం
- అర్ధరాత్రి వేళ నెల్లూరు సాక్షి బ్యూరో ఇన్‌చార్జి ఇంటికి వెళ్లి నోటీసులిచ్చిన పోలీసులు
- జర్నలిస్టుల పట్ల అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తూ టెర్రరిస్టుల మాదిరిగా చిత్రీకరిస్తున్న బాబు సర్కారు
- ప్రజా కంటక పాలనను నిగ్గదీస్తుండటంతో కంటగింపు.. మోసాలు, వైఫల్యాలను ప్రశ్నిస్తుండటంతో అక్రమ కేసులు
- రాజ్యాంగం కల్పించిన పత్రికా స్వేచ్ఛపై అక్రమ కేసులతో అణచివేత
- సుప్రీం ఆదేశాలకు విరుద్ధంగా అక్రమ కేసులు, నోటీసులతో పోలీసుల అరాచకం



విజయవాడలోని 'సాక్షి' ప్రధాన కార్యాలయంలో ఆదివారం పోలీసుల హల్‌చల్

సాక్షి, అమరావతి: ప్రజాకంటక పాలనను నిగ్గదీస్తూ.. మోసాలను ఎక్కడికక్కడ ఎండగడుతున్న 'సాక్షి' మీడియాపై ఏపీలోని కూటమి సర్కారు అణచివేత చర్యలకు పాల్పడుతూ కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. రాష్ట్రాన్ని కల్తీ మద్యం పట్టి పీడిస్తున్నా, అమాయకుల ప్రాణాలను హరిస్తున్నా, చోద్యం చూస్తున్న సర్కారు.. క్షేత్రస్థాయి వాస్తవాలను వెలుగులోకి తెచ్చిన 'సాక్షి'పై అక్రమ కేసులు బనాయించి పైశాచికత్వాన్ని ప్రదర్శిస్తోంది. ప్రభుత్వ నిర్లక్ష్యానికి పిట్టల్లా

మిగతా 12వ పేజీలో ▶

న్యూస్‌రీల్

బీసీ కోటాపై కాంగ్రెస్ చిత్తశుద్ధిని ప్రశ్నించలేరు



స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ల పెంపునకు సంబంధించిన బిల్లులు గవర్నర్, రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో పెట్టుకొని కాంగ్రెస్ పార్టీపై నిందలు ఎలా వేస్తారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రశ్నించారు.

- వివరాలు 3లో▶

బీసీ సంఘాల జేఏసీ



వెనుకబడిన తరగతులకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు సాధించుకునే లక్ష్యంతో తెలంగాణ బీసీ జేఏసీ ఏర్పాటైంది. జేఏసీ చైర్మన్‌గా ఎంపీ ఆర్.కృష్ణయ్య, వర్కింగ్ చైర్మన్‌గా జాజుల శ్రీనివాస్‌గౌడ్, వైస్ చైర్మన్‌గా వీజీఆర్ నారగోనిని ఎన్నుకున్నారు.

- వివరాలు 2లో▶

ఠాణాలను సివిల్ పంచాయితీ కార్యాలయాలుగా మార్చొద్దు



పోలీస్‌స్టేషన్లు, పోలీస్ కార్యాలయాలను సివిల్ వివాదాలు తీర్చే పంచాయితీ కార్యాలయాలుగా మార్చొద్దని డీజీపీ శివధర్‌రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. అవినీతితో పోలీసు శాఖకు మచ్చ తేవొద్దని హెచ్చరించారు.

- వివరాలు 16లో▶

ఐఐఎస్‌సీ బెంగళూరుదే అగ్రస్థానం



టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ వరల్డ్ వర్సిటీ ర్యాంకింగ్స్–2026లో బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) దేశంలోనే అగ్రశ్రేణి యూనివర్సిటీగా తన స్థానాన్ని నిలబెట్టుకుంది.

- వివరాలు 12లో▶



ఆర్.దామోదర్‌రెడ్డి సంతాప సభలో సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో కోమటిరెడ్డి, పొంగులేటి, ఉత్తమ్, వీహెచ్, దామోదర్‌రెడ్డి కుమారుడు సర్వోత్తమ్‌రెడ్డి తదితరులు

ఎస్సారెస్పీ స్టేజ్-2కు ఆర్డీఆర్ పేరు

- నల్లగొండ జిల్లాకు గోదావరి జలాలు తెచ్చిన ఘనత ఆయనదే
- రాంరెడ్డి దామోదర్‌రెడ్డి కుటుంబానికి అండగా గాంధీ కుటుంబం
- ఆర్డీఆర్ సంతాప సభలో సీఎం రేవంత్‌రెడ్డి

3లో

ఆపరేషన్ బ్లూస్టార్ తప్పుడు నిర్ణయం



- అందుకు మూల్యంగా ఇందిరాగాంధీ తన ప్రాణాన్నే కోల్పోయారు
- ఆ ఉగ్రవాదుల ఏరివేత నిర్ణయం ఇందిర ఒక్కరిదే కాదు
- సైన్యం, ఇంటెలిజెన్స్, పోలీస్, సివిల్ డిఫెన్స్ సంయుక్త నిర్ణయం
- అందుకు ఇందిరను ఒక్కరినే తప్పుపట్టడం సరికాదు
- కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం వ్యాఖ్య

6లో

స్కూళ్ల తనిఖీకి టీచర్లు

తెరపైకి మళ్లీ వివాదాస్పద ఉత్తర్వులు

- గెజిటెడ్ హెచ్‌ఎం స్కూల్‌కు ఎస్‌ఏలకు అధికారం
- గతంలో ఇదే తరహా ఉత్తర్వులు... టీచర్ల నుంచి వ్యతిరేకత
- మధ్యలో ఆపేసిన ప్రభుత్వం.. మళ్లీ అవే ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్

ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేసే అధికారం ఉపాధ్యాయులకు ఇస్తూ విద్యాశాఖ మరోసారి ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాల వారీగా బృందాలను ఏర్పాటు చేస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఆదేశాలు ఇచ్చారు. ప్రాథమిక పాఠశాలలకు 168, ప్రాథమికోన్నత పాఠశాలలకు 35, ఉన్నత పాఠశాలలకు 96 బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ఆయా స్థాయిల ప్రధానోపాధ్యాయుడు నోడల్ అధికారిగా, సెకండరీ గ్రేడ్ టీచర్లు సభ్యులుగా ఉంటారు. ప్రైమరీ, ప్రాథమికోన్నత పాఠశాలల్లో వేసే కమిటీల్లో ముగ్గురు, హైస్కూల్ స్థాయిలో 9 మంది సభ్యులు ఉంటారు. ప్రస్తుతం ప్రతీ మండల పరిధిలో స్కూళ్ల తనిఖీకి కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, మండల విద్యాశాఖాధికారులు పనిచేస్తున్నారు. తాజా కమిటీలు జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ఏర్పడతాయి. ఏప్రిల్ 4వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖ ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ నేపథ్యంలో పాఠశాల తనిఖీలు విస్తృతం చేయాలని, ఇవి నిరంతరంగా ఉండాలని పేర్కొన్నారు. దీంతో తనిఖీలకు ఉపాధ్యాయులనే నియమించేందుకు విద్యాశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది.

కమిటీలు ఏం చేస్తాయి?

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, మధ్యాహ్న భోజన నిర్వహణ, ఉపాధ్యాయుల హాజరు ఏ విధంగా ఉంది? ఎప్పుడు వస్తున్నారు ? బోధన ప్రణాళికను ఎలా అమలు చేస్తున్నారు? విద్యార్థుల హాజరు శాతం? ఇతర ప్రధాన కార్యక్రమాలు ఎలా అమలు చేస్తున్నారు? అనే అంశాలను ఈ కమిటీలు పరిశీలిస్తాయి. ఆ వివరాలను జిల్లా విద్యాశాఖ అధికారులకు అందిస్తాయి. జిల్లా అధికారులు ప్రతీ నెలా 5వ తేదీన రాష్ట్ర విద్యాశాఖ ప్రధాన కార్యాలయానికి వాటిని పంపుతారు. కలెక్టర్ల సమావేశంలో ప్రతీనెలా ప్రభుత్వం ఈ అంశాలపై చర్చిస్తుంది. కమిటీల్లో ఎంపికయ్యే టీచర్లు

మిగతా 2వ పేజీలో ▶

పదపద.. ప్రపంచాన్ని చుట్టొద్దాం!

ప్రజల ఆదాయాలు పెరుగుతుండటంతో జీవితంలో ఆనందాలు అనుభవించేందుకు అందులో కొంత ఖర్చు చేసేందుకు వెనుకాడటం లేదు. ముఖ్యంగా విహార యాత్రలపై భారతీయులు ఆసక్తి చూపుతున్నారు.



- వివరాలు 2లో▶

నల్లమల అందాలు చూసొద్దాం

- అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో టైగర్ సఫారీ
- కృష్ణమ్మ పరవళ్లతో కనువిందు చేస్తున్న సోమశిల అందాలు



- వివరాలు 5లో▶

రోజూ 113 ఆర్థిక నేరాలు

భారత్‌లో పెద్ద నగరాల్లో ఆర్థిక నేరాలు పెరుగుతున్నాయి. 2023లో పెద్ద నగరాల్లో సగటున రోజుకు 113 ఆర్థిక నేరాలు నమోదుకాగా.. 2018లో ఈ సంఖ్య 86గా ఉంది. దాదాపు 20% ఆర్థిక నేరాలు నగరాల నుంచే నమోదవుతున్నాయి.



- వివరాలు 16లో▶

ఇదండీ సంగతి



ఇలా సస్పెండ్ చేసుకుంటూ పోతే పార్టీలో ఎవరూ మిగలర్సార్!!

వందే భారత్ స్లీపర్ @ కాజీపేట

రైల్వే బోర్డు తాజా యోచన • దేశవ్యాప్తంగా వందేభారత్ స్లీపర్ రైళ్లు ప్రవేశపెట్టే చర్యలు ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో వందేభారత్ స్లీపర్ రైళ్లను తయారు చేయాలని రైల్వే బోర్డు భావిస్తోంది. వచ్చే సంవత్సరం మార్చిలో దీనికి సంబంధించిన ఉత్పత్తి ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. తొలుత కాజీపేటలో సాధారణ రైళ్లకు వినియోగించే ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు, ఎంఎంటీఎస్ తరహా రైళ్లకు వినియోగించే ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్స్ (ఈఎంయూ), సాధారణ వందేభారత్ కోచ్‌లను తయారు చేయాలని బోర్డు భావించింది. కానీ, ప్రస్తుతం దేశవ్యాప్తంగా వీలైనన్ని వందేభారత్ స్లీపర్ రైళ్లను అందుబాటులోకి తేవాలని నిర్ణయించిన నేపథ్యంలో కాజీపేట కొత్త కోచ్ ఫ్యాక్టరీని అందుకు కేటాయించాలని తాజాగా నిర్ణయించినట్టు తెలిసింది. ఈ కోచ్ ఫ్యాక్టరీ దాదాపు సిద్ధమైనా, ఇప్పటివరకు కోచ్‌ల తయారీ ఆర్డర్‌ను ఇవ్వలేదు. వాటి స్థానంలో వందేభారత్ స్లీపర్ రైళ్లను తయారు చేయిస్తేనే బాగుంటుందన్న భావనతోనే వర్క్ ఆర్డర్ జారీలో జాప్యం చేస్తున్నట్టు తెలుస్తోంది.

వందేభారత్ స్లీపర్ రైళ్లకు డిమాండ్ ఎక్కువ ఉండటంతో...

ప్రస్తుతం దేశవ్యాప్తంగా 19 రూట్లలో 76 వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయి. వీటిల్లో 33 రైళ్లు మాత్రమే 20, 16 కోచ్‌లతో నడుస్తుండగా మిగతావన్నీ 8 కోచ్‌లతో కూడిన మినీ వందేభారత్ సర్వీసులుగా సేవలందిస్తున్నాయి. వందేభారత్ రైళ్లు ప్రారంభించిన కొత్తలో వాటికి విపరీతమైన డిమాండ్ ఏర్పడి అన్ని రాష్ట్రాలు వాటి కోసం పోటీలో నిలిచాయి. కానీ, టికెట్ ధర ఎక్కువగా ఉండటం, అవి కేవలం పగటి పూట మాత్రమే నడుస్తుండటంతో వాటిపై రానురాను ఆసక్తి సన్నగిల్లుతోంది. ఇదే సమయంలో కేంద్రం వందేభారత్ స్లీపర్ రైళ్లను అందుబాటులోకి తెస్తోంది. ఇప్పటికే ఒక ప్రోటోటైప్ రైలు ట్రయల్స్ కూడా పూర్తి చేసుకుంది. రెండోది త్వరలో ట్రయల్స్‌కు సిద్ధమవుతోంది. ఆ వెంటనే వీటిని పట్టాలెక్కించనున్నారు. వీటి గరిష్ట వేగం గంటకు 180 కి.మీ.లు కావటంతోపాటు ఇవి స్లీపర్ మోడ్ రైళ్లు అయినందున రాత్రివేళ తిరుగుతాయి. దూరప్రాంతాల మధ్య తిరిగే రైళ్లలో పగటివేళ ప్రయాణానికి ఎక్కువ మంది ఆసక్తి చూపరు. దానివల్ల పనులు చేసుకునే పగటి సమయం వృథా అవుతుండటమే కారణం. దీంతో ఇప్పుడు

మిగతా 5వ పేజీలో ▶

పదపద.. ప్రపంచాన్ని చుట్టొద్దాం..!



విహార యాత్రలకు ఉవ్విళ్లూరుతున్న భారతీయులు

విదేశీ ప్రయాణాల్లో విహార యాత్రలదే సింహభాగం

భారతీయ ప్రయాణికుల్లో **42.5%** విహార యాత్రికులే..

థాయ్‌లాండ్‌కే అత్యధిక మంది పయనం

ప్రజల ఆదాయాలు పెరుగుతుండటంతో జీవితంలో ఆనందాలు అనుభవించేందుకు అందులో కొంత ఖర్చు చేసేందుకు వెనుకాడటంలేదు. ముఖ్యంగా విహార యాత్రలపై భారతీయులు ఆసక్తి చూపుతున్నారు. ఎప్పుడెప్పుడు ప్రత్యక్షంగా చూద్దామా అన్న ఆసక్తిని రేకెత్తించేలా సామాజిక మాధ్యమాల్లో విదేశీ నగరాలు, సందర్శనీయ స్థలాలు ఊరిస్తుండటంతో విదేశీ ప్రయాణాలు పెరుగుతున్నాయి. విదేశాలను చుట్టివస్తున్న భారతీయుల సంఖ్య అయిదేళ్లుగా పెరుగుతోంది. భారతీయుల విదేశీ ప్రయాణాల్లో 2020లో 31.9 శాతంగా ఉన్న విహార యాత్రికుల వాటా, 2024లో 42.5 శాతానికి చేరిందంటే ప్రజల్లో ఉన్న ఆసక్తిని అర్థం చేసుకోవచ్చు. కేంద్ర పర్యాటక శాఖ ఇటీవల విడుదల చేసిన ఇండియా టూరిజం గణాంకాల ప్రకారం భారత్ నుంచి 2020లో మొత్తం 72.9 లక్షల మంది వివిధ దేశాల్లో పర్యటించారు. ఈ సంఖ్య 2024లో 3.08 కోట్లకు పెరిగింది. విహార యాత్రల్లో భారతీయుల తొలి డెస్టినేషన్‌గా థాయ్‌లాండ్ నిలిచింది. గత ఏడాది ఈ దేశానికి వెళ్లిన వారిలో ఏకంగా 92.93 శాతం మంది విహార యాత్రలకే వెళ్లారు. 2022తో పోలిస్తే థాయ్‌లాండ్ వెళ్లిన విహార యాత్రికుల సంఖ్య రెండింతలు పెరిగి గత ఏడాది 19.1 లక్షలకు చేరింది.

\- సాక్షి, స్పెషల్ డెస్క్

గత ఐదేళ్లలో విదేశాల్లో పర్యటించిన భారతీయులు (శాతాల్లో)

ప్రయాణానికి కారణం	2020	2021	2022	2023	2024
విహార యాత్రలు	31.9	32.8	36.8	41.4	42.52
ఎన్నారైల ప్రయాణం	42.3	43.9	39.5	35.1	34.69
వ్యాపారం, వృత్తిపరంగా	19.9	17.3	16.9	15.6	14.92
తీర్థయాత్రలు	1.6	0	2.4	3.7	3.99
విద్య	3.6	5.2	3.5	3.3	2.45
ఇతర కారణాలు	0.7	0.8	0.9	0.9	1.43
ప్రయాణికులు (లక్షల్లో)	72.9	85.5	216	278	308

విహార యాత్రలు (వ్యక్తులు లక్షల్లో)

దేశం	2022 లీజర్	2022 వ్యక్తులు	2023 లీజర్	2023 వ్యక్తులు	2024 లీజర్	2024 వ్యక్తులు
థాయ్‌లాండ్	91.6%	9.5	92.9%	14.8	92.9%	19.1
సింగపూర్	39.2%	10.1	46.6%	13.1	47.3%	15.4
కెనడా	31.1%	7.8	36.4%	9.9	43.0%	9.5
యూఎస్	34.9%	17.3	36.4%	20.5	42.0%	21.4

భారతీయులు అత్యధికంగా వెళ్లిన దేశాలు (శాతాల్లో)

దేశం	వ్యాపారం, వృత్తిపరంగా	విహార యాత్రలు	ఎన్నారైల ప్రయాణం	ఇతర కారణాలు
యూఏఈ	9.41	37.28	52.74	0.57
సౌదీ అరేబియా	19.55	8.38	36.7	35.37
యూఎస్	19.87	42	26.22	11.91
థాయ్‌లాండ్	4.29	92.93	1.36	1.42
సింగపూర్	22.22	47.34	28.57	1.87
యూకే	10.04	35.23	46.04	8.69
ఖతర్	18.72	14.29	66.26	0.73
కెనడా	12.73	43.09	27.19	16.99



క్లుప్తంగా...

ఖర్గేకు జూపల్లి పరామర్శ



సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను.. పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పరామర్శించారు. ఆదివారం ఢిల్లీలోని ఖర్గే నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఖర్గే త్వరగా కోలుకోవాలని జూపల్లి ఆకాంక్షించారు.

పెన్షన్ బకాయిల చెల్లింపులపై ప్రభుత్వ నిర్లక్ష్యం: దేవీ ప్రసాద్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో రిటైర్డ్ ఉద్యోగుల దుస్థితి దయనీయంగా మారిందని, పెన్షన్ బకాయిల చెల్లింపులో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని టీఎన్జీవో మాజీ అధ్యక్షుడు దేవీప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. 2024 మార్చి నుంచి రిటైర్ అయిన ఉద్యోగులకు పెన్షన్ బకాయిలు చెల్లించకుండా, వారు సర్వీసులో దాచుకున్న సొమ్మును తిరిగి ఇవ్వకుండా ప్రభుత్వం వేధిస్తోందని ఆయన ఆరోపించారు. ప్రతినెలా రూ.700 కోట్లు విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ మాటతప్పిందని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో దేవీప్రసాద్ విమర్శించారు. ఇప్పటికే రూ.15వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉండగా, ప్రతినెలా రిటైర్ అయ్యే ఉద్యోగుల పరిస్థితి మరింత దిగజారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

తెలంగాణ ప్రజల పార్టీ అధ్యక్షుడిగా జస్టిస్ చంద్రకుమార్



నూతన కార్యవర్గంతో అధ్యక్షుడు చంద్రకుమార్

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఆయుధాల కొనుగోలుపై రూ. లక్షల కోట్లు ఖర్చుపెట్టే బదులు ఆ నిధులను దేశంలోని పేదల విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కోసం ఖర్చు చేయాలని మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ సూచించారు. ఆదివారం తెలంగాణ ప్రజల పార్టీ నేతలు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా జస్టిస్ బి.చంద్రకుమార్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా దుర్గాప్రసాద్, నర్సింహ, కార్యదర్శిగా పి.మల్లేశ్, ఉపాధ్యక్షులుగా ఇ.వెంకటేశ్, ఎండీ అబ్దుల్, ప్రధాన కార్యదర్శులుగా పవన్ కళ్యాణ్, లింగనాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సూర్యకిరణ్ ఎన్నికయ్యారు.

ఆరు జిల్లాల్లో 94.4 శాతం పల్స్ పోలియో పూర్తి

పోలియో చుక్కలకు తొలిరోజు అనూహ్య స్పందన

- బూత్ డ్రైవ్‌లో 16.35 లక్షల మంది చిన్నారులకు పోలియో డ్రాప్స్
- మిగిలినవారి కోసం నేడు, రేపు ఇంటింటికీ స్పెషల్ టీంలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఆరు జిల్లాల్లో ఆదివారం చేపట్టిన సబ్ నేషనల్ ఇమ్యునైజేషన్ డే (ఎస్ఎన్ఐడీ) పల్స్ పోలియో కార్యక్రమం మొదటిరోజు విజయవంతంగా ముగిసింది. బూత్ డే యాక్టివిటీలో భాగంగా మొత్తం 16,35,432 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. నిర్దేశించుకున్న 17,32,171 మంది పిల్లల లక్ష్యంలో మొదటిరోజే 94.4% పూర్తి చేసినట్లు హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అండ్ మిషన్ డైరెక్టర్ తెలిపారు. భారత్‌లో పోలియో కేసులు పూర్తిగా లేకుండా పోయినా.. పాకిస్తాన్, అఫ్గానిస్తాన్ వంటి పొరుగు దేశాల్లో పోలియో కేసులు ఇంకా నమోదవుతుండటంతో అక్కడి నుంచి వైరస్ వ్యాప్తి చెందకుండా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. వలసలు ఎక్కువగా ఉండే హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి, సంగారెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాలను ఈ కార్యక్రమం కోసం ఎంపిక చేశారు.



తొలిరోజే అనూహ్య స్పందన..

రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 6,897 పోలియో బూత్‌లలో 15,91,907 మందికి, బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు వంటి 138 రద్దీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్సిట్ పాయింట్లలో 22,173 మందికి టీకాలు వేశారు. 259 మొబైల్ టీంల ద్వారా మరో 21,352 మంది చిన్నారులకు పోలియో చుక్కలు అందించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 27,588 మంది వ్యాక్సినేటర్లు, 459 మంది సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. పలు జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, మేయర్లు, ఇతర ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.

మిగిలిన చిన్నారులే లక్ష్యంగా ఇంటింటికీ...

తొలిరోజు బూత్‌లకు రాలేకపోయిన చిన్నారులకు టీకా అందించేందుకు ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసింది. సోమ, మంగళవారాల్లో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటికీ తిరిగి మిగిలిపోయిన పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు వేస్తారు. ముఖ్యంగా వలస కార్మికులు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాల్లో నివసించే వారి పిల్లలు ఎవరూ మిస్ కాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. అవసరమైతే హైదరాబాద్ వంటి నగరాల్లో 15వ తేదీన కూడా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు. ప్రతి చిన్నారికీ పోలియో చుక్కలు అందించి, పోలియో రహిత తెలంగాణ లక్ష్యాన్ని కాపాడాలని అధికారులు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

పోలియో చుక్కలు వేయగానే శిశువు మృతి

సంగారెడ్డి జిల్లాలో ఘటన

కంగ్టి/నారాయణఖేడ్: పోలియో చుక్కలు వేసిన వెంటనే మూడు నెలల మగ శిశువు మృతి చెందాడు. సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం భీంరాలో ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన సర్కు న్‌దొడ్డి స్వర్ణలత–ఉమేశ్ దంపతులకు మూడు నెలల క్రితం బాబు జన్మించాడు. పోలియో చుక్కలు వేయించేందుకు వీరి నలుగురి పిల్లలను ఆదివారం పల్స్ పోలియో కేంద్రానికి తీసుకొచ్చారు. ముగ్గురు ఆడపిల్లలకు పోలియో చుక్కలు వేసిన తర్వాత, మూడు నెలల శిశువుకు కూడా డ్రాప్స్ వేశారు. చుక్కలు వేసినప్పటి నుంచి శిశువు ఏకధాటిగా ఏడుస్తుండటంతో తల్లి స్వర్ణలత పాలు తాగించే ప్రయత్నం చేసింది. పాలు తాగుతున్న సమయంలోనే శిశువు మృతి చెందింది. దీంతో పోలియో చుక్కల కారణంగా తమ బిడ్డ చనిపోయాడని స్వర్ణలత ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు శిశువు మృతదేహాన్ని ఖేడ్ ఆస్పత్రికి తరలించారు. శిశువు మృతిపై డీఎంహెచ్‌ఓ నాగనిర్మలను 'సాక్షి' వివరణ కోరగా... శిశువు ఏడుస్తుండగా తల్లి పాలు తాగించడంతో ఊపిరితిత్తుల్లోకి పాలు వెళ్లి మృతి చెందే అవకాశాలున్నాయని చెప్పారు.



మృత శిశువుతో తల్లి స్వర్ణలత

పోలియో చుక్కలు కారణం కాదు

శిశువు మృతికి పోలియో చుక్కలు కారణం కాదని ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తాను వైద్యులు, వైద్యాధికారులతో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నట్లు చెప్పారు. ఒకే వాయిల్‌లోని చుక్కలను వేయించుకున్న ఇతర చిన్నారులెవరికీ ఏమీ కాలేదన్నారు.

ఉద్యోగుల సర్వీసు ఏడాది పాటు పొడిగింపు

- ఎస్సీ గురుకులంలో 4,092 మంది సేవల పునరుద్ధరణ
- ఉత్తర్వులు జారీ చేసిన ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, పార్ట్‌టైమ్ పద్ధతిలో పనిచేస్తున్న 4,092 మంది ఉద్యోగుల సర్వీసును మరో ఏడాదిపాటు కొనసాగిస్తూ రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం కాంట్రాక్ట్ పద్ధతిలో 2, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో 1,545, పార్ట్‌టైమ్ విధానంలో 2,102, హానరోరియం కేటగిరీలో 443 మంది ఉద్యోగులకు మరో ఏడాదిపాటు పనిచేసేందుకు అవకాశం కల్పించారు. గురుకుల విద్యా సంస్థల్లో బోధన, అభ్యసన కార్యక్రమాలకు ఇబ్బందులు కలగకుండా వారి సేవలను వినియోగించుకుంటున్నట్లు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గురుకులాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తామన్నారు. ఉద్యోగుల సర్వీసును రెన్యువల్ చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు అడ్లూరి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయంపై టీఎస్‌డబ్ల్యూఆర్‌టీఈఏ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ బాలరాజు, దయాకర్, టీఎస్‌డబ్ల్యూఆర్ టీయూ చైర్మన్ డాక్టర్ రామలక్ష్మణ్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

లోటు.. లక్ష కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం అంచనా వేసి బడ్జెట్‌లో పెడితే.. తొలి ఐదు నెలల్లో (2025, ఆగస్టు 31 నాటికి) ఇచ్చింది రూ.1,673.43 కోట్లు మాత్రమే. మొత్తంగా 2021–22 నుంచి రూ.1,65,349.01 కోట్లు ఆశించగా, కేంద్రం ఇచ్చింది రూ.41,111.89 కోట్లు మాత్రమే.

గ్రాంట్ ఇన్ ఎయిడ్ అంటే...: గ్రాంట్ ఇన్ ఎయిడ్ అంటే సాయం కింద ఇచ్చే మొత్తం అని చెప్పొచ్చు. ఈ గ్రాంట్‌ను తిరిగి ఇవ్వాల్సిన పని ఉండదు. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రం తిరిగి చెల్లించే షరతు ఉంటుంది. కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చినా, రాష్ట్రం నుంచి ఏదైనా శాఖకు వెళ్లినా, ఎన్జీవోలు, విద్యాసంస్థలైనా ఇదే నిబంధన ఉంటుంది. వివిధ రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, ప్రాధాన్యతా ప్రాజెక్టులకు ఈ పద్దు కింద కేంద్రం నిధులు ఇచ్చే వెసులుబాటు ఉంది. కేంద్ర ప్రాయోజిత పథకాల కింద కూడా ఇవ్వొచ్చు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ఈ నిధులను మంజూరు చేయొచ్చు.

రాష్ట్రాల స్వతంత్ర ఆలోచనలను దెబ్బతీసే చర్య

కేంద్ర ప్రభుత్వాల పెత్తందారీ వైఖరి కారణంగానే రాష్ట్రాలకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ నిధులు రావడం లేదు. ఈ పద్దు కింద రాష్ట్రాలకు కేంద్రం నిధులు వస్తే తిరిగి చెల్లించాల్సిన అవసరం ఉండదు కాబట్టి ఆయా రాష్ట్రాలకు ఆర్థిక వెసులుబాటు ఉంటుంది. కానీ, కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా, రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఆర్థిక అధికారాల కేంద్రీకరణ మాత్రం ఏటేటా పెరుగుతోంది. రాష్ట్రాలను ఆదాయ వనరులుగా చూస్తున్నారే తప్ప సాయం చేయడం లేదు. సెస్‌ల రూపంలో కేంద్రమే పన్నులు వసూలు చేసుకుంటోంది. ఆ పన్నుల్లో వాటా ఆశించినంతగా ఇవ్వడం లేదు. గ్రాంట్ ఇన్ ఎయిడ్ కూడా మంజూరు చేయడం లేదు. అనేక రకాలుగా కేంద్రంపై రాష్ట్రాలు ఆధారపడే విధంగా చేయడం ద్వారా ఆయా రాష్ట్రాల స్వతంత్ర ఆలోచనను కేంద్ర ప్రభుత్వం దెబ్బతీస్తోంది.

\- ప్రొఫెసర్ అందె సత్యం, ఆర్థిక నిపుణులు

స్కూళ్ల తనిఖీకి టీచర్లు

▶ మొదటి పేజీ తరువాయి

ఏడాదిపాటు ఇదే పనిలో ఉంటారు. బోధన చేపట్టాల్సిన అవసరం ఉండదు. • పర్యవేక్షణ కమిటీ కోసం ఎంపిక చేసే టీచర్లు కనీసం పదేళ్ల పాటు టీచర్‌గా ప్రభుత్వ స్కూళ్లల్లో పనిచేసిన అనుభవం ఉండాలి. ప్రాథమిక పాఠశాల హెచ్ఎంలు, లేదా ఎస్జీటీలను నియమిస్తారు. వీరు ప్రతీ రోజు రెండు స్కూళ్లను విధిగా తనిఖీ చేయాలి. • ప్రాథమికోన్నత పాఠశాలలకు ఎంపిక చేసే టీచర్లు కూడా పదేళ్ల అనుభవం కలిగి ఉండాలి. స్కూల్ అసిస్టెంట్లను నియమిస్తారు. వీరు రోజుకు రెండు స్కూళ్లను తనిఖీ చేయాలి. • ఉన్నత పాఠశాలలకూ పదేళ్ల అనుభవం ఉన్న స్కూల్ అసిస్టెంట్లు అర్హులు. వీరు రోజూ ఒక స్కూల్‌ను, మూడు నెలల్లో 50 స్కూళ్లను తనిఖీ చేయాలి.

కొంతకాలం బ్రేక్ తర్వాత.. మళ్లీ

వాస్తవానికి పాఠశాలల తనిఖీకి ఉపాధ్యాయులను నియమిస్తూ జూన్ 21న విద్యాశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. వీటిపై ఉపాధ్యాయ వర్గాల నుంచి వ్యతిరేకత వచ్చింది. స్కూల్ అసిస్టెంట్ స్థాయి టీచర్.. గెజిటెడ్ హెచ్ఎం పనిచేసే స్కూల్‌ను తనిఖీ చేయడం సరికాదనే అభిప్రాయం వ్యక్తమైంది. ఇప్పటికే కాంప్లెక్స్ హెచ్ఎం, ఎంఈఓలతో పాటు అభ్యసన సామర్థ్య పరిశీలనకు ప్రత్యేకంగా ఐదు స్థాయిల అధికారులను నియమించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇంకెన్ని తనిఖీ వ్యవస్థలను ఏర్పాటు చేస్తారని పలు సంఘాలు అభ్యంతరం తెలిపాయి. ఇప్పటికే స్కూళ్లల్లో సబ్జెక్టు టీచర్ల కొరత ఉందని, కొత్త కమిటీల వల్ల ప్రతీ జిల్లాలోనూ రెండు శాతం టీచర్లు తనిఖీ అధికారులుగా వెళతారని తెలిపారు. దీంతో ఇచ్చిన ఉత్తర్వులను మధ్యలో నిలిపివేశారు. తనిఖీలు చేపట్టాల్సిందేనని, టీచర్లే తనిఖీలు చేస్తే వాస్తవాలు తెలుస్తాయని ఉన్నతాధికారులు భావించారు. దీంతో మళ్లీ తనిఖీ బృందాల ఏర్పాటుకు ఆదేశాలిచ్చారు.

బీసీ సంఘాల జేఏసీ ఏర్పాటు

చైర్మన్‌గా రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

- వర్కింగ్ చైర్మన్‌గా జాజుల శ్రీనివాస్‌గౌడ్, వైస్ చైర్మన్‌గా వీజీఆర్ నారగోని
- కో చైర్మన్లుగా రాజారాంయాదవ్, దాసు సురేశ్ ఎన్నిక
- ఈ నెల 14న తలపెట్టిన బంద్ వాయిదా.. 18న రాష్ట్ర బంద్‌కు జేఏసీ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన తరగతులకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు సాధించుకునే లక్ష్యంతో తెలంగాణ బీసీ ఐక్యకార్యాచరణ సమితి (బీసీ జేఏసీ) ఏర్పాటైంది. ఆదివారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో బీసీ కుల సంఘాలు, బీసీ సంఘాలు, ప్రజాప్రతినిధులు, మేధావుల ప్రత్యేక సమావేశం జరిగింది. బీసీ జేఏసీ ఏర్పాటు ప్రధాన ఎజెండాగా ఈ సమావేశం కొనసాగగా, సభ్యులంతా ఏకగ్రీవంగా జేఏసీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తెలంగాణ వెనుకబడిన తరగతుల ఐక్య కార్యాచరణ సమితి చైర్మన్‌గా రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, వర్కింగ్ చైర్మన్‌గా జాజుల శ్రీనివాస్‌గౌడ్, వైస్ చైర్మన్‌గా వీజీఆర్ నారగోని, కో చైర్మన్లుగా రాజారామ్‌యాదవ్, దాసు సురేష్, సమన్వయ కర్తగా గుజ్జ కృష్ణలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్ల సాధనకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించారు. ఈనెల 13న తలపెట్టిన రహదారుల దిగ్బంధం, 14న చేపట్టబోయే రాష్ట్ర బంద్ వాయిదా వేశారు. ప్రస్తుతం జేఏసీ ఏర్పాటు కాగా, అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారీగా జేఏసీ కమిటీలను తక్షణమే ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈనెల 18న రాష్ట్ర బంద్‌కు జేఏసీ పిలుపునిచ్చింది.

బీసీ రిజర్వేషన్లు సాధించుకోవాలంటే ప్రతి బీసీ పౌరుడు పోరాడాలని జేఏసీ చైర్మన్ ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్ల జీఓపై హైకోర్టు స్టే విధించి రాష్ట్రంలోని బీసీలకు అన్యాయం చేసిందన్నారు. వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 60% బీసీలు ఉన్నా... వారంతా ఐక్యంగా లేరన్నారు. అందువల్లే బీసీలకు అందాల్సిన రిజర్వేషన్లు నోటివరకు వచ్చినా, అడ్డుకోగలిగారని చెప్పారు. రిజర్వేషన్ వ్యతిరేకులకు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సెగ పుట్టించేలా బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ సమావేశంలో 40 బీసీ సంఘాలు, 110 బీసీ కుల సంఘాలతోపాటు బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశ్‌చారి, కుల్కచర్ల శ్రీనివాస్, కొండ దేవయ్య, శేఖర్ సగర, నీల వెంకటేశ్ పాల్గొన్నారు.



సమావేశంలో కృష్ణయ్య, జాజుల ఇతర బీసీ నాయకుల సంఘీభావం

ప్రపంచ వేదికపై సిరిసిల్ల సత్తా

- ఈవీ ఆవిష్కరణలను అంతర్జాతీయస్థాయికి తీసుకెళ్లిన గ్రావ్టన్ మోటార్స్ వ్యవస్థాపకుడు
- పర్శురామ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశంస

సిరిసిల్ల: తెలంగాణలోని ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) ఆవిష్కరణలను అంతర్జాతీయ వేదికకు తీసుకెళ్లిన సిరిసిల్ల బిడ్డ, గ్రావ్టన్ మోటార్స్ వ్యవస్థాపకుడు పర్శురామ్ పాకను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందించారు. ఒక ఆవిష్కర్తకు ప్రేరణ ఇచ్చే ఎకో సిస్టం లభించినప్పుడు అద్భుతాలు జరుగుతాయని కేటీఆర్ 'ఎక్స్'వేదికగా ఆదివారం పోస్ట్ చేశారు. పర్శురామ్ వంటి ప్రతిభావంతులను ప్రోత్సహించడంలో టీ–హబ్, టీ–వర్క్స్ పాత్ర కీలకమని కొనియాడారు.



పర్శురామ్‌ను అభినందిస్తున్న కేటీఆర్

సిరిసిల్ల నుంచి...: 'సిరిసిల్లకు చెందిన పర్శురామ్‌ది ఇంజినీరింగ్‌లో నేపథ్యం. మన ఇంక్యుబేటర్ల (టీ–హబ్, టీ–వర్క్స్) వద్ద ఉన్న అత్యాధునిక సౌకర్యాలను ఉపయోగించుకొని గ్రావ్టన్ మోటార్స్‌ను స్థాపించారు. నేడు ఈ సంస్థ తెలంగాణ నుంచే ప్రపంచస్థాయి ఎలక్ట్రిక్ మోటార్ సైకిళ్లను తయారు చేస్తోంది'అని కేటీఆర్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. గ్రావ్టన్ మోటార్స్ తమ మోటార్లు, బ్యాటరీలు, కంట్రోల్ సిస్టమ్స్‌ను పూర్తిగా దేశీయంగా రూపొందించిందన్నారు.

కే2కే ప్రపంచ రికార్డ్: గతంలో గ్రావ్టన్ మోటార్స్ సంస్థ 4,000 కిలోమీటర్ల కశ్మీర్ టు కన్యాకుమారి (కే2కే) రైడ్‌ను పూర్తి చేసి ప్రపంచ రికార్డును నెలకొల్పిందని, ప్రస్తుతం ఈ కంపెనీ కెన్యా, ఫిలిప్పీన్స్, పెరూ వంటి దేశాలకు తన కార్యకలాపాలను విస్తరిస్తోందని కేటీఆర్ గుర్తు చేశారు. కోయంబత్తూరులో పర్శురామ్‌ను శుక్రవారం కలిశానని, వారి కంపెనీ ప్రయాణం, విజయాలు తనను ఎంతగానో ప్రేరేపించాయని కేటీఆర్ తెలిపారు.

జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి ఖరారు

బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ నిర్ణయం.. నేడు ప్రకటించే అవకాశం

సాక్షి, న్యూఢిల్లీ: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక బరిలో నిలిచే పార్టీ అభ్యర్థిని బీజేపీ అధిష్టానం ఖరారు చేసినట్లు తెలుస్తోంది. మూడు పేర్లను ముందు పెట్టుకుని చర్చించిన పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ.. అందులో ఒక పేరును ఖరారు చేసినట్టు సమాచారం. ప్రధానంగా పోటీలో ఉన్న దీపక్‌రెడ్డి, కీర్తిరెడ్డి, మాధవీలతల్లో ఒకరి పేరును ఖరారుచేసినట్లు తెలుస్తోంది. బిహార్ సహా జూబ్లీహిల్స్ అభ్యర్థిత్వాలపై చర్చించేందుకు ప్రధాని మోదీ అధ్యక్షతన కమిటీ ఆదివారం సమావేశమైంది. ఈ భేటీకి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్ హాజరయ్యారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలకు సంబంధించి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఇప్పటికే అధిష్టానం పెద్దలకు నివేదిక అందించారు. దీపక్‌రెడ్డి, కీర్తిరెడ్డి, మాధవీలతల పేర్లతోనే ఆ నివేదిక అందింది. కమిటీ దీపక్‌రెడ్డి వైపే మొగ్గుచూపుతున్నట్లు చెబుతున్నారు. అభ్యర్థిని సోమవారం ప్రకటించే అవకాశం ఉందని కె.లక్ష్మణ్ చెప్పారు.

రెండు రాష్ట్రాల మధ్య వివాదానికి కేంద్రం కుట్ర

- బనకచర్లకు సహకరించాలని కేంద్రం లేఖ రాయడం సరికాదు: జాన్‌వెస్లీ



మిర్యాలగూడ: రెండు రాష్ట్రాల మధ్య వివాదాన్ని సృష్టించి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఆరోపించారు. ఆదివారం మిర్యాలగూడలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. బనకచర్ల విషయంలో ఏపీ ప్రభుత్వానికి సహకరించాలని తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం లేఖ రాయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచి, బనకచర్ల నిర్మించడం వల్ల తెలంగాణకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని తెలంగాణ ప్రభుత్వం అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ చట్టబద్ధత కోసం రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ చేయబోతుందని, అది సరిపోదని, అన్ని పార్టీలను కలుపుకొని కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు.

గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ



బీబీనగర్: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని గూడూరు పరిధిలో గల టోల్‌ప్లాజా వద్ద ఆదివారం వాహనాల రద్దీ నెలకొంది. వీకెండ్ కావడంతో పాటు వివాహ శుభకార్యాలు ఎక్కువగా ఉండడంతో వాహనాల రాకపోకల సంఖ్య పెరిగింది.

ఎస్సారెస్పీ స్టేజ్-2కు ఆర్డీఆర్ పేరు

- నల్లగొండ జిల్లాకు గోదావరి జలాలు తెచ్చిన ఘనత ఆయనదే
- రాంరెడ్డి దామోదర్‌రెడ్డి కుటుంబానికి అండగా గాంధీ కుటుంబం
- ఆర్డీఆర్ సంతాప సభలో సీఎం రేవంత్‌రెడ్డి



దివంగత దామోదర్ రెడ్డి తనయుడు సర్వోత్తమ్‌రెడ్డిని పరామర్శిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో కోమటిరెడ్డి, పొంగులేటి, రఘువీర్‌రెడ్డి, సామేలు తదితరులు

తుంగతుర్తి, తిరుమలగిరి: 'ఫ్లోరోసిస్ పీడిత ప్రాంతమైన నల్లగొండ జిల్లాకు గోదావరి జలాలు తెచ్చిన ఘనత రాంరెడ్డి దామోదర్‌రెడ్డిది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసిపడేలా చేసి ఎస్సారెస్పీ స్టేజ్-2 సాధించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని ఒప్పించి ఎస్సారెస్పీ స్టేజ్-2 కాలువకు నీళ్లు తెచ్చారు. అందుకే ఎస్సారెస్పీ స్టేజ్-2 కాలువకు 'ఆర్డీఆర్ ఎస్సారెస్పీ-2 కాలువ'గా నామకరణం చేసున్నాం. దీనికి సంబంధించి 24 గంటల్లో జీవో విడుదల చేస్తాం'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రాంరెడ్డి దామోదర్‌రెడ్డి లేని లోటు తీర్చలేదని, ఎస్సారెస్పీ-2కు ఆర్డీఆర్ పేరు పెట్టడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అన్నారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో ఆదివారం మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి సంతాప సభలో రేవంత్ మాట్లాడారు. ఈ కార్యక్రమానికి రేవంత్‌రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులతో కలిసి హాజరయ్యారు.

గోదావరి జలాల కోసం పోరాటం

దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా కరీంనగర్, వరంగల్ ప్రాంతాలకు నీళ్లు ఇచ్చారని, నల్లగొండ జిల్లాకు గోదావరి జలాలు తేవడానికి దామోదర్‌రెడ్డి ఎనలేని పోరాటం చేశారని రేవంత్‌రెడ్డి చెప్పారు. అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ రాజశేఖరరెడ్డిని తీసుకొచ్చి రక్తతర్పణం చేశారని గుర్తుచేశారు. ఐదుసార్లు శాసన సభ్యుడిగా, రెండుసార్లు మంత్రిగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి, జెండా మోసిన కార్యకర్తలకు అండగా నిలిచారని కొనియాడారు. ఖమ్మం జిల్లాలో రాంరెడ్డి వెంకట్‌రెడ్డి, నల్లగొండ జిల్లాలో రాంరెడ్డి దామోదర్‌రెడ్డి జోడెడ్లలాగా పార్టీని తమ భుజాలపై మోసినట్లు పేర్కొన్నారు. గాంధీ కుటుంబం దామోదర్‌రెడ్డి కుటుంబానికి ఎప్పుడూ అండగా ఉంటుందని, భవిష్యత్‌లో దామోదర్‌రెడ్డి కుటుంబానికి రాజకీయంగా అవకాశాలు కల్పించి కాపాడుకుంటామని రేవంత్ రెడ్డి చెప్పారు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేకు దామోదర్‌రెడ్డిపై అభిమానం ఉందన్నారు. రాహుల్ గాంధీ తన సంతాపాన్ని స్వయంగా లేఖ ద్వారా రాంరెడ్డి సర్వోత్తంరెడ్డికి పంపారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ రాంచందర్‌నాయక్, ఎంపీ రఘువీర్‌రెడ్డి, సీపీఐ శాసన సభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మాజీ మంత్రి జానారెడ్డి, మాజీ ఎంపీ హన్మంతరావు, ఎమ్మెల్యేలు మందుల సామేలు, పద్మావతి, వేముల వీరేశం, బాలునాయక్, మట్టా రాఘమయి, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, అద్దంకి దయాకర్, నెల్లికంటి సత్యం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఆందోళనపడకండి.. పార్టీ అండగా ఉంటుంది

- జోర్డాన్‌లో చిక్కుకున్న గల్ఫ్ కార్మికులకు హరీశ్‌రావు భరోసా



సాక్షి, హైదరాబాద్: ఏడాది క్రితం ఉపాధికోసం వెళ్లి జోర్డాన్‌లో చిక్కుకున్న 12 మంది తెలంగాణ వలస కార్మికులతో మాజీ మంత్రి హరీశ్‌రావు ఫోన్‌లో మాట్లాడి భరోసా ఇచ్చారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని, బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని వారికి తెలిపారు. ఈ మేరకు హరీశ్‌రావు ఒక ప్రకటన జారీ చేశారు. నిర్మల్, కామారెడ్డి, నిజామాబాద్, జగిత్యాల, సిద్దిపేటకు చెందిన కార్మికులు జోర్డాన్‌లో చిక్కుకుపోవడంపై ఆరా తీశారు. 'మీ సమస్యలను విదేశీ వ్యవహారాల శాఖ దృష్టికి తీసుకువెళ్లాం..మిమ్మల్ని తెలంగాణకు తీసుకొచ్చేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నాం. మీ ఇబ్బందులు రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లాం. బీఆర్‌ఎస్ ఎంపీ సురేశ్‌రెడ్డి విదేశీ వ్యవహారాల శాఖ అధికారులతో మాట్లాడుతున్నారు. ఎలాగైనా మిమ్మల్ని తెలంగాణకు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నాం'అని హరీశ్‌రావు వారికి ఫోన్‌లో భరోసా ఇచ్చారు.

మద్యం టెండర్లు స్థానికులే వేయాలి

మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



మునుగోడు: నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గంలోని మద్యం దుకాణాలకు స్థానికులే టెండర్లు వేయాలని, ఏ మండలానికి చెందిన వారు ఆ మండలంలో టెండర్లు వేసేలా చూడాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సూచించారు. మద్యం దుకాణాల టెండర్లపై ఆదివారం ఆయన మునుగోడు క్యాంపు కార్యాలయంలో నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ, మద్యం దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కాకుండా, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే విక్రయించేలా ఏర్పాట్లు చేయాలని ఎక్సైజ్ అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. కేవలం మండల కేంద్రాల్లోనే నాలుగు, ఐదు దుకాణాలు నడిపించకుండా నాలుగు, ఐదు గ్రామాలకు ఒకటి చొప్పున దుకాణం ఏర్పాటు చేసేలా చొరవచూపుతానని చెప్పారు. బెల్టు దుకాణాలకు మద్యం విక్రయిస్తే సహించబోమని స్పష్టం చేశారు. పేద ప్రజలను ఆర్థికంగా దెబ్బతీసే మద్యాన్ని మునుగోడు నియోజకవర్గంలో దశల వారీగా తగ్గించడమే తన ప్రధాన లక్ష్యమన్నారు.

బీసీ కోటాపై కాంగ్రెస్ చిత్తశుద్ధిని ప్రశ్నించలేరు

- బిల్లులను ఆమోదించాలని ప్రధాని మోదీని రాష్ట్ర బీజేపీ నేతలు ఎందుకు కోరట్లేదు?
- మంత్రుల మధ్య విభేదాలపై సీఎంతో మాట్లాడా: పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ల పెంపునకు సంబంధించిన బిల్లులు గవర్నర్, రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో పెట్టుకుని కాంగ్రెస్ పార్టీపై నిందలు ఎలా వేస్తారని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రశ్నించారు. ఈ విషయంలో తమ చిత్తశుద్ధిని ఎవరూ ప్రశ్నించలేరని, రాష్ట్ర ప్రభుత్వం పక్షాన చేయాల్సిందంతా చేస్తున్నామన్న విషయాన్ని తెలంగాణ బీసీ సమాజం గుర్తించాలని కోరారు. ఆదివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, టీపీసీసీ నేతలు ఈర్ల కొమురయ్య, అల్లం భాస్కర్, మాదు సత్యం గౌడ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల బిల్లులను అమలు చేయాలని ప్రధాని మోదీని రాష్ట్ర బీజేపీ నేతలు ఎందుకు కోరడం లేదని ప్రశ్నించారు. బీజేపీ ఆడుతున్న డ్రామాలో బీఆర్‌ఎస్ కూడా భాగస్వామి అయ్యిందని ఆరోపించారు. బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసే విషయంలో బీసీ సంఘాలు ఏ పిలుపు ఇచ్చినా కాంగ్రెస్ పక్షాన మద్దతిస్తామని చెప్పారు. హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో సవాల్ చేస్తున్న సందర్భంగా సోమవారం మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరితో కలిసి తానూ ఢిల్లీకి వెళ్తున్నట్లు చెప్పారు.

జూబ్లీహిల్స్‌లో 14 నుంచి బస్తీబాట

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ విజయం ఖాయమని మహేశ్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలన, రెండేళ్ల తమ పాలనపై చర్చకు సిద్ధమని చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 14 నుంచి బస్తీబాట కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు మహేశ్‌గౌడ్ చెప్పారు. మంత్రుల విభేదాల గురించి ప్రస్తావిస్తూ అది తమ కుటుంబ సమస్య అని, ఎలా పరిష్కరించుకోవాలో తమకు తెలుసునని చెప్పారు. ఈ విషయమై తాను సీఎం రేవంత్‌రెడ్డితో కూడా మాట్లాడానని, అటు పార్టీలో కానీ, ఇటు ప్రభుత్వంలో కానీ ఎవరికి ఏ సమస్య ఉన్నా ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు కూడా చెప్పుకునే స్వేచ్ఛ కాంగ్రెస్‌లో ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో అన్ని చట్టాలు నిర్వీర్యమవుతున్నాయని, అదే కోవలో సమాచార హక్కు చట్టం కూడా చేరిందని మహేశ్‌గౌడ్ ఆరోపించారు.

బిహార్‌లో ఒంటరిగానే మజ్లిస్ పోటీ

- ఇప్పటికే 17 స్థానాల్లో అభ్యర్థుల ఖరారు
- 100 స్థానాల్లో పోటీ యోచనలో రాష్ట్ర నాయకత్వం
- అవసరమైతే భావసారూప్యత కలిగిన పార్టీలతో మూడో ఫ్రంట్

సాక్షి, హైదరాబాద్: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరి పోటీకి మజ్లిస్ సిద్ధమైంది. కాంగ్రెస్, ఆర్జేడీ సారథ్యంలోని మహాకూటమి (మహా ఘట్‌బంధన్) పొత్తు కోసం చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో ఒంటరిగా తమ బలాన్ని నిరూపించుకోవాలని మజ్లిస్ నిర్ణయించింది. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఐదు రెట్లు ఎక్కువ స్థానాల్లో పోటీకి దిగుతున్నామని ఆ పార్టీ బిహార్ రాష్ట్ర అధ్యక్షుడు అఖ్తరుల్ ఇమాన్ వెల్లడించారు. దీనిని బట్టి చూస్తే.. 100 స్థానాల్లో పోటీ చేయాలని యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే 17 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది మరోవైపు ఎన్డీఏ, మహా ఘట్‌బంధన్ కూటములకు ప్రత్యామ్నాయంగా మూడో రాజకీయశక్తిగా అవతరించేందుకు కొన్ని భావసారూప్యత కలిగిన పార్టీలతో ప్రయత్నాలు మొదలుపెట్టింది

సీమాంచల్‌పైనే ఆశలు

సంస్థాగతంగా బలంగా ఉన్న సీమాంచల్‌పైనే మజ్లిస్ ఆశలు పెట్టుకుంది. ఆరు స్థానాలు స్థానాలు కేటాయిస్తే కలిసి వస్తామని ప్రకటించింది. మహాకూటమి తమతో కలిసిరాని పక్షంలో బిహార్‌లోని అన్ని నియోజకవర్గాల్లో మజ్లిస్ అభ్యర్థులు పోటీ చేస్తారని ఆ పార్టీ అధినేత ఒవైసీ స్పష్టం చేశారు. తెలంగాణ, మహారాష్ట్ర తర్వాత బిహార్‌ను పార్టీ విస్తరణకు అనుకూలంగా మజ్లిస్ భావిస్తోంది. తొలిసారిగా 2015 అసెంబ్లీ ఎన్నికల్లో సీమాంచల్‌లోని ఆరు స్థానాల్లో తొలిసారి పోటీ చేసింది. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో 20 సీట్లలో పోటీ చేసి ఐదు స్థానాల్లో గెలిచి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆ తర్వాత రాజకీయ పరిణామాలతో నలుగురు ఎమ్మెల్యేలు ఆర్జేడీలో చేరడంతో ప్రస్తుతం అఖ్తరుల్ ఇమాన్ మాత్రమే పార్టీ ఏకైక శాసనసభ్యుడిగా కొనసాగుతున్నారు. గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఎనిమిది స్థానాల్లో పోటీ చేసినా.. ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. తాజాగా బిహార్‌లో 17 శాతానికి పైగా ఉన్న ముస్లిం జనాభానే లక్ష్యంగా చేసుకొని తమ వ్యూహాలకు పదును పెడుతోంది. ఇప్పటికే అసదుద్దీన్ ఒవైసీ సీమాంచల్ ప్రాంతంలో పర్యటించి పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపుతున్నారు. మజ్లిస్ పోటీతో సెక్యులర్ ఓట్లు చీలి బీజేపీకి లాభం చేకూరుతుందని విపక్షాలు ఆరోపిస్తుండగా, తమ పార్టీ ఏ కూటమికి 'బీటీమ్'కాదని ఎంఐఎం స్పష్టం చేస్తోంది.

పార్టీలో గ్రూపులు కడితే చిప్ప చేతికొస్తుంది

పార్టీ బలోపేతం కోసం జట్టుగా పనిచేయాలి: మంత్రి దామోదర



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: పార్టీలో నాయకులు గ్రూపులు కడితే చిప్ప చేతికి వస్తుందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గ్రూపులు కట్టుకుంటూ వెళితే మనమే నష్టపోతామని, ఇప్పటికే పదేళ్ల ఓటమిని అనుభవించామని, తొమ్మిదిన్నర సంవత్సరాలు ప్రతిపక్షంలో ఉన్నామని గుర్తు చేశారు. డీసీసీ అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు ఆదివారం సంగారెడ్డిలో జరిగిన సంఘటన్ శ్రీజాన్ అభియాన్ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతం కోసం పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. డిసెంబర్ నాటికల్లా స్థానిక సంస్థల ఎన్నికలు వస్తాయని, మన కార్యకర్తలను గెలుపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. కార్యకర్తలు లేనిదే నాయకులు లేరని, కార్యకర్తలను పట్టించుకోకపోతే నాయకులకు మనుగడ ఉండదని స్పష్టం చేశారు. డీసీసీ ప్రెసిడెంట్ నిర్మలారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏఐసీసీ పరిశీలకులు సిజరిత, ఎంపీ సురేశ్ షెట్కార్, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్ కాల్వకు బీఎన్‌రెడ్డి పేరు పెట్టాలి

- దానికి దామోదర్‌రెడ్డి పేరు పెడతామని సీఎం ప్రకటించటం సరికాదు
- సామాజిక తెలంగాణ మహాసభ అధ్యక్షుడు కొత్తగట్టు మల్లయ్య

సాక్షి, హైదరాబాద్/సూర్యాపేట: శ్రీరాంసాగర్ కాల్వకు భీంరెడ్డి నరసింహారెడ్డి (బీఎన్‌రెడ్డి) పేరు పెట్టాలని సామాజిక తెలంగాణ మహాసభ అధ్యక్షుడు కొత్తగట్టు మల్లయ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆదివారం లేఖ రాశారు. శ్రీరాంసాగర్ రెండవ దశ నిర్మాణం కోసం బీఎన్‌రెడ్డి ఎంతో శ్రమించి 1996లో తిరుమలగిరి ప్రగతి నగర్‌లో శిలాఫలకం వేయించారని గుర్తుచేశారు. ప్రపంచం గర్వించదగ్గ తెలంగాణ సాయుధ పోరాటంలో ఆయుధాన్ని చేతపట్టి, అలుపెరుగని పోరాటం చేశారని లేఖలో పేర్కొన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం 2009లో శ్రీరాంసాగర్ కాల్వలను పూర్తిచేసి నీరు విడుదల చేసిందని గుర్తుచేశారు. ఆదివారం తుంగతుర్తిలో దామోదర్‌రెడ్డి సంతాప సభలో సీఎం రేవంత్ రెడ్డి ఎస్సారెస్పీకి దామోదర్‌రెడ్డి పేరు పెడతానని ప్రకటించడం దురదృష్టకరమని మల్లయ్యతోపాటు సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు, హైకోర్టు న్యాయవాది మల్లు కపోతంరెడ్డి విమర్శించారు. వారు ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈ మేరకు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు.



డబ్బులు స్వర్గం నుండి రాలి పడవు.
భూమి మీదే మీరు వాటిని సంపాదించుకోవాలి.
– 'ఉక్కు మహిళ' మార్గరెట్ థాచర్ (1925–2025)

సాక్షి
సోమవారం, 13 అక్టోబర్ 2025

యుగాంత రచయిత

ఆధునిక యూరప్ సాహిత్యంలోనైనా, ఏ తరపు యూరప్ సాహిత్యంలోనైనా విశిష్ట స్థానం ఉన్న హంగేరీ రచయిత లాస్లో క్రాస్నాహోర్కైయేను ఈ యేటి సాహిత్య నోబెల్ పురస్కారం వరించింది. 'ప్రళయ భయాల మధ్యలోనూ కళాశక్తిని తిరిగి ధ్రువీకరించే... ఆకర్షణీయమైన, దూరదృష్టి గల సాహిత్య కృతుల సమాహారానికిగానూ' 1954లో జన్మించిన ఈ 71 ఏళ్ల 'హంగేరియన్ రుషి'కి ఈ గౌరవం దక్కింది. తన తొలి నవల 'సాటాన్‌టాంగో'(1985)కు మూడు దశాబ్దాల తర్వాత వెలువడిన ఆంగ్లానువాదానికి గానూ 2015లో 'మ్యాన్ బుకర్ ఇంటర్నేషనల్ ప్రైజ్' అందుకున్న లాస్లో సరిగ్గా దశాబ్దం తర్వాత మళ్లీ వార్తల్లోకి వచ్చారు. ఏకాంతంగా ఉండటానికి ఇష్టపడే ఆయన 'ద మెలంకలీ ఆఫ్ రెసిస్టెన్స్' (1989), 'వార్ అండ్ వార్' (1999), 'బారన్ వెంక్‌హెయిమ్స్ హోమ్‌కమింగ్' (2016) లాంటి ఇతర పోస్ట్‌మాడర్న్ నవలలు రాశారు.

కథకుడు కూడా అయిన లాస్లో క్రాస్నాహోర్కైయే ప్రధానంగా హంగేరియన్ భాషలోనూ, చాలాకాలంగా నివాసం ఉండటం వల్ల జర్మన్‌లోనూ రాస్తారు. ఆయన సాహిత్యంలో ప్రపంచం వల్ల గాయపడిన మనుషులు కనిపిస్తారు. భయ పీడనలను వాళ్లు తప్పించుకోలేరు. సామాజిక అభద్రత, అశాంతి, భరించలేని ఉక్కపోత, నియంతృత్వపు అరాచకాల ఈ అపసవ్య ప్రపంచంలో జరిగే కర్కశ పోరాటాలను ఆయన చిత్రించారు. అందానికీ అవినీతికీ, అమాయకత్వానికీ కపటానికీ, బలహీనతకూ మొరటు బలానికీ మధ్య జరిగే ఎడతెగని పోరు; ప్రతి ఎత్తునూ ఒక అగాధానికి లాగే, ప్రతి స్వర్గాన్నీ ఒక నరకానికి నేలకూల్చే దారుణాలు ఆయన వస్తువులు. అందుకే అమెరికన్ విమర్శకురాలు సూసన్ సోంటాగ్ ఆయన్ని యుగాంత సాహిత్యపు గురువుగా అభివర్ణించారు. ఆయన కళ ఎల్లప్పుడూ అసంబద్ధతకు ఆతిథ్యంగా నిలుస్తుంది– ప్రపంచం తానే ఒక వ్యక్తిత్వాన్ని సంతరించుకొని, దయలేని ప్రతిద్వంద్విగా మారే మార్గాలకు సదా తెరిచి ఉంటుందని వ్యాఖ్యానిస్తారు బ్రిటిష్ రచయిత ఆడమ్ థర్ల్‌వెల్.

కాఫ్కా 'ద క్యాజిల్', దోస్తోవ్‌స్కీ 'ది ఇడియట్'ను అభిమానించే లాస్లో ఎన్నడూ రచయిత కావాలని అనుకోలేదు. 1970ల్లో ఆయన పాస్‌పోర్టును కమ్యూనిస్టు అధికారులు జప్తు చేశారు. దానివల్ల బొగ్గు గని కార్మికుడిగా పనిచేశారు. ఆవుల కొట్టాలకు రాత్రుళ్లు కావలి కాశారు. బార్లలో పియానో వాయించారు. గ్రామాల్లో పేదలతో కలిసి బతికారు. వీధుల్లోని జన భాషను ఒంటబట్టించుకున్నారు. మూడు నాలుగు నెలలకోసారి కొత్త పనులు వెతుక్కుంటూ తిరిగారు. ఈ అశాశ్వత ప్రపంచానికి కళ ఒక్కటే అతివిశిష్టమైన ప్రతిస్పందన అని నమ్మి రచనా వ్యాసంగం వైపు మళ్లారు. లాస్లో లాగే రాజ్య వ్యవస్థ బాధితుడైన హంగేరీ దిగ్దర్శకుడు బేలా టార్ ఆయనతో జట్టు కట్టడం యావత్ ప్రపంచ సినిమాకే మేలు చేసింది. బేలా టార్‌ను బేలా టార్‌గా నిలబెట్టిన సినిమాల రచయితగా లాస్లో పనిచేశారు. 'డామ్నేషన్', 'ద లాస్ట్ బోట్– సిటీ లైఫ్', 'వెర్క్‌మెయిస్టర్ హార్మనీస్', 'ద ట్యూరిన్ హార్స్'తో పాటు ఏడు గంటల నిడివుండే 'సాటాన్‌టాంగో' వీరి కాంబినేషన్లో వెలువడ్డాయి. నలుపు తెలుపుల్లో తీయడం, దీర్ఘ షాట్లు, మౌనం మాట్లాడటం, ఏమీ జరగకుండానే ఎంతో జరిగినట్టనిపించడం వీటి ప్రత్యేకత.

లాస్లో వచనంలో అన్నీ గుక్క తిప్పుకోలేని దీర్ఘ వాక్యాలే. ఫుల్‌స్టాపులు దేవుడికి సంబంధించినవంటారాయన. గుర్రాలు, గ్రహణాలు, తిమింగళాలు, ఇంకా మానవ ఉనికితో సహా ఈ విశ్వంలోని ప్రతిదాన్నీ అందమైనదిగా, అద్భుతమైనదిగా విశ్వసించే సాధారణ మనుషులు ఆయన సాహిత్యంలో ఆశావహ ప్రపంచపు ప్రతినిధులుగా కనబడతారు. కానీ ఆ ఆశ అనేది ఎప్పటికీ భవిష్యత్తుకు సంబంధించినదే; అలాంటి భవిష్యత్తుతో మనల్ని మనం భ్రమింపజేసుకుంటాం, ఆ భవిష్యత్తు ఎప్పటికీ రాదు; ఉన్నది వర్తమానం మాత్రమే అంటారు బౌద్ధ తాత్విక చింతనను ఇష్టపడే లాస్లో. యుగాంతం ఎప్పుడో సంభవించేది కాదనీ, అది ఇక్కడే ఉంది; అది సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న ప్రక్రియ అనీ పాఠకులను అప్రమత్తం చేస్తారు. ఈ చీకటి యుగంలో బతకడానికి చదవడం మరింత శక్తినిస్తుందంటారు.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు. ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.సప్తమి రా.5.48 వరకు, తదుపరి అష్టమి. **నక్షత్రం:** ఆరుద్ర రా.6.27 వరకు, తదుపరి పునర్వసు, **వర్జ్యం:** తె.5.56 నుండి 7.28 వరకు (తెల్లవారితే మంగళవారం). **దుర్ముహూర్తం:** ప.12.09 నుండి 12.55 వరకు, తదుపరి ప.2.28 నుండి 3.14 వరకు, **అమృత ఘడియలు:** ఉ.9.02 నుండి 10.33 వరకు.

సూర్యోదయం : 5.55
సూర్యాస్తమయం: 5.38
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

సోషల్ టాక్

అంతం కాదు!



వైఫల్యం మన గురువుగా ఉండాలి. ప్రయత్నంలో మనం విఫలం అవటం అంటే... అది 'మలుపు' తప్ప, ఆగిపోయిన దారి కాదు. దమానియా ఎయిర్‌వేస్‌ను నాలుగేళ్లకే మూసివేయవలసి వచ్చినప్పుడు ఆ వైఫల్యం గురించి ప్రపంచం ఎంతో మాట్లాడింది. మేము మౌనంతో సమాధానం చెప్పాం.

– పర్వేజ్ దమానియా, మోటివేషనల్ స్పీకర్

ఇల్లు కదలండి!



నేను వ్యక్తిత్వ వికాసానికి సంబంధించి సుదీర్ఘమైన భారీ చర్చల్లోకి వెళ్లను. మనం ఇది చేయగలమా, చేయలేమా; చేయలేకపోతే మరేమి చేయగలం... ఇంతవరకే ఎవరైనా ఆలోచించటం ముఖ్యం. మీరు చేయగలిగింది ఏదైనా చేయకుండా ఇంట్లోనే ఉండిపోవద్దు. బయటికి వెళ్లండి. పని మొదలు పెట్టండి!

– రాబర్ట్ డి నీరో, హాలీవుడ్ నటుడు

చేతనైనంత!



నేను బైబిల్‌ను గౌరవిస్తాను. క్రమం తప్పకుండా నమాజ్ చేస్తాను. కానీ నేను కొంత వరకు మాత్రమే ఆచారాలను పాటిస్తాను. నేను అర్థం చేసుకోగలిగిన, నాకు వర్తిస్తున్నాయనిపించే పద్ధతులను మాత్రమే. అదీ నా చేతనైనంత వరకు మాత్రమే పాటించగలను.

– ఇమ్రాన్ హష్మీ, నటుడు

సవాళ్లే జీవితం!



దూకుడు వ్యూహం వల్ల మీరు సమయం పొందవచ్చు, సమయం కోల్పోనూ వచ్చు. కానీ దూసుకుపోవటం అన్నది ఒక ప్రత్యేకమైన అనుభూతి. ప్రతి ట్రాక్‌లోనూ సవాళ్లు ఉంటాయి. కానీ ఆ సవాళ్లే డ్రైవింగ్‌ను అందంగా మారుస్తాయని నేను భావిస్తాను. జీవితమూ అంతే!

– రొమైన్ గ్రోస్జీన్, స్విస్ రేస్ కార్ డ్రైవర్

అప్పుడు లేదు!



నా చిన్నతనంలో ఫుట్ బాల్ ఆడేవాడిని. మా జట్టులో వేర్వేరు మత విశ్వాసాలు, వేర్వేరు కుటుంబ నేపథ్యాల నుండి వచ్చిన వారున్నారనే స్పృహ నాకు ఉండేది కాదు. మా స్కూలు రిక్షావాలా కొడుకు, మా పారిశుద్ధ్య పనివాడి కొడుకు అందులో ఉన్నట్లు గుర్తు.

– శూజిత్ సర్కార్, దర్శకుడు

ప్లాన్ కుదరదు!



సినిమా ఒక మాయాజాలం. ఇది ప్రణాళిక లేకుండా జరిగిపోయే విషయం. మీరూ ప్లాన్ చేసుకుని సినిమాల్లోకి రావచ్చు, కానీ సినిమాల్లోకి వచ్చాక ప్లాన్ పక్కనపడి పోతోంది. చివరికి ప్రేక్షకులు తెరపైన చూసిందే మీదవుతుంది తప్ప, ప్రేక్షకుల కోసం మీరు తీసినవన్నీ అదృశ్యం అవుతాయి.

– శ్రీధర్ రాఘవన్, స్క్రీన్‌రైటర్

మాటల్లో తెంపరితనం వద్దు!

అభిప్రాయం



మనోజ్ జోషీ

''వ్యూహాత్మకంగా మన శత్రువులందరినీ మనం తృణీకరించవచ్చు. కానీ, తార్కికంగా మనం వారందరినీ సీరియస్‌గా తీసుకుని తీరాలి.'' మావో జెడాంగ్ 1957లో చేసిన ఈ వ్యాఖ్య లోతైనది. ''ప్రభుత్వ సౌజన్యంతో సాగే ఉగ్రవాదాన్ని పాకిస్తాన్ కొనసాగిస్తే, భారత్ ఆపరేషన్ సిందూర్–1 సందర్భంగా చూపిన సంయమనాన్ని ఈసారి ప్రదర్శించకపోవచ్చు, ఈసారి మేం మరో అడుగు ముందుకేసి, నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తాం. అది ప్రపంచ పటంలో తాము కొనసాగాలో వద్దో పాక్ ఆలోచించుకొనేటట్లు చేస్తుంది'' అని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీ ఇటీవల అన్న మాటలు విన్నవెంటనే మావో వ్యాఖ్య గుర్తుకు వచ్చింది.

మొన్న మే నెలలో, స్వల్పకాలికమే అయినా నిర్ణయాత్మకమైన రీతిలో చేసిన పోరాటంలో పాక్ వైమానిక దళం ఎంతటి భారీ నష్టాన్ని చవిచూసిందీ భారత వైమానిక దళ చీఫ్ ఎ.పి.సింగ్ ఒక పత్రికా సమావేశంలో వివరించిన తర్వాత ద్వివేదీ నుంచి ఆ రకమైన ప్రకటన వెలువడింది. భారత్ వైపు చోటుచేసుకున్నట్లు చెబుతున్న నష్టాలను సింగ్ తోసిపుచ్చారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా వారిద్దరి కేమీ తీసిపోనన్నట్లుగా మాట్లాడారు. వివాదాస్పద సర్ క్రీక్ ప్రాంతంలో పాక్ ఎటువంటి దుస్సాహసానికి దిగినా, భారత్ ఇచ్చే దీటైన జవాబు పాకిస్తాన్ ''చరిత్రను, భౌగోళిక స్వరూపాన్ని రెండింటినీ'' మార్చివేస్తుందని తన భుజ్ పర్యటనలో హెచ్చరించారు.

తానేం తక్కువ తినలేదు!

వీటిపై పాక్ అసాధారణమైన రీతిలో స్పందించింది. భారత దేశంలో ఏ మూలనైనా దాడి చేయగల సామర్థ్యం తమ సొంతమని ప్రకటించింది. ఒకవేళ అణ్వాయుధాలతో పాక్‌ను నిర్మూలించదలిస్తే, అది పరస్పరమైనదిగా ఉంటుందని కుండబద్దలు కొట్టింది.

అణ్వాయుధ సంపత్తి కలిగిన పాకిస్తాన్ విఫల రాజ్యమనడంలో ఎలాంటి సందేహమూ లేదు. అది గత 40 ఏళ్ళుగా భారత్‌పై ఉగ్రవాదాన్ని ఎగదోస్తూనే ఉంది. చేబదుళ్ళు తెచ్చుకుంటూ రోజులు నెట్టుకొస్తోంది. అయినప్పటికీ, 6,60,000 బలగం కలిగిన పాక్ సైన్యాన్నీ, దాని అణ్వాయుధాలనూ భారత్ తేలిగ్గా తీసుకోవడానికి లేదు. ప్రపంచం పటం నుంచి తుడిచిపెట్టేస్తూంటే పాక్ అణ్వాయుధాలను ప్రయోగించకుండా కళ్ళప్పగించి చూస్తూ ఊరుకుంటుందనుకోవడం అవివేకం.



◆ 6,60,000 బలగం కలిగిన పాక్ సైన్యాన్ని, దాని అణ్వాయుధాలను భారత్ తేలిగ్గా తీసుకోవడానికి లేదు. ప్రపంచం పటం నుంచి తుడిచిపెట్టేస్తూంటే పాక్ అణ్వాయుధాలను ప్రయోగించకుండా కళ్ళప్పగించి చూస్తూ ఊరుకుంటుందనుకోవడం అవివేకం.

అంత తేలికేం కాలేదు!

పాక్ విజయ తంత్రాలను 1965లో ఛేదించడంలో భారత్ సఫలమైన మాట నిజమే కానీ, ఆ యుద్ధం ఒక రకంగా డ్రాగా ముగిసింది. రెండు పక్షాలూ ప్రత్యర్థి భూభాగాల నుంచి చెరికొంత ప్రయోజనాలను మూటగట్టుకున్నాయి. ఇక, పాక్‌తో భారత్ 1947 – 48 యుద్ధాన్ని కొనసాగించి ఉంటే మొత్తం జమ్ము–కశ్మీర్ విముక్తమయ్యేదనే అభిప్రాయం చాలా మందిలో బలంగా ఉంది. దేశ విభజన రక్తపు చారికలు ఆరకముందే, ఒక దేశంగా ఇంకా పూర్తిగా పటిష్ఠం కాకముందే, ఆ యుద్ధం జరిగివుంటే మరింత వినాశకర పర్యవసానాలకు దారితీసి ఉండేది.

మనం 1971లో తూర్పున చేసిన యుద్ధం బ్రహ్మాండంగా విజయవంతమైంది. కానీ, అది మనం ఓటమికి అణువంత అవకాశం కూడా ఇవ్వకూడని యుద్ధమనే సంగతిని మరచిపోకూడదు. ఈ విషయమై పాశ్చాత్యుల కథనం మాత్రం వేరు. పాక్ ఆకాశంలో సత్తా చూపలేక, చతికిలపడి ఉండవచ్చు. కానీ, క్షేత్ర స్థాయిలో మనం గడించిన లాభాలు అంతంతమాత్రమే! పైగా మనం ఛంబ్ (పీఓకే)ను కోల్పోవలసి వచ్చింది.

ఇక కార్గిల్ సంగతికొస్తే ఎత్తుగడ రీత్యా అది ఒక పరిమిత యుద్ధం. భారత్, పాక్ రెండూ అపుడు అణ్వాయుధ దేశాలు. భౌగోళికపరంగా, తీవ్రత పరంగా యుద్ధాన్ని కొంత మేరకే పరిమితం చేయాలనే వ్యూహాన్ని న్యూఢిల్లీ అనుసరించింది. ఈ సందర్భంగా భారత్‌కు అంతర్జాతీయంగా లభించిన మద్దతు పెద్ద ఫలితాన్ని ఇచ్చింది. ముఖ్యంగా అమెరికా నుంచి లభించిన మద్దతు వల్ల కార్గిల్‌లోని మిగిలిన పర్వత శిఖరాల నుంచి పాక్ సేనలు తోక ముడవవలసి వచ్చింది.

2002లో నిర్వహించిన 'ఆపరేషన్ పరాక్రమ్' భారత్–పాక్ సేనల సమీకరణను చూసింది. కానీ, తొమ్మిది నెలల తర్వాత, తుది ఫలితం అనుకూలంగా వస్తుందనే పూచీ లేకపోవడం వల్ల, భారత్ దాన్ని విరమించుకోవాల్సి వచ్చింది. ముంబయ్‌పై 2008 దాడి నేపథ్యంలోనూ అదే రకమైన పరిణామం చోటుచేసుకుంది.

'ఆపరేషన్ పరాక్రమ్' ఉపసంహరణ తర్వాత, ఆ సారాంశాన్ని పర్వేజ్ ముషారఫ్ బాగా వివరించారు. ''వారు (భారత్) మాపై దాడికి దిగరని, రెండు సైనిక శక్తులనూ బేరీజు వేసుకున్న తర్వాత ఒక నిర్ణయానికి వచ్చాను. దాడికి దిగే సేన విజయం సాధించేందుకు సైనికపరంగా ఒక నిర్దిష్ట నిష్పత్తి అవసరం. మేం నిర్వహిస్తూ వస్తున్న ఆ నిష్పత్తులు అంతకన్నా ఎక్కువగా ఉన్నాయి. ఆత్మరక్షణ చేసుకోవాల్సిన పక్షం తనను తాను కాపాడుకునేందుకు అవసరమైన దానికన్నా ఎక్కువ నిష్పత్తిలోనే ఉన్నాయి'' అని ఆయన అన్నారు.

ఇప్పుడేం మారిందని?


పాక్‌పై భారత్ పదాతి దళాలతో దాడికి దిగితే విజయం ఖాయమని సూచించేంతగా సంఖ్యలు, మోహరణలు, రక్షణ సామగ్రి పరంగా పరిస్థితిలో తేడా ఏమీ రాలేదు. మనం ఎంత చక్కగా సమాయత్తమై, ప్రేరణతో ఉన్నామో, అవతలి పక్షంవారు కూడా అలాగే ఉన్నారు. పైగా, వాస్తవాధీన రేఖ వెంబడి చైనా సేనల మోహరింపును ఎదుర్కొనేందుకు గడచిన ఐదేళ్ళుగా భారత్ తన సేనల కదలికలను నిశితంగా మార్చుకోవాల్సి వస్తోంది.

'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో, పాకిస్తానీ ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో, ప్రధాని మోదీ నూతన మార్గదర్శక సూత్రాలను నిర్దేశించారు. పాక్‌ను శిక్షించేందుకు అణు, సంప్రదాయ ఘర్షణల మధ్య తేడాను మెరుగైన రీతిలో వినియోగించుకోవాల్సి ఉందని ఆ మార్గదర్శక సూత్రాలు డిమాండ్ చేస్తున్నాయి. నాశనమైపోతారు జాగ్రత్తంటూ ప్రత్యర్థులను హెచ్చరించే బదులు, ప్రధాని చెప్పినట్లు నడచుకునేందుకు తగిన వ్యూహాలను పన్నడంపై సైన్యాధికారులు దృష్టి కేంద్రీకరించాలి.


వ్యాసకర్త న్యూఢిల్లీలోని 'అబ్జర్వర్ రిసెర్చ్ ఫౌండేషన్'లో విశిష్ట పరిశోధకుడు ('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

పుస్తక ప్రపంచం

అసంపూర్ణ న్యాయమేనా?



(ఇన్)కంప్లీట్ జస్టిస్?
ద సుప్రీం కోర్ట్ ఎట్ 75
క్రిటికల్ రిఫ్లెక్షన్స్



సంపాదకుడు:
జస్టిస్ ఎస్. మురళీధర్

రాజ్యాంగ అవతరణ జరిగిన రెండు రోజులకు, అంటే 1950 జనవరి 28న భారత అత్యున్నత న్యాయస్థానం తన కార్యక్రమాలను ప్రారంభించింది. ఈ 75 ఏళ్లలో ఎనిమిది మంది న్యాయమూర్తుల నుంచి 34 మంది న్యాయమూర్తులకు అది విస్తరించింది. భారతీయ న్యాయవ్యవస్థ పిరమిడ్ పైభాగాన ఉండే సుప్రీం కోర్టును ఢిల్లీలోని ఒక భవన సముదాయంగా పరిగణిస్తే– కోర్టు రూములు, వందలాది మంది కూర్చోగలిగే న్యాయవాదుల భిన్న ఛాంబర్లతో అది కళకళలాడుతుంటుంది. అక్కడ ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాదుల సంఖ్య 22,734. మరో 3,500 మంది 'అడ్వకేట్స్ ఆన్ రికార్డ్'. స్టెనోగ్రాఫర్స్, రిజిస్ట్రార్స్, డ్రైవర్స్, ప్యూన్స్ లాంటి ఇతర సిబ్బంది 3,770. ఇక 2025 మే 31 నాటికి పెండింగ్ కేసులు 81,735. ప్రజాస్వామ్యానికి మూడో స్తంభంగా పరిగణించే న్యాయవ్యవస్థ ఈ 75 ఏళ్లలో ఎలాంటి ఎత్తుపల్లాలను చూసిందో లోతుగా చర్చించే పుస్తకం '(ఇన్)కంప్లీట్ జస్టిస్?' శీర్షికే కోర్టు సంపూర్ణ న్యాయం చేకూర్చలేకపోయిందన్న భావన కలిగిస్తుంది. దాన్నే 24 మంది న్యాయనిష్ణాతులు తమ వ్యాసాలు, ఎడిటర్ స్వయంగా చేసిన ఇంటర్వ్యూల రూపంలో అభిప్రాయాలుగా పంచుకున్నారు.

'అందరు సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు కూడా మా స్థానిక హవల్దార్‌కు ఉన్నంత శక్తి లేదు' అని 1992 నాటి కుమ్హేర్ ఊచకోత నుంచి బతికి బయటపడ్డ



రాజస్థాన్‌కు చెందిన 'చున్నీ లాల్ జాతవ్' చెప్పిన మాటల్ని సీనియర్ జర్నలిస్ట్ పి.సాయినాథ్ ఉటంకిస్తారు. గ్రామాల్లోని అంచుల్లో ఉండేవాళ్లకు కోర్టుల్లోని న్యాయం ఎంత దూరమో ఆయన వివరిస్తారు. రాజ్యాంగానికి 'ఫౌండింగ్ డాటర్'నని చెప్పుకొనే న్యాయవాది ఇందిరా జైసింగ్... సుప్రీంకోర్టులో, మొత్తంగా న్యాయస్థానాల్లో ఉండే లింగ వివక్షను, లైంగిక హింసను ఎత్తిచూపుతారు. కార్మిక చట్టాల కేసులతో పాటు, ప్రత్యేకంగా పురుష న్యాయమూర్తుల బాధితులుగా ఉన్న మహిళా న్యాయమూర్తుల కేసుల్ని వాదించిన జైసింగ్ 'అది న్యాయవ్యవస్థ డర్టీ సీక్రెట్' అంటారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న న్యాయమూర్తిని మరో కోర్టుకు బదిలీ చేయడం అర్థరహిత చర్య, అది ఇంకో కోర్టుకు చేస్తున్న అన్యాయం అంటారు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి మదన్ లోకూర్. కొలీజియం పేరిట న్యాయమూర్తుల ఎంపికలో కార్యనిర్వాహక వ్యవస్థను మొత్తంగా పక్కన పెడితే, దాని ఆధిక్యాన్ని చాటుకోవడానికి కార్యనిర్వాహక వ్యవస్థ పలు దారులు వెతుకుతుందంటారు లా కమిషన్ మాజీ చైర్మన్ అజిత్ ప్రకాశ్ షా.

ఇన్ని లోపాలు ఉన్నప్పటికీ, సగటున అరవై ఏళ్ల వయసుండే ఒక సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఒక్కోసారి రోజుకు 60–65 హియరింగ్స్‌తో వ్యవహరించాల్సి ఉంటుంది. అంటే వాటన్నింటికి సంబంధించిన పత్రాలను ముందుగా చదివుండటం తప్ప మార్గం లేదు. 'ప్రపంచంలో ఏ సుప్రీం కోర్టు జడ్జికి కూడా ఇంతటి పని ఒత్తిడి ఉండదు' అంటారు సీనియర్ అడ్వకేట్ శ్రీరామ్ పంచు. వర్చ్యువల్ హియరింగ్స్‌కు ఆన్‌లైన్ ఫైలింగ్స్‌ను కూడా తప్పనిసరి చేయగలిగితే సుప్రీంకోర్టు సమర్థత పెరుగుతుందనీ, కోర్టు ప్రాంగణంలో మనుషుల తొక్కిడి ఉండదనీ సలహా ఇస్తారు సీనియర్ అడ్వకేట్ మీనాక్షీ అరోరా. 2023 జూలై 30 నాటికి 4,40,47,503 పెండింగ్ కేసులున్న జిల్లా కోర్టుల్లో 20 శాతం పోస్టులు ఖాళీగా ఉండటాన్నీ, కొన్నిచోట్ల కనీసం సరైన ప్రింటర్ కూడా ఉండని వైనాన్నీ వివరిస్తారు సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి ఎస్.రవీంద్ర భట్. ఇంకా రాజు రామచంద్రన్ (జడ్జీల తొలగింపు), ఉపేంద్ర బక్షి (పిల్స్), కె. చంద్రు (కార్మిక చట్టాలు), ఫైజాన్ ముస్తాఫా (ఆర్టికల్ 30) లాంటివాళ్లు భిన్న అంశాలను స్పృశిస్తారు. ఎన్నో తీర్పుల ఉటంకింపులతో సాగే ఈ వ్యాసాల్ని చదవడం సామాన్య పాఠకులకు కొంత ఇబ్బందే అయినా స్పిరిట్ అర్థం కాకుండా పోదు.


❑ ఎడిటోరియల్ టీమ్

గ్రామీణ సంపద పెరిగేలా...

ఇన్ బాక్స్

దేశంలోనే 100 వెనుకబడిన జిల్లాల్లో వ్యవసాయంలో సమూల మార్పులు తేవటమే 'ప్రధానమంత్రి ధన్–ధాన్య కృషి యోజన' (పీఎండీడీకేవై) పేరుతో రూపొందించిన మహత్తర పథకం లక్ష్యం. శనివారం ప్రధాని నరేంద్ర మోదీ ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. సుమారు రూ. 24 వేల కోట్ల వార్షిక బడ్జెట్‌తో 11 మంత్రిత్వ శాఖలకు చెందిన 36 కేంద్ర పథకాలను కలగలిపి ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. దీని ఐదు మూల సూత్రాలు:

1. **జల సంరక్షణ:** ప్రతి జిల్లాలో నీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధమయ్యాయి. డ్రిప్, స్ప్రింక్లర్ల వ్యవస్థలపై 90% సబ్సిడీ ఇస్తారు. సామూహిక బావులు నిర్మిస్తారు. సోలార్ పంపు సెట్లపై 60% సబ్సిడీ ఇస్తారు. కాలువలను ఆధునీకరిస్తారు. వరి సాగులో తడి పొడి (ఏడబ్ల్యూడీ) పద్ధతిని ప్రోత్సహించడం ద్వారా 30% నీటి వినియోగాన్ని తగ్గిస్తారు.



2. **పంటల వైవిధ్యం:** కరువును తట్టుకునే పంటల సాగుపై దృష్టి పెట్టడం, పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించడం లక్ష్యం. పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజలను ప్రోత్సహిస్తారు. పత్తిలో కంది లేదా సజ్జను అంతర పంటలుగా సాగు చేయిస్తారు. నేల సారాన్ని పెంచుకోవడమే కాకుండా, ఒక పంట విఫలమైనా మరొకటి ఆదాయాన్నిస్తుంది.
3. **కోత అనంతర ప్రాసెసింగ్:** ఈ పథకం కింద ప్రతి జిల్లాలో క్లీనింగ్, గ్రేడింగ్, కోల్డ్ స్టోరేజ్, మినీ–ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తారు.
4. **సంస్థాగత నిర్మాణం:** జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ఏర్పాటయ్యే 'ధన్–ధాన్య సమితి' ద్వారా జిల్లాకు అవసరమైన ప్రత్యేక ప్రణాళికను రూపొందించి అమలు చేస్తారు. నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ అభివృద్ధి చేసిన డిజిటల్ డాష్ బోర్డు... నేల ఆరోగ్యం, రుణ వినియోగం నుంచి మౌలిక సదుపాయాల కల్పన వరకు 117కు పైగా అంశాలను రియల్–టైమ్‌లో ట్రాక్ చేస్తుంది.
5. **సామాజిక న్యాయం:** చిన్న, సన్నకారు రైతులు, గిరిజనులు, అట్టడుగు వర్గాల వారిని సంఘటితం చేసి, ఉమ్మడి వ్యవసాయం, మార్కెటింగ్ చేయటంలో శిక్షణ ఇస్తారు. 70%కి పైగా ఉన్న చిన్న, సన్నకారు రైతులను ఆదుకోవటం లక్ష్యం. 40–60% మందిని ఎఫ్‌పీవోలు లేదా సహకార సంస్థలలో చేర్చుతారు.


ఈ పథకం గ్రామీణ సంపద సృష్టికి నూతన దిక్సూచిగా నిలుస్తుంది. తెలంగాణకు చెందిన నారాయణ్‌పేట, జోగులాంబ గద్వాల్, జనగాం, నాగర్‌కర్నూల్ జిల్లాలు ఈ పథకానికి ఎంపికయ్యాయి. ఈ పథకం వ్యవసాయ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయంగా నిలుస్తుంది.

– డా॥ షేక్ ఎన్. మీరా, ఐసీఏఆర్–అటారీ డైరెక్టర్, హైదరాబాద్

డేటా పాయింట్

వ్యవసాయ కూలీల ఆత్మహత్యలు

దేశంలో వ్యవసాయ కూలీల ఆత్మహత్యలు ఏటా పెరుగుతున్నాయి. 2019లో 4,324 నుంచి 2023 నాటికి 6,096కి పెరిగాయి.



ఆధారం: నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో

పరమ పావనం

జ్యోతిర్మయం

'అప్పటికి ఎన్నో ఏళ్ళ క్రితమే పూర్తిగా కాలి, బూడిద అయిపోయిన అరవై వేల మంది సగర పుత్రులు, ఆ బూడిద మీద పావన భాగీరథీ జలాలు ప్రవహించగానే స్వర్గ లోకాన్ని పొందారు. అంతటి మహిమ గల నదిని శ్రద్ధతో నిత్యమూ సేవించే భాగ్యశాలులు పొందే పుణ్యఫలం గురించి వేరే చెప్పాలా?' అంటుంది భాగవతం. భగీరథ ప్రయత్నఫలంగా ఘటించిన గంగావతరణ గాథ రామాయణంలోనే కాదు, భాగవతంలోనూ కనిపిస్తుంది.

భగీరథుడి తపస్సుతో ప్రసన్నురాలైన గంగ ఆయన కోరినట్లుగా ఆకాశం నుండి దిగి వచ్చేందుకు అంగీకరించింది, కానీ ఆమెకు ఒక సందేహం కలిగింది: 'రాజా! నీ కోరిక ప్రకారం నేను భూలోకంలో అవతరిస్తే, అక్కడి ప్రజలందరూ నా జలాలలో స్నానం చేసి, తమ పాపాలు ప్రక్షాళన చేసుకొంటారు. మంచిదే! కానీ తత్ఫలితంగా ఆ పాపాలు నాలో మిగిలి, నేను పాపపంకిలమైపోతే, అప్పుడు ఆ పాపాలు ప్రక్షాళనం చేసే ఉపాయం మరొకటి అవసరమౌతుంది. అలాంటి ఉపాయం ఏముంది?'

భగీరథుడు ఆ ప్రశ్నకు చక్కని జవాబిచ్చాడు: 'అమ్మా! భూమి మీద పాపాత్ములే కాదు, సాధు స్వభావం కలిగి సర్వసంగ త్యాగులై, బ్రహ్మనిష్ఠులూ, మహాత్ములూ, శాంతమూర్తులూ అయిన జ్ఞానులెందరో ఉన్నారు. **సాధవః, న్యాసినః, శాంతాః, బ్రహ్మిష్ఠాః, లోకపావనాః.** వాళ్ళు గంగాస్నానం చేసినప్పుడు, నీలో ఏదయినా పాప శేషం పోగుపడి ఉంటే, దాన్ని ఇట్టే, కేవలం తమ శరీర స్పర్శతో హరించివేయగలరు. **హరంతి అఘం తే, అంగ సంగాత్.** అంతటి శక్తి వాళ్ళకెక్కడిదంటావా? అది వాళ్ళ శక్తి కాదు. **తేష్వాస్తే అఘభిత్ హరిః.** అన్ని పాపాలనూ నశింపజేసే శ్రీహరి వాళ్ళలో నిత్యనివాసిగా నెలవై ఉంటాడు. ఏ శ్రీహరి పాదపంకజాల నుండి జన్మించటం నీ జలాల పావనత్వానికి కారణమో, ఆ శ్రీహరి అనుగ్రహమే మూడు లోకాలలోనూ ఆ పావనత్వానికి ఎలాంటి లోటూ రాకుండా కాపాడుతుంది' అన్నాడు. మందాకిని అప్పుడు నిస్సంకోచంగా భగీరథుడి రథం వెంట ప్రవహిస్తూ వెళ్ళింది.

– ఎం. మారుతి శాస్త్రి

క్లుప్తంగా...

పంట పోయిందని ప్రాణం తీసుకున్నాడు


మొండి

చెన్నూర్: ఇటీవల కురిసిన వర్షాలకు పంట నీటమునిగి, తెగుళ్లు ఆశించడంతో మనస్తాపం చెందిన రైతు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లో ఆదివారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. చెన్నూర్ పట్టణంలోని మహంకాళి వాడకు చెందిన రైతు గడల మొండి (65)కి 1.20 ఎకరాల సాగుభూమి ఉంది. ముగ్గురు ఆడ పిల్లల పెళ్లి కూడా చేశారు. ఈ ఖరీఫ్‌లో తన భూమితో పాటు మరో ఏడెకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాడు. సాగు భూమి గోదావరి సమీపంలో ఉండడంతో.. ఆగస్టు నెలలో కురిసిన భారీ వర్షాలకు సగం పంట నీట మునిగింది. సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలకు పంట మొత్తం మునిగి తెగుళ్లు ఆశిస్తున్నాయి. దీంతో దిగుబడి రాదని మొండి కొన్ని రోజులుగా దిగాలుగా ఉన్నాడు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో పశువులను మేతకు తీసుకెళ్లి సాయంత్రమైనా ఇంటికి రాలేదు. ఈ క్రమంలో కోటపల్లి రోడ్డులోని బతుకమ్మ వాగు వంతెన సమీపంలో పురుగు మందు తాగి మృతి చెందాడు. పోలీసులు రైతు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఖైదీ ఆత్మహత్యాయత్నం.. మృతి

- జనగామ సబ్‌జైలులో ఘటన


మల్లయ్య

జనగామ: జనగామ సబ్ జైలులో ఆత్మహత్యాయత్నం చేసిన ఒక ఖైదీ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆదివారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సింగరాజుపల్లికి చెందిన వారాల మల్లయ్య (42)ను ఒక కేసులో ఈ నెల 8వ తేదీన పోలీసులు కోర్టులో రిమాండ్ చేసి, అదే రోజు సబ్ జైలుకు తరలించారు. 11వ తేదీ ఉదయం టాయిలెట్‌లోని బ్లీచింగ్ పౌడర్ తాగినట్లు మల్లయ్య అధికారులకు స్వయంగా చెప్పడంతో.. వెంటనే జనగామ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అతన్ని వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మల్లయ్య మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు డీసీపీ కార్యాలయానికి వచ్చి జైలు అధికారుల నిర్లక్ష్యంతోనే మల్లయ్య చనిపోయాడని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. గర్భవతి అయిన మృతుని భార్య హైమ, ఇద్దరు పిల్లలు, గ్రామస్తులతో కలిసి న్యాయం చేయాలని కోరుతూ సబ్ జైలు వద్ద ఆందోళనకు దిగారు.

ఏనుగుల దాడిలో చిట్యాల వాసి మృతి


సైదులు

చిట్యాల: ఒడిశా రాష్ట్రంలో ఏనుగుల దాడిలో నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణానికి చెందిన బోరు బండి యజమాని మృతి చెందాడు. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాలివి. చిట్యాల పట్టణానికి చెందిన రుద్రారపు సైదులు (46)కు బోరు బండి ఉంది. సైదులు దసరా పండుగకు స్వగ్రామానికి వచ్చి ఇటీవల ఒడిశా రాష్ట్రంలోని డెంకనల్ జిల్లాలో నింబాహలి-గులేహి రోడ్డు వద్ద బోరు పనుల కోసం వెళ్లాడు. కాగా శనివారం ఉదయం సైదులు బోరు వేసేందుకు వెళ్లిన ప్రాంతంలో బహిర్భూమికి చెట్ల మధ్యలోకి వెళ్లాడు. ఇదే సమయంలో గుంపులుగా వచ్చిన ఏనుగులు అతనిపై దాడి చేసి తొక్కాయి. దీంతో సైదులు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం చిట్యాలలో అంత్యక్రియలు నిర్వహించారు.


నా బిడ్డ ఎన్నో జన్మల పుణ్యఫలం

- మిడ్కో సమగ్ర సాహిత్య ఆవిష్కరణ సభలో గుముడవెల్లి రేణుక తల్లి జయమ్మ


రేణుకకు నివాళులర్పిస్తున్న తల్లి జయమ్మ, తండ్రి సోమయ్య

హనుమకొండ కల్చరల్: 'రేణుక నా కూతురుగా పుట్టడం ఎన్నో జన్మల పుణ్యఫలం.. ఆమె నా బిడ్డ అయినందుకు గర్వపడుతున్నాను'అని గుముడవెల్లి రేణుక తల్లి జయమ్మ అన్నారు. దొడ్డి కొమురయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉద్యమకారిణి, రచయిత గుముడవెల్లి రేణుక (మిడ్కో) సమగ్ర సాహిత్యం.. పుస్తకాల ఆవిష్కరణ సభ ఆదివారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో జరిగింది. ఫౌండేషన్ కన్వీనర్ అస్నాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో మిడ్కో తల్లి జయమ్మ, తండ్రి సోమయ్య, ఫౌండేషన్ సలహాదారు నరసింహులు, దండకారణ్య ఉద్యమ నిర్మాత లంక పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనురాధ సంపాదకత్వంలో విరసం ప్రచురించిన మెట్టుమీద, ప్రవాహం, విముక్తిబాటలో అనే మూడు సంపుటాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. అస్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ మిడ్కో రచనలు సమాజానికి దారి చూపే దీపస్తంభమన్నారు.


దోమలపెంట సమీపంలో ఆక్టోపస్ వ్యూ పాయింట్


పాకాల సరస్సు..


నాగార్జున సాగర్ బ్యాక్‌వాటర్‌లో లాంచీలో ప్రయాణిస్తున్న పర్యాటకులు

నల్లమల అందాలు చూసొద్దాం

- అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో టైగర్ సఫారీ
- కృష్ణమ్మ పరవళ్లతో కనువిందు చేస్తున్న సోమశిల అందాలు
- నాగార్జునసాగర్ రిజర్వాయర్ల వద్ద బోటింగ్‌తో జాలీట్రిప్
- ప్రకృతి పారవశ్యానికి ఇదే సరైన సమయం

సాక్షి, నాగర్‌కర్నూల్: నల్లమల అటవీ అందాలను ఆస్వాదిస్తూ.. పులులు, చిరుతలు, వన్య ప్రాణులను ప్రత్యక్షంగా వీక్షించేందుకు అటవీశాఖ ఏర్పాట్లు చేసింది. ప్రకృతి ప్రేమికులు పరవశించిపోయేలా రోజంతా అడవి చెంతన గడిపేందుకు వీలుగా టైగర్ స్టే ప్యాకేజీలను అందిస్తోంది. టైగర్ సఫారీ వాహనంలో ప్రయాణిస్తూ వన్యప్రాణులను చూస్తూ.. దట్టమైన చెట్లతో ప్రకృతి అందాలను ఒకే చోట చేర్చినట్టు ఉండే వ్యూ పాయింట్లను వీక్షిస్తూ అమితమైన ఆనందాన్ని పొందొచ్చు.

రెండు రకాల ప్యాకేజీలతో టైగర్ స్టే..

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూర్, దోమలపెంట వద్ద రెండు రకాల టైగర్ స్టే ప్యాకేజీలను అటవీశాఖ అందిస్తోంది.

- మన్ననూర్ సమీపంలోని ఫర్హాబాద్ చెక్‌పోస్టు మీదుగా సఫారీ వాహనంలో జంగిల్ రైడ్, ఫర్హాబాద్ వ్యూ పాయింట్, మన్ననూర్‌లోని ప్రత్యేక కాటేజీల్లో వసతి సౌకర్యాలను కల్పిస్తోంది.
- శ్రీశైలం రిజర్వాయర్ చెంతనే ఉన్న దోమలపెంట వద్ద నైట్ స్టే, కాటేజీల్లో వసతి, దోమలపెంట నుంచి అక్కమహాదేవి గుహల వరకు కృష్ణానదిలో బోటు ప్రయాణం, కృష్ణమ్మ ఒడి నుంచి అక్కమహాదేవి గుహ వరకు ట్రెక్కింగ్ ఈ ప్యాకేజీలో ఉంది.
- ఒక్కో జంటకు రూ. 6,500 నుంచి 8 వేల వరకు చెల్లించి ఒక రోజంతా అడవిలో గడిపేలా ఈ ప్యాకేజీలను అమలు చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో www.amrabadtiferrererve.com ద్వారా ముందస్తు బుకింగ్ చేసుకోవచ్చు.

బెస్ట్ టూరిస్ట్ డెస్టినేషన్‌గా సోమశిల

చుట్టూ పచ్చని నల్లమల కొండలు, మధ్యలో నీలి రంగు పులుముకొని పరవళ్లు తొక్కుతూ సాగిపోయే కృష్ణానది అందాలు, పురాతన ఆలయాల సౌరభాలతో సోమశిల ప్రాంతం పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో లాంచీ విహారం, బోటు షికారు ద్వారా పర్యాటకులు ప్రత్యేక అనుభూతిని పొందుతున్నారు. ఇక్కడకు సమీపంలోనే ఉన్న పురాతన లలితా సోమేశ్వర ఆలయం, సంగమేశ్వర ఆలయం , జటప్రోలులోని మదనగోపాలస్వామి ఆలయాలను పెద్ద సంఖ్యలో పర్యాటకులు సందర్శిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలో ఉన్న సోమశిల గ్రామం ఇప్పుడు బెస్ట్ టూరిస్ట్ డెస్టినేషన్‌గా నిలుస్తోంది. శ్రీశైలం రిజర్వాయర్ పూర్తిగా నీటితో నిండటంతో ఈ ప్రాంతం సముద్రంలా కనిపిస్తోంది. పర్యాటకుల వసతి కోసం ప్రైవేటు రిసార్టులతో పాటు స్థానికులు హోం స్టే ద్వారా తమ ఇళ్లను అద్దెకు ఇస్తున్నారు. కృష్ణానదిలో లభించే చేపలతో రుచికరమైన వంటకాలను అందిస్తూ సోమశిల గ్రామస్తులు ఆదాయాన్ని పొందుతున్నారు.


విస్తృతమవుతున్న లాంచీ సేవలు

ఈసారి వర్షాలు అధికంగా ఉండటంతో ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు, జలాశయాలన్నీ నీటితో కళకళలాడుతున్నాయి. ఈ క్రమంలో బోటింగ్ విహారానికి సౌలభ్యం ఉన్నచోట పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. నాగార్జునసాగర్ బ్యాక్‌వాటర్‌లో లాంచీ విహారానికి పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. నాగార్జునసాగర్ హిల్‌కాలనీ నుంచి నాగార్జున కొండ, ఐలాండ్ మ్యూజియం వరకు సుమారు 18 కి.మీ.దూరం పాటు పర్యాటక శాఖ లాంచీ ప్రయాణానికి అవకాశం కల్పిస్తోంది. శుక్రవారం మినహా మిగతా రోజుల్లో నిత్యం లాంచీ అందుబాటులో ఉంటుంది.

పాకాలలోనూ...

వరంగల్ జిల్లాలోని పాకాల సరస్సు ప్రకృతి ప్రేమికులను ఆకర్షిస్తోంది. సరస్సు చుట్టూ పచ్చని అడవి, సరస్సు మధ్యలో ద్వీపాన్ని చూసేందుకు అటవీశాఖ బోటింగ్ సౌకర్యాన్ని కల్పిస్తోంది. ఇక్కడి బటర్‌ఫ్లై గార్డెన్‌తోపాటు చుట్టూ ఉన్న అభయారణ్యం అందాలను వీక్షిస్తూ ప్రకృతి ప్రేమికులు మురిసిపోతారు. చిలకలగుట్ట వ్యూపాయింట్ వద్ద వాచ్ టవర్, నైట్ క్యాంపింగ్‌నకు అధికారులు అవకాశం కల్పిస్తున్నారు.

పర్యాటకులకు వసతులు పెంచుతున్నాం..



కృష్ణాతీరంలో సోమశిల, అమరగిరి ప్రాంతాలు దేశ, విదేశ పర్యాటకులను సైతం ఆకర్షిస్తున్నాయి. అమరగిరి ఐలాండ్‌లో వెల్‌నెస్, స్పిరిచువల్ రిట్రీట్ ప్రాజెక్ట్ ద్వారా అధునాతన వసతులు, కాటేజీలు నిర్మిస్తున్నాం. సోమశిలను జాతీయ స్థాయిలో పర్యాటకులను ఆకర్షించేలా ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది.

– జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి

25శాతం కొనుగోలు పరిమితిని ఎత్తేయాలి

- మద్దతు ధర పథకంపై మంత్రి తుమ్మల
- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ

సాక్షి, హైదరాబాద్/దమ్మపేట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మద్దతు ధర పథకం (పీఎస్ఎస్)లో 25శాతం కొనుగోలు పరిమితిని ఎత్తివేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. ఈ మేరకు ఆయన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ఆదివారం లేఖ రాశారు. పీఎస్ఎస్ పథకంలో ఉన్న పరిమితులు, ప్రధాన పంటల కొనుగోలుపై కేంద్రం చూపుతున్న నిర్లక్ష్యం, రైతుల ఆదాయంపై ప్రభావం, కేంద్ర వాణిజ్య విధానాలపై లేఖలో వివరించారు. ప్రస్తుతం పీఎస్ఎస్ కింద కొనుగోలు చేస్తున్న నువ్వులు, శనగలు, వేరుశనగ, సోయాబీన్, పెసర్లు వంటి పంటలపై కేంద్రం 25% పరిమితి విధించడం వల్ల రైతులు పండించిన పంటలో 25% మాత్రమే మద్దతు ధరకు అమ్ముకొనే వెసులుబాటు ఉందన్నారు. తెలంగాణ తదితర రాష్ట్రాల్లో నువ్వులు, శనగలు, వేరుశనగ, సోయాబీన్, పెసర్లు విస్తారంగా సాగవుతాయని, ఈ పరిమితిని విధించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మార్కెట్‌లో ధరలు పడిపోయిన సమయంలో రైతుల ప్రయోజనార్థం రాష్ట్ర ప్రభుత్వం మార్క్ ఫెడ్, సహకార సంస్థల ద్వారా కేంద్రం విధించిన 25శాతం సీలింగ్ కంటే ఎక్కువ కొనుగోళ్లు చేయవలసి వస్తోందని, దీంతో రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా మొక్కజొన్న, జొన్న పంటలను పీఎస్ఎస్‌లో చేర్చాలని కోరారు.


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన కలెక్టర్ జితేష్

ఆయిల్‌పామ్‌తో రైతు రాజవుతాడు

స్థిరమైన ఆదాయాన్ని ఇచ్చే ఆయిల్‌పామ్ సాగుతో రైతే రాజు అనే నానుడి నిజం అవుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండల పరిధిలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో ఆయిల్‌ఫెడ్ అధికారుల అభినందన సభలో తుమ్మల మాట్లాడారు. మహారాష్ట్రకు చెందిన ఆదర్శ రైతు చంద్రశేఖర్ అనుసరిస్తున్న సుగుణ రీ జనరేటివ్ టెక్నాలజీ విధానంలో భూమిని దున్నకుండా సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేసేందుకు గల అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఈ విధానంలో పంటలో కలుపు పుట్టించి, దాన్ని కుళ్లబెట్టడం ద్వారా భూమికి బలం, పోషకాలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాదగిరి క్షేత్రంలో భక్తుల రద్దీ



యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు కావడంతో జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాల భక్తులు అధికంగా తరలి వచ్చారు. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.49,68,644 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.


అడవిదేవులపల్లిలో 15 అడుగుల జొన్న మొక్క


కల్వకుర్తి మండలం సుద్దకల్ గ్రామంలో 18 అడుగుల జొన్న మొక్క

జొన్న.. పొడవులో మిన్న

సాధారణంగా జొన్న చెట్టు 6 లేదా 7 అడుగుల ఎత్తు పెరుగుతుంది. కానీ, నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం సుద్దకల్ గ్రామంలో చాకలి తిరుపతమ్మ ఇంటి వద్ద మొలిచిన ఒక జొన్న చెట్టు ఏకంగా 18 అడుగులు పెరిగి ఆశ్చర్యానికి గురిచేస్తోంది. నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండల కేంద్రానికి చెందిన బాల సైదులు ఇంటి ఆవరణలో కూడా సుమారు 15 అడుగుల ఎత్తులో మొక్కజొన్న మొక్క ఏపుగా పెరిగి ఆకట్టుకుంటోంది.

– కల్వకుర్తి రూరల్/అడవిదేవులపల్లి

రిజర్వేషన్లపై ప్రభుత్వానిదే అంతిమ విజయం

- ఏఐసీసీ పరిశీలకుడు నారాయణస్వామి


మాట్లాడుతున్న నారాయణస్వామి

సాక్షి, నాగర్‌కర్నూల్: రాష్ట్రంలోని స్థానిక సంస్థల స్థానాల్లోని బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పనలో అంతిమంగా ప్రభుత్వమే విజయం సాధిస్తుందని పుదుచ్చేరి మాజీ ముఖ్యమంత్రి, ఏఐసీసీ పరిశీలకుడు నారాయణస్వామి స్పష్టం చేశారు. ఆయన ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడి ఎన్నికకు పరిశీలకునిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం సమగ్రంగా కులగణన చేపట్టి బీసీల లెక్క తేల్చిందన్నారు. దానిని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటోందని ఆరోపించారు. తమిళనాడులో ఓబీసీలకు 69 శాతం, కర్ణాటకలో 52 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయని గుర్తు చేశారు. తెలంగాణలోనూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డిని అభినందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాల్లో డీసీసీ పదవుల కోసం ఆశావహులతోపా టు బ్లాక్ కాంగ్రెస్, మండల అధ్యక్షుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట ఏఐసీసీ పరిశీలకులు నెమ్మళ్ల శ్రీనివాస్, కోటేశ్వరరావు, శ్రీకాంత్‌గౌడ్, సంధ్యారెడ్డి, ఎమ్మెల్యే వంశీకృష్ణ, రాజేశ్‌రెడ్డి తదితరులున్నారు.

నేను ఎవరిపైనా ఫిర్యాదు చేయలేదు: సీతక్క



సాక్షి, హైదరాబాద్: మేడారం ఆలయ అభివృద్ధి పనుల విషయంలో తాను పీసీసీ చీఫ్‌కు ఎవరిపైనా ఫిర్యాదు చేయలేదని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. సమ్మక్క-సారలమ్మ ఆలయ పనుల విషయంలో ఇద్దరు మంత్రుల మధ్య విభేదాలు వచ్చాయంటూ మీడియాలో వచ్చిన వార్తలను మాత్రమే తాను మహేశ్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లానని ఆదివారం ఒక ప్రకటనలో ఆమె వివరణ ఇచ్చారు. వీలైనంత త్వరగా ఆ వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని మాత్రమే చెప్పానని స్పష్టం చేశారు. వీర వనితలైన సమ్మక్క-సారలమ్మ ఆలయ అభివృద్ధి పనుల విషయంలో ఎలాంటి వివాదం ఉండకూడదన్న ఉద్దేశంతో మాత్రమే స్థానిక ఎమ్మెల్యేగా, మంత్రిగా విషయాలను పీసీసీ దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్న ఈ పనులను ఎలాంటి అపార్థాలకు తావు లేకుండా సజావుగా పూర్తి చేయాల్సి ఉంటుందని, సున్నితమైన అంశం కావడంతో అపార్థాలను తొలగించి అభివృద్ధి కార్యక్రమాలు వేగిరమయ్యేలా చూడాలని కోరానే తప్ప ఎవరిపైనా ఫిర్యాదు చేయలేదని సీతక్క తెలిపారు.

వందే భారత్ స్లీపర్ @ కాజీపేట

▶ మొదటి పేజీ తరువాయి

సాధారణ వందేభారత్ రైళ్లకు బదులు తమకు వందేభారత్ స్లీపర్ సర్వీసులు కేటాయించాలని రాష్ట్రాలు కోరుతున్నాయి. దీంతో క్రమంగా సాధారణ వందేభారత్ రైళ్ల డిమాండ్ తగ్గుతూ వస్తోంది.

200 వందేభారత్ స్లీపర్ రైళ్లు...

వీలైనంత తొందరలో దేశవ్యాప్తంగా 200 వందేభారత్ స్లీపర్ రైళ్లను ప్రవేశపెట్టాలని కేంద్రం భావిస్తోంది. క్రమంగా ప్రస్తుతం తిరుగుతున్న రాజధాని, దురొంతో ప్రీమియం కేటగిరీ సహా సూపర్ ఫాస్ట్ రైళ్ల స్థానంలో వాటిని ప్రవేశపెట్టే యోచనలో ఉంది. ఇది జరగాలంటే తక్కువ సమయంలో వీలైనన్ని రేక్స్ తయారు కావాల్సి ఉంటుంది.

- ప్రస్తుతం చెన్నై ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో తొలి ప్రోటోటైప్ రైలు తయారు కాగా, అక్కడ మరిన్ని రైళ్లను తయారు చేయనున్నారు.
- రష్యాకు చెందిన కినెత్ రైల్వే సొల్యూషన్స్‌తో కలిసి రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ జాయింట్ వెంచర్‌గా ఏర్పడి 120 రైళ్లను తయారు చేయనుంది. లాతూర్‌లోని మరాట్వాడా కోచ్ ఫ్యాక్టరీలో ఇవి తయారవుతాయి.
- బెంగళూరులోని భారత్ ఎర్త్‌మూవర్స్ లిమిటెడ్ (బీఈఎంఎల్)లో రెండో ప్రోటోటైప్ రైలు సిద్ధమవుతుండగా, ఇక్కడ వెంటనే మరిన్నింటి తయారీ కొనసాగనుంది.
- కోల్‌కతా శివారులోని టీటాగర్ రైల్ సొల్యూషన్స్ ఫ్యాక్టరీ, ఉత్తరప్రదేశ్‌లోని మోడ్రన్ కోచ్ ఫ్యాక్టరీలను కూడా ఇందుకు వినియోగించనున్నారు. అయితే డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా ఉండాలంటే మరిన్ని కోచ్ ఫ్యాక్టరీల్లో కూడా వాటి తయారీ అవసరమని తాజాగా రైల్వే శాఖ భావిస్తోంది. దీంతో కొత్తగా అందుబాటులోకి వస్తున్న కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని కూడా ఇందుకు వినియోగించాలని భావిస్తోంది. ఈమేరకు ఇటీవల అధికారులు కోచ్ ఫ్యాక్టరీని సందర్శించి వెళ్లారు. ఈ సంవత్సరం చివరి నాటికి అది పూర్తిస్థాయిలో సిద్ధం కానుంది. మార్చి నుంచి ఉత్పత్తి ప్రారంభించొచ్చని అధికారులు తేల్చారు. ఆ మేరకు రైల్వే బోర్డు ఉన్నతాధికారులు ఢిల్లీలో కూడా సమావేశమై దీనిపై చర్చించినట్టు తెలిసింది.

చేతబడి చేశారని నమ్మించి..

- రూ.కోట్లు కాజేసిన కిలాడీ దంపతులు.. మోసపోయిన విశ్రాంత ఉద్యోగి
- బాధితుడి ఫిర్యాదుతో నిందితుల అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

మహబూబ్‌నగర్ క్రైం: కుమారుడికి ఆరోగ్యం బాగాలేకపోతే.. చేతబడి చేశారని నమ్మించి దానిని తొలగించడానికి తల్లిదండ్రుల నుంచి రూ.కోట్ల నగదు కాజేసిన కిలాడీ దంపతులను మహబూబ్‌నగర్ జిల్లా పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని రాజేంద్రనగర్‌కు చెందిన విశ్రాంత ఉద్యోగి పురేందర్‌రెడ్డి ప్రస్తుతం హైదరాబాద్‌లోని సైనిక్‌పురిలో నివాసం ఉంటున్నాడు. అయితే పురేందర్‌రెడ్డి కొడుకు అల్సరేటివ్ కొలిటిస్ అనే వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యం చేసినా కోలుకునే అవకాశం తక్కువగా ఉందని వైద్యులు చెప్పారు. ఈ క్రమంలో పురేందర్‌రెడ్డికి బంధువుల ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్లకు చెందిన పాలడుగు రఘురాం అతని భార్య సునీతదేవి పరిచయం అయ్యారు. కొద్దిరోజుల తర్వాత రెండు కుటుంబాల మధ్య సాన్నిహిత్యం పెరిగింది. అయితే పురేందర్‌రెడ్డి కొడుకు ఆరోగ్యం మరింత క్షీణించడంతో వారిలో ఆందోళన మొదలైంది. ఈ క్రమంలో పురేందర్‌రెడ్డి దంపతుల నిస్సహాయతను ఆసరాగా చేసుకున్న రఘురాం, సునీతదేవి కలిసి మీ కుటుంబానికి ఎవరో చేతబడి చేశారని నమ్మించారు. ఆ చేతబడిని తొలగించే బ్రాహ్మణుడిని సంప్రదించాలని వారికి సలహా ఇచ్చారు. రఘురాంను గుడ్డిగా నమ్మి వారు చెప్పినట్టు చేయడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలోనే విజయవాడకు చెందిన ఓ బ్రాహ్మణ సిద్ధాంతిని సంప్రదించినట్టు నమ్మించాడు. చేతబడి తొలగించాలంటే ఇంట్లో బంగారం, వెండి ఆభరణాలు ఉండరాదని సిద్ధాంతి చెప్పాడని.. పూజలు పూర్తయిన తర్వాత తిరిగిస్తాడని పురేందర్‌రెడ్డిని నమ్మించారు. దీంతో పురేందర్‌రెడ్డి దగ్గర ఉన్న 60 తులాల బంగారం, రెండు కిలోల వెండి తీసుకున్నాడు. కొన్ని రోజులకు కొడుకు ఆరోగ్యం కొంత మెరుగైనట్టు అనిపించింది. పురేందర్‌రెడ్డికి రఘురాం దంపతులు పరిచయమైన నాటి నుంచి పూజలు, చేతబడి పేరిట రూ.60 లక్షలు వరకు వసూలు చేశారు. పురేందర్‌రెడ్డి కుటుంబం ఆందోళనలో ఉన్న సమయంలో మీ కోడలు మీపై క్రిమినల్ కేసులు పెట్టడానికి సిద్ధంగా ఉన్నట్టు రఘురాం మరోసారి వారిని నమ్మించి ఆస్తులు మొత్తం ఇతరుల పేరుపై పెట్టాలని సలహా ఇచ్చాడు. దీంతో పురేందర్‌రెడ్డి తన పేరు మీద హైదరాబాద్‌లోని మైహోం క్రిష్ ఫ్లాట్, మహబూబ్‌నగర్ రాజేంద్రనగర్‌లోని ఇల్లు, బండ్లగూడలో ఉన్న 200 గజాల స్థలం, అడ్డాకుల మండలం కందూరు గ్రామంలో ఉన్న 7.35 ఎకరాల భూమిని రఘురాం, అతని భార్య సునీతదేవి పేర్ల మీదకు చేశారు. బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.1.05 కోట్ల నగదును వీరి ఖాతాల్లోకి బదిలీ చేసుకున్నారు. ఇంట్లో ఉన్న రూ.కోటి నగదు సైతం రఘురాం తీసుకున్నాడు. ఆ తర్వాత పురేందర్‌రెడ్డి మోసపోయానని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆదివారం నిందితులు రఘురాం, సునీత దంపతులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ వెల్లడించారు. ఈ దంపతులపై హైదరాబాద్‌లోని పలు పోలీస్ స్టేషన్లలోనూ పలు కేసులు ఉన్నాయని సీఐ తెలిపారు.

తాగి వేధిస్తున్నాడని.. భర్తను కడతేర్చిన భార్య

- రంగారెడ్డి జిల్లా కేశంపేటలో దారుణం


కుమార్

కేశంపేట: తాగి వచ్చి వేధిస్తున్నాడని తాళి కట్టిన భర్తనే కడతేర్చింది ఓ మహిళ. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా కేశంపేటలో ఆదివారం వెలుగు చూసింది. సీఐ నరహరి తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన కొప్పు కుమార్ (35), మాధవి దంపతులకు ఓ కూతురు, కుమారుడు సంతానం. కూతురు హాస్టల్‌లో చదువుతుండగా కుమారుడు వీరి వద్దే ఉంటూ చదువుకుంటున్నాడు. కుమార్ మద్యానికి బానిసవ్వడంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం రాత్రి కూడా కుమార్ తాగి వచ్చి భార్యతో గొడవ పడ్డాడు. దీంతో భర్తను అంతం చేయాలని భావించిన మాధవి సిమెంట్ ఇటుకతో నిద్రిస్తున్న కుమార్ తలపై మోదడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ఇంటి ఎదుట ఉన్న నీటి సంపులో పడేసి భార్య పరారైంది. కాగా, తెల్లవారు జామున ఏడుస్తున్న కుమారుడిని గ్రామస్తులు ప్రశ్నించగా 'మా నాన్నను అమ్మ సిమెంట్ రాయితో కొట్టి చంపింది. ఎంత ఏడ్చినా వినలేదు. రక్తం మరకలు కనపడకుండా పౌడర్ చల్లి నాన్నను సంపులో పడేసింది'అంటూ చెప్పడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలుడిపై లైంగిక దాడి

- సైదాబాద్ చిల్డ్రన్ హోంలో ఘటన
- కేసు నమోదు.. గార్డ్ స్టాఫ్ అరెస్టు

సాక్షి, హైదరాబాద్: బాలసదనంలోని ఓ బాలుడిపై లైంగిక దాడి జరిగింది. తీవ్ర అస్వస్థతతో ఆస్పత్రికి ఆ బాలుడు వెళ్లగా.. ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. సైదాబాద్ బాల సదనంలోని ఓ బాలుడిపై కొంత కాలంగా అక్కడే పనిచేస్తున్న గార్డ్ స్టాఫ్ లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో ఆ బాలుడు అస్వస్థతకు లోనయ్యాడు. అనుమతి లేకున్నా, షార్ట్ లీవ్ మంజూరు చేశారు. దీంతో ఆ బాలుడు ఇంటికి వెళ్లాడు. నీరసంగా ఉండటంతో తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన డాక్టర్.. ఆ బాలుడు లైంగిక దాడికి గురైనట్టు నిర్ధారించాడు. దీంతో ఆ బాలుడి తల్లిదండ్రులు సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి సైదాబాద్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు బాలసదనానికి వెళ్లి లైంగిక దాడికి పాల్పడిన ఉద్యోగి (గార్డ్ స్టాఫ్)ని శనివారం రాత్రి అరెస్టు చేశారు.

మరికొందరిపైనా దాడి...: ఈ బాలసదనంలో మొత్తం 77 మంది చిన్నారులున్నారు. లైంగిక దాడి విషయంపై పోలీసులు ఆదివారం కూడా ఆరా తీశారు. మరో నలుగురిపైనా లైంగిక దాడి జరిగినట్టు గుర్తించారు. వారిని పోలీసులు ప్రత్యేకంగా విచారించి, వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నట్టు సమాచారం. ఈ దాడి వెనుక మరో ఇద్దరు ఉద్యోగుల ప్రమేయం కూడా ఉన్నట్టు తెలిసింది.

నిత్య వైద్య పరీక్షలేవీ?: వాస్తవానికి విద్యార్థులకు ప్రతిరోజు వైద్య పరీక్షలు నిర్వహించాలి. ఈ మేరకు అక్కడ శాశ్వత ప్రాతిపదికన డాక్టర్‌ను నియమించినా, ఆయన బాలసదనానికి చుట్టపుచూపుగా వస్తుంటాడని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. మరోచోట ప్రైవేట్ ఆస్పత్రి నిర్వహిస్తుండటంతో ఆయన ఇక్కడ విధులకు సకాలంలో హాజరుకారనే ప్రచారం ఉంది. ఈ ఘటనపై రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు స్పందించి విచారణకు ఆదేశించినట్టు సమాచారం.

అర్ధరాత్రి బయటకు ఎందుకొచ్చింది?

వైద్య విద్యార్థిని రేప్ ఉదంతంపై మమత వివాదాస్పద వ్యాఖ్యలు

- అంత రాత్రివేళ బయటికొస్తుంటే కాలేజీ సెక్యూరిటీ ఏం చేస్తున్నట్లు?
- అయినాసరే బయటకొస్తామంటే మీ రక్షణ మీరే చూసుకోవాలని హితవు
- మెడికల్ విద్యార్థుల భద్రతను ప్రైవేట్ కాలేజీ గాలికొదిలేసిందని ఆరోపణ

దుర్గాపూర్/కోల్‌కతా: పశ్చిమ్ బర్ధమాన్ జిల్లాలో వైద్యవిద్యార్థిని సామూహిక అత్యాచార ఉదంతంలో భద్రతా వైఫల్యాలపై ఆరోపణలు వెల్లువెత్తుతున్న వేళ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అర్ధరాత్రి వేళ విద్యార్థిని మెడికల్ కాలేజీ ప్రాంగణం నుంచి బయటకు ఎందుకు రావాల్సి వచ్చిందని ప్రశ్నించారు. నార్త్‌బెంగాల్ ఏరియాలో ప్రకృతివిపత్తుతో ధ్వంసమైన ప్రాంతాల్లో పర్యటించేందుకు వెళ్తూ కోల్‌కతా ఎయిర్‌పోర్ట్‌లో మీడియాతో ఆమె మాట్లాడారు. మహిళా విద్యార్థులకు రక్షణ కల్పించడంలో ప్రైవేట్ మెడికల్ కాలేజీ విఫలమైందని ఆరోపించారు. ''బాధిత విద్యార్థిని ప్రైవేట్ మెడికల్ కాలేజీలో చదువుకుంటోంది. ఈ లెక్కన ఆ కాలేజీలోని విద్యార్థినుల భద్రత, రక్షణ బాధ్యత ఆ కాలేజీదే. అర్ధరాత్రి 12.30 గంటలకు ఆ అమ్మాయి కాలేజీ నుంచి ఎందుకు బయటకు వచ్చింది? అమ్మాయి అర్ధరాత్రి బయటకు వస్తుంటే కాలేజీ సెక్యూరిటీ విభాగం ఏం చేస్తోంది? జరిగిన ఘటన అత్యంత దిగ్భ్రాంతికరమని నేను కూడా ఒప్పుకుంటా. కానీ అసలు అమ్మాయి అర్ధరాత్రి బయటకు వెళ్తుంటే కాలేజీ యాజమాన్యం ఏం పట్టించుకుంటున్నట్లు? అర్ధరాత్రి బయటకు అనుమతించే సంస్కృతిని ప్రైవేట్ కాలేజీని విడనాడాలి. అటవీ ప్రాంతంలోని ఆ కాలేజీ నుంచి అర్ధరాత్రి ఎవరినీ బయటకు అనుమతించకూడదు. అయినాసరే బయటకొస్తామంటే వాళ్ల రక్షణ బాధ్యత వాళ్లే చూసుకోవాలి. అది పూర్తిగా అటవీప్రాంతం. ఈ విషయంలో రాష్ట్ర పోలీసులను తప్పుబట్టడానికి ఏం లేదు. ఎందుకంటే పోలీసులకు సైతం కొన్ని పరిమితులు ఉంటాయి. వ్యక్తులు వ్యక్తిగతంగా రాత్రిళ్లు చేసే షికార్లను పోలీసులు ఎలా ముందే పసిగట్టగలరు?. రాత్రి ఎవరు ఇంటి నుంచి బయటకు వస్తున్నారో పోలీసులకు ఎలా తెలుస్తుంది? ప్రతి ఒక్క ఇంటి ముందు పోలీసులు రక్షణగా నిలబడలేరుకదా?. రాష్ట్రేతర మహిళా విద్యార్థులు తాముండే హాస్టళ్ల నిబంధనలను అతిక్రమించకూడదు. రాత్రివేళ బయటకు వచ్చే సాహసం చేయకండి'' అని మమత అన్నారు.

ముగ్గురు నిందితుల అరెస్ట్, రిమాండ్

గ్యాంగ్‌రేప్ ఘటనలో నిందితులు షేక్ రియాజుద్దీన్, షేక్ ఫిర్దౌస్, అప్పూలను ఆదివారం పోలీసులు అరెస్ట్‌చేశారు. ఘటన వేళ బాధితురాలి ఫోన్‌ను లాక్కున్న నిందితులు వేరే వ్యక్తికి ఫోన్ చేశారు. అలా బాధితురాలి ఫోన్ కాల్‌డేటా విశ్లేషణ ద్వారా నిందితుల జాడ కనిపెట్టారు. బాధితురాలి స్నేహితురాలి పాత్ర పైనా పోలీసులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఈ కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోంది. ముగ్గురు నిందితులను పోలీసులు ఆదివారం దుర్గాపూర్ సబ్ డివిజినల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. వీళ్లను 10 రోజులపాటు పోలీసు కస్టడీకి అప్పగిస్తూ ఆయన ఆదేశాలిచ్చారు. రేప్ ఘటనలో పరోక్ష ప్రమేయం ఉండొచ్చన్న అనుమానంతో మరో వ్యక్తిని సైతం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బెంగాల్ మీదే ఎందుకు కక్ష?

''చాలా రాష్ట్రాల్లో ఇలా గ్యాంగ్‌రేప్‌లు జరుగుతున్నాయి. ఒక్క బెంగాల్‌లో జరిగిన ఘటనలనే ఎందుకు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారుస్తున్నారు?'' అని మీడియాను మమత ఎదురు ప్రశ్నించారు. ''ఇలాంటి ఘటనలు పొరుగున ఉన్న బిహార్, ఉత్తర ప్రదేశ్, ఒడిశాలోనూ జరుగుతున్నాయి. కేసు విచారణ కోసం న్యాయస్థానాలకు వెళ్తున్న బాధితులను యూపీలో మార్గమధ్యంలోనే తగలబెడుతున్నారు. ఒడిశాలో బీచ్‌లలో రేప్ ఘటనలు జరిగాయి. ఇలాంటి ఘటనల్లో అక్కడి ప్రభుత్వాలు ఏపాటి చర్యలు తీసుకున్నాయి. గత ఏడాది ఆర్‌జీకర్ మెడికల్ కాలేజీ ఉదంతంలో మా ప్రభుత్వం నెలలోపే చార్జ్‌షీట్ దాఖలు చేసింది. కింది కోర్టు ఇప్పటికే మరణశిక్ష సైతం విధించింది''అని మమత గుర్తుచేశారు.



మండిపడ్డ విపక్షం

దారుణోదంతంపై కఠిన చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వాల్సిందిపోయి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారంటూ మమతా బెనర్జీపై విపక్ష బీజేపీ మండిపడింది. ''బాధితురాలికి అండగా నిలబడకుండా ఆమెనే నేరస్తురాలు అన్నట్లు మమత అత్యంత కర్కశంగా మాట్లాడుతున్నారు. బాధితురాలిని కష్టకాలంలో ఆదుకుని అండగా నిలబడాల్సిందిపోయి ఇలా మాట్లాడుతున్న మమతకు కనీసం పరిపాలించే హక్కు లేదు. మహిళాలోకానికే మమత మాయని మచ్చ'' అని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా 'ఎక్స్'లో ఒక పోస్ట్ పెట్టారు. ''ఆర్‌జీకర్ ఉదంతం, సందేశ్‌ఖాలీ ఘటనల తర్వాత రేప్ కేసుల్లో న్యాయం చేయడం మానేసి బాధితురాలినే సీఎం మమత తప్పుబడుతున్నారు'' అని గౌరవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ''రాత్రిళ్లు అవసరమైనా బయటకు వెళ్లకూడదట. వెళితే ఇలా రేప్‌లను ఎదుర్కోక తప్పదు అన్నట్లు మమత వ్యాఖ్యలున్నాయి'' అని బీజేపీ నేత అమిత్ మాలవీయ అన్నారు.

ఆపరేషన్ బ్లూస్టార్ తప్పుడు నిర్ణయం

అందుకు మూల్యంగా ఇందిరాగాంధీ తన జీవితాన్నే కోల్పోయారు

- ఆ ఉగ్రవాదుల ఏరివేత నిర్ణయం ఇందిర ఒక్కరిదే కాదు
- సైన్యం, ఇంటెలిజెన్స్, పోలీస్, సివిల్ డిఫెన్స్ సంయుక్త నిర్ణయం
- అందుకు ఇందిరను ఒక్కరినే తప్పుపట్టడం సరికాదు
- కాంగ్రెస్ అగ్రనేత, మాజీ కేంద్రమంత్రి పీ చిదంబరం వ్యాఖ్య
- సీనియర్ నేతలు జాగ్రత్తగా మాట్లాడాలి: కాంగ్రెస్
- అది ఇందిరాగాంధీ రాజకీయ దుస్సాహసం: బీజేపీ

సిమ్లా: సిక్కులకు పరమ పవిత్రమైన అమృతసర్‌లోని గోల్డెన్ టెంపుల్‌లో తిష్ట వేసిన సిక్కు వేర్పాటువాదులను ఏరివేసేందుకు 1984లో నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ అమలుచేసిన 'ఆపరేషన్ బ్లూస్టార్' తప్పుడు నిర్ణయమని కాంగ్రెస్ అగ్రనేత, మాజీ కేంద్రమంత్రి పీ చిదంబరం వ్యాఖ్యానించారు. వేరే విధంగా ఉగ్రవాదులను లొంగదీసుకునే మార్గం ఉన్నా, బలప్రయోగం చేశారని పేర్కొన్నారు. ఆ తప్పుడు నిర్ణయానికి ఇందిరాగాంధీ తన ప్రాణాలనే మూల్యంగా చెల్లించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. చిదంబరం వ్యాఖ్యలపై కాంగ్రెస్ తీవ్ర అసహనం వ్యక్తం చేయగా, కాంగ్రెస్‌పై బీజేపీ విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టింది.



ఇందిర ఒక్కరి నిర్ణయం కాదు

ఆపరేషన్ బ్లూస్టార్ ఇందిరాగాంధీ ఒక్కరి నిర్ణయం కాదని పీ చిదంబరం తెలిపారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని కసౌలీలో నిర్వహించిన కుశ్వంత్‌సింగ్ లిటరరీ ఫెస్టివల్‌లో శనివారం ఆయన పాల్గొన్నారు. ప్రముఖ జర్నలిస్టు, రచయిత హరిందర్‌సింగ్ భవేజా రాసిన తన అనుభవాలు, జ్ఞాపకాల సంకలనం 'దె విల్ షూట్ యూ మేడం: మై లైఫ్ త్రూ కాన్‌ఫ్లిక్ట్' ఆవిష్కరణ సందర్భంగా భవేజాతో చర్చలో చిదంబరం పాల్గొన్నారు. 'మిలిటెంట్లను తరిమివేసేందుకు (గోల్డెన్‌టెంపుల్ నుంచి) వాళ్లందరీ నిర్బంధించేందుకు వేరే మార్గాలు ఉన్నాయి. కానీ, ఆపరేషన్ బ్లూస్టార్ తప్పుడు మార్గం. ఆ పొరపాటుకు ఇందిరాగాంధీ తన ప్రాణాలనే మూల్యంగా చెల్లించారని నేను అంగీకరిస్తాను. అయితే, ఆ నిర్ణయం ఇందిరాగాంధీ ఒక్కరిదే కాదు. సైన్యం, నిఘా వర్గాలు, పోలీసులు, సివిల్ డిఫెన్స్ సంయుక్తంగా తీసుకున్న నిర్ణయం. అందువల్ల ఇందిరాగాంధీని ఒక్కరినే పూర్తిగా నిందించటం సరికాదు. ఇక్కడ ఏ సైన్యాధికారినీ తప్పుబట్టం లేదు. కానీ, ఆపరేషన్ బ్లూ స్టార్ నిర్వహించిన కొన్నాళ్ల తర్వాత మిలిటరీ ప్రమేయం లేకుండా ఉగ్రవాదులను ఎలా లొంగదీసుకోవచ్చో మేం చూపించాం' అని చిదంబరం అన్నారు.

ఏమిటీ ఆపరేషన్ బ్లూస్టార్

పంజాబ్‌ను స్వతంత్ర దేశంగా ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో సిక్కు వేర్పాటువాద నేత జర్నైల్ సింగ్ బింద్రన్‌వాలే నాయకత్వంలో వందలమంది సాయుధులు అమృతసర్‌లోని గోల్డెన్ టెంపుల్‌లో తిష్టవేశారు. ఆ విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన కేంద్ర ప్రభుత్వం, వారిని అంతమొందించేందుకు 1984 జూన్ 1 నుంచి 10 వరకు ఆపరేషన్ బ్లూస్టార్ పేరుతో సైనిక చర్య చేపట్టింది. సైనికులు బూట్లు, ఆయుధాలతో గోల్డెన్ టెంపుల్‌లోకి ప్రవేశించటంతో సిక్కుల మనోభావాలు దెబ్బతిన్నాయి. దీంతో అదే ఏడాది అక్టోబర్ 31న ఇందిరాగాంధీని ఆమె అంగరక్షకులే కాల్చి చంపారు. అయితే, 1986, 88లో కూడా స్వర్ణ దేవాలయంలో సిక్కు వేర్పాటువాదులు స్వర్ణ దేవాలయంలో తిష్టవేశారు. అప్పుడు సైనిక చర్య లేకుండానే వారిని ప్రభుత్వం లొంగదీసుకుంది.

కాంగ్రెస్ అసహనం.. బీజేపీకి అవకాశం

చిదంబరం వ్యాఖ్యలపై సొంతపార్టీ కాంగ్రెస్ నేరుగా స్పందించకపోయినా.. తీవ్ర ఆగ్రహంగా ఉన్నట్లు తెలిసింది. ఆయన వ్యాఖ్యలతో పార్టీ అధిష్టానం తీవ్ర మనస్తాపం చెందిందని కాంగ్రెస్ వర్గాలు ఆదివారం పేర్కొన్నాయి. 'పార్టీ నుంచి పదవులు, అవకాశాలు అన్నీ పొందిన సీనియర్ నాయకులు ఏవైనా ప్రకటనలు చేసేముందు జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా పార్టీకి ఇబ్బందులు కలిగించేలా మాట్లాడవద్దు. అలా మాట్లాడటం అలవాటుగా అస్సలు మారకూడదు. పార్టీ అగ్ర నాయకత్వంతోపాటు పార్టీ మొత్తం తీవ్రంగా కలత చెందింది (చిదంబరం వ్యాఖ్యలతో). పదేపదే ఇలాంటి వ్యాఖ్యలు చేయటంపై ఆగ్రహంగా ఉంది' అని ఏఐసీసీ వర్గాలు తెలిపాయి. ముంబైపై 2008లో పాకిస్తాన్ ఉగ్రవాదుల దాడి తర్వాత ఆ దేశంతో యుద్ధం చేయాలని భావించినా, అమెరికా అడ్డుకోవటం వల్లే ఆగిపోయామని చిదంబరం ఇటీవల చేసిన వ్యాఖ్యలు కూడా కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టిన విషయం తెలిసిందే. కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించేందుకు బీజేపీకి చిదంబరం వ్యాఖ్యలు మంచి అవకాశంగా మారాయి. కాంగ్రెస్ తప్పిదాలను చిదంబరం చాలా ఆలస్యంగా అంగీకరిస్తున్నారు. ముంబై దాడుల తర్వాత అమెరికా, అంతర్జాతీయ ఒత్తిళ్ల వల్లనే పాకిస్తాన్‌తో యుద్ధం చేయకుండా వెనక్కు తగ్గామని మొన్ననే తెలిపారు. ఇప్పుడు ఆపరేషన్ బ్లూస్టార్ కూడా తప్పిదమని ఒప్పుకున్నారు' అని కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు ఎక్స్ వేదికగా ఎద్దేవా చేశారు. నిజాన్ని చరిత్ర కచ్చితంగా రికార్డు చేయాలి. ఆపరేషన్ బ్లూస్టార్ చేపట్టడం నాడు జాతీయ అత్యవసరం కాదు. అది రాజకీయ దుస్సాహసం. ఒక జాతీయవాదిగా ఆపరేషన్ బ్లూస్టార్ పూర్తిగా అవసరం లేని చర్య అని నేను భావిస్తున్నా. చిదంబరం నిజమే చెప్పారు' అని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ఆర్పీ సింగ్ పేర్కొన్నారు.

శాంతి శిఖరాగ్ర సదస్సుకు ప్రధాని బదులు మంత్రి కేవీ సింగ్

న్యూఢిల్లీ: ఈజిప్టులోని ఎర్ర సముద్ర తీర నగరం షర్మ్ ఎల్ షేక్‌లో సోమవారం జరిగే శాంతి శిఖరాగ్ర సదస్సు(పీస్ సమిట్)కు మన దేశం తరఫున కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ హాజరవనున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సహా 20కి పైగా దేశాల నేతలు పాల్గొనే ఈ సమావేశానికి రావాలంటూ ఈజిప్టు అధ్యక్షుడు ఎల్ సిసి ప్రధాని మోదీకి ఆదివారం ఆహ్వానం పంపించారు. అయితే, ఆయన తన బదులుగా మంత్రి కేవీ సింగ్‌ను పంపిస్తున్నారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. గాజాతోపాటు పశ్చిమాసియాలో శాంతి నెలకొల్పడమే లక్ష్యంగా జరిగే కార్యక్రమానికి ఈజిప్టు అధ్యక్షుడు ఎల్ సిసి, ట్రంప్ సహాధ్యక్షత వహించనున్నారు. గాజా శాంతి ఒప్పందంపై ఈ సందర్భంగా సంతకాలు జరుగుతాయి. శిఖరాగ్రానికి ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్, యూకే ప్రధాని స్టార్మర్, ఇటలీ ప్రధాని మెలోనీ, స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ తదితర నేతలు హాజరవ నున్నారు.

బాంబు పేల్చిన హమాస్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ఒప్పందం అమలుపై అప్పుడే అనుమానాలు ముసురుకుంటున్నాయి. ఆదివారం హమాస్ చేసిన ప్రకటనే ఇందుకు తాజా ఉదాహరణ. సోమవారం ఈజిప్టులో జరిగే శాంతి శిఖరాగ్రాన్ని తాము బహిష్కరిస్తున్నామని హమాస్ తెలిపింది. ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ఒప్పందంపై తాము సంతకం చేసేది లేదని స్పష్టం చేసింది.

అమెరికాలో కాల్పులు

- నలుగురు మృతి
- 20 మందికి గాయాలు

బ్యూఫోర్ట్(అమెరికా): అమెరికాలోని దక్షిణ కరోలినా రాష్ట్రంలో సంభవించిన కాల్పుల ఘటనలో నలుగురు చనిపోగా 20 మందికి పైగా గాయపడ్డారు. సెయింట్ హెలెనా దీవిలోని విల్లీస్ బార్ అండ్ గ్రిల్‌లో ఆదివారం వేకువజామున ఘటన చోటుచేసుకుంది. బార్‌లో రద్దీగా ఉన్న సమయంలో కాల్పులు జరగడంతో జనం భయంతో తలోదిక్కుకు పరుగులు తీశారు. వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల్లో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు బ్యూఫోర్ట్ కౌంటీ పోలీస్ విభాగం తెలిపింది.

మెక్సికోలో తుపాను బీభత్సం 41 మంది మృతి

పొజా రికా: మెక్సికోలో మధ్య, ఆగ్నేయ ప్రాంతాల్లో తుపాను బీభత్సం సృష్టించింది. భారీ వర్షాలు, వరదలకు సంబంధించిన ఘటనల్లో కనీసం 41 మంది ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో గల్లంతయ్యారు. వెరాక్రుజ్ రాష్ట్రంలో ఈ నెల 6–9 తేదీల మధ్యలో అత్యధికంగా 54 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో, కజొనెస్ నది పొంగి ప్రవహించింది. శుక్రవారం వేకువజామున పొజారికా వీధుల్లో నాలుగు మీటర్ల మేర వరద ప్రవహించింది. వందల సంఖ్యలో ఇళ్లు ధ్వంసమయ్యాయి.

సాయం పంపిణీకి ఏర్పాట్లు

- గాజాలో కాల్పుల విరమణతో పెరుగుతున్న ఆశలు
- ఈజిప్టులో ట్రంప్ అధ్యక్షతన 'శాంతి శిఖరాగ్రం'



గాజా క్రాసింగ్ వద్ద సాయం ట్రక్కులు

కైరో: కాల్పుల విరమణ అమల్లోకి రావడంతో పాలస్తీనియన్లకు తక్షణ మానవతా సాయం అందించేందుకు ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి ఒప్పందం ప్రకారం రోజుకు 600 ట్రక్కుల సాయాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇజ్రాయెల్‌కు చెందిన పర్యవేక్షణాధికారి ఒకరు తెలిపారు. ఆదివారం తాము 400 ట్రక్కుల ఆహార పదార్థాలను పంపించనున్నట్లు ఈజిప్టు ప్రకటించింది. కెరెమ్ షలోమ్ వద్ద ఇజ్రాయెల్ అధికారులు తనిఖీలు జరిపాక, ఇవి గాజా స్ట్రిప్‌లోకి ప్రవేశిస్తాయని పేర్కొంది. ఈజిప్టు వైపు నుంచి రఫా క్రాసింగ్ మీదుగా గాజాలోకి పదుల సంఖ్యలో ట్రక్కులు ప్రవేశిస్తున్న ఫుటేజీ మీడియాలో ప్రత్యక్షమైంది. ట్రక్కుల్లో టెంట్లు, దుప్పట్లు, ఆహారం, ఇంధనం, వైద్య సాయం ఉన్నాయని ఈజిప్టు రెడ్ క్రీసెంట్ తెలిపింది. నెలలపాటు కొనసాగిన ఇజ్రాయెల్ దిగ్బంధనం ఫలితంగా గాజాలో తీవ్రమైన కరువు పరిస్థితులు తాండవిస్తున్నాయి. యుద్ధం సమయంలో అవసరమైన సాయంలో 20 శాతం మేర మాత్రమే సరఫరా చేయగలిగామని ఐరాస తెలిపింది. ప్రస్తుతం తమ వద్ద 1.70 లక్షల మెట్రిక్ టన్నుల ఆహారం, మందులు, ఇతర మానవీయ సాయం సిద్ధంగా ఉందని, ఇజ్రాయెల్ ఓకే చెప్పిన వెంటనే గాజాలోకి వీటిని పంపుతామంది.

బందీలు, ఖైదీల విడుదలకు ఏర్పాట్లు

గాజాలో హమాస్ వద్ద ఉన్న ఇజ్రాయెల్ బందీల విడుదల, ఇజ్రాయెల్ జైళ్లలో మగ్గుతున్న వందలాది పాలస్తీనా ఖైదీల విడుదలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సోమవారం ఉదయం నుంచి బందీల విడుదల మొదలవుతుందని ఈ వ్యవహారాలను పర్యవేక్షించే ఇజ్రాయెల్ అధికారి గాల్ హిర్ష్ చెప్పారు. సజీవంగా ఉన్న వారి కోసం ఆస్పత్రులతోపాటు రెయిమ్ క్యాంపులో ఏర్పాట్లు చేశామన్నారు. మృతదేహాలను తమకు అప్పగించిన వెంటనే గుర్తింపు కోసం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫోరెన్సిక్ మెడిసిన్‌కు తరలించనున్నట్లు చెప్పారు. హమాస్ చెరలో ఉన్న 48 మందిలో కనీసం 20 మంది సజీవంగా ఉండొచ్చని అంటున్నారు. ఇలా ఉండగా, తమ జైళ్ల నుంచి 2 వేల మంది పాలస్తీనా ఖైదీల విడుదల సమయాన్ని ఇజ్రాయెల్ ఇంకా ప్రకటించలేదు. వీరిలో జీవిత ఖైదు అనుభవిస్తున్న 250 మందితోపాటు, యుద్ధ సమయంలో గాజా నుంచి ఎలాంటి కారణం చూపకుండా ఇజ్రాయెల్ ఆర్మీ పట్టుకెళ్లిన మరో 1,700 మంది ఉన్నారు.

నేడు ఇజ్రాయెల్‌కు ట్రంప్ రాక

బందీలను విడుదల చేయనుండటంతో ఈ కాల్పుల విరమణ ఒప్పందంలో అన్నీ తానై వ్యవహరించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇజ్రాయెల్ రానున్నారు. ఇజ్రాయెల్ పార్లమెంట్ నెస్సెట్‌లో జరిగే కార్యక్రమంలో బందీల కుటుంబాలతో ఆయన మాట్లాడుతారని వైట్‌హౌస్ తెలిపింది. అనంతరం ఈజిప్టు వెళతారు. ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫతాహ్ ఎల్ సిసితో కలిసి ప్రాంతీయ, అంతర్జాతీయ నేతలతో జరిగే శాంతి శిఖరాగ్రానికి సహాధ్యక్షత వహిస్తారు.

మీ బెదిరింపులకు భయపడం

అమెరికాకు చైనా కౌంటర్

బీజింగ్: రేర్ ఎర్త్ మినరల్స్ సరఫరా విషయంలో నెలకొన్న వివాదంపై అమెరికా బెదిరింపులకు భయపడబోమని చైనా స్పష్టంచేసింది. తమ ఉత్పత్తులపై అమెరికా అన్యాయంగా విధించిన 100 శాతం అదనపు సుంకాలను రద్దు చేయకుంటే తాము కూడా కఠిన నిర్ణయాలు తీసుకుంటామని చైనా వాణిజ్య శాఖ ఆదివారం హెచ్చరించింది. టెక్నాలజీ, చిప్‌లు, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, పవన విద్యుత్, రక్షణ తదితర రంగాల్లో వినియోగించే అరుదైన మూలకాలను అమెరికా కంపెనీలకు ఎగుమతి చేయకుండా చైనా ఆంక్షలు విధిస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోపించిన విషయం తెలిసిందే. అందుకు ప్రతీకారంగా తమ దేశంలోకి వచ్చే చైనా ఉత్పత్తులపై ఆయన 100 శాతం అదనపు ప్రతీకార సుంకాలు విధించారు. ఇప్పటికే చైనా ఉత్పత్తులపై 30 శాతం సుంకాలు ఉన్నాయి. కొత్త సుంకాలు నవంబర్ 1 నుంచి అమలులోకి వస్తాయని ట్రంప్ ప్రకటించారు. ఈ సుంకాలపై చైనా ఆగ్రహం వ్యక్తంచేసింది. 'చైనాతో కలిసి పనిచేయాలనుకుంటే ఉద్దేశపూర్వక టారిఫ్‌లు విధించటం సరైన మార్గం కాదు. వాణిజ్య యుద్ధంలో చైనా స్థానం స్థిరంగా ఉంది. మేం దీనిని కోరుకోవటం లేదు. కానీ, ఈ పరిస్థితికి భయపడేది కూడా లేదు. అమెరికా తన తప్పుడు విధానాలను సరిచేసుకోవాలి. లేదంటే తన హక్కులు, ప్రయోజనాల రక్షణ కోసం చైనా కూడా కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది'అని ఆ దేశం హెచ్చరించింది.

బీజేపీ, జేడీయూకు చెరో 101 సీట్లు

- బిహార్‌లో ఎన్‌డీఏ కూటమి పార్టీల మధ్య ఖరారైన సీట్ల పంపకం
- 29 చోట్ల బరిలో దిగనున్న లోక్‌జనశక్తి
- చెరో ఆరు చోట్ల నుంచి పోటీచేయనున్న మాఝీ, కుష్వాహా పార్టీలు

న్యూఢిల్లీ: బిహార్ ఎన్నికల సమరంలో పాలక వర్గంలో ఏ పార్టీ ఎన్ని స్థానాల నుంచి పోటీచేయాలనే అంశంలో సయోధ్య సాధ్యమైంది. సీట్ల సర్దుబాటు పరిష్కారమైంది. బీజేపీ, జేడీ(యూ) చెరో 101 స్థానాల నుంచి పోటీచేయాలని ఏకాభిప్రాయానికి వచ్చాయి. ఎన్‌డీఏ కూటమి పార్టీల మధ్య సీట్ల పంపకం ఖరారైంది. బిహార్ ఎన్నికల్లో బీజేపీ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆదివారం ఈ విషయాన్ని తన సామాజిక మాధ్యమ 'ఎక్స్' ఖాతాలో వెల్లడించారు. బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో ప్రధాని మోదీ, ఇతర సీనియర్ మంత్రులు తీసుకున్న నిర్ణయాలను మంత్రి ధర్మేంద్ర వివరించారు. నితీశ్ కుమార్ సారథ్యంలోని జేడీ(యూ)తోపాటు బీజేపీ సైతం చెరో 101 సీట్ల నుంచి బరిలో దిగనుంది. 2005 ఏడాది నుంచి చూస్తే బీజేపీతో పోలిస్తే జేడీ(యూ) పోటీచేసే సీట్ల సంఖ్య తగ్గడం ఇదే తొలిసారి. గతేడాది సార్వత్రిక ఎన్నికల్లోనూ జేడీయూ కంటే బీజేపీ అధికస్థానంలో పోటీచేయడం విశేషం. జేడీ(యూ) ప్రాభవం తగ్గుతుందనడానికి, బీజేపీ హవా పెరుగుతుందనడానికి ఇది సంకేతంగా కనిపిస్తోంది. ఎన్‌డీఏ కూటమిలోని ఇతర పార్టీలు మిగిలిన స్థానాల నుంచి పోటీచేయనున్నాయి. చిరాగ్ పాశ్వాన్ సారథ్యంలోని లోక్ జనశక్తి(రామ్ విలాస్) పార్టీ 29 స్థానాల నుంచి పోటీ చేయనుంది. మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి జితన్ రామ్ మాఝీ సారథ్యంలోని హిందుస్తానీ అవామ్ మోర్చా(సెక్యులర్), ఉపేంద్ర కుష్వాహా నేతృత్వంలోని రాష్ట్రీయ లోక్ మోర్చాలు చెరో ఆరు స్థానాల నుంచి పోటీచేయనున్నాయి. 243 నియోజకవర్గాలున్న బిహార్‌లో పాలక ఎన్‌డీఏ కూటమిలో ఎవరే స్థానం నుంచి పోటీచేయాలన్న దానిపై కొద్దిరోజులుగా తీవ్రస్థాయిలో చర్చలు జరుగుతున్న విషయం తెల్సిందే. రాష్ట్రంలో నవంబర్ 6, 11 తేదీల్లో పోలింగ్ జరగనుంది.

మహాఘట్‌బంధన్ సంయుక్త మేనిఫెస్టో

నేడు ఢిల్లీలో కాంగ్రెస్, ఆర్జేడీ కీలక భేటీ

న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి అధికార ఎన్‌డీఏ కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు ఖరారైన నేపథ్యంలో విపక్ష 'మహాఘట్‌బంధన్' కూటమి పార్టీలు వడివడిగా అడుగులు వేస్తున్నాయి. సోమవారం ఢిల్లీలో కాంగ్రెస్, ఆర్జేడీ ముఖ్య నేతల మధ్య కీలక భేటీ ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. త్వరలోనే సీట్ల పంపకాన్ని ఖరారుచేసి ఈ వారంలోనే సంయుక్త మేనిఫెస్టోను ప్రకటించాలని విపక్ష కూటమి భావిస్తోంది. నేడు జరగబోయే సమావేశం కోసం ఇప్పటికే ఆర్జేడీ అగ్రనేతలు లాలూ ప్రసాద్ యాదవ్, తేజస్వీ యాదవ్‌లు ఢిల్లీకి చేరుకున్నారు. భేటీ కోసం వచ్చానని లాలూ చెప్పగా కోర్టు కేసు కోసం వచ్చానని తేజస్వీ ఎయిర్‌పోర్ట్‌లో మీడియాతో చెప్పారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో పేలవ ప్రదర్శన నేపథ్యంలో ఈసారి కాంగ్రెస్ తక్కువ సీట్లనే కోరే అవకాశం ఉందని తెలుస్తోంది. ఆనాడు 70 చోట్ల పోటీచేసి 17 చోట్ల మాత్రమే కాంగ్రెస్ గెల్చిన విషయం తెల్సిందే. కాంగ్రెస్ గౌరవప్రదమైన ఆమోదనీయమైన స్థానాలను సాధించవచ్చని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ అన్నారు.

మడగాస్కర్‌లో సైనిక తిరుగుబాటు

ప్రకటించిన అధ్యక్షుడు రజొలినా • తాను దేశంలోనే ఉన్నట్లు వెల్లడి

అంటాననరివో: ఆఫ్రికా దేశం మడగాస్కర్‌లో మరోసారి అస్థిర పరిస్థితులు నెలకొన్నాయి. దేశంలో తిరుగుబాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అధ్యక్షుడు ఆండ్రీ రజొలినా ప్రకటించారు. అక్రమంగా అధికారాన్ని చేజిక్కించుకునేందుకు జరిగే ప్రయత్నాలను అంతర్జాతీయ సమాజం దృష్టికి తీసుకు వస్తున్నానంటూ ఆయన పేర్కొన్నారు. సైనిక బలగాలు ఐక్యంగా ఉండి, రాజ్యాంగాన్ని, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఆయన ప్రస్తుతం ఎక్కడున్నదీ తెలియడం లేదు. తాను దేశంలోనే ఉన్నానని, ఎక్కడికీ వెళ్లలేదని రజొలినా కూడా ప్రకటించారు. రజొలినా అధ్యక్ష పదవి నుంచి దిగిపోవాలంటూ సెప్టెంబర్ 25వ తేదీ నుంచి జెన్ జెడ్ మడగాస్కర్ పేరుతో యువత ఆందోళనలు సాగిస్తోంది. శనివారం అతిపెద్ద ర్యాలీ జరిగింది. ఈ ప్రదర్శనలో ఆర్మీలో కీలకమైన క్యాప్‌శాట్ అనే యూనిట్ కూడా పాల్గొంది. ఈ నేపథ్యంలో ఆదివారం అధ్యక్ష కార్యాలయం తిరుగుబాటుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లుగా ప్రకటించడం గమనార్హం. హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న జాడలు లేవు. రాజధాని వీధుల్లో ప్రశాంత వాతావరణం కనిపిస్తోంది. తిరుగుబాటుకు కారణాలు, దీని వెనుక ఎవరున్నారు..వంటి విషయాలను అధ్యక్షుడు రజొలినా వెల్లడించలేదు.

ఉద్రిక్తంగా పాక్-అఫ్గాన్ పోరు

- 200 మంది తాలిబాన్ ఫైటర్లను హతమార్చామన్న పాక్
- 58 మంది పాక్ సైనికులను చంపేశామన్న అఫ్గాన్ సర్కార్

ఇస్లామాబాద్/పెషావర్: తెహ్రీక్–ఇ–తాలిబాన్ పాకిస్తాన్(టీటీపీ) సంస్థ స్థావరమే లక్ష్యంగా పాకిస్తాన్ జరిపిన దాడులు చివరకు తాలిబాన్, పాక్ మధ్య పోరును మరింత ఉధృతం చేశాయి. పాక్–అఫ్గాన్ సరిహద్దు ప్రాంతంలో ఆదివారం సైతం ఇరు దేశాల పరస్పర దాడుల పర్వం కొనసాగింది. శత్రుదేశానికి భారీ నష్టం వాటిల్లజేశామని అటు అఫ్గానిస్తాన్, ఇటు పాకిస్తాన్ ప్రకటించుకున్నాయి. 200 మందికిపైగా తాలిబాన్ ఫైటర్లను అంతం చేశామని పాకిస్తాన్ ఆర్మీ ఆదివారం ప్రకటించగా తాము 58 మంది పాక్ సైనికులను చంపేశామని అఫ్గాన్ ప్రభుత్వం పేర్కొంది. పాక్‌కు చెందిన 25 ఆర్మీ పోస్ట్‌లను సైతం దాడులను ధ్వంసంచేశామని అఫ్గాన్ సర్కార్ వెల్లడించింది. తమ దాడుల ధాటికి 30 మంది పాక్ సైనికులు రక్తమోడారని వెల్లడించింది. ఈ మేరకు తాలిబాన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి జబీహుల్లాహ్ ముజాహిద్ మాట్లాడారు. ''మా అఫ్గాన్ ప్రభుత్వానికి కంట్లో నలుసులా తయారైన ఐఎస్ఐఎస్ ఉగ్రవాదులకు పాకిస్తాన్ ఆశ్రయం కల్పిస్తోంది. పాక్‌లో తలదాచుకున్న ఐఎస్ఐఎస్ ముఖ్యులను మాకు అప్పగించాలి. ఐఎస్‌గ్రూప్ ఒక్క అఫ్గానిస్తాన్‌కే కాదు యావత్ ప్రపంచానికే పెనుముప్పు'' అని ముజాహిద్ అన్నారు.

సరిహద్దు వెంట కాల్పుల మోత

'ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్తాన్ పరిధిలోని బరామ్చాల్లో సరిహద్దు వెంబడి ఉన్న అంగూర్ అడ్డా, బజౌర్, కుర్రం, డిర్, చిత్రాల్‌లోని పాక్ ఆర్మీ పోస్ట్‌లపై మా బలగాలు దాడులుచేశాయి. డ్యూరాండ్ రేఖ వెంబడి పాక్ పోస్ట్‌లపై తెగబడి పలువురు పాక్ సైనికులను చంపేశాం' అని ముజాహిద్ వివరించారు.

శాంతియుత పరిష్కారం కావాలి

- పాక్ నుంచి చొరబాట్లను సహించబోం
- అఫ్గాన్ విదేశాంగ మంత్రి ముత్తాఖీ వ్యాఖ్య

న్యూఢిల్లీ: పాకిస్తాన్‌తో సరిహద్దుల వెంట కొనసాగుతున్న ఉద్రిక్తత సమసిపోయేందుకు శాంతియుత పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నట్లు అఫ్గానిస్తాన్ విదేశాంగ మంత్రి ఆమిర్‌ఖాన్ ముత్తాఖీ వ్యాఖ్యానించారు. పోరు సద్దుమణిగేందుకు శాంతియుత మార్గాలను అన్వేషిస్తామని, అది సాధ్యంకాకుంటే ఇతర 'మార్గాలను' వెతుకుతామని ఆయన అన్నారు. భారత పర్యటనలో ఉన్న ముత్తాఖీ ఆదివారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ''ఐఎస్ఐఎస్ ఉగ్రవాదుల వంటి విదేశీ శక్తుల చొరబాట్లను అడ్డుకునేందుకు అఫ్గానిస్తాన్ ఐక్యంగా పోరాడుతుంది. అఫ్గాన్ సార్వభౌమత్వానికి భంగపరిచే ఎలాంటి చర్యలను మేం సహించబోం. చర్చలు, పరస్పర అవగాహన ద్వారా సమస్యల పరిష్కారానికే మా ఇస్లామిక్ ఎమిరేట్స్ ఆఫ్ అఫ్గానిస్తాన్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోంది. ఎలాంటి ఉద్రిక్తతలకు తావివ్వకూడదనేదే మా విదేశాంగ విధానం. అది కుదరనప్పుడు మేం వేరే దారులను వెదికి అనుకున్నది సాధిస్తాం. అయినా మాకు పాక్ ప్రభుత్వం, ప్రజలతో ఎలాంటి విబేధాలు లేవు. అక్కడ తిష్టవేసిన కొన్ని శక్తులే(ఐఎస్ఐఎస్ ఉగ్రవాదులు) అసలు సమస్య. అఫ్గాన్‌లో అంతర్గతంగా విబేధాలు ఉండి ఉండొచ్చు. కానీ బయటిశక్తుల నుంచి పెను ప్రమాదం పొంచి ఉంటే తాలిబాన్ ప్రభుత్వ, పౌరులు, మతాధికారులు అంతా ఏకమై శత్రువును తుదముట్టిస్తారు '' అని ఆయన అన్నారు.



నగరంలో 'న్యుమోనియా' భూతం!
నగరంలో 'న్యుమోనియా' విజృంభిస్తోంది. దగ్గు, జలుబు, జ్వరం, శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ (న్యుమోనియా) లక్షణాలతో ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న వారి సంఖ్య భారీగా పెరిగింది. -8లో



సరదా అకేషన్.. కేరాఫ్ మెట్రో స్టేషన్
మెట్రో స్టేషన్లు ఎంటర్‌టైన్‌మెంట్ కేంద్రాలుగా నిలుస్తున్నాయి. కేవలం ప్రయాణానికే కాదు.. షాపింగ్ నుంచి సాంస్కృతిక కార్యక్రమాల వరకూ ముందుంటున్నాయి. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
31.0/18.0
నగరంలో సోమవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగలు పొడి వాతావరణం నెలకొంటుంది. గరిష్టంగా 31, కనిష్టంగా 18 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు కాంగ్రెస్‌కు గుణపాఠం కావాలి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



చెర్క మహేష్‌ను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న కేటీఆర్

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్‌లో జరగనున్న ఉప ఎన్నికలు కాంగ్రెస్‌కు గుణపాఠం కావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. షేక్‌పేటకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు చెర్క మహేష్ ఆదివారం నగరంలోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ప్రజలకు కారు కావాలో, బుల్డోజర్ కావాలో నిర్ణయించుకోవాలన్నారు. రెండేళ్లలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. అవినీతి సొమ్మును జూబ్లీహిల్స్‌లో ఖర్చు చేయనున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఓటుకు రూ.10 వేలు ఇవ్వడానికి సిద్ధంగా ఉందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేస్తే మోరీలో వేసినట్టేనన్నారు. హైదరాబాద్ తిరిగి గాడిన పడాలంటే కేసీఆర్ రావాలని, అది జూబ్లీహిల్స్ నుంచి ప్రారంభం కావాలన్నారు. అన్నీ తెలిసీ బీసీ రిజర్వేషన్ల అంశంలో సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని కేటీఆర్ దుయ్యబట్టారు. పార్లమెంట్‌లో చేయాల్సిన చట్టం అసెంబ్లీలో చేస్తే చెల్లదని, ఇచ్చిన జీఓ కోర్టు కొట్టేస్తుందని తెలిసి బీసీ రిజర్వేషన్ల పేరుతో మోసం చేశారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

నేడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నోటిఫికేషన్

నామినేషన్ల స్వీకరణ నేటి నుంచే..



జూబ్లీహిల్స్ అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి కార్యాలయం

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికకు సంబంధించి సోమవారం ఎన్నికల సంఘం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఇదే రోజు నుంచి ఈ నెల 21వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 22న నామినేషన్ల పరిశీలన, ఈ నెల 24 వరకు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగనుంది. ఉప ఎన్నిక పోలింగ్ నవంబర్ 11న పోలింగ్ జరగనుంది. నవంబర్ 14వ తేదీన కౌంటింగ్ చేపట్టనున్నారు.

నామినేషన్ల స్వీకరణకు అంతా సిద్ధం..
షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వీ కర్ణన్ ఆర్వో కార్యాలయాన్ని సందర్శించి ఏర్పాట్లపై ఆర్వో, ఏఆర్‌ఓలతో సమీక్షించారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా ఈఎస్ఐ నిబంధనలకు లోబడి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రిటర్నింగ్ అధికారి సాయిరాంనకు సూచించారు.

దూసుకొచ్చిన మృత్యువు

- బేగంపేట వైట్‌హౌస్ సమీపంలో రోడ్డు ప్రమాదం
- లారీ ఢీకొని యువ వైద్యుడు, ర్యాపిడో డ్రైవర్ దుర్మరణం



జగదీష్ చంద్ర



నవీన్

పంజగుట్ట: లారీ రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. యువ వైద్యుడితో పాటు ర్యాపిడో డ్రైవర్‌ను బలి తీసుకుంది. ఆదివారం తెల్లవారు జామున బేగంపేట వైట్‌హౌస్ సమీపంలో లారీ ఢీకొన్న దుర్ఘటనలో ర్యాపిడో డ్రైవర్, బైక్ వెనక కూర్చున్న యువ వైద్యుడు మృతి చెందారు. పంజగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా హవేలీ రూరల్‌కు చెందిన ముద్దంగల్ నవీన్ (30) నగరంలో జీఎస్‌టీయూ సమీపంలో నివసిస్తూ ర్యాపిడో బైక్ నడుపుతున్నాడు. కరీంనగర్ జిల్లా ధర్మపురికి చెందిన డాక్టర్ కస్తూరి జగదీష్ చంద్ర (35) బేగంపేట కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రిలో జనరల్ ఫిజీషియన్ చేస్తూ.. బేగంపేటలోని కుందన్‌బాగ్‌లో నివాసం ఉంటాడు. ఆదివారం తెల్లవారు జామున విధులు ముగించుకున్న జగదీష్ చంద్ర ఇంటికి వెళ్లేందుకు ర్యాపిడో బైక్ బుక్ చేసుకున్నాడు. నవీన్ తన యాక్టివా బైక్‌పై బేగంపేట ఫ్లైఓవర్ దిగి క్యాంపు కార్యాలయం ముందు నుంచి యూటర్న్ చేసుకుని గ్రీన్‌ల్యాండ్స్ వైపు వెళ్తున్నాడు. ఇదే సమయంలో యూసుఫ్‌గూడ బస్తీ నుంచి భద్రాచలం వెళ్తున్న ఇసుక లారీ బేగంపేట బ్రిడ్జి పైకి వస్తోంది. గ్రీన్‌ల్యాండ్స్ సిగ్నల్ దాటగానే లారీ వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న నవీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. కొన ఊపిరితో ఉన్న డాక్టర్ జగదీష్ చంద్రను ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొట్టపల్లికి చెందిన లారీ డ్రైవర్ శంకర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్లకార్డుతో ఓ చిన్నారి..



విద్యార్థినుల ఉత్సాహం



మంత్రి శ్రీధర్‌బాబుకు జ్ఞాపిక అందిస్తున్న డాక్టర్ చిన్నబాబు, చిత్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు



రన్‌లో పాల్గొన్న ఔత్సాహికులు

అట్టహాసంగా 'గ్లోబల్ గ్రేస్ కేన్సర్ రన్'

నగరంలో ఆదివారం జరిగిన గ్లోబల్ గ్రేస్ కేన్సర్ రన్‌కు అనూహ్య స్పందన లభించింది. గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ చిన్నబాబు సుంకవల్లి పర్యవేక్షణలో రన్‌ను గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియం వద్ద రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, పీఏసీ చైర్మన్ ఆరెకపూడిగాంధీ, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, హైదరాబాద్, సైబరాబాద్ సీపీలు సజ్జనార్, అవినాష్ మహంతి జెండా ఊపి ప్రారంభించారు. రన్‌లో విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు, ఔత్సాహిక రన్నర్లు పాల్గొన్నారు. సుమారు 30 వేల మంది ఈ కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొనగా.. ప్రపంచవ్యాప్తంగా 130 దేశాల నుంచి 1.5 లక్షల మంది వర్చువల్‌గా పాల్గొన్నట్లు గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ చిన్నబాబు సుంకవల్లి వివరించారు. ఈ సందర్భంగా కేన్సర్‌ను జయించిన నీలిమ, ప్రకాశ్, సంగీత, గీత రన్‌లో పాల్గొనడం విశేషం. మహిళల విభాగంలో రాజేశ్వరి సునీత, ఉమా, పురుషుల విభాగంలో ఈశ్వర్, అనూజ్ యాదవ్, మనోజ్ విజేతలుగా నిలిచారు. –గచ్చిబౌలి

ఆర్టీసీకి ఏఐ దన్ను

ఏ రూట్‌లో ఎంతమంది ప్రయాణికులు

ప్రయాణికుల రద్దీ, డిమాండ్ మేరకు ట్రిప్పులు పెంచేందుకు ఆర్టీసీ ప్రణాళికలను రూపొందిస్తోంది. అధునాతన ఏఐ (కృత్రిమ మేధ) సాంకేతిక పరిజ్ఞానంతో వివిధ రూట్‌లలో ప్రయాణికుల సంఖ్య, రాకపోకలు, ప్రయాణ వేళలు తదితర అంశాలపై శాస్త్రీయమైన అధ్యయనం చేసి సమగ్ర నివేదికను సిద్ధం చేసేందుకు సాంకేతిక నిపుణుల సహాయం తీసుకోనుంది. – సాక్షి, సిటీబ్యూరో

- రద్దీ, డిమాండ్ మేరకు బస్సుల నిర్వహణ
- అధునాతన సాంకేతికత వినియోగం
- రూట్‌లపై శాస్త్రీయ అధ్యయనం
- ప్రయాణికుల సంఖ్య పెంపునకు ప్రణాళికలు





మహా నగర పరిధి అనూహ్యంగా విస్తరిస్తోంది. ప్రతి ఏటా కొత్త కాలనీలు ఏర్పడుతూనే ఉన్నాయి. దీంతో ప్రయాణికులు ఏ ప్రాంతం నుంచి ఎక్కువగా బయలుదేరుతున్నారు. ఏయే ప్రాంతాల మధ్య రాకపోకలు విరివిగా కొనసాగుతున్నాయనే అంశంపై స్పష్టత ఉండడం లేదు. జీడిమెట్ల, దుండిగల్ చుట్టుపక్కల ప్రాంతాల్లో విస్తరించిన వందల కొద్దీ కాలనీల నుంచి హైటెక్ సిటీ, మాదాపూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, మణికొండ, నార్సింగి, తదితర ప్రాంతాలకు ప్రయాణికుల రాకపోకలు భారీగా ఉన్నాయి. ప్రైవేట్ సంస్థల్లో పని చేసే వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది ఈ ప్రాంతాల నుంచి ఎక్కువగా రాకపోకలు సాగిస్తున్నారు. కానీ.. ప్రయాణికుల డిమాండ్ మేరకు బస్సులు అందుబాటులో ఉండడం లేదు. పైగా ఏ కాలనీ నుంచి, ఏయే సమయాల్లో ఎక్కువ మంది రాకపోకలు సాగిస్తున్నారనే అంశాలపై కూడా తగిన సమాచారం ఉండదు. ఈ క్రమంలో సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా రియల్ టైమ్ డిమాండ్‌ను కచ్చితంగా అంచనా వేసి బస్సులను ఏర్పాటు చేయాలనేది ప్రతిపాదన.

ప్రతి రూటూ వాస్తవ చిత్రీకరణ..

- ఆర్టీసీ లెక్కల ప్రకారం గ్రేటర్ పరిధిలో సుమారు 1050 రూట్‌లు ఉన్నాయి. గత ఐదారేళ్లుగా విస్తరించిన నగర శివార్లను పరిగణనలోకి తీసుకొంటే ఈ రూట్‌ల సంఖ్య 1500 దాటి ఉంటుంది. కొన్ని రూట్‌లలో ప్రయాణికుల డిమాండ్, రద్దీ చాలా తక్కువగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే ఎక్కువ మంది ప్రయాణం చేస్తారు. మిగతా వేళల్లో పెద్దగా డిమాండ్ ఉండదు. అలాంటి రూట్‌లపై సరైన వివరాలు లేకుండా బస్సులను నడపడంతో నష్టం వాటిల్లుతున్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఇలా ప్రయాణికుల ఆదరణ లేని మార్గాల్లో ట్రిప్పులను తగ్గించి, డిమాండ్ ఎక్కువగా ఉన్న మార్గాల్లో పెంచేందుకు ప్రతి రూట్‌ను సమగ్రంగా అధ్యయనం చేసి గణాంకాలను రూపొందించనున్నారు. ఇందు కోసం ఒక ప్రైవేట్ సంస్థకు చెందిన సాంకేతిక నిపుణుల సహాయంతో డిపోల వారీగా వివిధ రూట్‌ల వివరాలను సేకరించనున్నారు.
- గ్రేటర్‌లో ప్రస్తుతం 25 డిపోల్లో ప్రస్తుతం 3,150 బస్సులు ఉన్నాయి. వీటిలో 10 శాతం బస్సులను స్పేర్‌లోనే ఉంచుతారు. దీంతో సుమారు 2,950 బస్సులు ప్రతిరోజు ప్రయాణికులకు రవాణా సదుపాయాన్ని అందజేస్తున్నాయి. ప్రస్తుతం రోజుకు 26 లక్షల మంది ప్రయాణిస్తున్నట్లు అంచనా. ప్రతి రోజు 31వేలకు పైగా ట్రిప్పులు తిరుగుతున్నాయి. ప్రతి ట్రిప్పు నుంచి ఆశించిన స్థాయిలో ఆదాయం లభించడం లేదు. ఆదాయం కంటే నిర్వహణ వ్యయం ఎక్కువగా ఉంటుంది. ఈ క్రమంలో అన్ని ట్రిప్పులను క్రమబద్ధీకరించాలని భావిస్తున్నారు.

ఆక్యుపెన్సీ ఉన్నా ఆదాయం అంతంతే...

మహాలక్ష్మి పథకంతో మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. సుమారు 18 లక్షల మంది మహిళలు సిటీ బస్సుల్లో పయనిస్తున్నారు. వీరి చార్జీలను ప్రభుత్వమే చెల్లిస్తోంది. ప్రతిరోజు ఆర్టీసీకి నగదు రూపంలో ఆదాయం లభించేది పురుషుల నుంచే. ప్రతి రోజు 8 లక్షల మంది మగవారు ప్రయాణం చేస్తున్నారు. రోజుకు రూ.6.5 కోట్ల ఆదాయం లభిస్తే అందులో రూ.4 కోట్ల వరకు రియంబర్స్‌మెంట్ రూపంలో ఆర్టీసీ ఖాతాలో జమ అవుతోంది. మిగతా 2.5 కోట్లు మాత్రమే నగదు రూపంలో అందుతోంది. ఈ ఆదాయం కంటే నిర్వహణ వ్యయం, ఉద్యోగుల జీతభత్యాలు తదితర ఖర్చులే అధికంగా ఉన్నాయి. దీంతో ప్రయాణికుల సంఖ్యను పెంచుకొనేందుకు, తద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకొనేందుకు కూడా ఈ సాంకేతిక పరిజ్ఞానం దోహదం చేస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఇద్దరిని బలిగొన్న ఈత సరదా



మహ్మద్ రెహాన్



సోహేల్

రాజేంద్రనగర్: జలపాతంలో ఈతకొట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి ఇద్దరు పదో తరగతి విద్యార్థులు మృత్యువాత పడిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సులేమాన్‌నగర్ ఎం.ఎం.పహాడీకి చెందిన మహ్మద్ రెహాన్ (16), సోహేల్ (15)లతో పాటు మరో నలుగురు బైక్‌లపై ఆదివారం మధ్యాహ్నం రాజేంద్రనగర్ గోల్డెన్ హైట్స్ ప్రాంతంలోని మొండికత్వ ప్రాంతానికి చేరుకున్నారు. జనచైతన్య వెంచర్‌లోని ఖాళీ స్థలంలో వాహనాలను పార్కు చేసి జలపాతం వద్దకు వెళ్లారు. ఈత కొట్టేందుకు ప్రయత్నించగా.. ప్రమాదవశాత్తు మహ్మద్ రెహాన్, సోహేల్‌లు నీళ్లలో మునిగిపోయారు. ఈ విషయాన్ని రాజేంద్రనగర్ పోలీసులకు తెలపడంతో అగ్నిమాపక సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. రాత్రి 8 గంటల వరకు వెతికి ఇద్దరి మృతదేహాలు నీటిలోంచి వెలికితీశారు. ఘటనా స్థలం వద్ద మృతుల కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

36 గంటలు.. నీళ్లు బంద్



సాక్షి, సిటీబ్యూరో: నగరానికి తాగునీటిని సరఫరా చేసే కృష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లై ప్రాజెక్ట్ (కేడీడబ్ల్యూఎస్పీ) ఫేజ్- 3 కోదండాపూర్ నుంచి గొడకొండ్ల వరకు పంపింగ్ మెయిన్-1కి సంబంధించి 2,375 ఎంఎం డయా పైపులైన్‌పై భారీ లీకేజీ ఏర్పడింది. దీంతో ఎయిర్ వాల్వ్, గేట్ వాల్వ్ మార్పు తదితర మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో పలు రిజర్వాయర్ల పరిధిలోని ప్రాంతాల్లో సోమవారం ఉదయం 6 నుంచి మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు.. సుమారు 36 గంటల పాటు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జల మండలి వర్గాలు పేర్కొన్నాయి.

అంతరాయం ఏర్పడే ప్రాంతాలివే..

గచ్చిబౌలి, కొండాపూర్, మాదాపూర్, అయ్యప్ప సొసైటీ, కావూరి హిల్స్, ప్రశాసన్ నగర్, ఫిల్మ్‌నగర్, జూబ్లీ హిల్స్, తట్టిఖానా, భోజగుట్ట, షేక్‌పేట్, హకీంపేట్, కార్వాన్, మెహిదీపట్నం, ఆసిఫ్‌నగర్, గోల్కొండ, లంగర్ హౌస్, దుర్గా నగర్, బుద్వేల్, సులేమాన్ నగర్, గోల్డెన్ హైట్స్, 9 నంబర్, కిస్మత్‌పూర్, గంధంగూడ, బండ్లగూడ, శాస్త్రిపురం, అల్లబండ, మధుబన్ కాలనీల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. అలాగే.. ధర్మసాయి (శంషాబాద్), సాహేబ్‌నగర్, ఆటోనగర్, సరూర్‌నగర్, వాసవీనగర్, నాగోల్, ఎన్టీఆర్ నగర్, వనస్థలిపురం, దేవేందర్ నగర్, ఉప్పల్, స్నేహపురి కాలనీ, భారతనగర్, రాంపల్లి, బోడుప్పల్, చెంగిచర్ల, మానిక్ చంద్, మల్లికార్జున నగర్, పీర్జాదిగూడ, పెద్దఅంబర్‌పేట్ తదితర ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని జల మండలి పేర్కొంది. వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించింది.

నమ్మించి నగదు, నగలు తీసుకుని మోసం

వెంగళరావునగర్: రెండేళ్లపాటు స్నేహం నటించి నగలు, నగదు తీసుకుని తిరిగి ఇవ్వమన్నందుకు చంపుతానని బెదిరించిన కుటుంబంపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం శ్రీనగర్‌కాలనీకి చెందిన అచ్యుత విజయ భాస్కర్ హాస్టల్ నిర్వహిస్తుంటాడు. గత రెండేళ్లుగా ఖమ్మం ప్రాంతానికి చెందిన ఎం.హర్షరెడ్డి వీరి వద్ద పేయింగ్ గెస్ట్‌గా ఉంటున్నాడు. విజయభాస్కర్ కుటుంబంతో సన్నిహిత సంబంధం కూడా పెట్టుకున్నాడు. దాంతో వారి కుటుంబ సభ్యులు హర్షరెడ్డిని పూర్తిగా నమ్మారు. గత ఏడాది సెప్టెంబరులో తాను వాటర్‌ప్లాంట్ వ్యాపారం చేస్తున్నాని, డబ్బు అవసరమని అచ్యుత విజయభాస్కర్‌రావును అడిగాడు. అతని వద్ద డబ్బు లేదని చెప్పగా హర్షరెడ్డి తల్లిదండ్రులు రఘునాథరెడ్డి, మల్లీశ్వరిరెడ్డి, సోదరి సాహితీ రెడ్డి, బావమరిది వీరారెడ్డిలు వచ్చి మూడు నెలల్లో తిరిగి ఇస్తామని హామీనిచ్చారు. దాంతో విజయభాస్కర్ కొంత నగలు తాకట్టుపెట్టి రూ.50 లక్షలు హర్షరెడ్డికి ఇచ్చాడు. అయితే అతను వ్యాపారం చేయలేదు. ఇచ్చిన నగదు తిరిగి ఇవ్వలేదు. అనేక సార్లు డబ్బు తిరిగి ఇవ్వమని అడిగినప్పటికీ తనతో పాటుగా వారి కుటుంబ సభ్యులు డబ్బులు తిరిగి ఇచ్చేదిలేదని, మరోసారి అడిగితే చంపేస్తామని విజయభాస్కర్‌ను బెదిరించారు. దీంతో హర్షరెడ్డి, అతని కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విదేశాలకు పంపిస్తానంటూ రూ.26 లక్షలు స్వాహా

వెంగళరావునగర్: విదేశాలకు పంపుతానని మోసగించి రూ.26 లక్షలు కాజేసిన వ్యక్తులపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం శ్రీనగర్‌కాలనీకి చెందిన శుభాంకర్ బ్యాంక్ ఆఫ్ అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. గత ఆగస్టు నెలలో శుభాంకర్ అమెరికా వెళ్లేందుకు ఏజెంట్లయిన మనీషా, ముస్తాఖ్ అనే వ్యక్తులను సంప్రదించాడు. ఎస్ఐజీ విద్యార్థులతో కలిపి అమెరికా పంపుతామని, అందుకు రూ.26 లక్షలు కావాలని అడిగారు. దాంతో అతను ఆ నగదును వారికి అందజేశాడు. అనంతరం తమ బ్యాంకు వేరే చోటుకు మారుతుందని, అక్కడ దరఖాస్తు ప్రాసెస్ చేస్తామని తెలిపారు. అయితే కొద్దిరోజులుగా శుభాంకర్ వారి కార్యాలయానికి వెళ్తున్నా వారి జాడ కన్పించలేదు. అంతేగాకుండా ఫోన్లకు సమాధానం ఇవ్వడం లేదు. దాంతో మోసపోయానని గ్రహించి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దండమూడి ఎన్‌క్లేవ్‌లో దొంగల హల్‌చల్

గంటన్నరపాటు ఐదిళ్లలో చోరీకి యత్నం




సీసీ ఫుటేజీలో రికార్డు అయిన దొంగల కదలికలు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్‌లోని దండమూడి ఎన్‌క్లేవ్‌లో మరోసారి దొంగలు రెచ్చిపోయారు. రెండు నెలల క్రితం రెండు ఇళ్లల్లో దొంగతనానికి పాల్పడ్డ విషయాన్ని మరువకముందే శనివారం తెల్లవారుజామున 3.30 నుండి 5 గంటల వరకు కాలనీలోని పలు ఇళ్లల్లో చోరీకి విఫలయత్నం చేశారు. దీంతో కాలనీవాసులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. మొదట రాజశేఖర్ అనే వ్యక్తి ఇంటికి వెళ్లిన దొంగలు అలారం మోగడంతో..అక్కడి నుంచి గఫార్ ఇంటి గోడ దూకి లోపలికి వెళ్లి బయటకు వచ్చారు. అనంతరం రాయచోటి సత్యనారాయణ గౌడ్, ఇంటికి వెళ్లి గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న కార్యాలయం తాళాలు పగులగొట్టి లోపలికి వెళ్లారు. తాళాలు ఉన్నాయా.. లోపల జనం ఉన్నారా అన్న విషయాన్ని గుర్తించి కిందకు దిగి వెళ్లిపోయారు. అక్కడి నుంచి హనుమంత్‌రెడ్డి ఇంటి వద్దకు చేరుకోగా అక్కడ అలారం మోగడంతో వెళ్లిపోయి అక్షయ్ బాబు ఇంటి వద్ద సంచరించారు. ఇలా గంటన్నర వ్యవధిలో ఏకంగా 5 ఇళ్లల్లో దొంగతనానికి ప్రయత్నం చేశారు. విలువైన సొత్తు చోరీకి గురవకున్నా..వచ్చిన ముగ్గురి చేతుల్లో ఇనుప రాడ్లు, కట్టర్, వేట కొడవలి ఉండడం ఆందోళనకు గురిచేసిందని స్థానికులు పేర్కొన్నారు. ఘటనపై ఫిర్యాదులు తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో 'న్యుమోనియా' భూతం!

కిటకిటలాడుతున్న పిల్లల ఆస్పత్రులు

- దగ్గు, జలుబు, జ్వరాలతో శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు
- వాతావరణంలో అసాధారణ మార్పులే కారణమంటున్న వైద్యులు
- జనవరి వరకు ఇదే పరిస్థితి ఉండొచ్చని అంచనా..



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో 'న్యుమోనియా' విజృంభిస్తోంది. దగ్గు, జలుబు, జ్వరం, శ్వాసకోశ ఇన్ఫెక్షన్ (న్యుమోనియా) లక్షణాలతో ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న వారి సంఖ్య భారీగా పెరిగింది. ప్రధానంగా పిల్లలు, వయోవృద్ధులు, ఆస్తమా బాధితులు తీవ్రమైన ఇన్ఫెక్షన్లతో బాధపడుతున్నారు. వారికి ఊపిరాడడం లేదు. ముఖ్యంగా పిల్లల ఆసుపత్రులు న్యుమోనియా లక్షణాలతో వచ్చిన బాధితులతో కిటకిటలాడుతున్నాయి. నిలోఫర్ ఆస్పత్రికి వచ్చే కేసుల్లో 25 నుంచి 30 శాతం మంది పిల్లల్లో న్యుమోనియా లక్షణాలు కనిపిస్తున్నాయని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో ఎడతెరిపి లేని వర్షాలు, వాతావరణంలో అసాధారణ మార్పులు, కాలుష్యం వంటివే ఈ పరిస్థితులకు కారణమని వైద్యులు అంచనా వేస్తున్నారు. వచ్చేది శీతాకాలం కావడంతో జనవరి వరకు శ్వాశకోస సంబంధిత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

పరిస్థితి ఇదీ..

నగరంలోని నిలోఫర్‌లో ప్రతిరోజు దాదాపు 1200 మంది వరకు పేషెంట్లు ఓపీకి వస్తుంటారు. వీరిలో దాదాపు 200 మందిలో న్యుమోనియా లక్షణాలు ఉంటున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. అదే సమయంలో ఉస్మానియా ఆసుపత్రిలో వయో వృద్ధులు, ఆస్థమా, సీఓపీడీ రోగుల తాకిడి పెరుగుతోంది. అయితే కొంత మంది జలుబు, జ్వరం, దగ్గు లక్షణాలు కనిపించినపుడు యాంటీబయోటిక్స్, పారాసెటమాల్ మాత్రలు వాడుతున్నారు. అయితే కొన్ని రకాల జ్వరాలు, దగ్గు వంటి లక్షణాలు యాంటీబయాటిక్స్‌తో నయం కావని వైద్యులు పేర్కొంటున్నారు. వైరల్ ఇన్ఫెక్షన్లలో యాంటీబయాటిక్స్ ఉపయోగించరాదని, సొంత ట్రీట్‌మెంట్ ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు. మార్కెట్‌లో ఫ్లూ, న్యుమోనియా వంటి వాటికి వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. తొలుత రోగ నిర్ధారణ చేసుకున్నాక వైద్యుల సూచనల మేరకు చికిత్సలు, మందులు వాడటం మేలని సూచిస్తున్నారు.

వైరల్ ఇన్‌ఫెక్షన్లతో జాగ్రత్తగా ఉండాలి



ఈ సీజన్‌లో వైరల్ ఇన్‌ఫెక్షన్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిపై వేగంగా ప్రభావం చూపిస్తాయి. షుగర్, కీమోథెరఫీ చేయించుకుంటున్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలి. ఊపిరితిత్తుల వ్యాధులు దగ్గు, జలుబు, గాలిలో వ్యాప్తిచెందుతాయి. మూడు రోజులకు మించి లక్షణాలు కనిపిస్తే నిపుణులను సంప్రదించాలి. పిల్లల్లో వేగంగా శ్వాస తీసుకోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడితే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఇలాంటి లక్షణాలు ఉన్న వారికి దూరంగా ఉండటం, లేదా మాస్క్ వినియోగించాలి. గోరు వెచ్చని నీటిని తాగాలి. పెద్దలు పొగతాగడం మానేయాలి. ఆస్తమా రోగులు నిత్యం ఇన్‌హేలర్ వాడాలి.

- డాక్టర్ రాజీవ్, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు

రెండో అంతస్తు పైనుంచి పడి ఏసీ మెకానిక్ దుర్మరణం



ఫారూఖ్ (ఫైల్)

మణికొండ: ఓ అపార్ట్‌మెంట్‌లో ఏసీ రిపేరు చేస్తుండగా ఓ యువకుడు రెండో అంతస్తు పైనుంచి కింద పడటంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అల్కాపూర్ టౌన్‌షిప్‌లో ఆదివారం జరిగింది. స్థానికులు, మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం..గజ్వేల్‌కు చెందిన ఫారూఖ్ (25) బతుకు దెరువు కోసం వచ్చి నగరంలోని మెహదీపట్నంలో నివసిస్తూ ఓ ప్రముఖ ఏసీ సంస్థలో పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే ఆదివారం సంస్థకు వచ్చిన ఫిర్యాదు మేరకు అల్కాపూర్ టౌన్‌షిప్‌లోని విహాన్ అపార్ట్‌మెంట్‌లో ఏసీ రిపేరు చేసేందుకు వచ్చాడు. రెండో అంతస్తులో ఏసీ యూనిట్‌ను రిపేరు చేస్తుండగా అదుపు తప్పి కింద పడిపోయాడు. తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఏసీ సంస్థ ఎలాంటి భద్రతా చర్యలు లేకుండా పనిచేయించటంతోనే ఫారూఖ్ చనిపోయాడని, సదరు సంస్థపై చర్యలు తీసుకోవాలని అతని బంధువులు నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

బైకును ఢీకొన్న జీపు..ఇద్దరికి తీవ్రగాయాలు



బైకును ఢీ కొట్టిన జీపు

హస్తినాపురం: ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు స్నేహితులను వెనుక నుండి వేగంగా వచ్చిన జీపు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రవి నాయక్ తెలిపిన వివరాల ప్రకారం రాజన్న సిరిసిల్లకు చెందిన ఫయాజ్ (21) మంగళపల్లిలోని సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాల నుండి బైకుపై అదే కళాశాలలో చదువుతున్న స్నేహితురాలు (21)తో కలిసి సాగర్ రింగ్‌రోడ్డు వైపు వస్తుండగా గుర్రంగూడ వద్ద యూటర్న్‌లో వెనుక నుంచి వేగంగా వచ్చిన థార్ కారు ఢీకొట్టింది. దీంతో ఫయాజ్ తలకు తీవ్రగాయాలు కాగా కుడి కాలు విరిగింది. వెనుక కూర్చున్న స్నేహితురాలి తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కు ఫోన్ చేయగా క్షతగాత్రులను అంబులెన్స్‌లో స్థానికంగా ఉన్న ఓ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ఫయాజ్‌కు ప్రాథమిక చికిత్స అనంతరం మలక్‌పేటలోని యశోదా ఆసుపత్రికి తరలించగా, అతని స్నేహితురాలిని సికింద్రాబాద్ యశోదా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన జీపు డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం మరో ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవినాయక్ తెలిపారు.

కూతురిలా ఉన్నావంటూనే...

- అసభ్యకరంగా ప్రవర్తించిన పైఅధికారి
- పోలీసులకు ఫిర్యాదు చేసిన యువతి.. కేసు నమోదు

బంజారాహిల్స్: కూతురిలా ఉన్నావని ప్రారంభంలో మర్యాదగా మాట్లాడి..చనువు పెంచుకుని మెల్ల మెల్లగా తన దుర్బుద్ధిని బయటపెట్టిన సీనియర్ అధికారిపై ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. మైండ్‌స్పేస్‌లోని ఓ ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థలో హెచ్‌ఆర్‌గా పనిచేస్తున్న యువతి (26)కి తన పైఅధికారిగా పనిచేస్తున్న మృణాల్ దాస్ (51)తో పరిచయం ఏర్పడింది. తరుచూ ఇద్దరూ మాట్లాడుకుంటూ పరిచయం పెంచుకున్నారు. తన కుమార్తెలా ఉన్నావంటూ మృణాల్‌దాస్ మొదట్లో ఆత్మీయతంగా వ్యవహరించేవాడని బాధిత యువతి పేర్కొంది. ఈ ఏడాది జులై 5వ తేదీన ఆమె మృణాల్‌దాస్‌తో కలిసి జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-72లో ఉన్న ది స్విఫ్ట్ ఎలిమెంట్ స్పాకు వెళ్లినట్లు తెలిపింది. పురుషులు, మహిళలకు వేర్వేరు గదులు ఉన్నాయని చెప్పడంతో తాను వెళ్లగా తనకు మసాజ్ చేస్తున్న సమయంలో నిద్రలో ఉండగా ఒక దశలో వెనుక నుంచి వేరొకరి చేతులు తగిలాయని, గమనించి చూసేసరికి మృణాల్‌దాస్ తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని గుర్తించానంది. తనపై అనుచితంగా ప్రవర్తిస్తూ అసభ్యకరంగా మాట్లాడుతుండటంతో తాను అరిచి మందలించానని తెలిపింది. ఆయన గది నుంచి వెళ్లిపోయినప్పటికీ మళ్లీ రావాలని ప్రయత్నించాడని ఆరోపించింది. ఇటీవల ఆయన లండన్‌కు వెళ్లడం జరిగిందని, అక్కడి నుంచి కూడా వీడియో కాల్ ద్వారా అసభ్యకరంగా ప్రవర్తించాడని ఆరోపించింది. ఈ సంఘటనను తాను పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ సంస్థ హెచ్‌ఆర్ టీమ్‌కు కూడా తెలియజేశానని పేర్కొంది. తన భద్రత పట్ల భయంగా ఉందని, ఆయన మళ్లీ వేధించే అవకాశం ఉందంటూ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరింది. జూబ్లీహిల్స్ పోలీసులు మృణాల్‌దాస్‌పై బీఎన్ఎస్ సెక్షన్ 75 (1) (ఐ) (2), 78 (1)(ఐఐ)(2), 79 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తొలి రోజు 92 శాతం మందికి పోలియో చుక్కలు

సాక్షి సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా తొలి రోజు మొత్తం 92 శాతం మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశామని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి వెంకటి తెలిపారు. మొత్తం 2,586 పల్స్ పోలియో కేంద్రాలు, 91 మొబైల్ టీమ్స్ ద్వారా 4,75,858 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశామన్నారు.

లిఫ్ట్ గుంతలో పడి కార్మికుడి మృతి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రమాదవశాత్తు భవనం నాలుగో అంతస్తు నుంచి లిఫ్ట్ గుంతలో పడి ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం ఉదయం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన మహమూద్ షహబాజ్(19) కుటుంబ సభ్యులతో కలిసి బోరబండ ప్రాంతంలో ఉంటున్నాడు. వృత్తిరీత్యా ఫాల్‌సీలింగ్ పనులు చేసే షహబాజ్ కొన్ని రోజులుగా శాస్త్రీపురం ప్రాంతంలోని ఓ భవనంలో పనులు చేస్తున్నాడు. ప్రతి రోజు మాదిరిగానే ఆదివారం ఉదయం పనికి వచ్చి నాలుగో అంతస్తులో ఫాల్‌సీలింగ్ వేసే పని చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు కింద ఉన్న లిఫ్ట్ గుంతలో పడి మృతి చెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్ టవర్‌లో అగ్నిప్రమాదం



కిందకు వచ్చిన అపార్ట్‌మెంట్ నివాసితులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ, నార్సింగి రోడ్డులోని బీఆర్‌సీ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్‌లోని బ్లాక్ జీకి విద్యుత్ సరఫరా చేసే కేబుళ్ల డెక్‌లో ఆదివారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన సిబ్బంది టవర్‌లో ఉన్న వారందరినీ అప్రమత్తం చేశారు. దాంతో వారంతా మెట్ల మార్గాల ద్వారా కిందకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది వెంటనే సరఫరాను నిలిపివేశారు. అగ్నిమాపక శాఖ వాహనాలు మంటలను ఆర్పివేశాయి. విద్యుత్ వైర్లు పూర్తిగా కాలిపోవటంతో టవర్‌లోని 19 అంతస్తులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మెట్ల మార్గంలో కిందకు పరుగులు తీస్తున్న క్రమంలో ముగ్గురు కింద పడిపోవటంతో గాయాలయ్యాయి.

ఓటు చోరీపై సంతకాల సేకరణ



సంతకాల సేకరణలో పాల్గొన్న నాయకులు

పహాడీషరీఫ్: ఎన్‌డీఏ సర్కార్ ఓటు చోరీతోనే మూడోసారి అధికారంలోకి వచ్చిందని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధి 12వ డివిజన్ అధ్యక్షుడు ఆదిల్ల జంగయ్య ఆధ్వర్యంలో మామిడిపల్లిలో ఆదివారం ఓటు చోరీపై సంతకాల సేకరణ చేపట్టారు. ఓటు చోరీని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందనాన్నారు. కార్యక్రమంలో కుమార్, విజయ్, నరేందర్, కృష్ణ, బాలకృష్ణ, రామునాయక్, రాంబాబు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురికి రిమాండ్

మొయినాబాద్‌రూరల్: ఆస్తి వివాదంలో వ్యక్తిని హత్య చేసేందుకు యత్నించిన ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించామని మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి చెప్పారు. వివరాలు.. సురంగల్ పౌల్ట్రీ ఫామ్‌లో 250 గజాల ప్లాట్ విషయంలో తగాదా జరుగుతోంది. ఈ క్రమంలో శనివారం రామగళ్ల ప్రసాద్, రామగళ్ల నందం, సావిత్రి దంపతులు రామగళ్ల శ్యామ్‌పై వేట కొడవలితో దాడి చేయంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని రాజేంద్రనగర్ న్యాయస్థానంలో ప్రవేశపెట్టగా రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

విధేయులకే పగ్గాలు

డీసీసీ ఎంపికలో కేడర్ అభిప్రాయానికే పెద్దపీట

- రోజుకు రెండు బ్లాకుల చొప్పున సమావేశాలు
- నేడు చేవెళ్ల ముఖ్య నేతలతో భేటీ
- పది రోజుల్లో ప్రక్రియ పూర్తి చేస్తాం
- ఏఐసీసీ జిల్లా పరిశీలకులు, ఎంపీ రాబర్ట్‌బ్రూస్



మాట్లాడుతున్న తిరునల్వేలి ఎంపీ రాబర్ట్ బ్రూస్ పక్కన డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: 'పారదర్శకంగా...ప్రజాస్వామ్య బద్ధంగా డీసీసీ అధ్యక్ష ఎన్నిక జరుగుతుందని, ఐదేళ్లుగా సభ్యత్వం ఉండి, సంస్థాగతంగా పార్టీ బలోపేతం కోసం పని చేస్తున్న కార్యకర్తనే డీసీసీ పీఠం వరిస్తుంది'అని ఏఐసీసీ జిల్లా పరిశీలకులు, ఎంపీ సి.రాబర్ట్ బ్రూస్ చెప్పారు. డీసీసీ ఎన్నికల పరిశీకుడిగా ఆయన నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆయన గాంధీభవన్‌కు చేరుకున్నా రు. డీసీసీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కష్టకాలంలో పార్టీకి అండదండగా నిలిచి, అందరికి ఆమోద యోగ్యుడైన సమర్థుడినే డీసీసీ చీఫ్‌గా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు సహా నామినేటెడ్ పోస్టుల చైర్మన్లు, పార్టీ జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయి, బ్లాక్ స్థాయి, మండల స్థాయి అధ్యక్షుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోనున్నట్లు తెలిపారు. మెజార్టీ సభ్యుల అభిప్రాయం ప్రకారమే ఈ ఎంపిక ఉంటుందని చెప్పారు.

నేడు చేవెళ్ల నేతలతో భేటీ

కేవలం పార్టీ నేతల నుంచే కాకుండా పార్టీతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎలాంటి సంబంధం లేని సామాజిక కార్యకర్తలు, సాధారణ ప్రజల నుంచి సైతం అభిప్రాయాలను సేకరించనున్నట్లు చెప్పారు. అయితే ఈ ఎంపికలో సాధారణ కార్యకర్త అభిప్రాయానికే ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఇందులో ఎలాంటి పైరవీలకు ఆస్కారం లేదన్నారు. సోమవారం(ఈనెల 13న) చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో పర్యటించి, ఉదయం ఎ-బ్లాక్, మధ్యాహ్నం బి-బ్లాక్ కేడర్‌తో సమావేశమై, వారి అభిప్రాయాలను సేకరించనున్నట్లు తెలిపారు. 16వ తేదీన శేరిలింగంపల్లి నియోజకవర్గం కేడర్‌తో భేటీ కానున్నట్లు చెప్పారు. ఔత్సాహికులు తమ దరఖాస్తులను స్వయంగా అందజేయవచ్చని సూచించారు. ఈ నెల 19 వరకు మొత్తం ప్రక్రియను పూర్తి చేసి, తుది జాబితాను ఏఐసీసీకి అందజేయనున్నట్లు ప్రకటించారు. సమావేశంలో పీసీసీ ఉపాధ్యక్షులు, పరిశీలకుల బృందం సభ్యుడు వినయ్‌రెడ్డి, కర్నె శ్రీనివాస్ పాల్గొన్నారు.

డీసీసీ రేసులో 12 మంది

ఇదిలా ఉంటే డీసీసీ పీఠం కోసం ఇప్పటికే 12 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి ఐదుగురు, మహేశ్వరం నియోజకవర్గం నుంచి నలుగురు, చేవెళ్ల నియోజకవర్గం నుంచి ముగ్గురు చొప్పున దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి యూత్ కాంగ్రెస్ నేత బొక్క చెన్నారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్, కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్, మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు ఉన్నారు. మహేశ్వరం నియోజకవర్గం నుంచి పార్టీ సీనియర్ నేత దేప భాస్కర్‌రెడ్డి డీసీసీ పీఠాన్ని ఆశిస్తున్నారు. ఇక ఎల్బీనగర్ నుంచి నాగోల్ కంటెస్టెడ్ కార్పొరేటర్ రాజిరెడ్డి సహా చేవెళ్ల నియోజకవర్గం నుంచి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీం భరత్, పీసీసీ సభ్యుడు గౌరి సతీశ్ సైతం రేసులో ఉన్నారు. ఇక కల్వకుర్తి నియోజకవర్గం నుంచి అయిల్ల శ్రీనివాస్‌గౌడ్ సహా మరికొంత మంది డీసీసీ పీఠాన్ని ఆశిస్తున్నట్లు సమాచారం. వీరంతా ఎవరికి వారు తమ ప్రయత్నాలను ముమ్మరం చేసుకుంటున్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, నామినేటెడ్ పోస్టుల చైర్మన్లు, స్థానిక సంస్థల చైర్మన్లు, జెడ్పీటీసీ మాజీ సభ్యులు, ఎంపీపీలు, బ్లాక్ కాంగ్రెస్, మండల కాంగ్రెస్ అధ్యక్షులను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. అభిప్రాయ సేకరణలో భాగంగా అధిష్టానానికి తమ పేర్లను సిఫార్సు చేయాల్సిందిగా వారు అభ్యర్థిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

నిమ్స్ నర్సుకు డాక్టరేట్



లక్డీకాపూల్: నిజామ్ వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) నర్సు శీలం కనకతార డాక్టరేట్ పొందారు. ఆమెకు సోషల్ సర్వీస్ కింద ఈ గౌరవ డాక్టరేట్ అవార్డు లభించింది. పాండిచ్చేరిలోని గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్శిటీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కనకతారకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. కార్యక్రమంలో యూనివర్శిటీ చైర్మన్ డాక్టర్ పి.మాన్యుయేల్, వైస్ చాన్సలర్ డాక్టర్ కె.వెంకటేశన్ తదితరులు పాల్గొన్నారు. ప్రస్తుతం కనక తార నిమ్స్ సిటీ సర్జన్ విభాగంలో నర్సింగ్ ఆఫీసర్‌గా సేవలు అందిస్తున్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న డోనర్స్

హిమాయత్‌నగర్: ప్రాణాంతక తలసేమియా వ్యాధితో పోరాడుతున్న పిల్లలకు సేకరించిన బ్లడ్ అందించి సహకరించాలనే తెలంగాణ రెడ్ క్రాస్ విజ్ఞాన జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీజేఐటీ) ఎన్ఎస్ఎస్ సంయుక్తంగా రక్తదాన శిబిరం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సృజన తెలిపారు. శిబిరంలో 180 మంది రక్తదానం చేశారన్నారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, కాలేజ్ స్టాఫ్ అంకిత భావంతో పనిచేసినందునే రక్తదాన శిబిరం విజయవంతం అయిందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీదేవి జాస్తి, డీన్ ఎ.పద్మజ, జి.శ్రీలత పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

రహమత్‌నగర్: రహమత్‌నగర్ క్వారీ మైదానంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నారు. సమావేశానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొంటారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, రహమత్‌నగర్ డివిజన్ ఎన్నికల పరిశీలకులు తక్కలపల్లి రవీందర్ రావు వెల్లడించారు. అదివారం మైదానంలో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థిని మాగంటి సునిత ఎన్నికల ప్రచారంలో భాగంగా క్వారీ మైదానంలో నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రి హరీష్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్‌అలీ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు.ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. బీఆర్ఎస్ కార్యర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని రవీందర్ రావు కోరారు. మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్, భాస్కర్, నాయకులు పాల్గొన్నారు.

7 వార్డులు.. 8 ఠాణాలు..!

- జూబ్లీహిల్స్‌లో పోలింగ్‌కు ముమ్మర ఏర్పాట్లు
- వృద్ధులు, దివ్యాంగుల కోసం ర్యాంప్ నిర్మాణం



పోలింగ్ బూత్‌ల వద్ద ర్యాంప్‌లు నిర్మిస్తున్న సిబ్బంది

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక నవంబర్ 11వ తేదీన జరగనుండగా అక్టోబర్ 13వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇందుకోసం ఇటు నామినేషన్ కేంద్రంలోనూ, అటు పోలింగ్ బూత్‌ల వద్ద సౌకర్యాలు మెరుగుపరుస్తున్నారు. అన్ని పోలింగ్ బూత్‌లకు వృద్ధులు, దివ్యాంగులు తేలికగా వెళ్లేవిధంగా ర్యాంప్‌లు నిర్మిస్తున్నారు. ప్రతి పోలింగ్‌బూత్‌లోనూ వెలుతురు స్పష్టంగా ఉండేలా లైట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ బూత్‌ల పరిసరాల్లో పరిశుభ్రతతో పాటు రోడ్లకు మరమ్మతులు చేయడం, స్ట్రీట్‌లైట్లు ఏర్పాటుచేయడం జరుగుతుంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మొత్తం 3,98,982 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 2,07, 367 కాగా, మహిళలు 1,91,590 ఉన్నారు. మొత్తం 139 లోకేషన్లలో 407 పోలింగ్ బూత్‌లు ఏర్పాటుచేశారు. నియోజకవర్గ పరిధిలో ఆరున్నర డివిజన్లు కవర్ అవుతున్నాయి.

ఇందులో అత్యధిక పోలింగ్ బూత్‌లు రహమత్‌నగర్ డివిజన్‌లో ఉండగా, అత్యల్పంగా సోమాజీగూడ డివిజన్‌లో ఉన్నాయి.

- నియోజకవర్గ పరిధిలోకి ఎనిమిది పోలీస్‌స్టేషన్లు వస్తుండగా అత్యధికంగా బోరబండలో 146 పోలింగ్‌బూత్‌లు ఉన్నాయి. అతి తక్కువ ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 16 బూత్‌లు ఉన్నాయి.
- జూబ్లీహిల్స్, ఫిలింనగర్, పంజగుట్ట, మధురానగర్, బోరబండ, టోలిచౌకి, గోల్కొండ, సనత్‌నగర్ తదితర పోలీస్‌స్టేషన్ల పరిధిలో 139 పోలింగ్ లొకేషన్లు ఉండగా, యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం నుంచి ఈవీఎంలు తీసుకువెళ్లడానికి, ఓటింగ్ జరిగిన తర్వాత ఈవీఎంలను తిరిగి స్ట్రాంగ్‌రూమ్‌లోకి చేర్చడానికి 13 రూట్లు ఏర్పాటు చేశారు.
- ఇందుకోసం భారీ పోలీసు బందోబస్తు శిక్షణ పొందిన సిబ్బందిని నియమిస్తున్నారు. ఇప్పటికే కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్‌లు పటిష్టమైన బందోబస్తు మధ్య ఏర్పాటుచేశారు.

ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎన్ని బూత్‌లు...

పోలీస్ స్టేషన్	లోకేషన్	పోలింగ్ కేంద్రాలు
జూబ్లీహిల్స్	9	28
ఫిలింనగర్	6	16
పంజగుట్ట	8	23
మధురానగర్	43	119
బోరబండ	44	146
టోలిచౌకి	13	33
గోల్కొండ	7	17
సనత్‌నగర్	9	21

డివిజన్‌ల వారీగా పోలింగ్ కేంద్రాలు ఈ విధంగా ఉన్నాయి

వార్డు పేర్లు	పోలింగ్	బూత్‌లు
షేక్‌పేట	(94)	70
సోమాజీగూడ	(97)	34
యూసుఫ్‌గూడ	(96)	61
వెంగళరావునగర్	(99)	57
ఎర్రగడ్డ	(101)	61
రహమత్‌నగర్	(102)	72
బోరబండ	(103)	52

నామినేషన్ ప్రక్రియకు మార్గదర్శకాల జారీ

- ఈ నెల 21 వరకు నామినేషన్ల స్వీకరణ
- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు

బంజారాహిల్స్: భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గ ఉప ఎన్నికకు సోమవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుండగా, ఆ వెంటనే నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ప్రభుత్వ సెలవు దినాలు మినహాయించి ఈ నెల 21 వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. అర్హత కలిగిన రాజకీయ అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.సాయిరాం సూచించారు.

నామినేషన్ దాఖలుకు మార్గదర్శకాలు...

అవసరమైన ఫారాలు: ఫారం-2బీ (నామినేషన్), ఫారం-26 (అఫిడవిట్-అన్ని కాలమ్స్ తప్పనిసరి, నోటరైజ్ చేయాలి)

సమయం: ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు..

నామినేషన్ దాఖలు కార్యాలయం: రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, షేక్‌పేట మండలం

దాఖలు చేయగలవారు: అభ్యర్థి లేదా ప్రతిపాదకుల్లో ఒకరు

ఫొటో పరిమాణం: 2 ఇన్‌టూ 2.5 సెంటీమీటర్లు

అభ్యర్థి కనీస వయస్సు: 25 సంవత్సరాలు

ప్రతిపాదకుల అవసరం:

- గుర్తింపు పొందిన పార్టీ అభ్యర్థులు అయితే ఒక్క ప్రతిపాదకుడు (నియోజకవర్గ ఓటరు)
- స్వతంత్ర/గుర్తింపు లేని అభ్యర్థులు అయితే పది మంది ప్రతిపాదకులు (అందరూ నియోజకవర్గ ఓటర్లు)
- ఇతర నియోజకవర్గ అభ్యర్థులు అయితే సంబంధిత ఈఆర్ఓ నుంచి ఓటర్ల వివరాలు సమర్పించాలి.

ఎన్‌కోర్ పోర్టల్ ద్వారా డిజిటల్ నామినేషన్..

- అభ్యర్థులు ఈఎన్‌సీఓఆర్ఈ.ఈసీఐ.జీఓవీ.ఇన్ ద్వారా నామినేషన్ ఫారం ఆన్‌లైన్‌లో నింపవచ్చు.
- క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్రింటెడ్ హార్డ్‌కాపీ తప్పనిసరిగా సమర్పించాలి.
- ఆన్‌లైన్ డిపాజిట్ బ్యాంక్/ట్రెజరీలో క్రెడిట్ అయి ఉండాలి. లేకపోతే మాన్యువల్ డిపాజిట్ చేయాలి.

నామినేషన్ సమయంలో పరిమితులు..

- ఆర్వో/ఏఆర్వో కార్యాలయానికి 100 మీటర్ల పరిధిలో గరిష్టంగా మూడు వాహనాలు
- అభ్యర్థితో సహా ఐదుగురికి ప్రవేశ అనుమతి.
- ఒకే ద్వారం ద్వారా ప్రవేశం ఉంటుంది.

చెత్తేస్తే జరిమానా.. జైలు తథ్యం



ఫిలింనగర్ చౌరస్తాలో జీహెచ్ఎంసీ అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

బంజారాహిల్స్: చెత్త వేయవద్దని ఎన్నిమార్లు మొత్తుకున్న కొంత మందిలో మార్పు రాకపోవడంతో జీహెచ్ఎంసీ అధికారులు వినూత్న తరహాలో ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నారు. తాజాగా జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని గౌతంనగర్ చౌరస్తాలో ఓ భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. రోడ్డుపై చెత్త వేసిన వారికి రూ. 1000 జరిమానాతో పాటు ఒక వారం రోజులు జైలు శిక్ష పడేలా కేసులు పెడతామంటూ హెచ్చరికలతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడ చెత్త వేయడానికి స్థానికులు జంకుతున్నారు. ఫిలింనగర్‌లో బహిరంగంగా చెత్త వేసే రెండు చోట్ల ఈ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామని ఈ ప్రాంతాల్లో స్థానికులు చెత్త వేయడం లేదని అధికారులు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న బాణాసంచా స్వాధీనం

ఫిలింనగర్: లైసెన్స్ లేకుండా నిబంధనలు ఉల్లంఘించి ఓ వ్యక్తి పెద్ద ఎత్తున బాణాసంచా ప్రమాదకరంగా నిల్వ చేయడంతో సమాచారం అందుకున్న ఫిలింనగర్ పోలీసులు దాడులు చేసి రూ. 50 వేల విలువైన టపాసులను సీజ్ చేశారు. వివరాలివీ... ఫిలింనగర్ రోడ్డునెంబర్-9లోని అంబేడ్కర్‌నగర్ నివసించే పన్నీరు ఉపేందర్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. స్థానికంగా ఓ షాపులో పెద్ద ఎత్తున బాణాసంచాను నిబంధనలకు విరుద్ధంగా గాజుల దుకాణంలో స్టోర్ చేసినట్లు సమాచారం రావడంతో ఫిలింనగర్ ఎస్ఐ పల్లవి ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేశారు. రూ.50 వేల విలువైన టపాసుల బాక్స్‌లను స్వాధీనం చేసుకున్నారు. 30 కిలోల బాణాసంచాను అక్రమంగా, అడ్డదారుల్లో ఈజీగా మనీ సంపాదించాలనే ఉద్దేశ్యంతో ఉపేందర్ దీపావళికి ముందుగానే ఇక్కడ బాణాసంచా నిల్వ చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఉపేందర్‌పై ఎక్స్‌ప్లోజివ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌కు అఖండ విజయాన్నందించాలి



సోమాజిగూడ డివిజన్ సమావేశంలో మాట్లాడుతున్న నవీన్‌యాదవ్

జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్

శ్రీనగర్‌కాలనీ: బూత్ స్థాయి కమిటీలే కాంగ్రెస్ పార్టీకి ఘన విజయాన్ని అందిస్తాయని, కార్యకర్తలు బూత్‌లతో సమష్టిగా పనిచేసి 50 వేల మెజారిటీని తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ అభ్యర్థి నవీన్‌యాదవ్ అన్నారు. ఆదివారం శ్రీనగర్‌కాలనీ శాలివాహననగర్ కమ్యూనిటీ హాల్‌లో సోమాజిగూడకు సంబంధించిన నేతలు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి అఖండ విజయం సీఎం రేవంత్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలని కోరారు. ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథన్, కార్పొరేటర్ వనం సంగీత, సోమాజిగూడ డివిజన్ అధ్యక్షుడు నరికెళ్ల నరేష్, నేతలు మనోజ్‌యాదవ్, కిరణ్‌యాదవ్, మాజిద్, గొంటి సాయినాథ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం...

కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమాభివృద్ధి సాధ్యమని, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఇప్పటికే కోట్లాది రూపాయాలతో అభివృద్ధి పనులను జరిగాయని నవీన్‌యాదవ్ అన్నారు. ఆదివారం ఎర్రగడ్డ డివిజన్ కళ్యాణ్‌నగర్ వెంఛర్-3లో కాలనీవాసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

బీసీ రిజర్వేషన్ల సాధనకు అన్ని పార్టీలు ఏకం కావాలి



సమావేశానికి హాజరైన బీసీ నేతలు

ఫిలింనగర్: బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే రాజకీయ పార్టీల బీసీ సంఘాల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని జూబ్లీహిల్స్ డివిజన్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మెంగా శ్యామ్ డిమాండ్ చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ... బీసీలకు రిజర్వేషన్లపై రాజకీయ పార్టీలన్నీ మనస్ఫూర్తిగా ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అఖిలపక్ష సమావేశం ఢిల్లీకి కూడా వెళ్లి కేంద్ర ప్రభుత్వంతో ఒత్తిడి పెంచాలన్నారు. ఈ అవకాశం చేజారితే మళ్లీ రాదని, 42 శాతం రిజర్వేషన్ అమలయ్యేదాకా అందరూ కలిసికట్టుగా పోరాడాలని కోరారు. అన్ని కుల, మతాలను ఈ విషయంలో ఒక్కతాటి పైకి తీసుకువచ్చి బీసీలకు మద్దతుగా నిలబడేలా చూడాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలపై ఉందన్నారు. ఫిలింనగర్‌కు చెందిన బీసీ ప్రతినిధులు పద్మ, ప్రియాంక, చంద్రమ్మ, హనుమంతుగౌడ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు 'అవోపా' ఆర్థిక సాయం



బంజారాహిల్స్: ప్రొఫెషనల్ కోర్సులు చదువుతున్న ప్రతిభావంత విద్యార్థులకు ఏపీ ఆవోపా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆర్థిక సహాయం అందజేసింది. పంజగుట్టలోని వివైఎస్ ప్రొఫెసర్ భవన్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ... ఏపీ, తెలంగాణలోని దాదాపు 16 పట్టణాలకు చెందిన విద్యార్థులను అవోపా గుర్తించి సహాయం అందజేస్తోందన్నారు. స్థానిక ఆవోపా ప్రతినిధులతో పాటు అవోపా కమిటీ విద్యార్థులను వడబోసి ఉత్తమ విద్యార్థులకు ఈ ఆర్థిక సహాయం చేస్తోందని వివరించారు. కార్యక్రమానికి హాజరయ్యే విద్యార్థుల ప్రయాణ, ఇతర ఖర్చులు కూడా ట్రస్టే భరిస్తుందన్నారు. వాసవి అకాడమీ అధ్యక్షుడు పెండేకంటి రామ్మోహన్‌రావు, సముద్ర గ్రూప్ సీఎండీ గుండా మధుసూదన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఏపీ అవోపా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధ్యక్షుడు సీఏ బెల్లి శ్రీధర్, మేనేజింగ్ ట్రస్టీ జి.నంబెర్‌మల్లు, ట్రెజరర్ లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడు మేడా నర్సింహులు, దాతలు, అవోపా సభ్యులు పాల్గొన్నారు.

ఫిలింనగర్‌లో భారీగా మద్యం స్వాధీనం

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా ఎన్నికల అధికారులు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను కట్టుదిట్టంగా అమలుచేస్తున్నారు. ఒకవైపు వాహనాలు క్షుణ్ణంగా తనిఖీలు చేస్తూ ఇంకోవైపు పెద్ద ఎత్తున మద్యం తరలిస్తున్న వారిపై దృష్టి పెట్టారు. సోమవారం నుంచి నామినేషన్ల పర్వం మొదలు కానుండగా, శని, ఆది వారాల్లో ఫిలింనగర్, జూబ్లీహిల్స్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో పెద్ద ఎత్తున మద్యం పట్టుబడింది. షేక్‌పేట డీ-మార్ట్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో 80 బ్రీజర్ బాటిళ్లు, 20 బడ్వైజర్ బీరు బాటిళ్లు, నాలుగు రెడ్ వైన్ బాటిళ్లు, 38 వోడ్కా బాటిళ్లను ఒకే వ్యక్తి తీసుకువెళ్తుండగా పట్టుకున్నారు. ఫిలింనగర్ ఎస్ఐ షేక్ సలీం ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో మద్యంతో పట్టుబడ్డ వ్యక్తి గోషామహల్‌కు చెందిన బొడ్డు సాయికుమార్‌గా గుర్తించారు. ఈ మద్యం విలువ రూ. 33,300లు ఉంటుందని పోలీసులు తెలిపారు. మద్యం బాటిళ్లను సీజ్ చేశారు.

జూబ్లీహిల్స్‌లో...

జూబ్లీహిల్స్ పోలీసులు వెంకటగిరిలోని కేకే వైన్స్ సమీపంలో నిర్వహించిన తనిఖీల్లో బత్తుల శివకుమార్ అనే వ్యక్తి పరిమితికి మించి 13 బీరు బాటిళ్లు తీసుకెళ్తుండగా పోలీసులు సీజ్ చేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం ఎన్నికలు జరుగుతున్న ప్రాంతంలో ఒక వ్యక్తి నిబంధనల ప్రకారం 10 బీరు బాటిళ్లు, లేదా నాలుగు విస్కీ బాటిళ్లు మాత్రమే తీసుకువెళ్లాల్సి ఉంటుంది. ఇంట్లో కూడా నాలుగున్నర లీటర్లకు మించి విస్కీ బాటిళ్లు ఉండడం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని పోలీసులు తెలిపారు.

వైభవంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



ఖైరతాబాద్: ఖైరతాబాద్ డివిజన్ మహభారత్ నగర్‌లోని మహంకాళి అమ్మవారి ఆలయంలో మహంకాళి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు ఫకీరయ్య యాదవ్‌తో పాటు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ఘన విజయం ఖాయం



మాట్లాడుతున్న చైర్మన్ తూము వినయ్ కుమార్

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.నవీన్ యాదవ్ ఘన విజయం సాధించడం ఖాయమని తెలంగాణ ఓబీసీ వర్కింగ్ చైర్మన్ తూము వినయ్ కుమార్ అన్నారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ బీసీ అభ్యర్థికి అవకాశం కల్పించడం చరిత్రాత్మక నిర్ణయమన్నారు. బీసీ అభ్యర్థిగా నవీన్ యాదవ్‌ను ఎంపిక చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇది బీసీల పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా వెనుకబాటుకు గురైన బీసీలకు న్యాయం చేయాలనే దృక్పథంతో కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందని ఆమర అన్నారు. ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ఘనవిజయం సాధించేందుకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. ఓబీసీ రాష్ట్ర కో ఆర్డినేటర్ రవికుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకటేష్ యాదవ్, మైనారిటీ ఓబీసీ రాష్ట్ర కో ఆర్డినేటర్ అన్మతున్నీసా తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి.. వేగంగా డ్రైవ్ చేసి...

వెంగళరావునగర్: మద్యం సేవించి వేగంగా డ్రైవ్ చేసి మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన గుర్తు తెలియని వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... శ్రీనగర్‌కాలనీలో నివాసం ఉంటున్న అభిమిత్ర తన స్నేహితులతో కలిసి శనివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలపై సత్యసాయి నిగమాగమం వైపు వస్తున్నారు. ఈ క్రమంలో మరో ద్విచక్ర వాహనంపై అతి వేగంగా వచ్చిన వ్యక్తి అభిమిత్ర స్నేహితుల బైక్‌ను ఢీకొట్టింది. అనంతరం ఆగకుండా వెళ్లిపోయింది. ఈ సంఘటనలో స్నేహితుడు వంశీ, సోదరుడు అన్వేష్‌లకు గాయాలయ్యారు. వారు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అభిమిత్ర మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు!

- వాడవాడలా పల్స్ పోలియో కేంద్రాలు
- బస్తీ దవాఖానాలు, కమ్యూనిటీ హాళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు





భగత్‌సింగ్ కాలనీ కమ్యూనిటీ హాల్ వద్ద...

బంజారాహిల్స్: పోలియో రహిత సమాజం కోసం ప్రభుత్వం చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం విజయవంతంగా నిర్వహించింది. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల వ్యాప్తంగా ఉన్న అన్ని డివిజన్లలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు బస్తీ దవాఖానాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ హాళ్లు, ప్రధాన కూడళ్లలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు అయిదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పోలియో చుక్కలు వేయించుకున్న చిన్నారుల వేళ్లకు సిరా చుక్కలను గుర్తుగా వేశారు. బంజారాహిల్స్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో 34 కేంద్రాలు, షౌకత్‌నగర్ ఆరోగ్య కేంద్రం పరిధిలో 14 కేంద్రాలు, ఫిలింనగర్ ఆరోగ్య కేంద్రం పరిధిలో 25 ప్రాంతాల్లో, జూబ్లీహిల్స్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో 18 ప్రాంతాల్లో పోలియో చుక్కల కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వైద్యాధికారులు తెలిపారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు రెండు, మూడు రోజుల తర్వాత కూడా ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేస్తామని వారు తెలిపారు.







ఫిలింనగర్ రౌండ్‌టేబుల్ స్కూల్‌లో పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది



ఎల్లారెడ్డిగూడలో...



రహమత్‌నగర్ గంథాలయంలో...



బోరబండ బస్ స్టాప్ వద్ద...

డీసీసీ అధ్యక్షుడి ఎంపికపై కసరత్తు

'సంస్థాగత' ఎన్నికలపై దృష్టి సారించిన కాంగ్రెస్

- నేడు మేడ్చల్ జిల్లాకు ఏఐసీసీ, టీపీసీసీ పరిశీలకులు
- ఆశావహుల నుంచి ఈ నెల14 నుంచి 19 వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఈ నెలాఖరుకల్లా కొత్త అధ్యక్షుడి ఎంపిక పూర్తయ్యే అవకాశం
- రాష్ట్రంలో అధికారంలో ఉన్నా జిల్లాలో కాంగ్రెస్‌ది ప్రతిపక్ష పాత్రే

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో అధికార కాంగ్రెస్‌ని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడంపై ఆ పార్టీ అధిష్టానం దృష్టి సారిస్తోంది. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన జీఓ 9, ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే ఇవ్వడంతో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ఆరు వారాలపాటు నిలిచిపోగా.. ఈలోగా పెండింగ్‌లో ఉన్న జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి ఎంపికపై కసరత్తు చేస్తోంది. ఈ మేరకు సోమవారం నుంచి 19 వరకు డీసీసీ అధ్యక్షుడి రేసులో ఉన్న ఆశావహుల నుంచి నియోజకవర్గాలవారీగా దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఇందుకోసం ఢిల్లీ, ఇతర ప్రాంతాల నుంచి ఆదివారం నగరానికి చేరుకున్న ఏఐసీసీ, టీపీసీసీ పరిశీలకులు సోమవారం నుంచి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. మొదటగా మేడ్చల్ అసెంబ్లీ నియోజవర్గం పరిధిలోని శామీర్‌పేట మండలం అంతాయిపల్లి ఎస్ఎన్ఆర్ పుష్ప కన్వెన్షన్‌లో సోమవారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో ముఖ్యఅతిథిగా ఏఐసీసీ పరిశీలకురాలు అంజలి నింబాల్కర్, టీపీసీసీ పరిశీలకులు బలరాంనాయక్, పటేల్ రమేష్‌రెడ్డి, నందిమల్ల యాదయ్య ముదిరాజ్, సింగారపు ఇందిర, పి.విజయారెడ్డి, జిల్లాకు చెందిన పార్టీ నాయకులు పాల్గొంటారు. సమావేశంలో ఏఐసీసీ పరిశీలకురాలు అంజలి జిల్లా అధ్యక్షుడు ఎన్నికపై ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ముఖాముఖి అభిప్రాయ సేకరణ చేపడతారు.

పోటాపోటీగా ఆశావహులు..

డీసీసీ అధ్యక్ష పదవి కోసం పోటీపడే వారి సంఖ్య జిల్లాల్లో బాగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పుడున్న డీసీసీ అధ్యక్షుడి మార్పు తథ్యమనే చర్చ జోరుగా సాగుతుండటంతో ఆశావహుల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు తెలుస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఆవిర్భావం నుంచి డీసీసీ అధ్యక్షుడిగా దాదాపు నాలుగేళ్లు పనిచేసిన మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కూన శ్రీశైలంగౌడ్ మళ్లీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవిని ఆశిస్తుండటంతోపాటు గట్టి ప్రయత్నం చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి మల్కాజిగిరి నుంచి పార్లమెంట్‌కు ఎన్నికైన సందర్భంలోనూ శ్రీశైలంగౌడ్ డీసీసీ అధ్యక్షుడిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో డీసీసీ అధ్యక్ష పీఠం శ్రీశైలంగౌడ్‌కు దక్కే అవకాశమున్నట్లు పార్టీ శ్రేణుల్లో ప్రచారం జరుగుతోంది. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆశావహుల సంఖ్య అధికంగా ఉంది. ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డిపాటు నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జ్ టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ (జంగయ్య యాదవ్), శామీర్ మండలానికి చెందిన మరో నేత, మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు అనుచరుడు నక్క ప్రభాకర్‌గౌడ్, ఘటేస్కర్ మండలానికి చెందిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి, పోచారం మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ బాలగోని వెంకటేష్‌గౌడ్ పోటీ పడుతున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంతోపాటు ఉప్పల్, కూకట్‌పల్లి, మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కూడా పలువురు కాంగ్రెస్ నాయకులు జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఉత్సాహాన్ని కనబరుస్తున్నట్లు తెలుస్తోంది.

ఇక్కడ కాంగ్రెస్ ప్రతిపక్షమే

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మాత్రం కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష పాత్ర నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడు హోదాలో పార్లమెంట్ సభ్యుడిగా ఈ జిల్లా నుంచే ప్రాతినిధ్యం వహించారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లా నుంచి శాసనసభకు ఒక్క కాంగ్రెస్ అభ్యర్థి కూడా ఎన్నిక కాలేదు. జిల్లాలో ఉన్న మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా మల్కాజిగిరి నుంచి ఎంపీగా బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపొందారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ, జిల్లాల్లో మాత్రం ప్రతిపక్షం స్థానంలో కాంగ్రెస్ ఉంది. ఈ నేపథ్యంలో కేడర్‌తోసహా కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపేలా డీసీసీ అధ్యక్షుడి ఎంపికపై అధిష్టానం కసరత్తు చేసేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పురపాలక సంఘాలు, జీహెచ్ఎంసీ పరిధిలోని డివిజన్లలో అధికార పార్టీ జెండా ఎగిరేలా డీసీసీ అధ్యక్షుడి ఎంపిక ఉండేలా క్షేత్రస్థాయి నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది.

హైదరాబాద్ వైపు ప్రపంచ దేశాల దృష్టి



సాక్షి, సిటీబ్యూరో: ఆలోచనలు కార్యరూపం దాల్చే సజీవ కేంద్రంగా హైదరాబాద్ నిలుస్తోందని ఐరా (ఐఆర్ఏ) రియాల్టి సీఈఓ నర్సిరెడ్డి అన్నారు. ఐరా రియాల్టి కార్యాలయంలో హైటీ మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభ, ఆవిష్కరణలు, ఐటీ, ఫార్మా రంగాల్లో సాధించిన ప్రగతి, విభిన్న కోణాల్లో రాణించడం వంటి అంశాలు హైదరాబాద్ సమగ్ర, సుస్థిర అభివృద్ధికి దోహదం చేశాయని పేర్కొన్నారు. హైదరాబాద్ ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తోందని తెలిపారు. నగర వృద్ధిలో రియల్ ఎస్టేట్ రంగం నుంచి తమ వంతు సహకారం అందించడం గర్వంగా భావిస్తున్నామని అన్నారు. వాణిజ్య సంబంధాలు బలపడటానికి ఇలాంటి వేదికలు అవసరమని తెలిపారు. కార్యక్రమంలో అమెరికా ప్రతినిధుల బృందం, ఐరా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్ల జీవోను గవర్నర్ ఆమోదించాలి

టీపీఆర్‌పీ అధ్యక్షుడు జిలుకర రవికుమార్



మాట్లాడుతున్న జిలుకర రవికుమార్

హిమాయత్‌నగర్: బీసీలకు విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల బిల్లును గవర్నర్ ఆమోదించకపోవడం వల్ల హైకోర్టు స్టే విధించిందని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ(టీపీఆర్‌పీ) వ్యవస్థాపక అధ్యక్షుడు జిలుకర రవికుమార్ అన్నారు. గవర్నర్ వెంటనే దానిని ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జీవో 9పై రాష్ట్ర హైకోర్టు విధించిన స్టేను ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లి వెకెట్ చేయించాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం వెంటనే పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి బీసీ బిల్లును ఆమోదించి, రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో చేర్చాలన్నారు. రాష్ట్రపతి కూడా ఈ బిల్లును ఆమోదించాలని కోరారు.

1995 బ్యాచ్ ఎస్ఐల అపూర్వ సమ్మేళనం



30 వసంతాల రీయూనియన్ కార్యక్రమంలో పాల్గొన్న 1995 బ్యాచ్ ఎస్ఐలు

బండ్లగూడ: 1995 బ్యాచ్ ఎస్ఐలుగా డైరెక్ట్ రిక్రూట్ అయిన అప్పా మొదటి బ్యాచ్ 30 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ పోలీస్ అకాడమీలో ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 1995 బ్యాచ్ ఎస్ఐలు నేడు ఇన్‌స్పెక్టర్లుగా, డీఎస్పీలుగా, అడిషనల్ ఎస్పీలుగా 306 మంది ఉన్నారు. వారిలో 200 మంది అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. రెండు రోజుల ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అప్పా మాజీ డైరెక్టర్ ఎం.వి.కృష్ణారావు మాట్లాడుతూ తన పర్యవేక్షణలో అప్పాలో 1995 బ్యాచ్ ఎస్ఐలు నాడు ఎంతో కష్టపడి, ఇష్టపడి శిక్షణ తీసుకున్నారని అన్నారు. రెండో రోజు ఆదివారం టీజీపీఏ డిప్యూటీ డైరెక్టర్ కవిత పాల్గొని మాట్లాడారు. పోలీసు అకాడమీ డైరెక్టర్లుగా పనిచేసిన గోపీనాథ్‌రెడ్డి, రతన్, మహంతి లాంటి అధికారుల కృషి వల్ల అకాడమీ దేశంలోనే అత్యున్నతమైన శిక్షణ కేంద్రంగా ఐఎస్‌వో సర్టిఫికెట్లు పొందటం గర్వకారణమని అధికారులు అన్నారు. కార్యక్రమంలో నర్సింగరావు, బచ్చల రమేష్, శ్రీనాథ్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, ఆదూరి శ్రీనివాసరావు, దేవారెడ్డి, భాస్కర్, అమ్మిరెడ్డి, సందీప్‌రెడ్డి, కాంతారావు, మహేంద్ర, బాజీ తేజేశ్వరరావు పాల్గొన్నారు.

జేఎన్‌వీ దరఖాస్తుల్లో మార్పులకు అవకాశం

కరెక్షన్ విండో 22–25 తేదీల్లో మాత్రమే..

రాయదుర్గం: జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2026–27 విద్యా సంవత్సరంలో 9, 11వ తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీ కోసం దరఖాస్తు చేసుకున్న వాటిల్లో మార్పులు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు శేరిలింగంపల్లి గోపన్‌పల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయ రంగారెడ్డి జిల్లా ప్రిన్సిపాల్ విజయభాస్కర్ ఆదివారం తెలిపారు. అందుకోసం ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు కరెక్షన్ విండోను తెరిచి ఉంచుతారని పేర్కొన్నారు. దరఖాస్తులో ఏరియా/జెండర్/కేటగిరీ/ డిజబిలిటీ/ఎగ్జాం మీడియం ఫీల్డ్‌లో మాత్రమే మార్పులు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 21 వరకు గడువు పొడిగించినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు చెందిన అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

యువతకు '4డీ' సూత్రం అవసరం

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



బంజారాహిల్స్: విలువలు, విధేయత, సంస్కారం కలిగిన విద్యే నేటి సమాజానికి అవసరమని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. యువతే దేశ సంపద అని, వారికి ఇప్పుడు డెడికేషన్, డిటాక్సిఫికేషన్, డిసిప్లేన్, డైవర్సిటీ అనే '4డీ'సూత్రాలు తప్పనిసరి అని ఆయన పేర్కొన్నారు. ప్రముఖ ప్రచురణ సంస్థ జాన్సన్ పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో ఆదివారం బంజారాహిల్స్‌లోని డాక్టర్ ఎం.సి.ఆర్.హెచ్.ఆర్.డి ఇన్‌స్టిట్యూట్‌లో 'టాలెంటోత్సవ్–2కే25' ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వెంకయ్యనాయుడు మాట్లాడుతూ నేటి కృత్రిమ మేధస్సు(ఏఐ) యుగంలో విద్యార్థులు ఆధునిక నైపుణ్యాలను నేర్చుకోవాలని, 'వైబ్ కోడింగ్'వంటి ఆధునిక సాంకేతికతలను నేర్చుకుంటూనే మన సంప్రదాయాలను కాపాడాలని సూచించారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని, మాతృభాషలో మాట్లాడాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పేర్కొన్నారు. జాన్సన్ పబ్లికేషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ 'టాలెంటోత్సవ్'ఒక పోటీ మాత్రమే కాదని, ప్రతి బాలబాలికలోని అపారమైన ప్రతిభను వెలికితీయడానికి జరుపుకునే వేడుక అని చెప్పారు. ఈ సందర్భంగా టాలెంటోత్సవ్‌లో పాల్గొన్న విద్యార్థుల నుంచి ఎనిమిది మంది విజేతలను ప్రకటించి వారికి అవార్డులు, సర్టిఫికెట్లు అందించారు. విద్య, కళ, సంగీతం, నృత్యం, స్పీచ్ తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ రంగాల ప్రముఖులు రామ్ కమల్, ఆకెళ్ల రాఘవేంద్ర, డాక్టర్ రాధా చింతల తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో చైతన్యానికి చంద్ర కృషి

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక



సీఆర్ ఫౌండేషన్ వార్షికోత్సవంలో మాట్లాడుతున్న జస్టిస్ నగేష్ భీమపాక

చందానగర్: అన్యాయాలను ఎదిరించే విషయంలో మౌనంగా ఉండొద్దని చంద్ర రాజేశ్వరరావు లాంటి ఎంతోమంది మహనీయులు ప్రజల్లో చైతన్యాన్ని నింపేందుకు కృషి చేశారని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక అన్నారు. ఆదివారం కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమం 26వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్ర రాజేశ్వరరావు, మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జస్టిస్ నగేష్ భీమపాక మాట్లాడుతూ సమాజానికి అనేక రకాలుగా సేవలందించినవారు సీఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో ఉన్నారని అన్నారు. పది ఎకరాల్లో వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేసి, మరిన్ని సేవలను అందించాలని, అందుకు తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. మార్క్స్ చెప్పినట్టుగా మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారాయని పేర్కొన్నారు. సీపీఐ సీనియర్ నేత సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు జీవితం ఎంతోమందిని ప్రభావితం చేసిందన్నారు. ప్రతి సమస్యను సీఆర్ లోతుగా ఆలోచించి, పరిష్కారానికి కృషి చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ సీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఎంబ్రాయిడర్, కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నామని అన్నారు. ఇటీవల మరణించిన సురవరం సుధాకర్‌రెడ్డి పేరును లైబ్రరీకి పెట్టామని చెప్పారు. కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి రామకృష్ణ, అజయ్‌కుమార్, సీఆర్ ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశవులు, వృద్ధాశ్రమ సలహా కమిటీ సభ్యులు రాజేందర్ రావు, తమ్మారెడ్డి తాన్యాకుమారి, హెల్త్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రజని, వృద్ధులు పాల్గొన్నారు.

మున్నూరు కాపులను విస్మరిస్తే గుణపాఠం తప్పదు



అభివాదం చేస్తున్న సంఘం ప్రతినిధులు

పంజగుట్ట: రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న మున్నూరు కాపులకు కాంగ్రెస్ మంత్రివర్గంలో స్థానం లేదని, తమను విస్మరిస్తే గుణపాఠం చెబుతామని మున్నూరు కాపు పటేల్ విద్యార్థి, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రాంప్రసాద్ పటేల్ అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మున్నూరు కాపు జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్ పటేల్‌తో కలిసి మాట్లాడుతూ మున్నూరు కాపులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిన్నచూపు చూస్తున్నారని, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ప్రాధాన్యం ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని జిల్లా కేంద్రాల్లో బాలబాలికల హాస్టల్‌కు రెండు ఎకరాల స్థలం కేటాయిస్తామని, మున్నూరు కాపులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని, కార్పొరేషన్, నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 22 నెలలవుతున్నా ఇంతవరకు అమలు చేయలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి, మంత్రుల ఇంటిని ముట్టడిస్తామని, స్థానిక సంస్థల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో మున్నూరు కాపు జర్నలిస్టు ఫోరం హైదరాబాద్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పి.అరుణ్ కుమార్ పటేల్, సంఘం నాయకులు శ్రీపతి, సురేష్ కుమార్, అన్నం శివ, అయిత ప్రశాంత్, మామిడి వినోద్, శ్రీకాంత్, ఆకుల వెంకటేష్, తోట సాయి, సోమశెట్టి రాజేష్, సాయిచరణ్, వెంకట్ పాల్గొన్నారు.

ఎన్నికల వ్యయ పర్యవేక్షకుడిగా సంజీవ్ కుమార్‌లాల్

లక్డీకాపూల్: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికకు ఎన్నికల వ్యయ పర్యవేక్షుడిగా ఐఆర్ఎస్ అధికారి సంజీవ్ కుమార్ లాల్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల కమిషన్ 2014 బ్యాచ్‌కి చెందిన సంజీవ్ కుమార్‌ని నియమించింది. ఎన్నికల వ్యయ పర్యవేక్షకులు ఎన్నికల ఖర్చుల పర్యవేక్షణలో భాగంగా అన్ని కార్యకలాపాలను సమీక్షించడంతోపాటు ఎన్నికల వ్యయంపై కట్టుదిట్టమైన పర్యవేక్షణను కొనసాగిస్తారు. ఉప ఎన్నికలో పారదర్శకతను కాపాడటమే కాకుండా, డబ్బు ప్రలోభాల ప్రభావాన్ని అరికట్టే దిశగా పర్యవేక్షకులు చర్యలు తీసుకుంటారు.

సీజేఐపై దాడి.. రాజ్యాంగంపై దాడే..



సమావేశంలో మాట్లాడుతున్న భరత్‌భూషణ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని భారత రాజ్యాంగంపై జరిగిన దాడిగా భావించాలని రిటైర్డ్ ఐఆర్‌టీఎస్ అధికారి అంబేడ్కర్‌వాది అప్పకట్ల భరత్‌భూషణ్ అన్నారు. ఆర్ఎస్ఎస్ ఇటీవల కాలంలో దేశ యువతలో నింపుతున్న విద్వేషాల ఫలితంగానే ఈ దాడి జరిగిందన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేవీపీఎస్, డీవైఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడికి వ్యతిరేకంగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. భరత్‌భూషణ్ మాట్లాడుతూ దళితుడు సీజేఐగా ఉండడాన్ని జీర్ణించుకోలేని ఆర్ఎస్ఎస్ దాడులకు ఉసిగొల్పుతోందన్నారు.

- ప్రముఖ అంబేడ్కర్‌వాది జేబీ రాజు మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని అడ్డుకునే వారందరిని ప్రతిఘటిస్తామని న్యాయవాది రాకేష్‌కిషోర్ మాట్లాడటం వెనుక ఆర్ఎస్ఎస్ కుట్ర ఉందన్నారు. అత్యున్నత న్యాయస్థానంలోనూ ఆర్ఎస్ఎస్ వాదులు దాడులు ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కోటా రమేష్, అనగంటి వెంకటేష్, కృష్ణసాగర్, వంగూరి రాములు, ఆర్.వెంకట్‌రాములు, బుర్రి ప్రసాద్, ఆర్.శ్రీరాంనాయక్, ఎం.శోభన్ నాయక్, భూపతి వెంకటేశ్వర్లు, ఎ.విజయకుమార్ పాల్గొన్నారు.

సెమీ కండక్టర్ రంగానికి పెరిగిన ప్రాధాన్యం

మాజీ గవర్నర్ బండారుదత్తాత్రేయ



ప్రారంభ కార్యక్రమంలో దత్తాత్రేయ, మంత్రి శ్రీహరి

గచ్చిబౌలి: సెమీ కండక్టర్ రంగం దేశ ప్రాధాన్య రంగంగా మారిందని హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. భారతదేశపు తొలి సెమీ కండక్టర్ ఇన్నోవేషన్ మ్యూజియాన్ని టెక్నాలజీ చిప్ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్(టీ చిప్) ఆధ్వర్యంలో కొండాపూర్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర క్రీడలు, యువజన శాఖల మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి దత్తాత్రేయ ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెమీకాన్ ఇండియా డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల దిశగా టి–చిప్ చేస్తున్న పని ప్రశంసనీయమన్నారు. ఈ రంగం అభివృద్ధి చెందేందుకు అన్ని విధాలా మద్దతు ఇవ్వడానికి కేంద్ర స్థాయిలో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ తెలంగాణ సాంకేతిక మార్పులలో ముందంజలో ఉంటుందన్నారు. ఈ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం విధానపరమైన మద్దతు, మౌలిక వసతులు, ప్రతిభా వికాసం వంటి అంశాల్లో సహకరిస్తుందని హామీనిచ్చారు. ఈ మ్యూజియం విద్యార్థులకు ప్రేరణగా, స్టార్టప్‌లకు వేదికగా, పరిశోధనకు ప్రయోగశాలగా మారనుందన్నారు. టీ చిప్ చైర్మన్ సందీప్‌కుమార్ మక్తాల మాట్లాడుతూ ఇది కేవలం ప్రదర్శన స్థలం మాత్రమే కాదని, ఇది పరిశోధన, పరిశ్రమ, సమాజం మధ్య వారధిగా నిలుస్తుందన్నారు. ఈ కార్య క్రమంలో చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఐటీ శాఖ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, తిరుపతిరెడ్డి, ఎమ్మెల్యేలు, టీ చిప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

స. హ. చట్టంతో ప్రజలను చైతన్యపర్చాలి



మాట్లాడుతున్న జస్టిస్ చంద్రయ్య

పంజగుట్ట: అందరూ సమాచార హక్కు చట్టాన్ని అందిపుచ్చుకుని ప్రజలను చైతన్యపర్చాలని, సమస్యల పరిష్కారానికి ఉపయోగించుకోవాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమాచార హక్కు చట్టం ఆవిర్భవించి 20 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో చట్టంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సమితి జాతీయ చైర్మన్ బొమ్మరబోయిన కేశవులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, డాక్టర్ జి.చిన్నారెడ్డి, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య, ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ అనేక కారణాల వల్ల కొన్ని చట్టాలు సరిగ్గా అమలు కావడంలేదని, ఈ లోపాలను సరిదిద్దాల్సిన బాధ్యత ప్రజలకు ఉందని, అందుకే 2005లో సమాచార హక్కు చట్టం తీసుకువచ్చారని తెలిపారు. చట్టాన్ని ప్రజల్లోకి మరింతగా తీసుకువెళ్లాలని సూచించారు. ప్రజలకు సమాచారమే అధికారం ఇస్తుందని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు సమాచార హక్కు చట్టం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. సకాలంలో ఆర్‌టీఐ కమిషనర్‌లను నియమించకపోవడంవల్ల నాలుగు లక్షల అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. సమావేశంలో ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి లక్ష్మీకాంతం, జల సాధన సమితి జాతీయ అధ్యక్షుడు దుశ్చర్ల సత్యనారాయణ, డాక్టర్ రంగారావు, శివయ్య ముదిరాజ్, రేఖా రజని, మేఖల శ్రీహరి, నరహరి, మెట్టు మధు, హరికృష్ణ, యాదయ్య, బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

నిష్పక్షపాత ఎన్నికలతోనే ప్రజాస్వామ్యం బలోపేతం

రాజకీయ విశ్లేషకుడు పరకాల ప్రభాకర్



సదస్సులో ప్రసంగిస్తున్న పరకాల ప్రభాకర్

హిమాయత్‌నగర్: నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగితేనే ప్రజాస్వామ్యం బలోపేతం అవుతుందని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, ఆర్థికవేత్త డాక్టర్ పరకాల ప్రభాకర్ అన్నారు. రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్యంపై నమ్మకం కల్పించడం లేదని విమర్శించారు. ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో జాగో నవ తెలంగాణ ఆధ్వర్యంలో జస్టిస్ చంద్రకుమార్ అధ్యక్షతన 'స్వేచ్ఛాయుత ఎన్నికలు–ఎన్నికల కమిషన్ పాత్ర'అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ చేతిలో కీలుబొమ్మగా మారిన ఎన్నికల కమిషన్ రద్దుకు పోరాడాలని పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో 5 కోట్ల ఓట్లు అదనంగా పడ్డాయని ఓ సర్వేలో తేలిందన్నారు. 234 స్థానాలు ఎన్డీఏకు, 313 స్థానాలు వ్యతిరేక శక్తులకు రావాల్సి ఉండగా, ఓట్ల తారుమారు కారణంగా అనుకోని ఫలితాలు వెల్లడయ్యాయని అన్నారు. మొత్తం మీద 15 రాష్ట్రాల్లో 79 స్థానాల్లో అక్రమ ఓటింగ్ జరిగిందని ఆరోపించారు. పక్షపాత ఓటరు జాబితాలో ఒకే ఇంట్లో 60 ఓట్లు, 103 ఏళ్ల వృద్ధులు, భర్తల పేర్ల స్థానంలో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా అంటూ నమోదు బహిర్గతం కావడం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. సమావేశంలో సీపీఐ సీనియర్ నేత కందిమల్ల ప్రతాపరెడ్డి, ఆప్ రాష్ట్ర కన్వీనర్ డా.దిడ్డి సుధాకర్, వివిధ సంఘాల నేతలు అఫ్జల్ అజీజ్, ప్రొఫెసర్ వెంకటదాసు, మునీరుద్దీన్ ముజాహిద్, ఏలేశ్వరం వెంకటేష్, నయనాల ప్రభాకర్, సోగరా బేగం, ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌కు ప్రతిష్టాత్మక అవార్డు



అవార్డు అందుకుంటున్న జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ వరలక్ష్మి

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌కు ప్రతిష్టాత్మకమైన 'ది బెస్ట్ స్పోర్ట్స్ ఇంప్లిమెంటేషన్ స్కూల్ అవార్డు'వరించింది. నగరంలోని టి–హబ్‌లో జరిగిన బ్రెయిన్ ఫీడ్, స్ప్రింక్ ప్రో అవార్డుల ప్రదానోత్సవంలో రిలయన్స్ జియో చీఫ్ డేటా సైంటిస్ట్ శైలేష్ కుమార్, ఇండియన్ బ్యాడ్మింటన్ టీమ్ చీఫ్ నేషనల్ కోచ్ పద్మభూషణ్ అవార్డు గ్రహీత పుల్లెల గోపీచంద్, ప్రభుత్వ క్రీడా కార్యదర్శి జయేష్ రంజన్ చేతుల మీదుగా పాఠశాల డైరెక్టర్ వరలక్ష్మి ఈ అవార్డును అందుకున్నారు. క్రీడలు, వెల్‌నెస్, ఏఐ ఆవిష్కరణలను పాఠ్యాంశాల్లో చేర్చి విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందించేందుకుగాను పాఠశాలకు ఈ అవార్డు దక్కింది. వివిధ ఆటల కోసం విశాలమైన మైదానాలు, సింథటిక్ కోర్టులు ఏర్పాటు చేశారు.

ప్రజావాణికి బ్రేక్

లక్డీకాపూల్: జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేశారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి నవంబర్ 11న ఉప ఎన్నిక జరగనున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు నామినేషన్ ప్రక్రియ కొనసాగనున్నది. ఈ నేపథ్యంలో ప్రజావాణిని రద్దు చేసినట్టు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు.

ఆదివాసీల అస్తిత్వం ప్రశ్నార్థకం

బాలగోపాల్ సంస్మరణ సభలో ప్రొఫెసర్ నందిని సుందర్



బాలగోపాల్ సంస్మరణ సభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ నందిని సుందర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బస్తర్‌లో ఆదివాసీల అస్తిత్వం ప్రశ్నార్థకంగా మారుతోందని ఢిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ నందిని సుందర్ అన్నారు. షెడ్యూల్డ్ ఏరియాలో ఆదివాసీల హక్కులను కాలరాయడం అత్యంత బాధాకరమన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మానవ హక్కుల వేదిక(హెచ్ఆర్ఎఫ్) ఆధ్వర్యంలో హక్కుల నాయకుడు కె.బాలగోపాల్ 16వ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా కె.బాలగోపాల్ రచించిన 'రాజ్యాంగాన్ని ఎలా చూడాలి'అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రొఫెసర్ నందిని సుందర్ మాట్లాడుతూ బస్తర్ ప్రాంతంలో ఖనిజాలను వారి ఇష్టానికి వ్యతిరేకంగా కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పడం సరికాదన్నారు. గత ఐదేళ్లలో విచ్చలవిడిగా సీఆర్‌పీఎఫ్ క్యాంపులను పెట్టి ఆదివాసీల హత్యకాండను కొనసాగిస్తోందని విచారం వ్యక్తం చేశారు. ఇది అన్యాయమైన చర్య అని, దీన్ని ఆపడం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేయాలని అన్నారు. ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ నాయకులు పీఎస్ అజయ్ కుమార్ మాట్లాడుతూ ఆధారాలు లేని భూమికి ప్రభుత్వం ఒక ట్రస్టీగా వ్యవహరించాల్సిందిపోయి యాజమానిగా మారి దాన్ని వ్యాపార సరుకుగా మారుస్తోందని విమర్శించారు. స్వరాజ్ అభియాన్ నాయకుడు యోగేంద్ర యాదవ్ మాట్లాడుతూ దేశంలో ఎన్నడూ లేని విధంగా ఒక వ్యక్తి తన ఐడెంటిటీని తానే నిరూపించుకోవాల్సిన పరిస్థితిని ఎన్నికల కమిషన్ కల్పించిందని, ఆ ఆధారాన్ని చూపకపోతే ఓటర్ల లిస్ట్ నుంచి తొలగించడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఇంటర్నెట్ ఫ్రీడమ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అపర్‌గుప్తా, మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్. జీవన్ కుమార్, డాక్టర్ ఎస్.తిరుపతయ్య, వేమన వసంతలక్ష్మీ, వై.రాజేష్, వీఎస్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, సోమవారం, 13, అక్టోబర్, 2025



సరదా అకేషన్.. కేరాఫ్ మెట్రో స్టేషన్..



ప్రయాణమే కాదు అంతకు మించి అంటున్న మెట్రోస్టేషన్లు

నగరంలోని మెట్రో స్టేషన్లు ఎంటర్‌టైన్‌మెంట్ కేంద్రాలుగా నిలుస్తున్నాయి. కేవలం ప్రయాణానికే కాదు.. షాపింగ్ నుంచి సాంస్కృతిక కార్యక్రమాల వరకూ అన్నింటా ముందుంటోంది. ఆహార కేంద్రాలు, ఫొటో బూత్‌లు వంటివి ప్రయాణికులకు ఆలంబనగా నిలుస్తున్నాయి. నచ్చిన రుచులను ఆస్వాదిస్తూ.. ఇష్టమైన బ్రాండ్స్‌ను కొనుగోలు చేస్తూ.. సరదాగా కాసేపు కాలక్షేపం చేయాలనుకునే వారికి వేదికలుగా నిలుస్తున్నాయి. ఫొటోలు దిగుతూ.. రుచికరమైన ఆహారాన్ని ఆస్వాదిస్తూ.. బ్రాండెడ్ ఉత్పత్తులు దొరికే స్టోర్స్, సంగీత ప్రదర్శనలు.. ఇవన్నీ ఒకే చోట దొరకాలంటే చాలా మందికి బహుశా నగరంలో పేరొందిన మాల్సే గుర్తుకొస్తాయేమో.. కానీ ఆ జాబితాలోకి మేం కూడా వస్తున్నాం అంటున్నాయి మెట్రో స్టేషన్స్.
- సాక్షి, సిటీబ్యూరో



* స్టాపింగ్ మాత్రమే కాదు జీవనశైలి కేంద్రాలుగానూ
* విందు, వినోదాల వేదికలుగా వర్ధిల్లుతున్న వైనం
* ప్రయాణికుల ప్రయారిటీలను మారుస్తున్న తీరు
* ఎంటర్ టైన్ మెంట్ వేదికలుగా మార్చే ప్రయత్నం
* అలరిస్తున్న పలు సాంస్కృతిక కార్యక్రమాలు



అమీర్‌పేట మెట్రో స్టేషన్ ప్రస్తుతం నగరంలోని రోజువారీ మెట్రో ప్రయాణికులకు పరిచయమైన ఒక ఏరియా స్టాప్ కంటే చాలా ఎక్కువ. దీని సందడికి మెట్రో ఇంటర్‌చేంజ్ దోహదం చేస్తుండగా మరోవైపు ఈ స్టేషన్ ఒక చిన్న తరహా అధునాతన జీవనశైలి కేంద్రంగా రూపాంతరం చెందుతోంది. ఇక్కడ జూడియో వంటి పేరొందిన ఫ్యాషన్ అవుట్‌లెట్స్, కేఎఫ్‌సీ, థిక్‌షేక్ ఫ్యాక్టరీ, సబ్‌వే వంటి ఆహార పదార్థాలు దొరికే ఫుడ్ కోర్ట్ స్పాట్‌ను తలపిస్తుంది. దీంతో పాటు గిఫ్ట్ స్టోర్స్, గ్రోసరీ షాప్స్ సైతం అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు, ఆఫీసులకు వెళ్లేవారు మాత్రమే కాదు పలువురు తమ కుటుంబాలతో కూడా ఇక్కడ తరచూ ఆగుతుంటాయి. ఇది ప్రయాణం కోసం మాత్రమే కాకపోవచ్చు ఓ సరదా సాయంత్రపు కాలక్షేపం కోసం, త్వరిత షాపింగ్ కోసం కూడా కావచ్చు.

ఫొటో బూత్ అదనపు అట్రాక్షన్..

ఈ స్టేషన్‌లో పెరుగుతున్న ఆకర్షణల జాబితాకు సరికొత్త హంగులు తోడవుతున్నాయి. ఈ ట్రాన్సిట్ జోన్‌ను ఆకస్మిక జ్ఞాపకాల ప్రదేశంగా మారుస్తోంది రెట్రో-శైలి ఫొటో బూత్. అమీర్‌పేట మెట్రో స్టేషన్‌లోని మొదటి అంతస్తులో ఉన్న ఇన్‌స్టా స్నాప్ ద్వారా కొత్తగా ఏర్పాటు చేసిన ఫొటోబూత్ ప్రయాణికులను జ్ఞాపకాలను కాపాడుకోడానికి ఆహ్వానిస్తోంది. స్కూల్స్, కాలేజీలకు వెళుతున్నా, పనికి వెళ్తున్నా లేదా తదుపరి రైలు కోసం వేచి ఉన్నా, రోజువారీ రద్దీ నుంచి రిఫ్రెష్ చేసే మరో దారి ఈ బూత్. సిబ్బంది అవసరం లేని ఈ ఫొటో బూత్ పూర్తిగా ఆటోమేటెడ్ పోలరాయిడ్-శైలి ఫొటో స్ట్రిప్‌లను కేవలం రెండు నిమిషాల్లో అందిస్తుంది. ఇంటర్‌ఫేస్ స్క్రీన్-గైడెడ్ చాలా సులభం. బటన్ ప్రెస్ చేయడం, ఫొటో స్టైల్ ఎంచుకోవడం, స్కాన్ చేసి చెల్లించడం.. ఆపై నాలుగు సరదా భంగిమలను ఎంజాయ్ చేయడం.. సోలో షాట్‌ల నుంచి జంట క్లిక్‌లు లేదా గ్రూప్ స్నాప్‌ల వరకూ ఈ బూత్ అమీర్‌పేట మెట్రో స్టేషన్‌లో సెల్ఫీ ప్రియులకు సందర్శనీయ ప్రదేశంగా మారుతోంది.

సోషల్ ఇన్‌స్టా జోన్లుగా..

ఫుడ్ కోర్టులు, షాపింగ్ కియోస్క్‌లు, గిఫ్ట్ స్టాల్స్, ఫ్యాషన్ అవుట్‌లెట్స్‌కు నిలయంగా ఉన్న అమీర్‌పేట్ మెట్రో స్టేషన్ ప్రస్తుతం సోషల్ మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ వేదికగా నిలుస్తోంది. ఇన్‌స్టా, ఫేస్‌బుక్, స్నాప్ చాట్ వంటి ఇంటరాక్టివ్ స్పాట్స్‌కు కేంద్రంగా నిలుస్తోంది. ముఖ్యంగా నగరంలోని యువత నిత్యం ఈ ప్రాంతం మీదుగా వెళ్లాల్సి రావడం, ఇది ఇంటర్ చేంజింగ్ స్పాట్ కావడం.. ప్రయాణీకుల టైంపాస్ కోసం ఏర్పాటు చేసిన వివిధ ఎంటర్‌టైన్మెంట్ వేదికలు కూడా దీనికి కారణాలుగా నిలుస్తున్నాయి. దీంతో ప్రజల కోసం మెట్రో స్టేషన్‌లో కల్పించే మౌలిక సదుపాయాలలోనూ వేగంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి.



ఈవెంట్స్ సైతం..

సిటీ మెట్రో స్టేషన్స్‌లో తరచూ సంగీతం, నృత్య ప్రదర్శనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. పరిమిత సంఖ్యలో కళాకారులను ఆహ్వానిస్తూ సంగీత దినోత్సవాలు వంటివి ఏర్పాటు చేస్తున్నారు. తద్వారా మెట్రో రైలు స్టాపులు ఇప్పుడు విందు, వినోద కేంద్రాలుగా అవతరిస్తున్నాయి.





ఫ్యాషన్‌కు కేరాఫ్ హైదరాబాద్..

- టాలీవుడ్ సింగర్ సునీత

సాక్షి, సిటీబ్యూరో: అధునాతన ఫ్యాషన్ హంగులను అనుసరించడం ఈతరం ట్రెండ్‌గా మారిందని ప్రముఖ టాలీవుడ్ సింగర్ సునీత ఉపద్రష్ట అన్నారు. జూబ్లీహిల్స్ రోడ్ నెం.66లో అతిన రీగల్ వీవ్స్ స్టోర్ ఆధ్వర్యంలో కొత్త షోరూంను ఆదివారం ప్రారంభించింది. ఈ స్టోర్‌ను గాయని సునీత ఉపద్రష్ట ఆవిష్కరించారు. హైదరాబాద్ నగరం అద్భుతమైన ఫ్యాషన్‌కు వేదికగా మారుతోందని, ఈ స్టోర్కు సిల్క్ మార్క్ సర్టిఫికెట్ రావటం గొప్ప విషయమని సునీత అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు స్వచ్ఛమైన పట్టు వస్త్రాలు అందించాలనే లక్ష్యంతో అతిన రీగల్ వీవ్స్ ప్రారంభించామని నిర్వాహకులు అనిత, లహరిక, మనశ్విని తెలిపారు.

రంగు రంగుల ప్రమిదలు..



బంజారాహిల్స్: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రమిదలతో పాటు బొమ్మల కొలువులు, వ్రతాలకు ఉపయోగించుకునే కుందుల తయారీలో మహిళలు నిమగ్నమయ్యారు. కుమ్మరి కళాకారులు సంప్రదాయబద్ధంగా చేతులతోనే ప్రమిదలతో పాటు కుందులు తయారుచేసి చక్కని డిజైన్లకు ఆకర్షణీయమైన రంగులు వేస్తూ మార్కెట్లోకి పంపిణీ చేస్తున్నారు. అమీర్‌పేటలోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వెనుక ఈ వృత్తి కళాకారులు, మహిళలు వీటి తయారీలో నిమగ్నమయ్యారు. కుందులకు, ప్రమిదలకు తగిన రంగులు అద్దుతూ ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దుతున్నారు. వీటిని మార్కెట్లో విక్రయించేందుకు పలువురు వ్యాపారులు ఆర్డర్లు ఇవ్వడంతో తమకు చేతినిండా పని దొరికిందని మహిళలు చెబుతున్నారు. వీటి తయారీ కోసం ఈ కుటుంబాలన్నీ ముఖ్యంగా మహిళలు నిమగ్నమయ్యారు. ప్రతియేటా దీపావళికి రెండు నెలల ముందు నుంచే వీటి తయారీపై దృష్టి పెడతామని కుమ్మరి శ్రీను తెలిపారు.



నగరంలో పెళ్లి సందడి..

* అక్టోబర్, నవంబర్‌లో భారీగా ముహూర్తాలు
* జోరుగా భాజా భజంత్రీల హడావుడి
* మాల్స్‌లో ఊపందుకున్న షాపింగ్ సందడి



నగరానికి పెళ్లి కళ వచ్చేసింది. అక్టోబర్, నవంబర్‌లో భారీగా ముహూర్తాలు ఉండడంతో పెళ్లి సందడి షురూ అయ్యింది. షాపింగ్ మాల్స్, వస్త్ర దుకాణాలు, బంగారం షాపులు కొనుగోలు దారులతో సందడి మారుతున్నాయి. రెండు నెలల పాటు పెద్ద సంఖ్యలో ముహూర్తాలు ఉండడం, ఆ తరువాత మూడు నెలల పాటు ఎలాంటి ముహూర్తాలు లేకపోవడంతో చాలా మంది ఈ రెండు నెలల్లోనే వివాహాలు జరిపించేందుకు ఆసక్తి చూపుతున్నారు. - సాక్షి, సిటీబ్యూరో



నగరంలో పెళ్లి సందడి మొదలైంది.. దీంతో నగరంలోని ఫంక్షన్ హాళ్లు, కమ్యూనిటీ హాళ్లు, హోటళ్లు, కల్యాణ మండపాలకు అనూహ్యంగా డిమాండ్ పెరిగింది. ఈ నెలలో ఇప్పటికే మొదటి వారంలో పెద్ద సంఖ్యలో వివాహ వేడుకలు జరిగాయి. అలాగే ఈ నెల 12వ తేదీ నుంచి నవంబర్ 27 వరకూ వరుస ముహూర్తాలు ఉన్నట్లు పురోహితులు చెబుతున్నారు. అక్టోబర్ 12 నుంచే హడావుడి మొదలైంది. దీంతో పాటు అక్టోబర్ 24, 26, 29, 30, 31 తేదీలు, నవంబర్ 7, 8, 15, 22, 26, 27 తేదీల్లో బలమైన ముహూర్తాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆ తరువాత నవంబర్ 28 నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకూ మూఢాలు ఉన్నట్లు చెప్పారు. అంటే నవంబర్ చివరి నుంచి డిసెంబర్, జనవరి నెలల్లో ఎలాంటి ముహూర్తాలు లేవు. ఇంచుమించు మూడు నెలల పాటు వివాహాలు జరిపేందుకు అవకాశం లేకపోవడంతో చాలామంది ఈ రెండు నెలల్లోనే తమ ఇళ్లల్లో భాజా భజంత్రీలు మోగించాలని భావిస్తున్నారు.

నగరంలో నిహారిక..

శరత్ సిటీ మాల్లో వర్ధమాన నటి సందడి





దేశంలో అగ్రగామి ఇన్ఫ్లుయెన్సర్ అయిన వర్ధమాన నటి నిహారిక ఎన్ఎం నగరంలోని శరత్ సిటీ మాల్లో ఆదివారం సందడి చేశారు. ప్రస్తుతం 'మిత్ర మండలి' సినిమాతో టాలీవుడ్‌లో హీరోయిన్‌గా అరంగేట్రం చేస్తూ తెలుగు ప్రేక్షకుల ముందుకు మరికొద్ది రోజుల్లో రానున్నారు. ఈ నేపథ్యంలో ప్రముఖ బ్రాండెడ్ ఫుట్ వేర్ బాటా నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సంస్థ తన కొత్త కలెక్షన్‌లో భాగంగా 'బ్రైటర్ మూమెంట్స్' పేరుతో కొత్త ప్రొడక్ట్‌ను శరత్ సిటీ క్యాపిటల్ మాల్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఇంటరాక్టివ్ గేమ్స్, పండుగ పోటీలు నిహారిక ఉత్సాహంగా పాల్గొన్నారు. అభిమానులతో సెల్ఫీలు దిగుతూ మీట్-అండ్-గ్రీట్ కార్యక్రమంలో పాల్గొన్నారు.
- సాక్షి, సిటీ బ్యూరో


తియ్యని వేడుకకు..

అదేదో వ్యాపార ప్రకటనలో చెప్పినట్లు.. 'తియ్యని వేడుక చేసుకుందామా' అనే పదం ఎంత తియ్యగా అనిపిస్తుందో.. అదే రీతిలో.. సమయం సందర్భం ఏదైనా.. అది మొదలయ్యేది మాత్రం 'తియ్యని వేడుక'తోనే.. ఇప్పుడీ సోదంతా ఎందుకంటే.. ప్రస్తుతం దీపావళి పండగ సమీపిస్తున్న నేపథ్యంలో స్వీట్స్‌కు ఉన్న ప్రాముఖ్యత వేరు. ఈ పండుగ సందర్భంగా ప్రతి ఒక్కరూ తియ్యటి గిఫ్ట్ ప్యాకింగ్స్ ఎంచుకుంటారు.. ప్రతీ ఇంటా వెలుగులు చిమ్మే ఈ దీపావళి సీజన్‌లో మనం చేసుకునేది కేవలం ఉత్సవం కాదు.. ఓ ఆత్మీయ కలయిక. స్నేహాన్ని బలపరుచుకోవడం, ఆనందాన్ని పంచుకోవడం అనే భావనల సమ్మేళనం. - సాక్షి, సిటీబ్యూరో

* దీపావళి నేపథ్యంలో మనం చాక్లెట్ ఉత్సవం
* గోదారి రుచులతో చాక్లెట్ ఖార్ఖానా..
* నగరంలోని చాక్లెట్ ప్రేమికుల కోసం 'ఉత్సవ టేబుల్'



దీపావళి నేపథ్యంలో నగరంలో స్వీట్లు, చాక్లెట్ల సందడి గురించి తెలిసిందే. అయితే ఈసారి పండుగకు పశ్చిమ గోదావరి జిల్లా కోకో తోటల నుంచి హైదరాబాద్ బంజారాహిల్స్ వరకూ సాగిన పంచదార రుచి కథలతో.. శ్రమ, కళ, ఫ్యాషన్ సమ్మిళిత చాక్లెట్ ఉత్సవాన్ని నగరవాసులకు పరిచయం చేస్తోంది మనం చాక్లెట్. ఈ సారి దీపావళి ఎడిషన్-2025లో భాగంగా మనం 'ఉత్సవ టేబుల్' అనే వినూత్న ఆలోచన చుట్టూ తన సృజనాత్మకతను విస్తరించింది. పంచుకోడానికి, రుచి చూడడానికి, ఆ అనుభూతిని పొందడానికి ఎన్నో మధుర క్షణాలను చాక్లెట్ రూపంలో అందించింది. పాశ్చాత్య శైలితో కాకుండా, భారతీయ భావనతో రూపొందిన ఈ కలెక్షన్‌లో ప్రతి డబ్బాలో గోదావరి కథలతో ఒక కొత్త అనుభవాన్ని పంచుతోంది.



వేగన్ స్టైల్‌లో..

మనం చాక్లెట్ ఖార్ఖానా భారతదేశంలోని మొదటి చాక్లెట్ బ్రాండ్. ఈ ఖార్ఖానాలో ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లాలో పండించిన చక్కటి రుచి గల కోకో బీన్స్‌తో తయారు చేసిన చాక్లెట్‌తో తయారు చేయబడిన 300 కంటే ఎక్కువ ఉత్పత్తులు నగరంలోని విభిన్న రుచులను ఆస్వాదించే చాక్లెట్ ప్రియులను అలరిస్తున్నాయి. డిజిటల్ ఆర్టిస్ట్ నమ్రతా కుమార్ సృష్టించిన ప్రత్యేక డిజైన్లు ఈ ప్యాకేజింగ్‌కి కొత్త ఉత్సవ రూపాన్ని ఇస్తున్నాయి. ఆమె చిత్రాలలో కేవలం వేడుక కాదు, సమాజం, భాగస్వామ్యం, ఆనందం అనే విలువలు ప్రతిబింబిస్తున్నాయి.

దీపావళి అనేది కేవలం వెలుగుల పండుగ కాదు, మనసులు దగ్గరయ్యే సందర్భం. ఆ భావనను మానం చాక్లెట్ తన ప్రత్యేక రుచులతో మరింత బలపరుస్తోంది. ఇండో-అమెరికన్ రుచులతో తయారు చేస్తున్న ఈ చాక్లెట్స్ ప్రత్యేకమైన వేగన్ స్టైల్‌లో తయారు చేశారు. ఈ చాక్లెట్స్ ఆరోగ్యకరమైన సమ్మేళనాలతో ఏ వయసు వారైనా ఇష్టంగా తినగలిగే విధంగా రూపొందించారు. ఈ ఎడిషన్‌లో డార్క్‌చాక్లెట్-ఆరెంజ్ క్లస్టర్స్, గుంటూరు మిర్చి-డ్రింకింగ్ చాక్లెట్ మిక్స్, సీ సాల్ట్ స్ప్రింకిల్ థిన్స్, గోదావరి కోకో నిబ్స్ థిన్స్, నట్టీ ప్రాలిన్ బార్క్స్, పిస్తా ఫడ్జ్ ఇన్‌క్లూజన్ టాబ్లెట్, ఇండియన్ ఆరిజిన్ టాబ్లెట్ నెం.6 వంటి ప్రత్యేక ఉత్పత్తులు ఉన్నాయి.

ఊరూరా బెల్ట్‌షాపులు

ఏపీ వ్యాప్తంగా 75 వేలకు పైగానే..

రూ.లక్ష మొదలు రూ.9 లక్షల వరకు వేలంపాటలు





ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ మద్యం బాటిళ్లు (ఫైల్)

కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గం నాగాయలంక మండలంలో సొర్లగొంది గ్రామంలో బెల్ట్‌షాపు రూ.9 లక్షలు పలికింది. అదే జిల్లా చల్లపల్లి మండలం మాజేరులో 3,998 జనాభా ఉండగా, ప్రతి 333 మందికి ఒకటి చొప్పున ఇక్కడ 12 బెల్టు షాపులున్నాయి. కృష్ణాజిల్లాలో 1,589 బెల్ట్ షాపులు, ఎన్టీఆర్ జిల్లాలో 1,135 ఉన్నాయి. అంటే టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో మద్యం ఏ విధంగా ఏరులై పారుతోందో అర్థం చేసుకోవచ్చు. ఇదే తరహాలో అన్ని జిల్లాల్లోనూ బెల్ట్ షాపులు పెట్టి నకిలీ మద్యం భారీగా అమ్మినట్టు ప్రచారం జరుగుతోంది.

సాక్షి ప్రతినిధి, విజయవాడ: రాష్ట్రంలో బయటపడ్డ నకిలీ మద్యం స్కామ్ దేశవ్యాప్తంగా ప్రకంపనలు రేపుతోంది. పచ్చముఠాల అండదండలతో రాష్ట్రంలో ఒక పరిశ్రమ తరహాలో నకిలీ మద్యం తయారీ రాకెట్ విస్తరించింది. అన్నమయ్య జిల్లా ములకల చెరువులో బయటపడ్డ నకిలీ మద్యం దందా ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం దాకా పాకింది. ఈ ముఠా తయారు చేసిన నకిలీ మద్యం బెల్ట్ షాపుల ద్వారా విక్రయించారని సమాచారం. వాస్తవానికి ప్రభుత్వమే విచ్చలవిడిగా ఊరూరా బెల్ట్ షాపులు ఏర్పాటుకు గేట్లు బార్లా తెరిచింది. మద్యం షాపులన్నింటిని టీడీపీకి చెందిన నియోజకవర్గ ప్రజాప్రతినిధులే దక్కించుకొన్నారు. అరకొరగా డ్రాలో ఇతరులకు దక్కినా నయానో భయానో బెదిరించి తమ ఖాతాలో వేసుకున్నారు. దీంతో మద్యం షాపులు నియోజకవర్గ ప్రజాప్రతినిధి కనుసన్నల్లో సాగుతుండగా... రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో 75వేలకు పైగా బెల్ట్‌షాపులను టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు నడుపుతున్నారు. ఓ గ్రామంలో 10 నుంచి 12 పైగా బెల్ట్ షాపులు ఉన్నాయంటే మద్యం ఎలా ఏరులై పారుతోందో అర్థం చేసుకోవచ్చు. ఉదాహరణకు కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం మాజేరు పంచాయతీలో 3,998 జనాభా ఉండగా, ప్రతి 333 మందికి ఒకటి చొప్పున ఇక్కడ 12 బెల్టు షాపులున్నాయి. అదే జిల్లా నాగాయలంక మండలంలో సొర్లగొంది గ్రామంలో బెల్ట్ షాపు రూ.9 లక్షలు పలికింది. కనీసం నాలుగైదు వేల జనాభా కూడా లేని ఊళ్లలో ఒక్కో బెల్ట్ షాపు పెట్టుకోవడానికి 9 లక్షల రూపాయల వరకు వేలంపాట పాడారంటే ఏమనుకోవాలి? అంత చిన్న ఊళ్లలో ఎంత మద్యం అమ్మితే అంత డబ్బు తిరిగి రావడంతోపాటు అదనంగా లాభాలు వస్తాయి? ఏ మేరకు లాభాలు వస్తాయో... ఎలా వస్తాయో.. సదరు టీడీపీ నేతలు వేలం పాట పాడిన వారికి ముందే చెప్పారా? ఈ లెక్కన 'నకిలీ' మద్యం అమ్మకాలు ఉంటాయని, తద్వారానే భారీ లాభాలు మూటకట్టుకోవచ్చని ఉప్పందించారని తెలియడం లేదా? అందుకేగా ఇదివరకెన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో బెల్ట్‌షాపుల కోసం వేలం పాటలు పెట్టడం చూసి విస్తుపోయాం. ఇప్పుడు ఆచరణలో అమలవుతున్నది ఆ నకిలీ దందానే.

కింది నుంచి పైదాకా అందరికీ వాటాలు

- ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం తయారీ వ్యవహారం అంతా టీడీపీ పెద్దల కనుసన్నల్లోనే సాగినట్లు జోరుగా చర్చ సాగుతోంది. విజయవాడకు కూతవేటు దూరంలో ఇంత పెద్ద నకిలీ మద్యం డంపు నడిచిందంటే, టీడీపీ ప్రజాప్రతినిధులకు తెలియకుండా ఈ వ్యవహారం జరగదనే భావనను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.
- మైలవరం నియోజకవర్గంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధికి, అతని బావమరిదికి తెలియకుండా చీమ కూడా చిటుక్కుమనదని చెబుతున్నారు. ఇసుక, మట్టి, బూడిద, మద్యం వ్యాపారం అంతా వారి కనుసన్నల్లోనే జరుగుతుందని.. అలాంటప్పుడు ఈ నకిలీ మద్యం తయారీ వ్యవహారం వీరి అండ లేకుండా జనార్దన్‌రావు ఒక్కడే చేయటం సాధ్యం కాదని స్పష్టం చేస్తున్నారు. పార్లమెంటు ప్రజాప్రతినిధికి కూడా వాటాలు లేకుండా వ్యాపారం చేయలేరని స్థానికులు చెబుతున్నారు.
- వీరితో పాటు ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా మద్యం సిండికేట్‌లో ప్రధాన భూమిక పోషిస్తున్న పలువురు టీడీపీ నేతల హస్తం కూడా ఉందని ఎక్సైజ్ శాఖ అధికారి ఒకరు తెలిపారు. పలు మద్యం షాపుల వద్ద మాన్యువల్‌గా పేపరు మీద రాసుకున్న స్టాకు వివరాల లెక్కలు ఒకసారి పరిశీలిస్తే రోజుకు ఎంత నకిలీ మద్యం అమ్మింది తేలనుంది. మద్యం డిపో నుంచి తెచ్చిన సరుకును బార్లకు తరలించి, పలుచోట్ల నకిలీ మద్యమే షాపుల్లో విక్రయించారని పలువురు స్పష్టం చేస్తున్నారు.
- కాగా, పట్టుబడిన నకిలీ మద్యంకు సంబంధించిన కేసు విచారణ ముఖ్యనేత డైరెక్షన్‌లో సాగుతుండటం గమనార్హం. ఈ వ్యవహారంలో ముఖ్య నేతలకు వాటాలు ఉండటంతో పాటు ప్రభుత్వ ప్రతిష్ట మసక బారడంతో కేసు తీవ్రతను తగ్గించి చూపేందుకు ప్రభుత్వం నానా తంటాలు పడుతోంది. ఇందుకు ప్రజల ఆరోగ్యాన్ని ఫణంగా పెడుతుండటం దుర్మార్గం.

టీడీపీ నాయకుల్లో అలజడి

ఏడాదిన్నరగా గుట్టుగా సాగిన నకిలీ మద్యం వ్యవహారం బట్టబయలు కావడంతో టీడీపీ నాయకులు బెంబేలెత్తుతున్నారు. ఏడాదిగా రాష్ట్రవ్యాప్తంగా బెల్ట్ షాపులు ఊరూరా పుట్టగొడుగుల్లా వెలిశాయి. తక్కువ ధరకు దొరికే నకిలీ బ్రాండ్ల మద్యం అమ్మకాలే ఈ బెల్ట్ షాపుల్లో ఎక్కువగా జరిగినట్లు సమాచారం. నకిలీ మద్యం అమ్మకాల ద్వారా పేదల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఈ మద్యం తాగిన పలువురు అనారోగ్యం బారిన పడుతున్నారు. దీంతో నకిలీ మద్యం గుట్టు రట్టు కావడంతో, ఈ మద్యం తాగినవారు బెంబేలెత్తుతున్నారు. ప్రముఖ బ్రాండ్ల పేరుతో ఎక్కువగా నకిలీ మద్యం తయారు చేసి విక్రయించినట్లు తనిఖీల్లో వెలుగు చూసిన ఆధారాలను బట్టి తెలుస్తోంది. పేదలు ఎక్కువగా తాగే రూ.99, రూ.130 లాంటి రకాల నకిలీ మద్యం తయారీపైనే సిండికేట్ దృష్టి సారించినట్లు ఎక్సైజ్ అధికారుల విచారణలో తేలింది. మరోవైపు విజయవాడ కేంద్రంగా కూడా ఈ నకిలీ మద్యం వ్యాపారం జోరుగా సాగిందని పోలీసు, ఎక్సైజ్ శాఖల అధికారులు చెబుతున్నారు. ఉదాహరణకు ఎన్టీఆర్ జిల్లాలో 1,135, కృష్ణా జిల్లాలో 1,589 బెల్ట్ షాపులు ఉన్నాయి. అంటే గ్రామాల్లో మద్యం ఏ విధంగా ఏరులై పారుతోందో ఇట్టే తెలిసిపోతోంది. ప్రభుత్వ నియంత్రణ ఉంటే ఇన్ని బెల్ట్ షాపులు ఎలా పుట్టుకొచ్చాయని సామాజికవేత్తలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. బెల్ట్ షాపులకు ప్రభుత్వమే తలుపులు బార్లా తెరిచిందని చెబుతున్నారు. సాక్షాత్తూ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో ఈ పరిస్థితి ఉంటే, మిగతా జిల్లాల్లో ఎంత దారుణమైన పరిస్థితులు ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. బెల్ట్ షాపులను అధికారులు తనిఖీ చేసిన పాపాన పోవటం లేదు. కరకట్ట బంగ్లా మొదలు టీడీపీ పార్లమెంటు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు, ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలకు వారి స్థాయిని బట్టి ముడుపులు ముట్టడమే ఇందుకు కారణమని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నాణ్యమైన మద్యం సరఫరా చేస్తామని ఎన్నికల సమయంలో బురిడీ కొట్టించి, నకిలీ మద్యం అంటగట్టారని మందు తాగే వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో నకిలీ మద్యం తయారీ వెనుక పార్లమెంట్, మైలవరం నియోజకవర్గ ప్రజాప్రతిధుల పాత్ర ఉన్నట్లు జోరుగా చర్చ సాగుతోంది.

గుట్టు రట్టుతో గుభేల్..

నకిలీ మద్యం గుట్టు రట్టు కావడం.. ఇప్పటికే ప్రభుత్వ ప్రతిష్ట పూర్తిగా దిగజారడంతో దీని నుంచి దృష్టి మళ్లించేందుకు టీడీపీ పెద్దలు నానా పాట్లు పడుతున్నారు. అద్దేపల్లె జనార్దనరావుతో పాటు ఆయన సోదరుడు, మరి కొందరు మాత్రమే నకిలీ మద్యం తయారీదారులుగా చూపించి సూత్రధారులు సురక్షితంగా బయట పడేందుకు ఎత్తుగడలు వేస్తున్నారు. కరకట్ట బంగ్లా పాత్రను కప్పిపుచ్చే యత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. అద్దేపల్లె జనార్దనరావు లొంగుబాటు ఓ పథకం ప్రకారమే జరిగినట్లు ఎక్సైజ్ వర్గాల్లోనే చర్చ సాగుతోంది.

క్లుప్తంగా...

ప్రధాని ఉమ్మడి కర్నూలు పర్యటన షెడ్యూల్ ఖరారు

నల్లమలలో పోలీసుల విస్తృత కూంబింగ్

కర్నూలు కల్చరల్/మార్కాపురం: ప్రధాని మోదీ ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈనెల 16న పర్యటించనున్నారు. ఈ పర్యటన షెడ్యూల్‌ను అధికారులు ఆదివారం విడుదల చేశారు. 16న ఉదయం 10.20 గంటలకు ప్రధాని కర్నూలు విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి సుండిపెంట హెలిప్యాడ్‌కు..ఆ తరువాత రోడ్డు మార్గం ద్వారా భ్రమరాంబ గెస్ట్‌హౌస్‌కు వెళతారు. 11.45 గంటలకు శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానానికి చేరుకుంటారు. దర్శనానంతరం తిరిగి అదే గెస్ట్‌హౌస్‌కు వెళతారు. మధ్యాహ్నం అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా సుండిపెంట హెలిప్యాడ్‌కు బయలుదేరుతారు. అక్కడి నుంచి కర్నూలు హెలిప్యాడ్‌కు వెళతారు. అనంతరం రోడ్డు మార్గం ద్వారా రాగమయూరి గ్రీన్ హిల్స్ సభా స్థలానికి చేరుకుంటారు. దాదాపు 2 గంటలపాటు కర్నూలులో వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపన, పలు ప్రాజెక్టులను జాతికి అంకితం చేయడం చేస్తారు. అనంతరం రోడ్డు మార్గం ద్వారా కర్నూలు హెలిప్యాడ్‌కు అక్కడి నుంచి కర్నూలు విమానాశ్రయానికి వెళతారు. 4.45 గంటలకు కర్నూలు ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రత్యేక విమానం ద్వారా ఢిల్లీకి బయలుదేరుతారు.కాగా, ప్రధాని పర్యటన నేపథ్యంలో ప్రత్యేక పోలీసు బలగాలు అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టాయి. ఆత్మకూరు నుంచి దోర్నాల, దోర్నాల– శ్రీశైలం అటవీ ప్రాంతంలో ప్రత్యేక పోలీసు దళాలు అణువణువూ గాలిస్తున్నాయి.

78వ సారి హైదరాబాద్‌కు లోకేశ్

సాక్షి, హైదరాబాద్: ఏపీ మంత్రి నారా లోకేశ్ కూడా తన తండ్రి, సీఎం చంద్రబాబు బాటలోనే పయనిస్తున్నారు. శనివారం వచ్చిందంటే చాలు ఆంధ్రాను వదిలి హైదరాబాద్‌లో వాలిపోతున్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు గన్నవరం విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు 77సార్లు ప్రయాణించిన లోకేశ్... తాజాగా 78వ సారి హైదరాబాద్‌కు వచ్చి, వెళ్లారు. లోకేశ్ తరచూ హైదరాబాద్‌కు వచ్చి, వెళుతుండడంపై టీడీపీ కూటమి, సోషల్ మీడియాలో తీవ్ర చర్చ సాగుతోంది. 'డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఒక్కరే కాదు.. మొత్తం ఏపీ కేబినెట్ అంతా పక్క రాష్ట్రంలో నివాసం.. విశాఖలో డేటా సెంటర్ శంకుస్థాపనకు పక్క రాష్ట్రం నుంచి మంత్రి నారా లోకేశ్ వచ్చారు...' అంటూ సోషల్ మీడియాలో సెటైర్లు వైరల్ అవుతున్నాయి. అధికారంలోకి వచ్చాక సగటున వారానికి ఒకసారి లోకేశ్ హైదరాబాద్‌కు వెళ్లి సరదాగా గడిపినట్లు సోషల్ మీడియాలో సెటైర్లు పేలుతున్నాయి. గతేడాది ఆగస్టు 31న బుడమేరు వరద విజయవాడను చుట్టుముట్టి విలయం సృష్టించి, అపార ఆస్తి, ప్రాణనష్టం జరిగినప్పుడు కూడా లోకేశ్ హైదరాబాద్, ముంబైలో ఉన్నారని ప్రజలు ఎత్తి చూపుతున్నారు. 2014–19 మధ్య టీడీపీ కూటమి అధికారంలో ఉన్నప్పుడు కూడా లోకేశ్ ఇదే రీతిలో వ్యవహరించేవారని గుర్తు చేస్తున్నారు. 2019లో టీడీపీ అధికారం కోల్పోయాక మూడేళ్లపాటు ఏపీకి వచ్చింది వేళ్లపై లెక్కపెట్టవచ్చని పేర్కొంటున్నారు. పాదయాత్ర, ఎన్నికల ప్రచార సమయంలో మినహా లోకేశ్ మిగతా రోజుల్లో హైదరాబాద్‌కే పరిమితమయ్యారని టీడీపీ నేతలే చెబుతున్నారు.

ఐఐఎస్‌సీ బెంగళూరుదే అగ్రస్థానం

- టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ వరల్డ్ వర్సిటీ ర్యాంకింగ్స్ విడుదల
- దేశంలో మరోసారి అగ్రస్థానాన్ని నిలుపుకున్న ఐఐఎస్‌సీ–బెంగళూరు
- అమెరికా తర్వాత అత్యధిక ర్యాంకులు సాధించిన భారత విద్యాసంస్థలు
- ప్రపంచ టాప్ వర్సిటీగా వరుసగా పదో ఏడాది యూకే సంస్థ ఆక్స్‌ఫర్డ్ రికార్డు
- గతంతో పోలిస్తే అత్యుత్తమ ర్యాంకులు కోల్పోయిన యూఎస్ సంస్థలు
- యూకే విశ్వవిద్యాలయాలకు మిశ్రమ ఫలితాలే

సాక్షి, అమరావతి: టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ వరల్డ్ వర్సిటీ ర్యాంకింగ్స్–2026లో బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) దేశంలోనే అగ్రశ్రేణి యూనివర్సిటీగా తన స్థానాన్ని నిలబెట్టుకుంది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 201–250 ర్యాంక్ బ్యాండ్‌లో వరుసగా మూడో ఏడాది కొనసాగుతోంది. తాజా జాబితాలో ప్రపంచంలో అత్యధికంగా విశ్వవిద్యాలయాలు ర్యాంకులు పొందిన దేశాల్లో అమెరికా తర్వాత భారత్ రెండో స్థానానికి చేరుకోవడంవిశేషం. ఇక చెన్నైకి చెందిన సవిత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ టెక్నికల్ సైన్సెస్ 401–500 బ్యాండ్ నుంచి 351–400 ర్యాంకులకు ఎగబాకి దేశంలో రెండో స్థానం దక్కించుకుంది. తెలుగు రాష్ట్రాల్లో అనంతపురం జేఎన్‌టీయూ, హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీలు 1001–1200 బ్యాండ్‌లో, ఐఎఫ్‌హెచ్‌ఈ–హైదరాబాద్, ఉస్మానియా వర్సిటీలు 1201–1500 బ్యాండ్‌లో, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీలు 1501 ప్లస్ బ్యాండ్ ర్యాంకుల్లో కొనసాగుతున్నాయి. వీటితో పాటు మరో నాలుగు ప్రైవేటు సంస్థలు కూడా ఉన్నాయి.

దేశీయ సంస్థలు స్థానాలు ఇలా..

జామియా మిలియా ఇస్లామియా (ఢిల్లీ), షూలిని వర్సిటీ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ (బజోల్, హిమాచల్‌ప్రదేశ్) 401–500 కేటగిరీలోను, బనారస్ హిందూ వర్సిటీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇండోర్, కేఐఐటీ వర్సిటీ (భువనేశ్వర్), లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ (ఫగ్వారా, పంజాబ్), మహాత్మాగాంధీ వర్సిటీ (కొట్టాయం, కేరళ), యూపీఈఎస్ (డెహ్రాడూన్) 501–600 కేటగిరీలో ర్యాంక్‌లు పొందాయి. 601–800 బ్యాండ్‌లో 15కుపైగా భారతీయ సంస్థలు నిలిచాయి. వాటిల్లో అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయం, అమిటీ విశ్వవిద్యాలయం (నోయిడా), భారతీయార్ విశ్వవిద్యాలయం (కోయంబత్తూర్), సెంట్రల్ వర్సిటీ ఆఫ్ పంజాబ్ (భటిండా), చిత్కరా విశ్వవిద్యాలయం (చండీగఢ్), గ్రాఫిక్ ఎరా విశ్వవిద్యాలయం (డెహ్రాడూన్), ఐఐటీ పాట్నా, ట్రిపుల్ ఐటీ హైదరాబాద్, మాలవ్య నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (జైపూర్), మణిపాల్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, ఎన్‌ఐటీ రూర్కెలా, పంజాబ్ విశ్వవిద్యాలయం (చండీగఢ్), శారదా విశ్వవిద్యాలయం (గ్రేటర్ నోయిడా), సింబయాసిస్ ఇంటర్నేషనల్ విశ్వవిద్యాలయం (పూణే), థాపర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ (పాటియాలా), ఢిల్లీ విశ్వవిద్యాలయం, విట్ విశ్వవిద్యాలయం (వెల్లూరు) ఉన్నాయి.

ఆక్స్‌ఫర్డ్ పదో ఏడాది టాప్‌లోనే..

యూకేకు చెందిన టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ వరల్డ్ వర్సిటీ ర్యాంకింగ్స్ 2026లో 115 దేశాలు నుంచి 2,191 సంస్థలు నిలిచాయి. ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ వరుసగా 10వ ఏడాది కూడా ప్రపంచంలోనే అగ్రశ్రేణి వర్సిటీగా నిలిచింది. ఆక్స్‌ఫర్డ్‌లోని పరిశోధన వాతావరణం కారణంగా ప్రపంచ అగ్రశ్రేణి వర్సిటీగా ఎదురులేకుండా కొనసాగుతోంది. చైనా టాప్–200లో 13 విశ్వవిద్యాలయాలను కొనసాగిస్తూ.. మూడో ఏడాది స్థిరంగా ఉంది. అక్కడ సింఘువా విశ్వవిద్యాలయం వరుసగా మూడవ సంవత్సరం 12వ స్థానంలో నిలవగా, పెకింగ్ విశ్వవిద్యాలయం ఒక స్థానం ఎగబాకి 13వ స్థానానికి చేరుకుంది. నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ మెరుగుదల లేకుండా 17వ స్థానంలో నిలిచింది. 2012 తర్వాత ఈ సంస్థలు తమ ర్యాంక్‌లను మెరుగుపరుచుకోకపోవడం గమనార్హం.

టాప్–10లో ఏడు అమెరికా సంస్థలు

టాప్–10లో అమెరికా విశ్వవిద్యాలయాలు ఆధిపత్యం చెలాయిస్తూ 10లో ఏడు స్థానాలను సొంతం చేసుకున్నాయి. అంతేస్థాయిలో క్షీణతను కూడా ఎదుర్కొంటున్నట్టు నివేదిక స్పష్టం చేసింది. మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) ప్రపంచంలో రెండవ స్థానంలో ఉంది. అమెరికాకు చెందిన ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయం, యూకేకు చెందిన కేంబ్రిడ్జి వర్సిటీతో ఉమ్మడిగా మూడవ స్థానంలో కొనసాగుతోంది. అమెరికాలో గత సంవత్సరంతో పోలిస్తే టాప్–20లో ఆరు వర్సిటీలు తగ్గిపోయాయి. టాప్ 100లో 38 నుంచి 35కి పడిపోయాయి. టాప్ 500లో మొత్తం అమెరికా సంస్థల సంఖ్య 102 కాగా.. ఇది రికార్డు స్థాయిలో అత్యల్పమని నిపుణులు పేర్కొంటున్నారు. ఏకంగా 25 అమెరికా విశ్వవిద్యాలయాలు వాటి అత్యల్ప స్థానాలకు పడిపోయాయి. వాటిలో చికాగో విశ్వవిద్యాలయం (15వ స్థానం), కొలంబియా విశ్వవిద్యాలయం (20వ స్థానం), డ్యూక్ విశ్వవిద్యాలయం (28వ స్థానం) ఉన్నాయి. యూకేలో ఆక్స్‌ఫర్డ్ మొదటి స్థానంలో ఉండగా, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం మూడవ స్థానాన్ని పంచుకుంది. ఇంపీరియల్ కాలేజీ లండన్ 8వ స్థానంలో ఉంది. యూకే సంస్థలు మిశ్రమ ఫలితాలను చూపించాయి.

'సాక్షి'పై ఏపీ సర్కారు కక్ష సాధింపు

▶ మొదటి పేజీ తరువాయి

రాలిపోతున్న ప్రజల ప్రాణాలకు రక్షణ ఏదని ప్రశ్నించడాన్ని జీర్ణించుకోలేపోతోంది. నకిలీ మద్యంపై వార్తలు ప్రచురించినందుకు.. ఎడిటర్‌కు నోటీసుల పేరుతో విజయవాడలోని 'సాక్షి' ప్రధాన కార్యాలయంలో ఆదివారం తెల్లవారుజామున పోలీసుల దాష్టీకానికి దిగారు. నకిలీ మద్యం దారుణాలను కప్పిపుచ్చేందుకే సాక్షి ఎడిటర్, విలేకరులపై కూటమి సర్కారు అక్రమ కేసులు బనాయిస్తోంది. ఎన్నికల హామీలను ఎగ్గొట్టడమే కాకుండా ఘోర పాలనా వైఫల్యాలపై ప్రజల పక్షాన, ప్రజా గొంతుకగా నిలదీస్తున్న సాక్షిపై అక్రమ కేసులతో దాడికి తెగబడుతోంది. అధికార పీఠం ఎక్కింది మొదలు పోలీసులను ఉసిగొల్పుతూ.. యథేచ్ఛగా అక్రమ కేసులు బనాయిస్తూ రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతోంది. ప్రతికా స్వేచ్ఛ.. భావ ప్రకటన స్వేచ్ఛకు అర్థాన్ని విస్మరించి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అనుసరిస్తూ కక్షసాధింపులకు బరితెగిస్తోంది. ప్రాథమిక హక్కులకు సైతం సంకెళ్లు వేసిన ఎమర్జెన్సీ నాటి దురాగతాలను తలదన్నేలా వ్యవహరిస్తోంది.

దేశాన్ని కుదిపివేసిన నకిలీ మద్యం..

ఆంధ్రప్రదేశ్‌లో నకిలీ మద్యం బాగోతం బయటపడటం.. అధికార టీడీపీకి చెందిన, అందులోనూ ముఖ్యనేతతో అత్యంత సన్నిహితంగా ఉండే వ్యక్తులే సూత్రధారులని బహిర్గతం కావడం యావత్తు దేశాన్ని కుదిపి వేసింది. ఈ ఘటనపై నిరంతరం ప్రజలను అప్రమత్తం చేస్తూ కథనాలు ప్రచురిస్తున్న సాక్షిని ఎలాగైనా అడ్డుకోవాలనే దుర్బుద్ధితో టీడీపీ కూటమి సర్కారు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోంది. 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయ రెడ్డి, నెల్లూరు జిల్లా విలేకరులపై నెల్లూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో బనాయించిన అక్రమ కేసులే ప్రభుత్వ కుట్రకు నిదర్శనం. అక్రమ కేసును అడ్డుపెట్టుకుని ఆదివారం తెల్లవారకముందే విజయవాడ ఆటోనగర్‌లోని 'సాక్షి' ప్రధాన కార్యాలయంలో పోలీసులు హల్‌చల్ చేశారు. గేట్లు తెరవకముందే తెల్లవారుజాము 5 గంటల నుంచి 9 గంటల వరకు అరాచకం సృష్టించారు.

సోదాల పేరిట ఇళ్లలోకి దౌర్జన్యంగా చొరబడి..

ప్రభుత్వ పెద్దల డైరెక్షన్‌లో అక్రమ కేసు నమోదు చేసిన వెంటనే నోటీసుల పేరుతో సాక్షి కార్యాలయాల్లో పోలీసులు దాడికి తెగబడ్డారు. విజయవాడ ఆటోనగర్‌లోని సాక్షి ప్రధాన కార్యాలయంలో వీరంగం వేశారు. కార్యాలయం తాళాలు కూడా తెరవక ముందే నోటీసులు తీసుకోవాలంటూ భయానక వాతావరణాన్ని సృష్టించారు. ఇక కలిగిరిలో మరో అక్రమ కేసు పెట్టడమే కాకుండా సోదాల పేరిట ఏకంగా విలేకరుల ఇళ్లలోకి దౌర్జన్యంగా చొరబడి భయభ్రాంతులకు గురి చేశారు. నకిలీ మద్యాన్ని అరికట్టాల్సిన పోలీసులు.. దీనిపై కథనాలు రాసిన విలేకరులకు నోటీసులు ఇవ్వడం కూటమి కక్షసాధింపులకు పరాకాష్టగా నిలుస్తోంది.

ఆది నుంచి 'సాక్షి' ఒక్కటే టార్గెట్..

ప్రజల పక్షాన గొంతుకగా నిలుస్తున్న సాక్షిపై చంద్రబాబు ప్రభుత్వం ఆది నుంచి అక్రమ కేసులు బనాయించి వేధిస్తోంది. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో పోలీసులను అడ్డుపెట్టుకుని యథేచ్ఛగా ప్రజాస్వామ్య హక్కులు, విలువలను కాలరాస్తోంది. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టిన ప్రతిసారి ఎక్కడో చోట.. సంబంధం లేని వ్యక్తులతోనూ ఫిర్యాదు చేయించి సాక్షిపైకి పోలీసులను ఉసిగొల్పుతోంది. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుల్లో– అత్యంత ప్రధానమైన ఆర్టికల్ 19 (1) (ఏ) ప్రకారం దక్కిన భావ ప్రకటనా స్వేచ్ఛను హరిస్తూ.. పత్రికా స్వేచ్ఛపై దాడికి తెగబడుతూ దుస్సాహసానికి పాల్పడుతోంది. ఈ అక్రమ కేసులను న్యాయస్థానాలు తప్పుబడుతున్నా చంద్రబాబు సర్కారు తీరు మాత్రం మారట్లేదు. పత్రికలు, మీడియా, సోషల్ మీడియాలో భావ ప్రకటన విషయంలో అందే ఫిర్యాదులకు సంబంధించి కేసుల నమోదు విషయంలో పాటించాల్సిన ప్రమాణాలపై పోలీసు శాఖతోపాటు జిల్లా మేజిస్ట్రేట్లకు హైకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు నిర్దేశించింది. అయినప్పటికీ రాష్ట్ర పోలీసు శాఖ మాత్రం టీడీపీ పెద్దలకు జీహుజూర్ అనడానికి మాత్రమే పరిమితమైనట్లు కనిపిస్తోంది. ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతిని ఎండగడుతున్న ''సాక్షి''ని అక్రమ కేసులతో వేధించడమే విధానంగా మార్చుకున్నారు.

నెల్లూరు బ్యూరో ఇన్‌చార్జికి నోటీసు

ఎక్సైజ్ అధికారులతో వరుసగా వివిధ పోలీసు స్టేషన్లలో ఫిర్యాదులు ఇప్పిస్తూ.. పాత్రికేయులను టెర్రరిస్టుల మాదిరిగా చిత్రీకరిస్తూ, చంద్రబాబు సర్కారు అత్యంత జుగుప్సాకరంగా వ్యవహరిస్తోంది. తమ ఎదుట విచారణకు హాజరు కావాలంటూ నెల్లూరు సాక్షి బ్యూరో ఇన్‌చార్జి చిలకా మస్తాన్‌రెడ్డికి తాజాగా పోలీసులు అర్ధరాత్రి సమయంలో ఆయన ఇంటికి చేరుకుని నోటీసులు ఇచ్చారు. అయ్యప్ప మాల ధారణలో ఉన్న ఆయన్ను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ పొద్దున్నే విచారణకు హాజరు కావాలని ఆదేశించారు.

అద్దేపల్లి ఫోన్ అదృశ్యం

- నకిలీ మద్యంలో సాక్ష్యాలను కనుమరుగు చేసే కుట్ర
- టీడీపీ పెద్దలతో లింకులు, ఆర్థిక లావాదేవీల సమాచారం అందులోనే..



సాక్షి ప్రతినిధి, విజయవాడ: నకిలీ మద్యం కేసులో కరకట్ట బంగ్లా డైరెక్షన్‌తో సాక్ష్యాలను కనుమరుగు చేసే కుట్రలు ముమ్మరమయ్యాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడు అద్దేపల్లె జనార్దనరావుకు టీడీపీ పెద్దలతో లింకులు ఉన్నట్లు బహిర్గతం కావడంతో తమ పేర్లు ఎక్కడ బయటికి వస్తాయోనని ముఖ్యనేతలు హడలిపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నకిలీ మద్యం తయారీ కుటీర పరిశ్రమ తరహాలో విస్తరించిన నేపథ్యంలో జనార్దనరావు నోరు తిప్పితే తమ కొంప కొల్లేరు అవుతుందని ముఖ్యనేతలు ఆందోళన చెందుతున్నారు. నకిలీ మద్యం వెలుగులోకి రావడంతో ప్రభుత్వ ప్రతిష్ట పూర్తిగా మసకబారింది. ఈ నేపథ్యంలో టీడీపీ పెద్దలే నేరుగా రంగంలోకి దిగారు. జనార్దనరావు తమ డైరెక్షన్‌లో లొంగిపోయేలా డ్రామాకు తెర తీశారు. ప్రధానంగా నకిలీ మద్యం వ్యవహారంలో కరకట్ట బంగ్లాకు నెలవారీగా రూ.కోట్లాది ముడుపులు వెళ్లినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో ప్రధాన నిందితుడు అద్దేపల్లె జనార్దనరావు ఫోన్ తాజాగా అదృశ్యమైంది. జనార్దనరావును అరెస్టు చేసిన తరువాత ఫోన్ గురించి పోలీసులు ఆరా తీయగా ఆఫ్రికా నుంచి వస్తుండగా తన ఫోన్ ముంబై ఎయిర్‌పోర్టులో పోయిందని చెప్పినట్లు కట్టుకథ అల్లారు.

లొంగిపోయే వరకు టచ్‌లోనే..!

అద్దేపల్లె జనార్దనరావును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేసిన తరువాత రాష్ట్రంలో పలుచోట్ల విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మద్యం షాపుల్లో తనిఖీలు చేశారు. అందులో వెల్లడైన విషయాలను వెలుగులోకి రాకుండా తొక్కి పెట్టారు. దీనినిబట్టి కరకట్ట బంగ్లాతో పాటు పలువురు టీడీపీ నేతలకు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్నట్లు స్పష్టం అవుతోంది. జనార్దనరావు ఫోన్ దొరికితే పలువురు టీడీపీ నేతలతో ఆయనకు ఉన్న లింకులు, ఫోన్ సంభాషణలు వెలుగు చూస్తాయని ముందు జాగ్రత్తగా మాయం చేసినట్లు స్పష్టమవుతోంది. లొంగిపోయే వరకు టీడీపీ పెద్దలతో టచ్‌లో ఉన్నట్లు భావిస్తున్నారు. వారి కనుసన్నల్లోనే కేసును నీరుగార్చే కుట్రలకు పదును పెట్టినట్లు సమాచారం. విదేశాలకు వెళ్లే సమయంలో మైలవరం ప్రజాప్రతినిధి బావమరిదికి అద్దేపల్లి జనార్దనరావు చివరిగా ఫోన్ కాల్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

జనసేన నేత వినుత డ్రైవర్


హత్య కేసులో కొత్త ట్విస్ట్

- కోట వినుత దంపతుల హత్యకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల స్కెచ్
- వైరల్ అవుతున్న హతుడి సెల్ఫీ వీడియో.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం

సాక్షి టాస్క్‌ఫోర్స్: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన పార్టీ మాజీ ఇన్‌చార్జి కోట వినుత డ్రైవర్ శ్రీనివాసులు (రాయుడు) హత్య వెనుక కొత్త ట్విస్ట్ చోటుచేసుకుంది. తనను హత్య చేయడానికి ముందు డ్రైవర్ రాయుడు తీసుకున్న సెల్ఫీ వీడియో బయటకు రాగా.. అందులో అతడు చెప్పిన సంచలన విషయాలు ఆలస్యంగా బయటకొచ్చాయి. వినుత దంపతుల హత్యకు శ్రీకాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి స్కెచ్ వేసినట్టు డ్రైవర్ రాయుడు సెల్ఫీ వీడియోలో తెలిపాడు. కోట వినుత దంపతులను హత్య చేసేందుకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఏవిధంగా కుట్ర చేశారనే విషయాలను ఆ వీడియోలో డ్రైవర్ వెల్లడించాడు. ఆ కుట్రలు బెడిసి కొట్టడంతో తనకు భారీ మొత్తంలో నగదు ముట్టజెప్పి కోట వినుత ఏకాంత వీడియోలు తీయాలని పురమాయించడం, వినుత దంపతులు ఎప్పుడెప్పుడు, ఎక్కడికి వెళుతున్నారు, ఏం చేస్తున్నారన్న సమాచారం తనకు ఇవ్వాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తనని బెదిరించి, భయపెట్టినట్టు డ్రైవర్ రాయుడు ఆ వీడియోలో పూసగుచ్చినట్టు చెప్పడం రాజకీయంగా కలకలం రేపుతోంది.

రూ.20 లక్షలు ఇచ్చి..

జనసేన నాయకులు కోట వినుత, ఆమె భర్త చంద్రబాబు హత్యకు బొజ్జల సుధీర్‌రెడ్డి రెండుసార్లు ప్రయత్నించినట్టు డ్రైవర్ రాయుడు ఆ వీడియోలో వెల్లడించాడు. ఆ కుట్రలు బెడిసికొట్టడంతో తనను పావుగా వినియోగించుకున్నట్టు తెలిపాడు. వినుత ఏకాంత (ప్రైవేట్) వీడియోలు తీయాలని బొజ్జల సుధీర్‌రెడ్డి తనకు రూ.30 లక్షలు ఇస్తానని చెప్పినట్టు డ్రైవర్ తన వీడియోలో వివరించాడు. ముందుగా కోట వినుత, ఆమె భర్త చంద్రబాబు



హతుడు శ్రీనివాసులు (రాయుడు) సెల్ఫీ వీడియో

సమాచారం నిమిత్తం రూ.20 లక్షలు ఇచ్చినట్టు పేర్కొన్నాడు. ఈ క్రమంలో బొజ్జల సుధీర్‌రెడ్డి చెప్పినట్టు వినుత బెడ్ రూమ్‌లో కెమెరాలు పెట్టి దొరికిపోయినట్టు డ్రైవర్ వెల్లడించాడు. ఈ వరుస పరిణామాల నేపథ్యంలోనే జనసేన నాయకురాలు కోట వినుత డ్రైవర్ రాయుడును హత్య చేసినట్టు తెలుస్తోంది. జూలై 7న డ్రైవర్ రాయుడు హత్యకు గురైన విషయం తెలిసిందే. జూలై 10న చెన్నై సమీపంలోని కూవం నది కాలువలో తేలిన డ్రైవర్ రాయుడు మృతదేహాన్ని అక్కడి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నివేదికలో అతడు హత్యకు గురైనట్టు తేలింది. మృతుడి చేతిపై కోట వినుత, జనసేన పార్టీ గుర్తు పచ్చబొట్లు ఉండటంతో తమిళనాడ పోలీసులు లోతుగా దర్యాప్తు చేశారు. విచారణలో అప్పటి శ్రీకాళహస్తి జనసేన ఇన్‌చార్జి వినుత దంపతులు రాయుడిని హత్యచేసి జూలై 8న కూవం కాలువలో పడేసినట్టు పోలీసులు నిర్ధారించుకున్నారు. అనంతరం కోట వినుత దంపతులతో పాటు ముగ్గురు అనుచరులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన ఏపీ రాజకీయాల్లో సంచలనం సృష్టించింది. వినుత బెయిల్‌పై బయటకు వచ్చిన అనంతరం మీడియా సమావేశం ఏర్పాటుచేసి దీనివెనుక ఎవరెవరు ఉన్నారనేది త్వరలోనే బయటకు వస్తుందని చెప్పారు. అదే సమయంలో ఆమె భర్త చంద్రబాబు కల్పించుకుని బొజ్జల సుధీర్‌రెడ్డి (టీడీపీకి చెందిన శ్రీకాళహస్తి ఎమ్మెల్యే) దీని వెనుక ఉన్నారని బహిరంగంగా వ్యాఖ్యానించడం అప్పట్లో చర్చనీయాంశమైంది. తాజాగా డ్రైవర్ రాయుడు తీసుకున్న సంచలన సెల్ఫీ వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. ఇది కూటమి నేతల్లో కలకలం రేపుతోంది.



"నాకు అది కావాలి, ఇది కావాలి అని నువ్వు నన్ను అడుగవద్దు. నీకేది కావాలో నన్ను నిర్ణయించనీ! ఎందుకంటే నీవు అడుగుతున్నది చాలా అల్పమైనది నేను నీకు ఇవ్వదలచుకున్నది చాలా విలువైనది. లాభదాయకమైనది. నీవు కోరుకున్నది మాత్రమే ఇమ్మంటే, ఇస్తాను! కానీ అటు తరువాత జరుగవలసిన పరిణామాలను పూర్తిగా నీవే చూసుకోవాలి. అందులో నా ప్రమేయముండదు. ఏది చేయాలనేది నీవే నిర్ణయించుకో!

– సర్వాంతర్యామి

మంచిమాట

మనిషి లక్షణాలు



ఒక వ్యక్తి గురించి తెలియటానికి వారి గురించిన పరిచయ పత్రమో, నివేదికో చదివిన దాని కన్న, వారిని ప్రత్యక్షంగా చూస్తే బాగా తెలుస్తుంది. ఎట్లా తెలుస్తుంది అన్నదాన్ని చాణక్యుడు చక్కగా తెలియ చేశాడు. ఆచారం కులాన్ని తెలియచేస్తుంది అన్నాడు. ''కుల''మంటే ఈనాడు మనమనుకునేది కాదు. ఒక వృత్తిని అవలంబించే వారి సముదాయం లేక సంఘం. ఆచారమంటే తరతరాలుగా వస్తున్న అలవాట్లు, పద్ధతులు, సంప్రదాయాలు మొదలైనవి. ఇవి ఒక కుటుంబానికి మరొక కుటుంబానికే మారిపోతూ ఉంటాయి. అటువంటిది వృత్తులని బట్టి మారటం సహజమే కదా! ఉదాహరణకి ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వారికి సమయపాలన, క్రమశిక్షణ తప్పులు లేకుండా ఎదుటివారికి అర్థమయ్యే విధంగా మాట్లాడటం మొదలైనవి అలవాటవుతాయి.

అందుకే ఎవరైనా తాను నిక్కచ్చిగా ఉండి, ఎదుటివారిని కూడా అట్లా ఉండమంటే ''మరీ క్లాసు టీచర్ లాగా వెంట పడుతున్నాడు'' అనటం వింటూ ఉంటాం. పనిచేసే తీరుని బట్టి కూడా ఉపాధ్యాయవృత్తిలో ఉన్నవాళ్లని చెప్పవచ్చు. అన్ని వృత్తులు కూడా అంతే! కుల శబ్దానికి శీలమనే అర్థం కూడా చెప్పారు. శీలమైనా వ్యక్తమయ్యేది అలవాట్ల లోను, పని చేసే తీరులోనే కదా! మాట తీరు ఆవ్యక్తి ఏప్రాంతానికి చెందినవాడో తెలియచేస్తుంది. తెలుగు మాట్లాడేవాళ్ళే అయినా వాళ్ళు మాట్లాడే తెలుగు స్వస్థలం ఏదో చెప్పకనే చెపుతుంది. ''ఈ పోరగాడు'' అనగానే ఎక్కడివారో చెప్పనక్కర లేదు. ''ఈ పిలగాడు'' అని ఎవరంటారో అందరికి తెలుసు. ''ఈ గుంటడు'' అంటే ఉత్తరాంధ్ర నుండి వచ్చిన వారని చెప్పనవసరం లేదు. మాటలే కాదు మాటాడే తీరు, అంటే యాస వాళ్లెక్కడి వాళ్ళో పట్టిస్తుంది. అందుకే పండితులైన వాళ్ళు శిష్టవ్యవహారికం రాయటమే కాదు, మాట లో కూడా ప్రాంతీయత తొంగిచూడకుండా జాగ్రత్త పడుతూ ఉంటారు. అంటే యాసలో మాట్లాడటం తప్పో, తక్కువో అని కాదు. సమతని పాటించటం కోసం అంతే! అదే పరాయి భాష అయితే మరీ తేలికగా తెలిసిపోతుంది. ఉత్తరదేశీయుల ఇంగ్లీషుకి, తెలుగువారి ఇంగ్లీషుకి, తమిళుల ఇంగ్లీషుకి, బెంగాలీల ఇంగ్లీషుకి తేడా స్పష్టంగానే కనిపిస్తుంది. విదేశీయులది సరే సరి. మాట వినగానే ఎక్కడివాళ్ళో వెంటనే తెలిసిపోతుంది. ఇక శరీరం తిన్న ఆహారాన్ని ప్రకటిస్తుంది. ఎటువంటి ఆహారం ఎంత తింటారు అన్నది ఆకారాన్ని చూసి చెప్పవచ్చు. మితాహారుల శరీరం చూడ ముచ్చటగా ఉంటుంది.

అన్నీ నోటితో చెప్పనక్కర లేదు. చూడగానే తెలిసిపోతాయి. మన గురించి మంచి అభిప్రాయం ఎదుటివారికి కలగాలంటే ప్రవర్తనని, భాషని, ఆహారపుటలవాట్లని సరి చేసుకుంటే సరి.

ఆచారః కుల మాఖ్యాతి దేశ మాఖ్యాతి భాషణం సంభ్రమః స్నేహ మాఖ్యాతి వపురాఖ్యాతి భోజనం" నడవడిక కులాన్ని (శీలాన్ని), మాటతీరు ప్రాంతాన్ని, సంభ్రమం (మర్యాద చూపే తీరు) ప్రేమను, శరీరం ఆహారపు అలవాట్లను తెలుపుతాయి.

సంభ్రమం అంటే మర్యాద చేయటానికి పడే హడావుడి, కంగారు. ఈ సంభ్రమం ఎంత ప్రేమ ఉన్నదో తెలియచేస్తుంది. ఇష్టమైనవాళ్ళు వస్తున్నారంటే కాళ్ళుచేతులు ఆడవు. వాళ్ళకి నచ్చినట్టు చేయాలనే తాపత్రయంలో ఒకదానికి ఒకటి చెయ్యటం కూడా కద్దు. ఆ విధంగా పొరబడటం అవకతవకగా చెయ్యటం ప్రేమకి చిహ్నమే కాని, చేతకానితనం కాదు. కృష్ణుడు తన ఇంటికి వచ్చాడన్న ఆనందంలో విదురుడు అరటిపండ్లు ఒలిచి ప్రేమగా పెడదామనుకుని, తొక్కలు కృష్ణుడి చేతిలో పెట్టి, పండు బయట పడేశాడుట! కృష్ణుడు ఆప్యాయంగా ఆ తొక్కలని తిన్నాడు ఆ సంభ్రమం వెనక ఉన్న ప్రేమని గుర్తించాడు కనుక. అదే ఇష్టంలేని వాళ్ళు వస్తే ఉన్నచోటు నుండి కదలబుద్ధి అవదు. తప్పనిసరి అయి, వాళ్ళకి ఆతిథ్యం ఇవ్వవలసి వస్తే చేయవలసిన మర్యాదలన్నీ ఎక్కువగానే చేసినా మనసుపెట్టి చేసినట్టుగా ఉండదు. యాంత్రికంగా అనిపిస్తుంది.

– డాక్టర్ ఎన్. అనంతలక్ష్మి

ఆధ్యాత్మికథ

చూసే దృష్టి



తమిళనాడు రాష్ట్రం తిరుచ్చిలోని ఒక ఆడిటర్‌కి ఇద్దరు మగపిల్లలు. కవలలైన వారిద్దరూ ఫిజియో థెరపీ కోర్సు చేశారు. స్వంతంగా క్లినిక్ ప్రారంభించాలని అనుకున్నారు. లక్షలు ఖర్చుపెట్టి భవనాన్ని నిర్మించారు.

క్లీనిక్‌ని ప్రారంభించే ముందు తిరుమలకెళ్ళి స్వామి వారి దర్శనం చేసుకుందామని తిరుమల బయలుదేరారు. కొండమీద ఇసుక రాలనంత జనం ఉంది. వరాహస్వామి దర్శనం చేసుకుని ఓపికగా క్యూలో నిలబడ్డారు. వైకుంఠం కాంప్లెక్స్‌లో దేవస్థానం వారు అందించిన వేడివేడి పాలు తాగారు. చిన్న చిన్నగా క్యూ కదిలింది.

'కష్టపడి చదివాము, భవిష్యత్తు ఎలా ఉంటుందోనని ఆందోళనగా ఉంది' అని కొడుకులిద్దరూ తండ్రితో చెప్పారు. ''ఏదైనా మనం చూసేదాన్ని బట్టి ఉంటుంది. ధైర్యంగా ఉండండి'' అని బదులిచ్చాడు తండ్రి.

ఇంతలో జనం తోసుకోవడం ప్రారంభమయ్యింది. మహాద్వారం వరకు ఒక్కటిగా వచ్చిన ముగ్గురూ వేరయ్యారు. విడివిడిగా దర్శనానికి వెళ్ళారు.

ఆరోజు గురువారం కావడంతో మూలవిరాట్టు పైన నగలేమీ లేవు. స్వామివారి నొసటిపై పెద్దగా ఉన్న పచ్చకర్పూరపు నామాన్ని అర్చకులు బాగా తగ్గించి ఉన్నారు. అందువల్ల భక్తులకు శ్రీవారి నేత్రాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నేత్ర దర్శనం చేసుకుని హుండీలో కానుకలు సమర్పించి ఉచిత ప్రసాదం ఇచ్చే చోట ముగ్గురూ కలిశారు. చిన్న లడ్డులు అందుకున్నారు.

''ఎలా జరిగింది దర్శనం?'' అని తండ్రి ఇద్దరినీ అడిగాడు. పెద్దబ్బాయి ముఖం నల్లగా పెట్టి ''దర్శనమైతే అయ్యింది కానీ, జనం నన్ను తొక్కేశారు. ఒళ్లంతా హూనమయ్యింది'' అని బదులిచ్చాడు. చిన్నబ్బాయి మెరుపు ముఖంతో ''స్వామి దర్శనంతోపాటు ఒళ్ళంతా ఫిజియో థెరపీ చేసుకున్నట్లయ్యింది. ఇప్పుడు నా శరీరం తేలికగా ఉంది'' అన్నాడు. వెంటనే తండ్రి ''గులాబీ తోటలోకి వెళ్ళిన కొందరు అందమైన గులాబీ పూలను చూస్తారు. మరికొందరు గులాబీ ముళ్ళను చూస్తారు. అలాగే మన జీవితాన్నీ, వృత్తినీ మనం చూసేదాన్ని బట్టి ఉంటుంది. మంచిగా ఆలోచిస్తే అంతా మంచే, చెడ్డగా ఆలోచిస్తే అంతా చెడ్డే'' అన్నాడు. నాన్న చెప్పిన మాటల్లోని అంతరార్థం తెలుసుకున్న కొడుకులిద్దరూ లడ్డు తింటూ మనసులోనే గోవింద నామస్మరణలు చేస్తూ చిన్నగా గుడి బయటికి వచ్చారు.

– ఆర్.సి.కృష్ణస్వామి రాజు

అమృత బిందువులు

- బాధ్యతల నుంచి తప్పించుకోవడంవల్ల శాంతి చేకూరదు. ఎదుగుదలా ఉండదు. మనిషి బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ జీవనసమరంలో గెలుపు సాధించాలి.
- చాలామంది రెండు పక్కలకు లాగిపట్టి ఉంచిన పరిస్థితిలో – ఒకలాంటి స్థితి స్థాపకతలో ఉంటారు. చేస్తున్నది ఒకటైతే, కోరుకునేది మరొకటి. కోరుకునేదానిపైన దృష్టి నిలపకపోవడం, చేయాల్సిన విధులనుంచి తప్పించుకోవడం!
- కష్టాలు మనిషి ఎదుగుదలకు అవకాశం కల్పిస్తాయి. భగవంతుడికి సమర్పణ భావంతో పనిలో నిమగ్నమైతే, ఆ ప్రక్రియలోనే గొప్ప ఉత్సాహం లభిస్తుంది. అంతకుమించి ఆనందం పొందే వీలుంటుంది. చేయాలనుకున్నది మనిషి అంతరంగ భావన. ఇతరులు రకరకాలుగా అనుకోవచ్చు విమర్శనాస్త్రాలూ సంధించవచ్చు దాన్ని పట్టించుకుంటే అడుగు ముందుకు పడదు.

తాత్త్వికథ

సత్యం చెబితే నరకం ప్రాప్తించింది!



ఒక బాటసారి ఊరికి వెళ్తూ ఉండగా రాత్రయింది. పడుకోవడానికి కొంచెం స్థలం దొరికితే చాలని అనుకున్నాడు. అతడు దగ్గర్లో ఉన్న ఒక ఇంటికి వెళ్ళాడు. ఇంటి యజమాని తలుపు తెరిచి అతని లోపలికి పిలిచాడు. తీరా చూస్తే అతను పాత స్నేహితుడే. సంతోషంతో మాట్లాడాడు. భోజనం అయ్యిందా? అని అడిగాడు. ఆ సందర్భంలో భోజనం అయ్యింది అని అబద్ధం చెప్పాలో, లేక చేయలేదు అని నిజం చెప్పాలో? ఒకవేళ భోజనం కాలేదు అంటే ఇంటి యజమాని కట్టెలు తెచ్చి, పొయ్యి వెలిగించి, వంట చేసి వడ్డించాలి. అలా అని ఇంటి వారికి ఇబ్బంది కలగకూడదని భోజనం అయింది. పడుకోవడానికి కొంచెం అవకాశం ఇస్తే చాలు అని అబద్ధం చెప్పాడు. ఇటువంటి అబద్ధం నిజం అవుతుంది.

మరొక ప్రసిద్ధమైన కథ ఉంది. ఒక ఋషి తన ఆశ్రమంలో ధ్యానం చేస్తూ కూర్చున్నాడు. దగ్గర్లో ఉన్న ఊరిలో దొంగలు పడి, ప్రజలపై దాడి చేసి, ఆ ఊరిలో జనాల సంపదనంతా దోచుకుందామని వారి వెంట పరిగెడుతూ రాసాగారు. ఊరి ప్రజలందరూ తమ ప్రాణాలు మిగిలితే చాలని తప్పించుకొని పరిగెత్తసాగారు. మధ్యలో ఋషి ఆశ్రమం కనిపించింది. ఆశ్రమం సమీపంలో ఉన్న పొదలలో వారంతా తలదాచుకున్నారు. వారిని వెంటాడుతూ వచ్చిన దొంగలు ఋషి దగ్గరకు వచ్చి,'మా వద్ద నుండి తప్పించుకుని వచ్చిన జనాలు ఈ దారిలోనే వచ్చారు అని తెలిసింది. నీవేమన్నా చూసావా?' అని అడిగారు. అబద్ధం చెబితే నరకం కలుగుతుందని, ప్రజలంతా ఆ పొదలమాటున దాక్కున్నారనే సత్యాన్ని చెప్పాడు. వెంటనే దొంగలు వారిపై దాడి చేసి వారి ఆభరణాలను దోచుకొని, ప్రాణాల్ని సైతం తీసివేశారు. ఋషి చనిపోయిన తర్వాత సత్యం చెప్పినందుకు నరకానికి వెళ్ళాడు. ఒకవేళ తాను చూసినా కూడా చూడలేదు అని అబద్ధం చెప్పినట్లైతే స్వర్గానికి వెళ్ళేవాడు. అంటే ఆయా కాలాలకి తగినట్లు సత్యాసత్యాలను నిర్ణయించుకోవాలి.

– డి.వి.ఆర్.

సాక్షి సినిమా

హలో హీరో...



● రామ్, భాగ్యశ్రీ బోర్సే

''సినిమాకెందుకు తీసుకెళ్లావ్... పిల్లాడ్ని ఇలానే పాడుచేసి పెట్టు...' అనే డైలాగ్‌తో మొదలవుతుంది 'ఆంధ్ర కింగ్ తాలూకా' సినిమా టీజర్. రామ్ పోతినేని, భాగ్యశ్రీ బోర్సే హీరో హీరోయిన్లుగా, ఉపేంద్ర, రావు రమేశ్, మురళీ శర్మ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం ఇది. టీ సిరీస్ ఫిలిమ్స్, గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్ సమర్పణలో మహేశ్‌బాబు .పి దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా నవంబరు 28న విడుదల కానుంది. ఆదివారం ఈ చిత్రం టీజర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. 'సినిమాలు చూసి ఎవరు చెడిపోతారే...', 'హలో హీరో... నీకో చిన్న గిఫ్ట్ తీసుకువచ్చా', 'వాళ్ల సమస్యను మన సమస్య అనుకోవడమేరా ప్రేమంటే' 'ఫ్యాను ఫ్యాను అని నువ్వు ఓ గుడ్డలు చింపేసుకోవడమే కానీ... నువొకడివి ఉన్నావ్ అని కూడా మీ ఆ హీరోకు తెలియదు' అన్న డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ఈ చిత్రంలో ఆంధ్ర కింగ్ సూపర్ స్టార్ సూర్య కుమార్ పాత్రలో ఉపేంద్ర, సూర్యకుమార్ అభిమాని సాగర్ పాత్రలో రామ్ నటిస్తున్నారు.

ఆలోచింపజేసేలా...



● రోహిణి హట్టంగడి, కుటుంబరావు, రోహిణి, ఓల్గా

రోహిణి హట్టంగడి, రోహిణి ముల్లేటి, సముద్ర ఖని ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'ఒక మంచి ప్రేమకథ'. ఈ సినిమాకు కథ, మాటలు, పాటలను ఓల్గా అందించగా, అక్కినేని కుటుంబరావు దర్శకత్వం వహించారు. హిమాంశు పోపూరి నిర్మించిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో రోహిణి ముల్లేటి మాట్లాడుతూ– ''ఈ సినిమాలో నా పాత్రను చూస్తే, ఆడియన్స్ కోప్పడతారు'' అని అన్నారు. ''ఇరవైఏళ్ల క్రితం కుటుంబరావు, ఓల్గాగార్లు ఓ సినిమా కోసం నన్ను అప్రోచ్ అయ్యారు. అప్పుడు అది కుదర్లేదు. ఇప్పుడు ఈ సినిమా చేయడం సంతోషంగా ఉంది. ఈ సినిమా నా మనసుని హత్తుకుంది'' అని పేర్కొన్నారు రోహిణి హట్టంగడి. ''అందరిలోనూ ఓ ఆలోచనను రేకెత్తించేలా ఈ సినిమాను తెరకెక్కించాను. ఎక్కడా బోర్ కొట్టించకుండా ఆడియన్స్‌ను నవ్విస్తూ, ఏడిపించేలా ఈ సినిమా కథనం ఉంటుంది'' అని తెలిపారు అక్కినేని కుటుంబరావు. ''ఈ సినిమాలో నేను కూడా ఓ రోల్ చేశాను. అందరికీ నచ్చే చిత్రం ఇది'' అని పేర్కొన్నారు హిమాంశు. ''మంచి సినిమా రావాలని కోరుకునే ఆర్టిస్టులు మాకు దొరకడం సంతోషంగా ఉంది'' అని పేర్కొన్నారు ఓల్గా. సంగీత దర్శకుడు కేఎం రాధాకృష్ణన్, ఈటీవీ విన్ ప్రతినిధులు సంధ్య, నితిన్ మాట్లాడారు.

మా అమ్మ కల నిజమైంది

– నిర్మాత మల్లికార్జున



రమణ్, వర్ష విశ్వనాథ్, జెమినీ సురేష్ ప్రధాన పాత్రధారులుగా నటించిన సినిమా 'మటన్ సూప్'. రామచంద్ర వట్టికూటి దర్శకత్వంలో మల్లికార్జున ఎలికా (గోపాల్), అరుణ్ చంద్ర వట్టికూటి, రామకృష్ణ సనపల నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదలైంది. ఈ సందర్భంగా మల్లికార్జున ఎలికా మాట్లాడుతూ– ''మటన్ సూప్'కి నేను ఓ కో డైరెక్టర్‌గా వచ్చాను. రామచంద్ర ప్యాషన్ చూసి, ఈ సినిమా నిర్మించాను. ప్రేక్షకుల స్పందన చూస్తుంటే మేం పడ్డ కష్టాన్ని ఇట్టే మర్చిపోయాం. మా సినిమా స్క్రీన్ ప్లే చూసి ఆడియన్స్ ఆశ్చర్యపోతున్నారు. ప్రస్తుతం నా దర్శకత్వంలో ఓ హారర్ మూవీ చేస్తున్నాను. అలాగే రామచంద్రతో మరో సినిమా ప్లాన్ చేస్తున్నాను'' అని అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ''నేను సినిమాలు చేయాలని, స్క్రీన్‌పై నా పేరు కనిపించాలని మా అమ్మగారు కలలు కన్నారు. 'మటన్ సూప్'తో ఆ కల నిజమైంది. కానీ ఇప్పుడు ఇది చూడటానికి మా అమ్మగారు లేకపోవడం చాలా బాధగా ఉంది'' అని చెప్పారు.

● అక్టోబర్ 13 కిషోర్ కుమార్ వర్ధంతి

జీవన తాత్త్వికతను ప్రతిబింబించిన అమర స్వరం



'జిందగీ కా సఫర్ కోయి సమ్ ఝా రహా'... 'ముసాఫిర్ హు యారో న ఘర్ హై నా ఠికానా'... 'మేరే నైనా సావన్ బాధో ఫిర్ భి మేరా మన్ ప్యాసా'... 'ఘుంఘురూ కి తరా బజ్ థా హి రహా హు మై'... ఆ బరువైన స్వరం వినగానే విషాదంలో కూరుకొనిపోయిన వారికి ఉపశమనం కలుగుతుంది. జీవన సమరంలో ఓడిపోయిన వారికి పోరాడే ధైర్యం వస్తుంది. నిరాశ నిస్పృహలో కొట్టు మిట్టాడినవారికి ఆశలు చివురిస్తాయి.

పల్లవులను చూడగానే ఆ స్వరం ఎవరిదో తెలిసిపోతుంది... ఆ పల్లవులను వింటే చాలు, రాసిన రచయితలకంటే, సంగీతం అందించిన స్వరకర్తల కంటే ముందుగా సాక్షాత్కరించే గాన గంధర్వుడెవరన్నది... అది నాలుగు దశాబ్దాలుగా తన నవరసభరిత గాత్రంతో బాలీవుడ్ సినీ రంగాన్ని శాసించిన అపురూప, అరుదైన గాయకుడు కిషోర్ కుమార్‌దేనని. అందరూ ప్రేమగా పిలుచుకొనే 'కిషోర్ దా' భౌతికంగా దూరమై, మూడున్నర దశాబ్దాల పైనే అవుతోంది.

'నీవు లేవు నీ పాట వుంది' అని తిలక్ అన్నట్లు కిషోర్ దా మన మధ్య లేకున్నా ఆయన పాటలు స్వర స్మరణీయులుగా మన హృదయాలను స్పృశించడానికి కారణం ఆయన స్వరంలోని జీవ శక్తి... ఆయన గాత్రంలోని జీవన తాత్త్వికత... కవి హృదయాన్ని అవగతం చేసుకొని కథా సన్నివేశాన్ని, పాత్రల మనోభావాలను మమేకం చెంది, సంగీత దర్శకుని బాణీలను ఇంప్రొవైజ్ చేసి, స్వీయ అనుభవాలను మిళితం చేసి, అనుభూతి చెంది పాడడం వల్ల కిషోర్ స్వరం భాస్వరంలా ప్రజ్వరిల్లింది.

ఆయన గాత్రంలోని జీర, బరువు, స్థాయి, మధురిమ, డైనమిక్స్ అన్నీ పంచామృతమై గానధారలుగా రస ప్లావితం చేసింది. ఆ శైలీ ప్రభంజనంలో పడిపోయిన వేలాది గాయకులు జూనియర్ కిషోర్ కుమారులై వేదికల మీద పాడుతూ మురిసిపోతున్న మాట వాస్తవం..

కిషోర్ కుమార్ నటుడు కావాలనుకున్నాడు కానీ గాయకుడయ్యాడు. 'జిద్దీ' (1948) చిత్రంలో ఖేమ్ చంద్ర ప్రకాశ్ తొలి పాటను పాడించాడు. కానీ ఆయనలోని ప్రతిభను, చిలిపితనాన్ని, వలపుతనాన్ని గుర్తించింది ఎస్.డి. బర్మన్. యాభైలలో రఫీ ప్రభంజనం ఉన్న రోజుల్లో కిషోర్‌కు మంచి పాటలిచ్చి ప్రోత్సహించాడు.

1960 దశకం ప్రారంభంలో ఆయన సినిమాలు విఫలమైన తరుణంలో ఎస్.డి. బర్మన్ కొడుకు ఆర్.డి. బర్మన్ 'పడోసన్'లో 'మేరే సామ్నె వాలే ఖిడ్ కీ మే' పాటనిచ్చి కిషోర్ గొంతులోని రొమాంటిజాన్ని ఆవిష్కరించి, అందరి దృష్టినీ ఆకర్షించాడు.

కిషోర్ జీవితంలోని 'ఆరాధన' (1969) పెద్ద మలుపు. ఆ చిత్ర స్వరకర్త ఎస్.డి. బర్మన్... రఫీతో రెండు పాటలు రికార్డు చేశాక జబ్బు పడడంతో ఆర్.డి. కిషోర్‌తో 'రూప్ తేరా మస్తానా...' పాడించి హిట్ చేయడంతో కిషోర్ ప్రభంజనం మొదలైంది. ఆ పాటలతో హిందీ సినీ గీతాల దిశ కూడా మారింది.

కిషోర్ యువతీ యువకుల పాలిట రొమాంటిక్ సింగర్ అయ్యాడు. అయితే కిషోర్ మరోవైపు జీవన తాత్త్వికతను తెలిపే బరువైన పాటలూ పాడాడు. ఆ పాటలే ఆయనను సమున్నత స్థానానికి చేర్చాయి. నిజానికి విషాద గీతాలను పాడి మెప్పించడం చాలా కష్టమని ప్రసిద్ధ గాయకులు చెప్పే మాట... కానీ కిషోర్ దా పాడిన ప్రతి విషాద గీతం కంటతడి పెట్టిస్తుంది. ఆయన గొంతులోని మార్దవం మనల్ని ఓదారుస్తుంది.

'యే జీవన్ హై... ఇస్ జీవన్ కా యహీహై యహీహై రంగ్ రూప్...

'పియా కా ఘర్' (1972) లోని ఈ పాట అర్థం తెలిస్తే మనం ఎంతో ఉపశమనం పొందుతాం... ఇందులో 'జీవితం కొంత సుఖం... కొంత కష్టం... బతుకుతో పంతం వద్దు' అని చెబుతుంది. ఈ పాట కిషోర్‌కు ఎంతో ఇష్టమైనది. ఇదే ఆనంద్ భక్షి రాసిన 'చింగారి కోయీ భడ్ కే, తొ సావన్ ఉసే భుజాయే, సావన్ జొ అగన్ లగాయే, ఉసె కౌన్ భుజాయె' (నిప్పును వర్షం చల్లారుస్తుంది, అయితే వర్షంలోనే నిప్పు పుడితే ఎవరు చల్లారుస్తారు) అని 'అమర్ ప్రేమ్'లోని పాట ఆద్యంతం మనకు విధి నిర్ణయాలలోని వైవిధ్యాన్ని తెలియజేస్తుంది. కిషోర్ ఈ పాటను ఎంతో నెమ్మదిగా... మంద్రంగా పాడాడు.

'మేరా జీవన్ కోరా కాగజ్ కోరా హి రహ్ గయా... జో లిఖాథా ఆంసు వోంకె సంగ్ బహ్ గయా' (నా జీవితం ఓ తెల్ల కాగితం... ఏదైనా రాస్తే అదంతా కన్నీటితో తుడుచుకుపోయింది) అని 'కోరా కాగజ్' చిత్రంలోని ఈ పాట కంట తడి పెట్టిస్తుంది. జీవితంలో అంతా కోల్పోయిన వారు వేదాంతిలా మారిపోతారు, లేదా జీవించే ప్రయత్నం చేయక మరణాన్నే ప్రేమిస్తుంటారు.

'ఘుంఘురూ కీ తరహా బజ్ థా హూ రహా హు మై' (చోర్ మఛాయే షోర్) మొదలైన పాటలు ఇందుకు ఉదాహరణలే.

జీవన వైచిత్రిని, జీవన సత్యాన్ని తెలిపే గీతాలకు కిషోర్ ప్రాణ ప్రతిష్ఠ చేశాడు.

జిందగీ కా సఫర్ ... హై యే కైసా సఫర్ కోయి సమ్ ఝా సహీ కోయి జానా సహీ హై యే కైసే డగర్... చల్ తె హై సబ్ మగర్... (ఈ జీవిత పయనం ఎవరికీ తెలియదు.. ఎవరికీ అర్థం కాదు. అందరం ఏ తోవన వెళుతున్నామో తెలియకున్నా వెళుతూనే వున్నాం). 'సఫర్ (1970) చిత్రంలోని ఈ పాట అందర్నీ కదిలిస్తుంది...

అలాగే 'ఆప్ కి కసమ్' సినిమా (1974)లో జీవితంలో గడచిన క్షణాలు, సంఘటనలు మళ్ళీ రావు అనే సత్యాన్ని ఆరు ఋతువులతో పోలుస్తూ రాసిన గీతాన్ని కిషోర్ హృద్యంగా పాడారు.

'జిందగీ కా సఫర్ మై గుజర్ జాతే హై జో మఖామ్... వో ఫిర్ నహీ ఆతీ... వో ఫిర్ నహీ ఆతీ'... (ఇందులో శిశిరంలో రాలిన పూలు వసంతంలో చిగురిస్తాయని అనుకోవద్దని, ఒక్కసారి దూరమైన వ్యక్తులు మరల చేరువ కారని మనిషికి అనుమానం ఉంటే అది పెనుభూతమవుతుందని, జీవితం అశాంతిమయమనే) భావనతో రాసిన గీతాన్ని కిషోర్ ఎంతో గంభీరంగా పాడాడు.

'అందాజ్' (1971) చిత్రంలోని 'జిందగీ ఎక్ సఫర్ హై సుహానా యహ కల్ క్యా హో కిస్ నే జానా' ఆల్ టైం హిట్‌గా నిల్చింది. (రేపు ఏమవుతుందో తెలియదు. మృత్యువు అనుక్షణం వెంటాడుతుంటుంది. అనుభవించేదేదో ఈ క్షణమే అనుభవించు) అనే భావంతో ఈ పాట సాగుతుంది.

'అమర్ ప్రేమ్' (1972) లోని 'కుఛ్ తో లోగ్ కహేంగే... లోగోంకా కామ్ హై కహనా' (ప్రజలు ఎప్పుడు ఏవో మాట్లాడుతూ వదంతులు సృష్టిస్తూనే వుంటారు... ఆ మాటలను పట్టించుకోవద్దు... సీతమ్మ వారినే నిందించింది లోకం... మనం లోకానికి జవాబుదారు కాము) గీతాన్ని ఎంతో అనునయంగా పాడాడు కిషోర్...

'కాలా పత్థర్' (1979) చిత్రంలోని 'ఎక్ రాస్తా హై జిందగీ' గీతాన్ని కిషోర్ పాడిన తీరు మనల్ని కట్టి పడేస్తుంది..

కిషోర్ వ్యక్తిగత జీవితమూ రక రకాల గతుల్లో పయనించింది. ఆయన జీవితంలో నలుగురు స్త్రీలు ప్రవేశించి కొన్నాళ్ల తరువాత నిష్క్రమించారు. తొలుత రూమాదేవి 1950ల్లో తరువాత మధుబాలను, తరువాత 1970ల్లో యోగితా బాలిని, చివరికి 1980ల్లో లీనా చందా వర్కర్‌ను వివాహమాడాడు... వీరందరూ ప్రసిద్ధ నటీమణులే... కిషోర్ వాయిద్యాలతో, సంగీత దర్శకులతో ట్యూన్ అయ్యాడు కానీ ఆయన భార్యలు మాత్రం ఆయనతో ట్యూన్ కాలేదు. కారణం ఆయన నిలకడ లేనితనం, చిన్నపిల్లాడి తత్వమే! 1969లో మధుబాల మరణంతో కిషోర్ డిప్రెషన్‌లోకి వెళ్ళాడు. తరువాత చాలా కాలానికి యోగితా బాలి ఆయన జీవితంలో ప్రవేశించింది. ఆ తర్వాత లీనా చందా వర్కర్... కిషోర్ జీవితంలో చివరివరకున్నది... కిషోర్ ఉమనైజర్ కాదు. పరిస్థితుల ప్రభావం వల్ల ఆయన వ్యక్తిగత జీవితం తెగిన గాలి పటమైంది. కానీ ఇవేవీ ఆయన స్వర జీవితంపై ప్రభావం చూపలేదు..

కిషోర్ తరచూ గుండె నొప్పి అని, అందర్నీ ఆట పట్టించేవాడు. అక్టోబర్ 13న (1987) కూడా అలాగే అంటే భార్య లీనా జోక్ కాబోలనుకుంది... కానీ మరుక్షణంలోనే డాక్టర్‌ను పిలిపించింది... డాక్టర్ వచ్చే లోపే కిషోర్ తుది శ్వాస వదిలాడు. అప్పుడు ఆయన వయసు 58 యేళ్ళు...

కిషోర్ లేడు అనుకోగానే... 'మౌత్ ఆయేగీ ఆయేగీ ఎక్ దిన్... జాన్ జాయేగీ జాయేగీ ఎక్ దిన్' కిషోరే పాడిన పాట గుర్తుకు వస్తుంది... కానీ కిషోర్ మాత్రం తనకు ఎన్నడు వీడ్కోలు ఇవ్వద్దని వెళుతూ మరీ చెప్పాడు.

'చల్ తే చల్ తే మేరే యే గీత్... యాద్ రఖ్ నా కభి అల్ విద నా కహనా' (చల్ తే చల్ తే)... అవును.. కిషోర్ దా గాత్రానికి మరణం లేదు.. అది అజరం, అమరం.

– డా. వి.వి. రామారావు
(గాయకుడు, రచయిత, వ్యాఖ్యాత)

ఇద్దరు అమ్మాయిల్ని లవ్ చేస్తే..!



● అనీష్

అనీష్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'లవ్ ఓటీపీ'. 'ఓవర్... టార్చర్... ప్రెజర్' అనేది ఉపశీర్షిక. జాన్విక, స్వరూపిణి ఈ చిత్రంలో హీరోయిన్లుగా నటించగా, రాజీవ్ కనకాల కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా ట్రైలర్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. 'ఇద్దరు అమ్మాయిల్ని లవ్ చేశానండి...', 'అంటే... ఒకరికి తెలియకుండా మరొకరిని...', 'అరె... మామ బ్రేకప్ అనగానే ఊపిరాడట్లేదురా నాకు' అనే డైలాగ్స్ ఈ ట్రైలర్‌లో ఉన్నాయి. ''ఈ చిత్రంలో తండ్రీకొడుకుల ఎమోషన్ కొత్తగా ఉంటుంది. మా 'లవ్ ఓటీపీ' సినిమాతో ఎవరూ ఊహించని ఎంటర్‌టైన్‌మెంట్‌ని మీ ముందుకు తీసుకువస్తున్నాం'' అని చెప్పారు నిర్మాత విజయ్ .యం రెడ్డి.



మిథాలీ రాజ్ స్టాండ్ ఆవిష్కరణ

విశాఖపట్నంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలోని ఒక స్టాండ్‌కు భారత మహిళా క్రికెట్ దిగ్గజం మిథాలీ రాజ్ పేరు పెట్టారు. ఆదివారం భారత్, ఆసీస్ మ్యాచ్‌కు ముందు ఈ స్టాండ్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఐసీసీ చైర్మన్ జై షా, బీసీసీఐ అధ్యక్ష, కార్యదర్శులు మిథున్ మన్హాస్, దేవజిత్ సైకియా, ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్‌తో పాటు ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) అధికారులు ఇందులో **పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీఏ ప్రత్యేకంగా రూపొందించిన వెండి బంతిని** మిథాలీకి బహూకరించింది. మిథాలీ రాజ్ తల్లిదండ్రులు దొరై రాజ్, లీలా రాజ్ కూడా దీనికి హాజరయ్యారు. మరోవైపు మైదానంలో ఆంధ్ర మాజీ క్రికెటర్ పేరిట 'రావి కల్పన గేట్' ఆవిష్కరణ కార్యక్రమం కూడా నిర్వహించారు. తనకు లభించిన ఈ గౌరవం పట్ల మిథాలీ రాజ్ సంతోషం వ్యక్తం చేసింది. మైదానంలో మహిళా క్రికెటర్ పేరిట స్టాండ్ ఏర్పాటు చేయడం క్రీడల్లోకి వచ్చే అమ్మాయిలకు స్ఫూర్తిని స్తుందని ఆమె పేర్కొంది. బీసీసీఐ పరిధిలోకి రాక ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున తాను అండర్-16, అండర్-19 స్థాయి మ్యాచ్‌లు ఆడిన విషయాన్ని **ఆమె గుర్తు** చేసుకుంది.

మనదే పైచేయి

- **తొలి ఇన్నింగ్స్‌లో విండీస్‌ను 248కే కూల్చేసిన భారత బౌలర్లు**
- తిప్పేసిన కుల్దీప్, జడేజా
- ఫాలోఆన్‌లో విండీస్ ప్రతిఘటన
- రెండో ఇన్నింగ్స్‌లో 173/2

కుల్దీప్, జడేజాలు తిప్పేయడంతో తొలి ఇన్నింగ్స్‌లో 250 పరుగుల్లోపే ఆలౌటైన వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్‌లో ప్రతిఘటిస్తోంది. గత టెస్టులో వన్డే ఓవర్ల కోటా (50)ను ఆడలేకపోయిన కరీబియన్ బ్యాటర్లు ఆశ్చర్యకరంగా ఫిరోజ్‌షా కోట్లా స్పిన్ ట్రాక్‌పై పోరాటం కనబరుస్తున్నారు. దీంతో భారత జట్టు క్లీన్‌స్వీప్ ఆలస్యమవుతోంది. నాలుగో రోజుకు చేరిన ఈ టెస్టు ఫలితానికి భారత్ ఇంకా 8 వికెట్ల దూరంలో ఉండగా... ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవడానికి విండీస్ 97 పరుగులు చేయాల్సి ఉంది.


కుల్దీప్

న్యూఢిల్లీ: పడేశారు... కానీ పడగొట్టాల్సిన పని ఇంకా మిగిలే ఉంది. భారత స్పిన్నర్లు ప్రత్యర్థిని తొలి ఇన్నింగ్స్‌లో కూల్చేశారు. కానీ రెండో ఇన్నింగ్స్‌లో కరీబియన్లు మన స్పిన్ ట్రాక్‌పై... మన స్పిన్నర్లకు సవాలు విసురుతున్నారు. దీంతో ఈ సిరీస్‌లో క్లీన్‌స్వీప్ విజయం కోసం నాలుగో రోజూ కూడా భారత బౌలర్లు శ్రమించాల్సిన అవసరం వచ్చింది. మూడో రోజు ఆటలో కుల్దీప్ యాదవ్ 82 పరుగులిచ్చి 5 వికెట్లు, రవీంద్ర జడేజా 46 పరుగులిచ్చి 3 వికెట్లు తీయడంతో వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 81.5 ఓవర్లలో 248 పరుగులకే ఆలౌటైంది. ఖరి పియర్ (23; 3 ఫోర్లు), ఫిలిప్ (24 నాటౌట్; 2 ఫోర్లు) కాసేపు ప్రతిఘటించారు. అనంతరం ఫాలోఆన్ ఆడిన విండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 49 ఓవర్లలో 2 వికెట్లే కోల్పోయి 173 పరుగులు చేసింది. ఓపెనర్ క్యాంప్‌బెల్ (87 బ్యాటింగ్; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), షై హోప్ (66 బ్యాటింగ్; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయంగా రాణించారు. సిరాజ్, సుందర్ చెరో వికెట్ తీశారు.


క్యాంప్‌బెల్ షై హోప్

కుల్దీప్ ఉచ్చులో పడి...

ఓవర్‌నైట్ స్కోరు 140/4తో ఆదివారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన వెస్టిండీస్‌ను ఆరంభంలోనే కుల్దీప్ దెబ్బకొట్టాడు. ఓవర్‌నైట్ బ్యాటర్లు షై హోప్ (36; 5 ఫోర్లు), ఇమ్లాచ్ (21; 3 ఫోర్లు)లను తన వరుస ఓవర్లలో అవుట్ చేశాడు. దీని నుంచి తేరుకోకముందే గ్రీవెస్ (17; 3 ఫోర్లు)ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. ఆ మరుసటి ఓవర్లో సిరాజ్... వారికెన్ (1)ను క్లీన్‌బౌల్డ్ చేయడంతో 35 పరుగుల వ్యవధిలోనే 4 వికెట్లను కోల్పోయింది. అప్పుడు విండీస్ స్కోరు 175/8 కావడంతో ఇక లాంఛనమే మిగిలుందనిపించింది. కానీ పియర్, ఫిలిప్, సీల్స్ (13; 3 ఫోర్లు) దాదాపు 250 పరుగుల దాకా లాక్కొచ్చారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 518/5 డిక్లేర్డ్; **వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్:** 248 ఆలౌట్ (81.5 ఓవర్లలో); **వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్:** క్యాంప్‌బెల్ (బ్యాటింగ్) 87; తేజ్ చందర్‌పాల్ (సి) గిల్ (బి) సిరాజ్ 10; అతనేజ్ (బి) సుందర్ 7; షై హోప్ (బ్యాటింగ్) 66; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (49 ఓవర్లలో 2 వికెట్లకు) 173. వికెట్ల పతనం:** 1-17, 2-35. **బౌలింగ్:** సిరాజ్ 6-2-10-1, జడేజా 14-3-52-0, సుందర్ 13-3-44-1, కుల్దీప్ 11-0-53-0, బుమ్రా 4-2-9-0, జైస్వాల్ 1-0-3-0.

స్టార్ బ్యాటర్ స్మృతి ఫామ్‌లోకి వచ్చింది. ప్రతీక, జెమీమా కూడా రాణించారు. 330 పరుగుల భారీ స్కోరు నమోదైంది. పిచ్ బ్యాటింగ్‌కు కాస్త అనుకూలంగానే ఉన్నా... ఈ భారీ స్కోరును కాపాడుకోవచ్చని భారత మహిళలు భావించారు. కానీ అటువైపు ఉన్నది ఆస్ట్రేలియా... కెప్టెన్ అలీసా హీలీ నేతృత్వంలో డిఫెండింగ్ చాంపియన్ జట్టు ఎక్కడా తగ్గకుండా దూసుకుపోయింది. చివర్లో కొన్ని అవకాశాలు సృష్టించుకొని భారత్ పట్టు బిగించినట్లు కనిపించినా... ప్రత్యర్థి విజయాన్ని ఆపడానికి అవి సరిపోలేదు. దాంతో గత మ్యాచ్ తరహాలోనే గెలుపునకు చేరువైనట్లు కనిపించినా... మరో ఓటమితో టీమిండియాకు నిరాశ తప్పలేదు.


హర్మన్‌ప్రీత్

330 సరిపోలేదు

భారీ స్కోరు చేసినా భారత్‌కు తప్పని ఓటమి

- ప్రపంచ రికార్డు లక్ష్యాన్ని ఛేదించిన ఆస్ట్రేలియా
- 3 వికెట్లతో గెలిచిన డిఫెండింగ్ చాంపియన్
- అలీసా హీలీ అద్భుత సెంచరీ
- అనాబెల్ సదర్లాండ్‌కు 5 వికెట్లు
- మూడు వికెట్లతో రాణించిన శ్రీచరణి

112 స్మృతి 5 వేల పరుగులు పూర్తి చేసుకునేందుకు పట్టిన ఇన్నింగ్స్‌ల సంఖ్య. మహిళల వన్డేల్లో అందరికంటే వేగంగా ఆమె ఈ మైలురాయిని చేరుకుంది. ఇదే ఇన్నింగ్స్‌లో ఒకే ఏడాది 1000 పరుగులు చేసిన తొలి క్రికెటర్‌గా కూడా స్మృతి గుర్తింపు పొందింది.

331 మహిళల వన్డేల్లో అత్యధిక పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన జట్టుగా ఆస్ట్రేలియా రికార్డు నెలకొల్పింది. శ్రీలంక జట్టు (302 దక్షిణాఫ్రికాపై 2024లో) పేరిట ఉన్న రికార్డును ఆస్ట్రేలియా అధిగమించింది.



అలీసా హీలీ

సాక్షి క్రీడా ప్రతినిధి, విశాఖపట్నం: సొంతగడ్డపై మహిళల వన్డే వరల్డ్ కప్‌లో భారత్‌కు మరో నిరాశజనక ఫలితం ఎదురైంది. ఆదివారం ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో హోరాహోరీగా సాగిన పోరులో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా జట్టు 3 వికెట్ల తేడాతో భారత్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 48.5 ఓవర్లలో 330 పరుగులకు ఆలౌటైంది. అన్ని వరల్డ్‌కప్‌లలో కలిపి భారత్‌కు ఇదే అత్యధిక స్కోరు. ఓపెనర్లు స్మృతి మంధాన (66 బంతుల్లో 80; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు), ప్రతీక రావల్ (96 బంతుల్లో 75; 10 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 24.3 ఓవర్లలో 155 పరుగులు జోడించారు. ఆస్ట్రేలియా బౌలర్ అనాబెల్ సదర్లాండ్ 40 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టింది. అనంతరం ఆస్ట్రేలియా 49 ఓవర్లలో 7 వికెట్లకు 331 పరుగులు సాధించి గెలిచింది. మహిళల వన్డేల చరిత్రలో ఇదే అత్యధిక ఛేదన కావడం విశేషం. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అలీసా హీలీ (107 బంతుల్లో 142; 21 ఫోర్లు, 3 సిక్స్‌లు) అద్భుత సెంచరీతో చెలరేగింది. ఆంధ్రప్రదేశ్ స్పిన్నర్ నల్లపురెడ్డి శ్రీచరణి 41 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు తీసింది. భారత్ తమ తర్వాతి పోరులో ఈ నెల 19న ఇంగ్లండ్‌తో ఇండోర్‌లో తలపడుతుంది. **నేడు విశాఖపట్నంలో జరిగే మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో దక్షిణాఫ్రికా తలపడుతుంది.**

భారత ఓపెనర్లు ప్రతీక, స్మృతి ఇన్నింగ్స్‌ను జాగ్రత్తగా మొదలు పెట్టారు. ఫలితంగా తొలి 7 ఓవర్లలో 26 పరుగులే వచ్చాయి. పవర్‌ప్లే తర్వాత 11-15 ఓవర్లలో భారత్ 15 పరుగులే చేసింది. ఓపెనర్లు ధాటిని పెంచడంతో 21-24 మధ్య 4 ఓవర్లలోనే 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 46 పరుగులు రావడం విశేషం. ఎట్టకేలకు స్మృతిని అవుట్ చేసి మోలినే ఈ భాగస్వామ్యాన్ని విడదీసింది. ఆ తర్వాత హర్లీన్ డియోల్ (38; 3 ఫోర్లు, 1 సిక్స్) కూడా కొన్ని చక్కటి షాట్లతో ఆకట్టుకోగా, 30 ఓవర్లు ముగిసేసరికి జట్టు స్కోరు 192/1కు చేరింది. అయితే తర్వాతి బంతికే ప్రతీక వెనుదిరగ్గా, హర్మన్‌ప్రీత్ (22; 3 ఫోర్లు) ధాటిగా ఆడే ప్రయత్నంలో వెనుదిరిగింది. అయితే జెమీమా రోడ్రిగ్స్ (21 బంతుల్లో 33; 5 ఫోర్లు), రిచా ఘోష్ (22 బంతుల్లో 32; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడు ప్రదర్శిస్తూ స్కోరును 300 దాటించారు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 34 బంతుల్లో 54 పరుగులు జత చేశారు. అయితే ఆఖర్లో భారీ షాట్‌లకు యత్నించి భారత బ్యాటర్లు వరుసగా వెనుదిరిగారు. 36 పరుగుల వ్యవధిలో చివరి 6 వికెట్లు కోల్పోయిన జట్టు ఇన్నింగ్స్ మరో 7 బంతుల ముందే ముగిసింది.

ఓపెనర్ల దూకుడు...

భారీ ఛేదనలో ఆసీస్‌కు ఓపెనర్లు హీలీ, లిచ్‌ఫీల్డ్ ఘనమైన ఆరంభం అందించారు. క్రాంతి ఓవర్లో 3 ఫోర్లు, సిక్స్‌తో హీలీ దూకుడు కనబర్చగా, అమన్‌జోత్ ఓవర్లో లిచ్‌ఫీల్డ్ 4 ఫోర్లు బాదింది. తొలి వికెట్‌కు వీరిద్దరు 68 బంతుల్లోనే 85 పరుగులు జోడించారు. అయితే లిచ్‌ఫీల్డ్‌తో పాటు తక్కువ వ్యవధిలో బెత్ మూనీ (4), అనాబెల్ సదర్లాండ్ (0) అవుటయ్యారు. కానీ మరోవైపు హీలీ ఎక్కడా తగ్గకుండా ధాటిగా ఆడుతూ ఇన్నింగ్స్‌ను నడిపించింది. ఈ క్రమంలోనే 84 బంతుల్లో ఆమె శతకం పూర్తి చేసుకుంది. ఆసీస్ విజయానికి చేరువవుతున్న దశలో ఒక్కసారిగా భారత బౌలర్లు పైచేయి సాధించారు. ఫలితంగా 38 పరుగుల వ్యవధిలో జట్టు 4 వికెట్లు చేజార్చుకోవడంతో ఉత్కంఠ పెరిగింది. అయితే ఒత్తిడిని అధిగమించి ఆసీస్ ఒక ఓవర్ ముందే గెలిచింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: ప్రతీక (సి) పెరీ (బి) సదర్లాండ్ 75; స్మృతి (సి) లిచ్‌ఫీల్డ్ (బి) మోలినే 80; హర్లీన్ (సి) సదర్లాండ్ (బి) మోలినే 38; హర్మన్‌ప్రీత్ (సి) మోలినే (బి) షుట్ 22; జెమీమా (సి) మూనీ (బి) సదర్లాండ్ 33; రిచా (సి) (సబ్) వేర్‌హమ్ (బి) సదర్లాండ్ 32; అమన్‌జోత్ (సి) మోలినే (బి) గార్డ్‌నర్ 16; దీప్తి (సి) మూనీ (బి) మోలినే 1; స్నేహ్ (నాటౌట్) 8; క్రాంతి (సి) (సబ్) వేర్‌హమ్ (బి) సదర్లాండ్ 1; శ్రీచరణి (బి) సదర్లాండ్ 0; ఎక్స్‌ట్రాలు 24; **మొత్తం (48.5 ఓవర్లలో ఆలౌట్) 330. వికెట్ల పతనం:** 1-155, 2-192, 3-234, 4-240, 5-294, 6-309, 7-320, 8-327, 9-330, 10-330. **బౌలింగ్:** గార్త్ 5-0-35-0, షుట్ 6.1-0-37-1, యాష్లే గార్డ్‌నర్ 7-0-40-1, మోలినే 10-1-75-3, సదర్లాండ్ 9.5-0-40-5, తాలియా మెక్‌గ్రాత్ 4.5-0-43-0, అలానా కింగ్ 6-0-49-0. **ఆస్ట్రేలియా ఇన్నింగ్స్:** హీలీ (సి) స్నేహ్ (బి) శ్రీచరణి 142; లిచ్‌ఫీల్డ్ (సి) స్నేహ్ (బి) శ్రీచరణి 40; ఎలీస్ పెరీ (నాటౌట్) 47; మూనీ (సి) రోడ్రిగ్స్ (బి) దీప్తి 4; సదర్లాండ్ (బి) శ్రీచరణి 0; యాష్లే గార్డ్‌నర్ (బి) అమన్‌జోత్ 45; తాలియా మెక్‌గ్రాత్ (ఎల్బీ) (బి) దీప్తి 12; మోలినే (ఎల్బీ) (బి) అమన్‌జోత్ 18; కిమ్ గార్త్ (నాటౌట్) 14; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (49 ఓవర్లలో 7 వికెట్లకు) 331. వికెట్ల పతనం:** 1-85, 2-168, 3-170, 4-265, 5-279, 6-299, 7-303. **బౌలింగ్:** అమన్‌జోత్ 9-0-68-2, క్రాంతి 9-1-73-0, స్నేహ్ రాణా 10-0-85-0, శ్రీచరణి 10-1-41-3, దీప్తి 10-0-52-2, హర్మన్‌ప్రీత్ 1-0-10-0.

భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం – విపత్తుల నిర్వహణ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం– తెలుగు
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం – రసాయన శాస్త్రం » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం – ఇంగ్లిష్ లాంగ్వేజ్



విద్య, ఉద్యోగ సమాచారం

టీజీఎస్ఆర్టీసీలో 1,743 డ్రైవర్, శ్రామిక్ పోస్టులు

తెలంగాణ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్(టీజీఎస్ఆర్టీసీ) రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జోన్లలో డ్రైవర్, శ్రామిక్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 1,743.
- » **పోస్టుల వివరాలు:** డ్రైవర్–1000, శ్రామిక్–743.
- » **అర్హత:** పోస్టును అనుసరించి ఐటీఐ, పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు డ్రైవింగ్ లైసెన్స్, పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 01.07.2025 నాటికి డ్రైవర్ పోస్టులకు 22 నుంచి 35 ఏళ్లు, శ్రామిక్ పోస్టులకు 18 నుంచి 30 ఏళ్లు మించకూడదు.
- » **వేతనం:** నెలకు డ్రైవర్ పోస్టులకు రూ.20,960 నుంచి రూ.60,080.
- » **ఎంపిక విధానం:** ఫిజికల్ మెజర్‌మెంట్ (పీఎంటీ), మెడికల్, డ్రైవింగ్ టెస్ట్‌ల ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 08.10.2025.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.10.2025.
- » **వెబ్‌సైట్:** https://www.tgprb.in

ఈడీసీఐఎల్ (ఇండియా) లిమిటెడ్‌లో కన్సల్టెంట్ పోస్టులు

ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ).. ఈడీసీఐఎల్(ఇండియా) లిమిటెడ్ ఆధ్వర్యంలో ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
- » **పోస్టుల వివరాలు:** కన్సల్టెంట్(ఎయిర్‌పోర్ట్ సిస్టమ్స్)–01, జూనియర్ కన్సల్టెంట్(ఎయిర్‌పోర్ట్ సిస్టమ్స్)–02.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ (ఇంజనీరింగ్ టెక్నాలజీ)లో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 16.10.2025 నాటికి కన్సల్టెంట్‌కు 40 ఏళ్లు,జూనియర్ కన్సల్టెంట్‌కు 35ఏళ్లు ఉండాలి.
- » **వేతనం:** నెలకు కన్సల్టెంట్‌కు రూ.1,20,000, జూనియర్ కన్సల్టెంట్‌కు రూ.1,00,000.
- » **ఎంపిక విధానం:** విద్యార్హతలు, పని అనుభవం, డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 03.10.2025.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.10.2025.
- » **వెబ్‌సైట్:** https://www.aai.aero

యూజీసీ నెట్ డిసెంబర్-2025

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ).. జేఆర్‌ఎఫ్, యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు పోటీపడేందుకు, పీహెచ్‌డీ ప్రవేశాలకు నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్–2025 నోటిఫికేషన్ విడుదలైంది.

- » **సబ్జెక్టులు:** అడల్ట్ ఎడ్యుకేషన్, ఆంత్రోపాలజీ, అరబ్ కల్చర్ అండ్ ఇస్లామిక్ స్టడీస్, అరబిక్, ఆర్కియాలజీ, అస్సామీ, బెంగాలీ, బోడో, బౌద్ధ, జైన, చైనీస్, కామర్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ క్రిమినాలజీ, జాగ్రఫీ, ఎకనామిక్స్, ఇంగ్లిష్, హోంసైన్స్, హిస్టరీ, ఫోరెన్సిక్ సైన్స్, ఇండియన్ కల్చర్, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, లింగ్విస్టిక్స్ తదితరాలు.
- » **అర్హత:** 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి. ఓబీసీ –ఎన్‌సీఎల్ /ఎస్సీ/ఎస్టీ /దివ్యాంగులు/ థర్డ్ జెండర్ కేటగిరీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉండాలి.
- » **వయసు:** 01.12.2025 నాటికి జేఆర్‌ఎఫ్‌కు 30 ఏళ్లు మించకూడదు. అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు గరిష్ట వయో పరిమితి లేదు.
- » **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష ద్వారా ఎంపికచేస్తారు.
- » **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష. రెండు పేపర్లు ఉంటాయి. పేపర్–1 మొత్తం 100 మార్కులకు 50 ప్రశ్నలు ఉంటాయి. పేపర్–2 మొత్తం 200 మార్కులకు 100 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం మూడు గంటలు ఉంటుంది.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 07.10.2025.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.11.2025.
- » **పరీక్ష ఫీజు చెల్లించడానికి చివరితేది:** 07.11.2025.
- » **దరఖాస్తు సవరణ తేదీలు:** 10.11.2025 నుంచి 12.11.2025 వరకు
- » **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://ugcnet.nta.nic.in

సీపీఆర్ఐ, బెంగళూరులో పోస్టు డాక్టోరల్ ఫెలోలు

బెంగళూరులోని సెంట్రల్ పవర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీపీఆర్ఐ) పోస్టు డాక్టోరల్ ఫెలోల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 09.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
- » **ఫెలోషిప్:** నెలకు రూ.80,000.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, సెంట్రల్ పవర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీపీఆర్ఐ), ప్రొఫెసర్. సార్.సి.వి.రామన్ రోడ్, పోస్ట్ బాక్స్ నెం.8066, సదాశివ నగర్ పీవో బెంగళూరు–560080.
- » **దరఖాస్తులకు చివరితేది:** 31.10.2025.
- » **వెబ్‌సైట్:** https://cpri.res.in

ఆదికవి నన్నయ్య యూనివర్సిటీలో ప్రోగ్రామర్

రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీలో తాత్కాలిక ప్రాతిపదికన ప్రోగ్రామర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంసీఏ/ఎంఎస్సీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 40 ఏళ్లు ఉండాలి.
- » **వేతనం:** నెలకు రూ.35,000.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 01.10.2025.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.10.2025.
- » **వెబ్‌సైట్:** https://aknu.edu.in

డీఆర్‌డీవోలో 50 అప్రెంటిస్‌లు

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీవో) వివిధ విభాగాల్లో అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 50.
- » **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు –10,టెక్నీషియన్(డిప్లొమా)అప్రెంటిస్‌లు–40.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్, బీఈ, డిప్లొమాలో ఉత్తీర్ణులై ఉండాలి.
- » **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.12,300, టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటిస్‌కు రూ.10,900.
- » **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మెరిట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.10.2025.
- » **వెబ్‌సైట్:** https://drdo.res.in

నిట్ కర్ణాటకలో జేఆర్‌ఎఫ్‌లు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్) కర్ణాటకలో జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్‌ఎఫ్)లు ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 01.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో ఎంఈ/ఎంటెక్(ఈసీఈ, సీఎస్ఈ, ఐటీ)లో ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
- » **వేతనం:** నెలకు రూ.37,000.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఈమెయిల్:** prabuk@nitk.edu.in
- » **దరఖాస్తులకు చివరితేది:** 20.10.2025.
- » **వెబ్‌సైట్:** www.karnatakacareers.org

ఐఓబీలో స్పెషలిస్ట్ ఆఫీసర్

మొత్తం 127 పోస్టుల భర్తీకి ఐఓబీ నోటిఫికేషన్ ● మూడంచెల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహణ

చెన్నై ప్రధాన కేంద్రంగా పని చేస్తున్న ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు (ఐఓబీ).. 127 స్పెషలిస్ట్ ఆఫీసర్ (ఎస్ఓ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. మూడంచెల ఎంపిక ప్రక్రియలో విజయం సాధిస్తే.. ఎంఎంజీ స్కేల్-2, స్కేల్-3 గ్రేడుతో మేనేజర్, సీనియర్ మేనేజర్ హోదాలో ఆకర్షణీయమైన వేతనాన్ని అందుకోవచ్చు. ఎంపికైన అభ్యర్థులు దేశంలో ఎక్కడైనా పని చేసేందుకు సిద్ధంగా ఉండాలి. ఐఓబీలో స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులు, అర్హతలు, ఎంపిక విధానం తదితర వివరాలు..


బ్యాంక్ జాబ్స్

అర్హతలు

ప్రభుత్వ గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎంసీఏ, ఎంఎస్సీ, ఎంబీఏ, బీటెక్, బీఈ, బీఆర్క్, ఎంఈ, పీజీడీసీఏ, పీజీడీబీఏ పూర్తి చేసి ఉండాలి. ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, సాంకేతిక కోర్సుల్లో పట్టభద్రులు అర్హులు. బ్యాంకింగ్ లేదా ఫైనాన్స్‌కు సంబంధించిన ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసిన వారికి అదనపు ప్రయోజనం ఉంటుంది. అభ్యర్థులకు రెండేళ్ల నుంచి ఆరేళ్ల పని అనుభవం తప్పనిసరిగా ఉండాలి.

వయసు

అభ్యర్థుల వయసు 24 ఏళ్ల నుంచి 40 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్ల వరకు సడలింపు ఉంటుంది.

వేతనం

పరీక్షలో ముందు వరుసలో నిలిచి తుది జాబితాలో చోటు దక్కించుకుంటే.. ఎంఎంజీఎస్ గ్రేడ్-2 హోదాలో ఉన్న వారికి నెలకు రూ.64,820-రూ.93,960 వేతనం, గ్రేడ్-3 హోదాకు రూ. 85,920-రూ.1,05,280 మధ్య జీతం లభిస్తుంది. దీంతో పాటు డీఏ, హెచ్ఆర్ఏ, సీసీఏ ఇతర అలవెన్సులు లభిస్తాయి.

ఎంపిక విధానం

దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను మూడంచెల్లో ఎంపిక చేస్తారు. ముందుగా ఆన్‌లైన్ రాత పరీక్ష .. ఆ తర్వాత అభ్యర్థుల మార్కులు, అనుభవం ఆధారంగా ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఇందులో ప్రతిభ చూపిన వారు ఫైనల్ లిస్టులో చోటు దక్కించుకుంటారు. వీరికి వైద్య పరీక్షలు, సర్టిఫికెట్ల పరిశీలన తదితరాల అనంతరం తుది జాబితాను బ్యాంకు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. ఎంపికైన అభ్యర్థులు దేశంలో ఎక్కడైనా పని చేయాల్సి ఉంటుంది.

వంద మార్కులకు పరీక్ష

ఎంపిక ప్రక్రియలో తొలి దశ అయిన ఆన్‌లైన్ రాత పరీక్షలో 100 మార్కులకు గాను 100 ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ పరీక్షలో ఇంగ్లిష్‌పై 25 ప్రశ్నలు (25 మార్కులు), జనరల్ అవేర్‌నెస్‌పై 25 ప్రశ్నలు (25 మార్కులు), ప్రొఫెషనల్ నాలెడ్జ్‌పై 50 ప్రశ్నలు (50 మార్కులు) ఉంటాయి. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కును తగ్గిస్తారు.

ప్రొబేషన్, సర్వీస్ బాండ్

ఎంపికైన అభ్యర్థులు ఉద్యోగంలో చేరిన తేదీ నుంచి మూడేళ్ల పాటు సంస్థలో పని చేస్తామని ఒప్పంద పత్రం (బాండ్) సమర్పించాల్సి ఉంటుంది. ఇందులో రెండేళ్ల ప్రొబేషన్ పీరియడ్ ఉంటుంది. ప్రొబేషనరీ పీరియడ్ తర్వాత రెగ్యులర్ ఉద్యోగిగా గుర్తింపు లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- ✦ దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- ✦ ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేదీ:12.09.2025
- ✦ ఆన్‌లైన్ దరఖాసుతకు చివరి తేదీ:13.10.2025
- ✦ పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.iob.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	329	82,501
నిఫ్టీ ▲	103	25,285

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు	మార్పు
నాస్‌డాక్	25,285	▽ 820
డోజోన్స్	45,480	▽ 878
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,427	▽ 82
డాక్స్	24,241	▽ 370
హాంగ్‌సెంగ్	3,897	▽ 37
నికాయ్	48,088	▽ 492

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	88.35	89.37
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	117.71	120.69
€	యూరో	ఎస్‌బీఐ	102.08	104.88
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	59.28	59.97
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	57.51	59.78
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.35	70.07
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.79	24.28
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.29	24.54
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.59	13.42

అప్పుతో ఐపీవో ఆట!

పబ్లిక్ ఆఫర్ రుణాలకు పెరుగుతున్న డిమాండ్

- అదృష్టం తోడైతే మంచి లాభం
- తేడా వస్తే భారీ నష్టాల రిస్క్
- షేర్లు వస్తాయన్న గ్యారంటీ లేదు
- ప్రాసెసింగ్, వడ్డీ చార్జీలు సమర్పించుకోవాల్సిందే...



ప్రైమరీ మార్కెట్‌లో ఐపీవోల (పబ్లిక్ ఆఫర్) సందడి నెలకొంది. పేరొందిన కంపెనీలకే కాదు, చిన్నా చితకా పబ్లిక్ ఆఫర్‌లకు సైతం స్పందన అదిరిపోతోంది. పట్టణాల్లో ఇంటి వద్దకే పలు రకాల సేవలను ఆఫర్ చేసే 'అర్బన్ కంపెనీ' గత నెలలోనే విజయవంతంగా ఐపీవోని ముగించుకుంది. రూ.1,900 కోట్ల సమీకరణకు రాగా.. రూ.1.95 లక్షల కోట్ల విలువైన బిడ్లు వచ్చిపడ్డాయి. 103 రెట్ల స్పందన వచ్చింది. లిస్టింగ్‌లోనే ఇన్వెస్టర్లకు 56 శాతానికి పైగా లాభాన్నిచ్చింది. ఇదొక్క ఉదాహరణే. కొన్ని ఐపీవోలు లిస్టింగ్‌తోనే అదరగొడుతుండడంతో రిటైల్ ఇన్వెస్టర్లు, హెచ్‌ఎన్‌ఐల్లో (హై నెట్‌వర్త్ ఇన్వెస్టర్లు) లాభాల కాంక్ష ఉరకలెత్తుతోంది. రుణం తీసుకుని మరీ ఎక్కువ షేర్ల కోసం బిడ్లు వేస్తున్నారు. ఫలితంగా ఐపీవో ఫండింగ్ మార్కెట్ విస్తరిస్తోంది. ఇది గమనించిన ఆర్‌బీఐ ఒక వ్యక్తికి ఐపీవో రుణ పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచుతున్నట్టు ఇటీవలి పాలసీ సమీక్షలో ప్రకటించింది. రుణంతో ఐపీవోలో పాల్గొనడం వల్ల లాభాలే కాదు, తేడా వస్తే నష్టాలనూ భరించాల్సి వస్తుంది. ఇందులో ఉండే రిస్క్‌లను తెలుసుకోకుండా దూకుడు ప్రదర్శించడం ఎంత మాత్రం మంచిది కాదు.

– సాక్షి, బిజినెస్ డెస్క్

2024-25 ఆర్థిక సంవత్సరంలో 16 బ్యాంకులు సంయుక్తంగా మంజూరు చేసిన ఐపీవో రుణాల మొత్తం రూ.7,748 కోట్లు. ఇందులో ఒక్క హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకే రూ.5,030 కోట్ల రుణ వితరణ చేసింది. కొన్ని బ్యాంక్‌లు వాటి సబ్సిడరీల రూపంలోనూ ఐపీవో ఫండింగ్‌ను అందిస్తున్నాయి. బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీలు), బ్రోకరేజీ సంస్థలు ఈ విభాగంలో ఇంతకంటే పెద్ద మొత్తంలోనే ఫండింగ్‌ను సమకూరుస్తున్నాయి. అర్బన్ కంపెనీ ఐపీవోలో నాన్ ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్ (ఎన్‌ఐఐ) విభాగంలో 78 రెట్లు అధికంగా బిడ్లు రాగా, రిటైల్ విభాగంలోనూ 41 రెట్ల అధిక స్పందన వచ్చింది. ముఖ్యంగా ఎన్‌ఐఐ విభాగంలో ఎక్కువ మంది రుణంతోనే బిడ్లు వేస్తుంటారు. 2022లో ఎల్‌ఐసీ ఐపీవో సందర్భంగా ఎల్‌ఐసీ ఉద్యోగులకు ఎస్‌బీఐ రుణాన్ని ఆఫర్ చేసింది. ఒక్కొక్కరికీ రూ.20 లక్షల రుణాన్ని 7.10 శాతం వడ్డీపై, 60 నెలల కాల వ్యవధితో ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. ఉద్యోగి, పాలసీదారుడు, రిటైల్ ఇలా మూడు విభాగాల్లోనూ షేర్లకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉండడంతో అధిక మొత్తంలో రుణాన్ని ఆఫర్ చేసింది.

2024-25లో ఐపీవో రుణాలు

బ్యాంక్	మంజూరు చేసిన రుణాలు(రూ.కోట్లలో)
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	5,029.80
బ్యాంక్ ఆఫ్ ఇండియా	1,167.11
కోటక్ బ్యాంక్	971.16
ఎస్‌బీఐ	446.44
ఐసీఐసీఐ బ్యాంక్	117.21




ఎంత రుణం?

ఐపీఓలకు దరఖాస్తు చేసుకోవడానికి ఒక పాన్ నంబర్‌పై బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల నుంచి ఇప్పుడు రూ. 25 లక్షల వరకు రుణం తీసుకోవచ్చు. గతంలో ఈ పరిమితి రూ.10 లక్షలుగానే ఉండగా ఆర్‌బీఐ తాజాగా పెంచింది. ఎన్‌బీఎఫ్‌సీ అనుబంధ సంస్థలున్న బ్రోకరేజీ సంస్థలు కూడా ఐపీఓ ఫండింగ్ విషయంలో ఇన్వెస్టర్లను ప్రోత్సహిస్తున్నాయి.

రుణ షరతులు, నియమాలు

బ్యాంక్‌లు 3-6 రోజుల కాల వ్యవధికి ఐపీవో ఫండింగ్‌ను అందిస్తున్నాయి. వీటిపై వడ్డీ రేటు 9-15 శాతం వరకు ఉంటుంది. అదే ఎన్‌బీఎఫ్‌సీల్లో అయితే ఇంతకు రెట్టింపులో ఉంటోంది. మార్కెట్లో నగదు లభ్యత, ఈక్విటీ మార్కెట్లలో సెంటిమెంట్ తదితర అంశాలు రుణంపై వడ్డీని ప్రభావితం చేస్తుంటాయి. పైగా రుణ విలువపై ఒక శాతం వరకు ప్రాసెసింగ్ చార్జీని చెల్లించాల్సి ఉంటుంది. ఐపీవోలో వేస్తున్న బిడ్ విలువకు సరిపడా రుణాన్ని పొందలేరు. ఇన్వెస్టర్ తన వంతుగా కొంత సమకూర్చుకోవాలి. ఇది ఎంతన్నది అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఏ కంపెనీ ఐపీవోకు దరఖాస్తు చేస్తున్నారు? దరఖాస్తుదారుడి గత రుణ చెల్లింపుల చరిత్ర, మార్కెట్ పరిస్థితులను బ్యాంక్‌లు/ఎన్‌బీఎఫ్‌సీలు పరిగణనలోకి తీసుకుంటాయి.



సాధారణంగా 10-25 శాతం వరకు ఇన్వెస్టర్ తన వంతు వాటా కింద సిద్ధం చేసుకోవాలి. అప్పుడే మిగిలిన మొత్తానికి రుణం లభిస్తుంది.

"రుణాన్ని 3-4 రోజుల్లో క్లియర్ చేసినప్పటికీ.. 7 రోజుల కాలానికి వడ్డీ చెల్లించాల్సిందే. లిస్టింగ్ రోజునే షేర్లను విక్రయించాలి. ఆ తర్వాత కూడా షేర్లను కొనసాగించుకోవాలంటే సొంత నిధులతోనే సాధ్యపడుతుంది. లిస్టింగ్ రోజునే ప్రిన్సిపల్ (అసలు) మొత్తాన్ని చెల్లించాలని బ్యాంక్‌లు కోరుతుంటాయి" అని జెరోదా వైస్ ప్రెసిడెంట్ మోహిత్ మెహ్రా తెలిపారు. కొన్ని బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు లిస్టింగ్ తర్వాత కూడా ఆ షేర్లను కొనసాగించుకునేందుకు అనుమతిస్తున్నాయి. ఒకవేళ ఐపీవోలో కేటాయించిన ధర కంటే తక్కువకు లిస్ట్ అయి, నష్టాల్లో కొనసాగుతుంటే, వ్యత్యాసం మేర అదనపు నిధులు సమకూర్చాలని ఇన్వెస్టర్లను కోరతాయి. ఆ మేరకు సర్దుబాటు చేస్తే, షేర్లను వెంటనే విక్రయించనక్కర్లేదు.

రిస్క్‌లు..

ఐపీవో ధర కంటే ఎక్కువలో లిస్టింగ్ అయితే మంచి లాభాలు కళ్లజూడొచ్చు. దీంతో తీసుకున్న రుణంపై బ్యాంక్‌లకు/ఎన్‌బీఎఫ్‌సీలకు అసలుతోపాటు వడ్డీని సులభంగా చెల్లించేయొచ్చు. తన వంతు ఎంతో కొంత లాభాన్ని మిగుల్చుకోవచ్చు. ఒకవేళ కేటాయించిన ధర కంటే తక్కువలో లిస్ట్ అయితే పరిస్థితి ఏంటి?. రుణం ఇచ్చిన బ్యాంక్ లేదా సంస్థ వడ్డీతోపాటు రాబట్టుకునేందుకే ప్రాధాన్యం ఇస్తుంటాయి. ఇన్వెస్టర్ లాభ, నష్టాలతో వాటికి అవసరం లేదు. కొన్ని సంస్థలు 90 రోజుల వరకు అనుమతిస్తున్నాయి కదా అని చెప్పి.. వడ్డీ చెల్లించుకుంటూ అంత కాలం పాటు ఆ షేర్లను కొనసాగించడం కూడా తెలివైన నిర్ణయం అనిపించుకోదు. ఎందుకంటే అన్ని రోజులు ఆగినప్పటికీ లాభాలు వస్తాయన్న గ్యారంటీ ఉండదు కదా?! కనుక లాభం వచ్చినా, నష్టం వచ్చినా లిస్టింగ్ రోజునాడు విక్రయించడమే సరైన విధానం అవుతుంది. ఒకవేళ షేర్లపై నష్టం బుక్ చేసుకుంటే, రుణంపై వడ్డీ రూపంలోనూ మరికొంత నష్టపోవాల్సి వస్తుంది.

ఇక పెద్ద మొత్తంలో రుణం తీసుకుని ఐపీవోలో బిడ్ వేసినప్పటికీ.. షేర్లు దక్కుతాయన్న హామీ ఉండదు. 50-100 రెట్లకు పైగా స్పందన వచ్చిన ఐపీవోల్లో కేటాయింపు అవకాశాలు చాలా తక్కువ. షేర్లు దక్కకపోతే అప్పుడు ఐపీవో కోసం తీసుకున్న రుణంపై వడ్డీని సొంత జేబు నుంచి చెల్లించుకోవాల్సి ఉంటుందని ఏంజెల్‌వన్ అడ్వైజరీ చీఫ్ అమర్‌దియో సింగ్ పేర్కొన్నారు. సాధారణంగా అధిక స్పందన ఉన్న ఐపీవోల్లో అలాట్‌మెంట్ అవకాశాలు చాలా తక్కువ. పరిమిత స్పందన ఉన్న వాటిల్లోనే కేటాయింపు అవకాశాలు ఎక్కువ. పరిమిత స్పందన వచ్చిన ఐపీవోలు లిస్టింగ్‌లో మంచి లాభాలు పంచడం తక్కువ కేసుల్లోనే కనిపిస్తోంది. జొమాటో, అర్బన్ కంపెనీ తదితర ఐపీవోలు లిస్టింగ్‌తోనే లాభాలు పంచగా, పేటీఎం, కల్యాణ్ జ్యువెలర్స్, కార్‌ట్రేడ్ టెక్, ఎస్‌బీఐ కార్డ్ కేటాయించిన ధర కంటే తక్కువకే లిస్ట్ కావడం



గమనించాలి. హ్యుందాయ్ మోటార్స్ లిస్టింగ్‌లో లాభాలను ఇవ్వకపోగా, కేటాయించిన ధర కంటే కిందకు పడిపోయి చాలా కాలం స్థిరీకరణకు నోచుకుంది. ఆ తర్వాత కొత్త గరిష్టాలను చూసింది.

సెబీ అధ్యయనం ప్రకారం ఐపీవోల్లో హెచ్‌ఎన్‌ఐ విభాగంలో 60-75 శాతం మధ్య దరఖాస్తులకు కేటాయింపులు లభించడం లేదు. రూ.75 లక్షల నుంచి రూ.కోటి మొత్తంతో బిడ్ వేసినా ఒక్క షేరు కూడా రాని సందర్భాలు కూడా ఉంటాయి. పెద్ద మొత్తంతో బిడ్ వేసినప్పటికీ.. చివరికి కొన్ని షేర్లే అలాట్ అయిన సందర్భాల్లోనూ వచ్చే లాభం వడ్డీ చెల్లించడానికి సరిపోకపోవచ్చు. లిస్టింగ్ నాటికి మార్కెట్లలో భారీ కరెక్షన్ చోటుచేసుకుంటే, అప్పుడు కూడా నష్టాల రిస్క్ ఉంటుంది. కనుక ఇన్వెస్టర్లు రుణంపై ఐపీవోలో దరఖాస్తు చేసుకోవడానికి ముందు ఈ పరిస్థితులను సమగ్రంగా విశ్లేషించుకోవాలి. తన రిస్క్ సామర్థ్యం, ఎంత మేరకు నష్టాలను భరించగలమో అర్థం చేసుకుని ముందుకు వెళ్లాల్సి ఉంటుంది.

చెల్లించడంలో విఫలమైతే..



రుణం మంజూరుకు ముందుగా బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు ఒప్పందంపై సంతకాలు చేయించుకుంటాయి. ఐపీవోలో కేటాయించే షేర్లను విక్రయించేందుకు పవర్ ఆఫ్ అటార్నీ (పీవోఏ) తీసుకుంటాయి. ఇన్వెస్టర్ నిర్ణీత గడువులోపు షేర్లను విక్రయించి, అసలు.. వడ్డీ చెల్లించడంలో విఫలమైతే రుణం ఇచ్చిన సంస్థలు బ్రోకరేజీల ద్వారా వాటిని విక్రయించేస్తాయి. ఇన్వెస్టర్ సమకూర్చిన మార్జిన్ మనీకి మించి నష్టాలు వస్తే.. అప్పుడు మిగిలిన బకాయి రాబట్టుకోవడానికి బ్యాంకులు/ఎన్‌బీఎఫ్‌సీలు చట్టపరమైన చర్యలు చేపడతాయి.

షేర్లు, ఫండ్స్‌పై రుణం

రిటైల్ ఇన్వెస్టర్లు తమ షేర్లు, ఫండ్స్‌పై రుణం తీసుకుని కూడా ఐపీవోలో పాల్గొనొచ్చు. ఇందుకు బ్రోకరేజీలు, ఎన్‌బీఎఫ్‌సీలు, బ్యాంకులు సైతం అనుమతిస్తున్నాయి. మ్యూచువల్ ఫండ్స్, ఈక్విటీ షేర్ల తనఖా విలువపై 50-75% వరకు రుణం లభిస్తుంది. వడ్డీ రేటు 12-15 శాతం వరకు ఉంటుంది. ఒక్కో ఇన్వెస్టర్ గరిష్ఠంగా రూ.కోటి వరకు రుణం పొందేందుకు ఆర్‌బీఐ ఇటీవలే అనుమతించింది.

హెచ్‌ఎన్‌ఐ విభాగంలో దరఖాస్తులు..



రిటైల్ ఇన్వెస్టర్లు రిటైల్ కోటాలో గరిష్ఠంగా రూ.2 లక్షల విలువైన షేర్లకు మాత్రమే బిడ్ వేయగలరు. అదే నాన్ ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్ (ఎన్‌ఐఐ) విభాగంలో రూ.2 లక్షలకు మించి, ఎంత మొత్తానికి అయినా బిడ్ దాఖలు చేసుకోవచ్చు. ఐపీవోల్లో సాధారణంగా రిటైల్ ఇన్వెస్టర్లకు 10-35 శాతం మధ్య, ఎన్‌ఐఐలకు 15-35 శాతం మధ్య కోటా ఉంటుంది. ఎన్‌ఐఐలోనూ రెండు విభాగాలు ఉంటాయి. రూ.2-10 లక్షల వరకు బిడ్లను స్మాల్ ఎన్‌ఐఐ కింద పరిగణిస్తారు. మొత్తం ఎన్‌ఐఐ కోటాలో వీరికి మూడింట ఒక వంతు షేర్ల కోటా ఉంటుంది. మిగిలినది రూ.10 లక్షలకు మించిన బిడ్లకు రిజర్వ్ చేస్తుంటారు.

డెల్హివరీ	బ్రోకరేజ్: మోతీలాల్ ఓస్వాల్	కొనొచ్చు

స్టాక్ వ్యూ

ప్రస్తుత ధర: రూ. 467 **టార్గెట్:** రూ. 540

ఎందుకంటే: పండుగల సీజన్‌ను ఘనంగా ఆరంభించినట్టు కంపెనీ యాజమాన్యం ప్రకటించింది. సెప్టెంబర్ మాసంలో 104.4 మిలియన్ షిప్‌మెంట్లు (ఎక్స్‌ప్రెస్, పార్ట్ ట్రక్ లోడ్ సహా) సాధించినట్టు తెలిపింది. పరిమాణం పరంగా 20 శాతానికి పైగా మార్కెట్ వాటా కలిగిన డెల్హివరీ దేశంలో అతిపెద్ద 3పీఎల్ ఎక్స్‌ప్రెస్ పార్సిల్ సంస్థగా ఉంది. ఎక్స్‌ప్రెస్ లాజిస్టిక్స్ విభాగంలో సంస్థల మధ్య స్థిరీకరణ చోటుచేసుకుంటోంది. ఈకామ్ ఎక్స్‌ప్రెస్‌ను కొనుగోలు నేపథ్యంలో పండుగల సీజన్‌లో పెరిగే రవాణా అవకాశాలను సొంతం చేసుకోవడం ద్వారా మార్కెట్ వాటా పెంచుకునేందుకు డెల్హివరీ మెరుగైన స్థితిలో ఉంది. దేశవ్యాప్తంగా 18,800 పిన్‌కోడ్‌లను చేరుకునే నెట్‌వర్క్ కలిగి ఉంది. అధిక సామర్థ్యం కలిగిన ట్రక్కింగ్ సామర్థ్యాలు, ఆటోమేటెడ్ సార్టేషన్ కేంద్రాలున్నాయి. డీ2సీ బ్రాండ్లు, ఎస్ఎంఈ రూపంలో



అధిక వృద్ధి కలిగిన ఉప విభాగాలకు సైతం సేవలు అందించే సామర్థ్యాలు ఉన్నాయి. రూ.1,400 కోట్లతో ఈకామ్ ఎక్స్‌ప్రెస్‌ను కొనుగోలు వల్ల ఎక్స్‌ప్రెస్ లాజిస్టిక్స్ సేవల్లో సామర్థ్యాలు బలపడడంతోపాటు గ్రామీణ ప్రాంతాలకూ సేవలు అందించే నెట్‌వర్క్ తోడైంది. దీనివల్ల వ్యయాలపరమైన అనుకూలతలు ఏర్పడతాయి. 2025 మార్చి నాటికి డెల్హివరీ ఎబిట్డా మార్జిన్ 4.2 శాతంగా ఉంటే, 2028 మార్చి నాటికి 7.3 శాతానికి మెరుగుపడుతుందని అంచనా వేస్తున్నాం. 2025-2028 మధ్య కాలంలో విక్రయాలు ఏటా 14 శాతం, ఎబిట్డా ఏటా 38 శాతం చొప్పున పెరగొచ్చు.

టాటా ఎలెక్సీ	బ్రోకరేజ్: ఐసీఐసీఐ సెక్యూరిటీస్	విక్రయించొచ్చు

ప్రస్తుత ధర: రూ. 5,573 **టార్గెట్:** రూ. 4,230

ఎందుకంటే: టాటా ఎలెక్సీ 2025-26 రెండో త్రైమాసికంలో (సెప్టెంబర్) ఆదాయం, మార్జిన్ల పరంగా అంచనాలకు మించిన పనితీరు నమోదు చేసింది. అయినప్పటికీ ఈ రంగంలో నిర్మాణాత్మకమైన వ్యాపార రికవరీ సంకేతాలు ఇంకా కనిపించాల్సి ఉంది. మీడియా విభాగం పనితీరు కారణంగా క్యూ2 ఆదాయంలో వృద్ధి నమోదైంది. గత కొన్ని త్రైమాసికాల్లో సాధించిన ఆర్డర్లను వేగంగా పూర్తి చేయడం, కొత్త వాటిని సాధించడంపై కంపెనీ దృష్టి సారించింది. ఆటో, హెల్త్‌కేర్ విభాగాల్లో పనితీరు పరంగా ఎలాంటి వృద్ధి కనిపించలేదు. మీడియా, కమ్యూనికేషన్ రంగంలో సవాళ్లు ఇంకా కొనసాగుతున్నాయి. కనుక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయ ఆరు నెలల కాలంలో వృద్ధి ధోరణి కొనసాగకపోవచ్చు. ఆటో విభాగంలో ఒక ప్రధాన క్లయింట్‌పై సైబర్ దాడి కారణంగా డిమాండ్ ప్రభావితమైంది. అయితే యాజమాన్యం మాత్రం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల



కాలం కంటే ద్వితీయ ఆరు నెలల కాలంలో మెరుగైన పనితీరు సాధిస్తామని భావిస్తోంది. అయినప్పటికీ క్యూ3లో కాలానుగుణమైన బలహీనత కారణంగా గణనీయమైన పురోగతి కనిపించకపోవచ్చు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని 2027 సెప్టెంబర్ చివరికి రూ.141 షేరువారీ ఆర్జన ఆధారంగా 30 పీఈ ప్రకారం రూ.4,230 లక్ష్యిత ధరను అంచనా వేస్తున్నాం. ప్రస్తుత ఆర్డర్ల నిర్వహణను వేగవంతం చేయడంతోపాటు, కొత్త ఆర్డర్లను సాధించడం, నియంత్రణపరమైన సానుకూల మార్పులతో అమెరికాలో డిమాండ్ పెరగడం అన్న రిస్క్‌లను పరిశీలించాల్సి ఉంటుంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

ఎస్‌బీఐ జనరల్ నుంచి హెల్త్ ఆల్ఫా



బీమా రంగ దిగ్గజం ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ తమ ఫ్లాగ్‌షిప్ ఆరోగ్య బీమా పథకం హెల్త్ ఆల్ఫాను ఆవిష్కరించింది. జీవన విధానాలు, ఆరోగ్య సంరక్షణ అవసరాలకు తగ్గట్లు 50 పైగా కవరేజీ ఆప్షన్లతో ఇది లభిస్తుంది. సమ్ ఇన్సూర్డ్ రూ. 5 లక్షల నుంచి ఉంటుంది. దీర్ఘకాలికంగా 5 ఏళ్ల వరకు పాలసీ వ్యవధిని ఎంచుకోవచ్చు. క్లెయిమ్స్ చేయకపోతే ఏటా పది రెట్లు క్యుములేటివ్ బోనస్, జిమ్.. స్పోర్ట్స్ గాయాలకు కవరేజీ, కోట్ జనరేట్ చేసిన అయిదు రోజుల్లోగా కొత్త పాలసీని కొనుగోలు చేస్తే 5 శాతం వెల్కం డిస్కౌంటు, డే కేర్ ట్రీట్‌మెంట్ మొదలైన ఫీచర్లు ఈ పాలసీలో ఉన్నాయి. జీఎస్‌టీ సంస్కరణల తర్వాత పరిశ్రమలో తొలిసారిగా ప్రవేశపెట్టిన పథకం ఇదని సంస్థ డిప్యూటీ సీఈవో మొహమ్మద్ ఆరిఫ్ ఖాన్ తెలిపారు.

న్యూ ఫండ్ ఆఫర్స్

ఇన్వెస్కో ఇండియా కన్జంప్షన్ ఫండ్

దేశీయంగా వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఇండియా కన్జంప్షన్ ఫండ్‌ని ప్రవేశపెట్టింది ఇన్వెస్కో మ్యూచువల్ ఫండ్. ఈ ఫండ్ అక్టోబర్ 17 వరకు అందుబాటులో ఉంటుంది. కనీసం రూ. 1,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. రోజువారీ సిప్ రూపంలో అయితే కనీసం రూ. 100, నెలవారీ అయితే రూ. 500 నుంచి పెట్టుబడులు పెట్టొచ్చు. వినియోగం థీమ్‌తో ప్రయోజనం పొందే కంపెనీల ఈక్విటీ, ఈక్విటీ సంబంధ సాధనాల్లో కనీసం 80% ఇన్వెస్ట్ చేస్తుంది. మనీష్ బొద్దార్, అమిత్ గణాత్రా ఫండ్ మేనేజర్లుగా ఉంటారు. ట్యాక్స్ శ్లాబులు మార్చడం, జీఎస్‌టీ సంస్కరణలు మొదలైనవి వినియోగానికి మరింతగా ఊతమిస్తాయని సంస్థ సీఈవో సౌరభ్ నానావటి తెలిపారు.




కోటక్ నుంచి గోల్డ్, సిల్వర్ ఫండ్

కోటక్ మహీంద్రా ఏఎంసీ కొత్తగా గోల్డ్ సిల్వర్ ప్యాసివ్ ఫండ్ ఆఫ్ ఫండ్స్ (ఎఫ్‌వోఎఫ్) పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్‌ఎఫ్‌వో) అక్టోబర్ 20తో ముగుస్తుంది. కనీసం రూ. 100 నుంచి ఇందులో ఇన్వెస్ట్ చేయొచ్చు. ఇది ప్రధానంగా కోటక్ గోల్డ్ ఈటీఎఫ్, కోటక్ సిల్వర్ ఈటీఎఫ్ యూనిట్లలో ఇన్వెస్ట్ చేస్తుంది. బంగారం, వెండిలో పెట్టుబడి అవకాశాన్ని కల్పిస్తూ, దీర్ఘకాలికంగా మూలధన వృద్ధి ప్రయోజనాలను అందించడం ఈ ఫండ్ లక్ష్యమని సంస్థ ఎండీ నీలేష్ షా తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా సెంట్రల్ బ్యాంకులు బంగారం నిల్వలను పెంచుకుంటున్నాయని, పరిశ్రమల్లో వెండి వాడకం పెరుగుతోందని ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో రెండింటి వృద్ధి ప్రయోజనాలను పొందేందుకు ఈ ఫండ్ అనువుగా ఉంటుందని పేర్కొన్నారు.



లాభాన్ని నష్టంతో సర్దుబాటు చేసుకోవచ్చా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రిసెర్చ్

ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో నాకు రూ.1.25 లక్షలకు పైగా దీర్ఘకాల మూలధన లాభం (ఎల్‌టీసీజీ) వచ్చింది. అదే సమయంలో స్వల్పకాల మూలధన నష్టం కూడా ఎదురైంది. ఈ నష్టాన్ని సర్దుబాటు చేసుకుని తక్కువ పన్ను చెల్లించడం సాధ్యపడుతుందా? – సత్యనారాయణ గొట్టిపాటి

ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో దీర్ఘకాల మూలధన లాభం వచ్చినట్టయితే.. ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.25 లక్షలకు మించిన మొత్తంపై 12.5 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ ఈక్విటీ పెట్టుబడులపై స్వల్పకాల మూలధన నష్టం (ఏడాదిలోపు విక్రయించినప్పుడు వచ్చే మొత్తం/ఎస్‌టీసీఎల్)) ఎదురైతే.. అప్పుడు ఎల్‌టీసీజీ నుంచి ఎస్‌టీసీఎల్‌ను మినహాయించుకోవచ్చు. దీనివల్ల నికరంగా చెల్లించాల్సిన పన్ను భారం తగ్గిపోతుంది. ఈక్విటీ పెట్టుబడిని కొనుగోలు చేసిన తేదీ నుంచి ఏడాది నిండిన తర్వాత విక్రయించనప్పుడు వచ్చే లాభం/నష్టాన్ని దీర్ఘకాలంగా, ఏడాది నిండకుండా విక్రయించినప్పుడు వచ్చే మొత్తాన్ని స్వల్పకాల మూలధన లాభం/నష్టం కింద పరిగణిస్తారు. ఉదాహరణకు ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో రూ.2 లక్షల దీర్ఘకాల లాభం వచ్చిందని అనుకుందాం. రూ.1.25 లక్షల వరకు పన్ను లేదు. అప్పుడు మిగిలిన రూ.75,000పై 12.5 శాతం చొప్పున రూ.9,375 పన్ను చెల్లించాలి. ఒకవేళ అదే ఆర్థిక సంవత్సరంలో రూ.50,000 స్వల్పకాల నష్టం వచ్చిందనుకోండి. నికర దీర్ఘకాల లాభం రూ.75వేలలో ఈ మొత్తాన్ని సర్దుబాటు చేసుకోవచ్చు. అప్పుడు నికర దీర్ఘకాల మూలధన లాభం రూ.25,000కు తగ్గుతుంది. దీనిపై 12.5 శాతం రేటు ప్రకారం రూ.3,125 పన్ను చెల్లిస్తే సరిపోతుంది.

ఒకవేళ ఈక్విటీ ఫండ్స్‌లో పెట్టుబడులపై వచ్చిన నష్టం దీర్ఘకాలానికి సంబంధించి అయితే.. అప్పుడు దీర్ఘకాల మూలధన లాభంతోనే సర్దుబాటు చేసుకోగలరు. అదే స్వల్పకాల మూలధన నష్టాన్ని స్వల్పకాల మూలధన లాభం, దీర్ఘకాల మూలధన లాభంతోనూ సర్దుబాటు చేసుకోవచ్చు. ఒకవేళ స్వల్పకాల నష్టం అన్నది స్వల్పకాల లాభం/దీర్ఘకాల మూలధన లాభం మించి ఉంటే.. అప్పుడు సర్దుబాటు చేసుకోగా మిగిలిన నికర నష్టాన్ని ఎనిమిది ఆర్థిక సంవత్సరాల పాటు క్యారీ ఫార్వార్డ్ (భవిష్యత్తు లాభాల్లో సర్దుబాటు) చేసుకోవచ్చు.



మ్యూచువల్ ఫండ్స్‌లో సిప్ ద్వారా ఇన్వెస్ట్ చేస్తున్నాను. నాకు గృహ రుణం ఉంది. మరో 5 ఏళ్లకు పూర్తవుతుంది. గ్రాట్యుటీ రూపంలో వచ్చే మొత్తంతో గృహ రుణాన్ని ముందుగానే తీర్చివేయాలా లేక మెరుగైన రాబడి వచ్చే చోట ఇన్వెస్ట్ చేసుకోవాలా? – జ్యోతిర్మయి

గృహ రుణాన్ని కొనసాగించుకోవచ్చు. గృహ రుణం కాకుండా ఇతర రుణాలు ఉంటే, పెట్టుబడుల కంటే ముందు వాటిని తీర్చేయడం మంచి నిర్ణయం అవుతుంది. గృహ రుణం కొనసాగించడం వల్ల నష్టం లేదనడానికి పలు కారణాలు ఉన్నాయి. అద్దె రూపంలో కొంత ఆదా చేస్తుంటారు. రుణంపై వడ్డీ చెల్లింపులకు పన్ను ప్రయోజనం ఉంది. పైగా చాలా తక్కువ రేటుకు వచ్చే రుణం ఇది. ఈ రుణం రేటుతో పోలిస్తే దీర్ఘకాలంలో పెట్టుబడులపై అధిక రాబడులు వస్తాయి. కనుక గృహ రుణం లాభదాయకమే. ఒకవేళ గృహ రుణాన్ని పూర్తిగా తీర్చివేయడం ద్వారా నిశ్చింతగా ఉండొచ్చని భావిస్తే లేదా భవిష్యత్తు ఆదాయం విషయంలో అనిశ్చితిగా ఉంటే అలాగే ముందుకెళ్లొచ్చు. గ్రాట్యుటీ ద్వారా వచ్చే మొత్తంతో ఆ పనిచేయవచ్చు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
అమెరికా-చైనా టారిఫ్ వార్.. క్యూ2 ఫలితాలపై కన్ను!
నాణ్యమైన పెట్టుబడులకు వేదిక!

రోజూ 113 ఆర్థిక నేరాలు



- 2023లో పెద్ద నగరాల్లో నమోదైన కేసులివీ..
- 2018లో ఈ సంఖ్య సగటున 86 మాత్రమే
- ఐదేళ్లలో 31% పెరిగిన ఆర్థిక నేరాలు
- రూ.1-10 లక్షల విలువైన ఆర్థిక నష్టాలే ఎక్కువ


భారత్‌లో పెద్ద నగరాల్లో ఆర్థిక నేరాలు పెరుగుతున్నాయి. 2023లో పెద్ద నగరాల్లో సగటున రోజుకు 113 ఆర్థిక నేరాలు నమోదు కాగా.. 2018లో ఈ సంఖ్య 86గా ఉంది. దాదాపు 20% ఆర్థిక నేరాలు నగరాల నుంచే నమోదవుతున్నాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) తాజా నివేదిక ప్రకారం 2018తో పోలిస్తే 2023లో ఈ నేరాలు దాదాపు 31 శాతం అధికం అయ్యాయి. వీటిలో రూ.1-10 లక్షల విలువ చేసే ఆర్థిక నష్టాల కేసులే ఎక్కువ. కోట్ల విలువైన మోసాలూ జరుగుతుండటం ఆందోళన కలిగించే అంశం. దేశవ్యాప్తంగా 2018లో పెద్ద నగరాల్లో 31,501 ఆర్థిక నేర సంబంధ కేసులు నమోదవగా, 2023లో ఈ సంఖ్య 41,220కి చేరింది. ఆ ఏడాది నగరాల్లో నేరాల రేటు లక్ష జనాభాకు 36.1గా ఉంది. దాదాపు 10లో 9 కేసులు ఫోర్జరీ, మోసానికి సంబంధించినవి. ఇటీవలి సంవత్సరాల్లో కేసుల సంఖ్య పెరిగినప్పటికీ.. కోర్టుల్లో పెండింగ్ కేసుల్లో తగ్గుదల నమోదైంది.

- సాక్షి, స్పెషల్ డెస్క్

దేశంలో ఆర్థిక నేరాల తీరు..

సంవత్సరం	పెద్ద నగరాల్లో	మొత్తం నేరాలు
2018	31,501	1,56,268
2019	33,979	1,65,693
2020	26,970	1,45,754
2021	35,185	1,74,013
2022	40,760	1,93,385
2023	41,220	2,04,973

(20 లక్షలకుపైగా జనాభా కలిగిన 19 పెద్ద నగరాలు)



పెద్ద నగరాల్లో 2023లో పరిష్కారమైన కేసుల వారీగా నష్టం విలువ

నష్టం విలువ (రూపాయల్లో)	కేసుల సంఖ్య
1 లక్ష లోపు	6,468
1-10 లక్షలు	11,583
10-50 లక్షలు	4,748
50 లక్షల నుంచి 1 కోటి	1,531
1-10 కోట్లు	1,061
11-25 కోట్లు	275
26-50 కోట్లు	40
51-100 కోట్లు	21
100 కోట్లకుపైగా	17

కేసుల సంఖ్యాపరంగా టాప్ నగరాలు

నగరం	2018	2023
ముంబై	4,803	6,476
హైదరాబాద్	1,788	5,728
జైపూర్	4,385	5,304
ఢిల్లీ	4,469	4,580
బెంగళూరు	3,241	3,858



సదుపాయాల కల్పనకే చార్జీల పెంపు

టీజీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి



హనుమకొండ: మౌలిక సదుపాయాల కల్పనకే చార్జీలు పెంచినట్లు టీజీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి అన్నారు. ఆర్టీసీ ఎండీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి పర్యటనలో భాగంగా ఆదివారం ఆర్టీసీ వరంగల్ రీజియన్‌ను సందర్శించారు. హనుమకొండలోని వరంగల్ రీజియన్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, డిపోల వారీగా ప్రగతిని సమీక్షించారు. ఆర్ఎం డి.విజయభాను, డిప్యూటీ ఆర్ఎంలు, డిపో మేనేజర్లు డిపోల వారీగా కార్యక్రమాలు, వస్తున్న ఆదాయం, తిరుగుతున్న కిలోమీటర్లు తదితర వివరాలు ఎండీకి వివరించారు. అనంతరం హనుమకొండ జిల్లా బస్ స్టేషన్‌ను పరిశీలించారు. వరంగల్-1 డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్లకు ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వస్తున్న ఆదాయం ఎక్కడికక్కడికే సరిపోతోంది. భవిష్యత్‌లో ఎలక్ట్రిక్ బస్సులు రానున్న క్రమంలో వసతులు సమకూర్చుకోవాల్సిన అవసరముందని, ఈ క్రమంలో ఆదాయం పెంచుకునేందుకే చార్జీలు పెంచినట్లు వివరించారు. ఖర్చులు తగ్గించుకోవడం, ఆదాయం పెంపుదలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తామని, వరంగల్ మహానగరానికి 100 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని తెలిపారు. సమీక్షలో ఆర్టీసీ కరీంనగర్ ఈడీ పి.సోల్మ తదితరులు పాల్గొన్నారు.

ఠాణాలను సివిల్ పంచాయితీ కార్యాలయాలుగా మార్చొద్దు

- 9 అంశాలతో పోలీస్ అధికారులకు డీజీపీ లేఖ
- శివధర్‌రెడ్డి ఘాటు లేఖపై పోలీస్‌శాఖలో తీవ్ర చర్చ



సాక్షి, హైదరాబాద్: పోలీస్‌స్టేషన్లు, పోలీస్ కార్యాలయాలను సివిల్ వివాదాలు తీర్చే పంచాయితీ కార్యాలయాలుగా మార్చొద్దని డీజీపీ బి.శివధర్‌రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. 'సివిల్ వివాదాలను పోలీస్‌స్టేషన్లు లేదా పోలీస్ కార్యాలయాల్లో పరిష్కారం చేయరాదు. ఈ విషయాలు సివిల్ కోర్టుల పరిధిలోకి వస్తాయనే విషయం తెలిసిందే. పోలీస్‌స్టేషన్లు లేదా పోలీస్ కార్యాలయాల్లో సివిల్ పంచాయితీలు నిర్వహించడంలో పాల్గొనే అధికారులపై కఠిన చర్యలు తప్పవు'అని డీజీపీ పేర్కొన్నారు. కొందరు పోలీస్ అధికారులు, సిబ్బంది తమ అవినీతితో పోలీస్‌శాఖకు మచ్చ తేవొద్దని హెచ్చరించారు. తాజాగా మొత్తం 9 అంశాలతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐపీఎస్ అధికారులు, అన్ని పోలీస్ యూనిట్ల ఆఫీసర్లు, డీఎస్పీలు, అడిషనల్ ఎస్పీలు, నాన్‌కేడర్ ఎస్పీలు, ఇతర స్టాఫ్ అధికారులకు డీజీపీ లేఖ రాసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. అందులో పోలీసింగ్ విధానాలు ఎలా ఉండాలన్న దానితో పాటు, అవినీతికి తావు లేదంటూ డీజీపీ అత్యంత స్పష్టంగా పేర్కొన్న అంశాలపై పోలీస్‌శాఖలో ఇప్పుడు అంతర్గతంగా చర్చ జరుగుతోంది. డీజీపీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శివధర్‌రెడ్డి ఈ నెల 9న అన్ని యూనిట్ల పోలీస్ ఉన్నతాధికారులతో సమావేశమైన తన పంథాను స్పష్టం చేశారు.

మీ అవినీతితో పోలీస్‌శాఖకు మచ్చ తేవొద్దు

'అవినీతి,అక్రమాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి న్యాయస్థానం ముందు నిలబెట్టేది పోలీస్ సిబ్బంది. కానీ, అవినీతికి పాల్పడే కొందరు పోలీస్‌శాఖకు అప్రతిష్ఠ తీసుకొస్తున్నారు. అవినీతికి పాల్పడి పోలీస్‌శాఖకు మచ్చ తీసుకురావొద్దు. అవినీతికి పాల్పడే సిబ్బంది పట్ల కఠినంగా వ్యవహరించాల్సి వస్తుంది. పోలీస్ యూనిఫాం అంటే గౌరవం, బాధ్యత, ప్రజలకు లేదా దేశ సేవకు ప్రతీక. అవినీతి అనేది నమ్మక ద్రోహానికి సంకేతంగా చెప్పొచ్చు. యూనిఫాం, అవినీతి రెండు విరుద్ధమైనవి. అంటే యూనిఫాం ధరించిన వ్యక్తి అవినీతికి పాల్పడితే, యూనిఫాం అసలు అర్థాన్ని చెరిపివేస్తుంది. ప్రజలు పోలీస్ శాఖపై ఉంచిన విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. మన ప్రవర్తన..యూనిఫామ్‌కు గౌరవం, ప్రభుత్వానికి ప్రతిష్ట, సమాజంలో శాంతిని కల్పించే విధంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నాను'అని డీజీపీ తన లేఖలో పేర్కొన్నారు. పేదవారి, బలహీనవర్గాల సమస్యలు విని న్యాయం చేయాలి..తద్వారా పోలీసుశాఖ పట్ల విశ్వాసం, అధికారులపై అభిమానం ఎప్పటికీ ఉంటుందని పేర్కొన్నారు. ఆపదలో ఆదుకునే వారిని పేద ప్రజలు ఎప్పటికీ మరిచిపోరు అని తన అభిప్రాయంగా డీజీపీ ఈ లేఖలో పేర్కొన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బందిని ఆలోచింపజేసేలా తన భావాలను వ్యక్తీకరిస్తూ డీజీపీ రాసిన లేఖ గురించి పోలీస్ అధికారులు, సిబ్బందిలోనూ ఇప్పుడు చర్చ జరుగుతోంది.

కాళ్లు కడిగించి.. ఆ నీరు తాగించి!

- అభ్యంతరకర ఏఐ చిత్రం పోస్టు చేశాడని..
- దమోహ్ జిల్లాలో యువకుడిపై దాష్టీకం

దమోహ్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో రూపొందించిన ఒక 'అభ్యంతరకరమైన' చిత్రాన్ని పంచుకున్నందుకు మధ్యప్రదేశ్‌లోని దమోహ్ జిల్లాలో ఒక యువకుడిని బ్రాహ్మణుడి కాళ్లు కడిగించి.. ఆ నీటిని తాగమని బలవంతం చేశారన్న ఆరోపణలపై ఆదివారం పోలీసు కేసు నమోదైంది. జిల్లా కేంద్రానికి 45 కిలోమీటర్ల దూరంలోని పతేరా పోలీస్ స్టేషన్ పరిధిలోని సతరియా గ్రామంలో శనివారం జరిగిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలివి.

చెప్పుల దండ వేసినట్లు ఏఐ చిత్రం

ఓబీసీ వర్గానికి చెందిన పురుషోత్తం కుష్వాహా, అదే గ్రామానికి చెందిన అన్నూ పాండే అనే వ్యక్తికి చెప్పుల దండ వేసినట్లు ఏఐ రూపొందించిన చిత్రాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. ఈ పోస్ట్ వైరల్ కావడంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలకు దారితీసింది. దీంతో కుష్వాహా ఆ పోస్ట్‌ను తొలగించి, బహిరంగంగా క్షమాపణ చెప్పాడని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శ్రుత్ కీర్తి సోమ్‌వంశీ తెలిపారు. అనంతరం గ్రామంలో పంచాయతీ నిర్వహించి కుష్వాహాతో బలవంతంగా పాండే కాళ్లు కడిగించి.. అదే నీటిని అతనితో తాగించారు. పంచాయతీ అతనికి రూ.5,100 జరిమానా కూడా విధించింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మరో వీడియోలో, కుష్వాహా మాట్లాడుతూ.. తాను చేసిన తప్పుకు క్షమాపణ చెప్పానని, ఈ సంఘటన రాజకీయ అంశంగా మారాలని కోరుకోవడం లేదని స్పష్టం చేస్తున్నట్లు ఉంది. కాగా, బాధితుడు ఇంతవరకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని స్థానిక అధికారులు స్పష్టం చేశారు. అయినప్పటికీ, పాండేతో సహా నలుగురిపై భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 196 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు దమోహ్ కలెక్టర్ సుధీర్ కుమార్ కోచర్ విలేకరులకు తెలిపారు. నిందితులను అరెస్టు చేసే ప్రక్రియ జరుగుతోందని ఎస్పీ తెలిపారు. ఈ సంఘటన మానవత్వంపై మచ్చని కాంగ్రెస్ పార్టీ 'ఎక్స్'లో పేర్కొంది. నేరస్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. రాష్ట్ర బీజేపీ మీడియా ఇన్‌చార్జ్ ఆశిష్ అగర్వాల్ మాట్లాడుతూ.. ప్రతిపక్ష పార్టీ ప్రతి నేరాన్నీ రాజకీయం చేస్తోందని ఆరోపించారు.



'పుంజు తోక 'కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న అంపశయ్య నవీన్, కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి, బన్న అయిలయ్య తదితరులు

కొత్తకోటవి సామాజిక మార్పు కలిగించే రచనలు

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్
- హనుమకొండలో 'పుంజు తోక'కవితా సంపుటి ఆవిష్కరణ

హనుమకొండ కల్చరల్: రిటైర్డ్ ఐపీఎస్ అధికారి కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి రచనలు సామాజికంగా మార్పు కలిగించే విధంగా ఉన్నాయని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ పేర్కొన్నారు. హనుమకొండ మిత్రమండలి ఆధ్వర్యంలో కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి రచించిన 'పుంజు తోక'కవితా సంపుటి ఆవిష్కరణ సభ ఆదివారం హనుమకొండలోని వాగ్దేవి కళాశాల ఆడిటోరియంలో జరిగింది. అంపశయ్య నవీన్ ముఖ్యఅతిథిగా పాల్గొని పుస్తకావిష్కరణ చేశారు. అనంతరం నవీన్ మాట్లాడుతూ కవి శ్రీనివాస్‌రెడ్డి సుదీర్ఘ కాలం పోలీస్‌శాఖలో పనిచేసినా తన గురించి ఈ సంపుటిలో ప్రస్తావించకపోవడం గమనార్హమన్నారు. ఆయనను అభ్యుదయ కవిగా భావిస్తున్నానని, తన ద్వారా మరిన్ని రచనలు రావాలని సూచించారు. రచయిత కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వరంగల్ తనకు ప్రత్యేక అనుభూతులను మిగిల్చిందని, తాను ఇక్కడ ట్రైనింగ్ ఏఎస్పీగా, ఎస్పీగా పనిచేశానని తెలిపారు. విద్యార్థి దశ నుంచి కవితలు రాయడం అలవాటని, తాను రాసిన కొన్ని కవితలు ఆనాడే ప్రచురితమయ్యాయని తెలిపారు. ఈ పుస్తకం రాయడంలో శ్రీశ్రీ, చలం, కాళోజీలాంటి కవులతోపాటు సినీ దర్శకులు సత్యజిత్‌రే, నర్సింగరావు స్ఫూర్తినిచ్చారన్నారు. సాహిత్యమనేది సంస్కారం అందిస్తుందని, మానవతా విలువలను కాపాడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా మిత్రమండలి కన్వీనర్ వీఆర్ విద్యార్థి, కేయూ విశ్రాంతాచార్యులు బన్న అయిలయ్య, కాళోజీ ఫౌండేషన్ అధ్యక్షుడు నాగిళ్ల రామశాస్త్రి పుస్తక పరిచయం చేశారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
సోమవారం । 13-10-2025

ఎన్డీఆర్ఎఫ్‌కు సింగరేణి శిక్షణ

➤ ఈ ఏడాది ఫిబ్రవరి 22న ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలిపోయింది. ఎన్డీఆర్ఎఫ్ ఆగమేఘాలపై ఘటనా స్థలానికి చేరుకుంది. అయితే, రెస్క్యూలో శిక్షణ, ఆపరేషన్‌కు వినియోగించే బ్రీతింగ్ ఆపరేటర్లు, పరికరాల్లేక వేచి చూడాల్సిన దుస్థితి ఏర్పడింది.

➤ ఇదే సమయంలో సమాచారం అందుకున్న సింగరేణి రెస్క్యూ బృందాలు వెంటనే టన్నెల్ వద్దకు చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించాయి. సొరంగంలో చిక్కుకున్న కార్మికులను బయటకు తెచ్చేందుకు తమ అనుభవం రంగరించి అసాధ్యమనుకున్న పనిని సుసాధ్యం చేసింది.

- 14 రోజుల పాటు రెసిడెన్షియల్ తర్ఫీదు
- గని ప్రమాదాల్లో రెస్క్యూపై మెళకువలు
- భూగర్భ గనిలో రెస్క్యూ, రికవరీ శిక్షణ



రెస్క్యూ థియరీ క్లాస్

గోదావరిఖని: ప్రకృతి వైపరీత్యాల్లో సేవలు అందిస్తున్న నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(ఎన్డీఆర్ఎఫ్) ప్రతినిధులకు సింగరేణి రెస్క్యూ ఫోర్స్ శిక్షణ ఇస్తోంది. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో రెస్క్యూ ఆపరేషన్‌ను కళ్లారా చూసిన ఎన్డీఆర్ఎఫ్ బృందం.. గనుల్లోనూ రెస్క్యూ ఆపరేషన్ చేపట్టేలా రెసిడెన్షియల్ శిక్షణ తీసుకుంటోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లోని 10వ బెటాలియన్‌కు చెందిన ఈ తొలిబ్యాచ్‌కు సింగరేణి మైన్స్ రెస్క్యూ శిక్షణ ఇస్తోంది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని మెయిన్ రెస్క్యూ స్టేషన్ ఇందుకు వేదికగా మారింది. భూగర్భ గనుల్లో ప్రమాదాలు జరిగితే ఆపరేషన్ చేయాల్సిన తీరుపై 14 రోజుల పాటు శిక్షణ కొనసాగుతుంది.

సింగరేణి రెస్క్యూకు జాతీయస్థాయిలో ప్రత్యేకత

జాతీయ స్థాయిలో ప్రత్యేకత సంతరించుకున్న సింగరేణి రెస్క్యూ ద్వారా ఎన్డీఆర్ఎఫ్‌కు శిక్షణ ఇవ్వాలని కేంద్ర ఎన్డీఆర్ఎఫ్, మినిస్ట్రీస్ ఆఫ్ హోం ఎఫైర్స్, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (డీజీఎంఎస్), సింగరేణి సంస్థ సమష్టి నిర్ణయంతో ఎన్డీఆర్ఎఫ్‌కు శిక్షణ ఇస్తున్నారు. భూగర్భ గనుల్లో ప్రమాదాలు, గనుల్లో చిక్కుకున్న ఉద్యోగులను సకాలంలో రక్షించడం, రెస్క్యూ సమయంలో తీసుకునే జాగ్రత్తలు, అప్రమత్తత తదితర అంశాలపై 14 రోజులపాటు శిక్షణ ఇస్తారు.

తొలిబ్యాచ్‌లో 30 మంది..

ఎన్డీఆర్ఎఫ్ తొలిబ్యాచ్‌లో 30మంది సిబ్బంది ఉండగా, అందులో ప్రస్తుతం 20 మంది శిక్షణ పొందుతున్నారు. ఈ బ్యాచ్‌కు సింగరేణి ఆర్జీ–2 ఏరియా పరిధిలో మూసివేసిన జీడీకే–7ఎల్ఈపీ గనిలో శిక్షణ ఇస్తున్నారు. ఇందులో ఫస్ట్ ఎయిడ్, రెస్క్యూ రికవరీ, బ్రీతింగ్ ఆపరేటర్స్, థియరీ, గ్యాస్ టెస్టింగ్ తదితర అంశాలు ఉంటున్నాయి. ఒక్కొక్క బెటాలియన్‌లో 18 బ్యాచ్‌లు ఉంటాయని అధికారులు తెలిపారు.


బ్రీతింగ్ ఆపరేటర్లను సరిచేసుకుంటున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం



బ్రీతింగ్ ఆపరేటర్లతో రెస్క్యూ శిక్షణకు సిద్ధం

ఎంతో నేర్చుకున్నాం


సింగరేణి రెస్క్యూ శిక్షణలో కొత్త విషయాలు నేర్చుకున్నాం. ఎన్డీఆర్ఎఫ్ శిక్షణలో అనేక విషయాలు నేర్చుకున్నా.. మైనింగ్ ప్రమాదాల్లో సేవలు అందించేందుకు ప్రస్తుత శిక్షణ దోహదం చేస్తుంది.

– కమలేశ్‌సింగ్, ఇన్‌స్పెక్టర్, ఎన్డీఆర్ఎఫ్

భవిష్యత్‌లో తోడ్పాటు


ప్రస్తుత శిక్షణ భవిష్యత్‌తో ఉపయోగపడుతుంది. గని ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని బయటకు తీసుకురావడం, ఇదే సమయంలో మాకు మేము ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవడం తదితర అంశాలను కళ్లకు కట్టినట్లు వివరిస్తున్నారు.

– ఎస్.వెంకటేశ్, ఎన్డీఆర్ఎఫ్, సభ్యుడు

ఆత్మ విశ్వాసం నింపింది


గనుల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుంది. పైకప్పు కూలడం, విషవాయువులు వెలువడటం, విపత్తుల్లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు రెస్క్యూ రికవరీలో శిక్షణ ఆత్మవిశ్వాసం నింపింది. కొత్త విషయాలు తెలిశాయి.

– వాసుదేవరాజు, ఎన్డీఆర్ఎఫ్ సభ్యుడు


సమగ్ర శిక్షణ ఇచ్చారు


రెస్క్యూ, రికవరీ, ఫస్ట్‌ఎయిడ్, గ్యాస్ డిటెక్షన్, బ్రీతింగ్ ఆపరేటర్ల వినియోగం తదితర అంశాలపై శిక్షణలో సమగ్రంగా వివరిస్తున్నారు. ఎస్ఎల్‌బీసీ ప్రమాదంతో కొత్త సవాల్ ఎదుర్కొన్నాం. అక్కడ సింగరేణి రెస్క్యూ పని తీరు అభినందనీయం. ఆ తర్వాతే సింగరేణి ద్వారా శిక్షణ పొందాలని నిర్ణయించుకున్నాం.

– కిరణ్‌కుమార్, అసిస్టెంట్ కమాండెంట్

ప్రజలకు పనికిరాని పార్టీ బీఆర్ఎస్

- బీజేపీ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: భారతీయ జనతా పార్టీపైన బీఆర్ఎస్ నేత కేటీ రామారావు చేసిన విమర్శలు హాస్యాస్పదమని అసెంబ్లీలో బీజేపీ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఆయన ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీని పూజకు పనికిరాని పువ్వన్నారని.. కానీ బీఆర్ఎస్ ప్రజలకు పనికిరాని పార్టీ అని ప్రజలే తీర్పు ఇచ్చారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కనీసం ఒక్క పార్లమెంట్ స్థానం కూడా గెలవని పార్టీ బీఆర్ఎస్ అన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందనే విశ్వాసం ఉందని, ప్రజలకు కూడా బీజేపీకి మద్దతుగా నిలుస్తున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీలను తుంగలో తొక్కిందన్నారు.

గెస్ట్ లెక్చరర్లకు వేతనాలేవీ?

పది నెలలుగా ఇబ్బంది పడుతున్న 1,200 మంది



సిరిసిల్లకల్చరల్: రెగ్యులర్, కాంట్రాక్ట్ అధ్యాపకులతో సమానంగా గెస్ట్ లెక్చరర్లు విధులు నిర్వర్తిస్తున్నా, 10 నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో 1,654 మంది గెస్ట్ లెక్చరర్లు ఉండేవారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన లెక్చరర్ల నియామక ప్రక్రియ ఫలితంగా సుమారు 1200 మందిని ఇంటికి పంపించారు. అయితే వీరిని తిరిగి విధుల్లోకి తీసుకుంటామని ఇంటర్‌బోర్డు కమిషనర్ హామీ ఇచ్చారు. వీళ్లకు కూడా నాలుగు నెలల వేతనాలు అందలేదు. విధుల్లో ఉన్న వారికి పది నెలలుగా వేతనాలు అందడం లేదు.

పీరియడ్ల ఆధారంగా వేతనం

నిర్దిష్ట వేతనంతో పనిలేకుండా పాఠాలు చెప్పే పీరియడ్ల సంఖ్యను ప్రామాణికంగా తీసుకొని జీతాలు చెల్లించేలా ప్రభుత్వం ముందే ఒప్పందం చేసుకుంది. రెగ్యులర్, కాంట్రాక్ట్ లెక్చరర్లతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నా అతిథి అధ్యాపకులకు జీతాలు చెల్లించే విషయంలో ప్రభుత్వం చిన్నచూపే చూస్తోంది. దీంతో గంటల ప్రాతిపదికన అందాల్సిన అరకొర వేతనాల కోసం నెలల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది.

కనీస వేతనాల కోసం పోరు

ఇంటర్ స్థాయి సైన్స్ సబ్జెక్టులకు థియరీతోపాటు ప్రయోగ తరగతులు కూడా ఉంటాయి. ఆర్ట్స్, కామర్స్ సబ్జెక్టులు బోధించే లెక్చరర్ల పరిస్థితి అధ్వానంగా ఉంటుంది. ఒక్కో పీరియడ్‌కు రూ.300 చొప్పున వారానికి గరిష్టంగా 72 గంటలు మించకుండా తరగతులు నిర్వహిస్తున్నారు.

కనీస వేతనాలు ఇవ్వండి


పీరియడ్ల ఆధారంగా నిర్ణయించిన వేతనాలతో కుటుంబాలు గడవడం కష్టంగా మారుతోంది. గెస్ట్ లెక్చరర్లు సైతం మిగిలిన వారితో సమానంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వేతనాల విషయంలో ప్రభుత్వం ఉదారత చూపించాలి. పీరియడ్‌ల వారీగా కాకుండా కనీసం వేతనాన్ని నిర్ణయించి అమలు చేయాలి.

– దీపిక, గెస్ట్ లెక్చరర్ల సంఘం సిరిసిల్ల జిల్లా అధ్యక్షురాలు

ఆ కుటుంబాలను ఆదుకోవాలి


ప్రభుత్వ జూనియర్ కళాశాలల్ని బలోపేతం చేసే దిశగా సాగుతున్న ప్రక్రియలో గెస్ట్ లెక్చరర్లు కూడా కీలకంగా వ్యవహరిస్తున్నారు. సర్కార్ విద్యపై సామాన్యుల్లో నమ్మకాన్ని పెంచుతున్నారు. విధులకు దూరమైన 1200 మందికి ఇచ్చిన హామీ నిలుపుకోవాలి. మిగిలిన వారికి పది నెలల జీతాలు వెంటనే విడుదల చేయాలి.

– గెంట్యాల రాజశేఖర్, గెస్ట్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి

సింగరేణిపై బకాయిల భారం



సింగరేణి (కొత్తగూడెం): తెలంగాణ ఏర్పడక ముందు సింగరేణి సంస్థ ఇక్కట్లలో ఉంటే.. అప్పటి ప్రభుత్వాలు సుమారు రూ.450 కోట్లు అందించి ఆదుకున్నాయి. కానీ తెలంగాణ వచ్చాక బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరుపై కార్మికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాడు సంస్థ నిధులపై లేదా ఇతరత్రా విషయాల్లో ప్రభుత్వాల నుంచి కనీస జోక్యం లేకపోగా.. ఇప్పుడు కార్మికులు బదిలీలకు సైతం కొందరు మంత్రులు, ఎమ్మెల్యేల పీఏలు లేఖలు ఇస్తున్నారని వాపోతున్నారు. కొన్నిచోట్ల మాట వినని అధికారులపై వేటు వేయించడానికి సైతం వెనకాడటం లేదనే విమర్శలు వస్తున్నాయి.

సీఎస్సార్ నిధులు దుర్వినియోగం

వందల అడుగుల లోతులో రక్తాన్ని చెమటగా మార్చి, ప్రకృతికి విరుద్ధంగా రేయింబవళ్లు కష్టపడుతూ కార్మికులు బొగ్గు ఉత్పత్తి చేస్తున్నారు. ఇలా వచ్చిన ఆదాయంలో కొంత శాతం ఓసీలు, భూగర్భ గనుల ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు సోషల్ రెస్పాన్స్‌బులిటీ (సీఎస్సార్)గా వెచ్చించాల్సి ఉంటుంది. కానీ ప్రభావిత ప్రాంతాలకు ఖర్చు చేయకుండా ఇతర చోట్ల వెచ్చిస్తూ దుర్వినియోగం చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఈ నిధులను ప్రభావిత ప్రాంతాల్లో కాక మిగతా చోట్లకు కేటాయించొద్దని ఎవరైనా అధికారులు అడ్డుకున్నా పట్టింపు ఉండటం లేదని వాపోతున్నారు.

రూ.వేల కోట్ల బకాయిలు

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో సింగరేణి సంస్థకు సుమారు రూ.25 వేల కోట్ల బకాయిలున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే అలా ఉండదని కాంగ్రెస్ నేతలు చెప్పినా ఇప్పుడు తీరు మారకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రస్తుత ప్రభుత్వంలో జూలై నాటికి సింగరేణికి రూ.19 వేల కోట్ల బకాయి పడగా.. మొత్తం రూ.44 వేల కోట్లు బాకీ పడినట్లు సమాచారం.

కొత్త గనుల్లేక.. పాత గనులు బోసిపోయి..

సింగరేణి సంస్థ ఒకప్పుడు 76 భూగర్భ గనులు, 1.20 లక్షల మంది కార్మికులతో కళకళలాడేది. నానాటికీ గనుల్లో బొగ్గు నిక్షేపాలు నిండుకుంటుండటం, కొన్ని గనుల్లో గ్యాస్ బయటకు వస్తుండడంతో మూసివేశారు. ఫలితంగా ప్రస్తుతం సింగరేణిలో 22 భూగర్భ గనులు, 18 ఓపెన్‌కాస్ట్ గనుల్లో సుమారు 40 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఇక ఎవరైనా సరే వేలంలో పాల్గొనాల్సిందేనని కేంద్ర ప్రభుత్వం నిబంధన విధించడంతో కొన్నాళ్లుగా సింగరేణికి కొత్త గనులు దక్కలేదు. ఏళ్ల తర్వాత ఒడిశాలోని నైనీ బ్లాక్‌ను దక్కించుకోగా.. ఇటీవలే మళ్లీ వేలంలో పాల్గొనాలని నిర్ణయించుకుంది.

బకాయిలు చెల్లించాల్సిందే..


సింగరేణి సంస్థకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు చెల్లించాలి. లేకపోతే సంస్థ అభివృద్ధి కుంటుపడుతుంది. పైగా సింగరేణి ఏ పని ముందుకు సాగాలన్నా ప్రభుత్వ అనుమతి తప్పనిసరైంది. అధికారులు ప్రభుత్వం చేతుల్లో కీలుబొమ్మలుగా మారారు.

– వాసిరెడ్డి సీతారామయ్య, అధ్యక్షుడు, ఏఐటీయూసీ

ఆందోళనలు చేపడతాం


ఎన్నో హామీలతో తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గడిచిన 21 మాసాల్లో సింగరేణికి రూ.19 వేల కోట్లు బకాయి పడింది. కంపెనీకి రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించేలా మా యూనియన్ ఆధ్వర్యాన ఆందోళనలు చేపడతాం.

– మిర్యాల రాజిరెడ్డి, అధ్యక్షుడు, టీబీజీకేఎస్

గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల తీరుతోనే..


గత ప్రభుత్వం బొగ్గు బకాయిలు చెల్లించి, విద్యుత్ బకాయిలు ఆపితే.. కాంగ్రెస్ ప్రభుత్వం రెండింటినీ నిలిపివేసింది. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి నెలకొంది. ఇకనైనా ప్రభుత్వం, విద్యుత్ సంస్థల నుంచి బకాయిలు చెల్లించాలి.

– పి.మాధవనాయక్, బీఎంఎస్ జాతీయ నేత

యాదగిరి క్షేత్రంలో భక్తుల రద్దీ


శ్రీస్వామి దర్శనం కోసం ఆలయ ముఖ మండపంలో వేచి ఉన్న భక్తులు


ప్రధాన బుకింగ్ కౌంటర్ నుంచి ఆలయానికి వెళ్లే దారిలో భక్తుల రద్దీ

బీసీల శత్రువు బీజేపీ అని రుజువైంది

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దయాకర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ బీసీ సమాజానికి బీజేపీ శత్రువని మరోమారు రుజువైందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. కనీసం ఒక్కసారయినా బీజేపీ నేతలు గవర్నర్‌ను కలిసి బీసీ బిల్లును ఆమోదించాలని కోరలేదని గుర్తు చేశారు. రాష్ట్రపతి దగ్గర పెండింగ్‌లో ఉన్న బిల్లును ఆమోదించాలని.. మోదీ దగ్గర నోరు కూడా మెదపలేకపోయారని విమర్శించారు. ఆ పార్టీ నుంచి ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఈటల రాజేందర్ బీసీ నాయకుడైనా,, స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు నుండే ప్రజలను భయపెట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు.

నల్లమల అందాలు చూసొద్దాం


నల్లమలలోని ఫర్హాబాద్ వ్యూ పాయింట్


సోమశిల వద్ద కృష్ణానది వ్యూ







ఆదివారం హైదరాబాద్ గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియం జరిగిన గ్లోబల్ గ్రేస్ కేన్సర్ రన్‌కు అనూహ్య స్పందన లభించింది. ఈ రన్‌ను మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, పీఏసీ చైర్మన్ అరెకపూడిగాంధీ, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, హైదరాబాద్, సైబరాబాద్ సీపీలు సజ్జనర్, అవినాష్ మహంతి జెండా ఊపి ప్రారంభించారు.

'బలమే జీవితం.. బలహీనతే మరణం' అని ఆలోచనాత్మక వాక్యం చెప్పారు స్వామి వివేకానంద. జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను తట్టుకోలేక చిన్న సమస్యలకే కుంగిపోయి ఎంతోమంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కుటుంబ సమస్యలనో.. ఆర్థిక ఇబ్బందులనో.. అనారోగ్య సమస్యలనో.. పరీక్ష తప్పామనో.. చదువు ఇష్టం లేదనో.. ప్రేమ విఫలమైందనో.. ఇలా రకరకాల కారణాలతో ఒత్తిడికి లోనై బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్న ఘటనలు జిల్లా వ్యాప్తంగా రోజురోజుకూ పెరగిపోతున్నాయి. ప్రతి సమస్యకూ పరిష్కారం ఉందన్న విషయాన్ని మరచి అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారు.

క్షణికావేశం.. తీస్తోంది ప్రాణం



2025లో సత్యసాయి జిల్లాలో ఆత్మహత్యలు ఇలా..

నియోజకవర్గం	ఆత్మహత్యలు
కదిరి	27
పుట్టపర్తి	19
ధర్మవరం	24
రాప్తాడు	16
పెనుకొండ	22
హిందూపురం	24
మడకశిర	21
మొత్తం	153

పెరుగుతున్న మానసిక సమస్యలు / అర్ధంతరంగా ముగుస్తున్న జీవితాలు
రోజుకు ఒకరు చొప్పున బలవన్మరణం / సత్యసాయి జిల్లాలో పెరుగుతున్న ఆత్మహత్యలు



సీకేపల్లి మండలం ప్యాదిండిలో ఆత్మహత్య చేసుకున్న అశ్విని (ఫైల్)



క్యాబ్‌డ్రైవర్ల వేధింపులతో ఆత్మహత్యాయత్నం చేసిన హోంగార్డు ప్రియాంక (ఫైల్)

కౌన్సెలింగ్ అవసరం



మానసిక సమస్యలకు చికిత్స అందుబాటులో ఉంది. ప్రారంభ దశలోనే గుర్తించి తగిన కౌన్సెలింగ్ ఇప్పిస్తే వ్యతిరేక ఆలోచనల నుంచి బయట పడవచ్చు. మానసిక సమస్యలతో బాధపడే వారిని మరింత కోపానికి, ఒత్తిడికి గురి చేయడం మంచిది కాదు. వారికి ప్రశాంతమైన వాతావరణం కల్పించాలి. వీలైనంత వరకూ వారు అందరిలో ఉంటూ ఆనందంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
– డాక్టర్ ఫైరోజాబేగం, డీఎంహెచ్‌ఓ

ఒక్క క్షణం ఆలోచించాలి



జీవితం ఎంతో విలువైనది. ఆత్మహత్య చేసుకునే ముందు ఒక్క క్షణం ఆలోచించాలి. ఎంతటి సమస్యకైనా పరిష్కారం ఉంటుంది. నమ్ముకున్న అమ్మ, నాన్న, భార్య, భర్త, పిల్లలు, స్నేహితులు, కుటుంబ సభ్యులు, బంధువులను ఆ క్షణంలో తలుచుకుంటే ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచనే రాదు. సమస్యలకు చావు పరిష్కారం కానే కాదు. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ సెంటర్‌ను అందుబాటులోకి తెస్తాం. యువతను మేల్కొలిపే కార్యక్రమాలు చేపడతాం.
– ఎస్.సతీష్‌కుమార్, ఎస్పీ

కదిరి: ఉన్నది ఒక్కటే జీవితం. ఏం సాధించినా అందులోనే. అలాంటి అమూల్యమైన జీవితాన్ని క్షణికావేశంలో చేజేతులా సమాప్తం చేసుకుంటే వారి మీద ఆధారపడ్డవారిని, వారి మీదే ఆశలు పెట్టుకొని జీవిస్తున్న వారిని రోడ్డున పడేసినట్లే అవుతుంది. సత్యసాయి జిల్లాలో ఈ నెల 1వ తేదీ నుండి 9వ తేదీ వరకూ కేవలం 9 రోజుల్లోనే 9 మంది పలు కారణాలతో ఆత్మహత్య చేసుకున్నారంటే ఇది మామూలు విషయం కాదు. వీరిలో అధిక శాతం మంది యువతీ యువకులే. సమస్యలు ఎదురైనప్పుడు క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాల కారణంగానే ఇలా బలవన్మరణాలు జరుగుతాయని వైద్య నిపుణులు అంటున్నారు.

భయపెడుతున్న ఘటనలు..

- మడకశిర పట్టణానికి చెందిన మధు(23) అగళి మండలంలోని ఓ అమ్మాయిని ప్రేమించాడు. ఇదే విషయంగా చివరకు జైలుకు వెళ్లాల్సి వచ్చింది. ఒక ప్రేమించిన అమ్మాయి తనకు దక్కదనే భావంతో క్షణికావేశంలో ఈ నెల 1వ తేదీ ఆత్మహత్య చేసుకున్నాడు.
- నల్లచెరువు మండలం అల్లుగుండు గ్రామానికి చెందిన కుళ్లాయప్ప(40) చిన్న పాటి అంశానికి భార్యతో గొడవ పడి కొన్నేళ్లుగా విడిగా ఉంటున్నాడు. చివరకు ఒంటరి జీవితంపై విరక్తి పుట్టి ఈ నెల 5న రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు.
- ధర్మవరంలోని కోట కాలనీకి చెందిన తొండమాల మహేష్(37) ఓ ప్రైవేటు సంస్థలో సెక్యూరిటీ గార్డుగా పని చేసేవాడు. పెళ్లి సంబంధాలేవీ కుదరడం లేదని మనస్థాపానికి గురై ఈ నెల 6న ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు.
- మడకశిర మండలం హెచ్ ఆర్ పాళ్యంకు చెందిన ప్రవీణ్‌కుమార్(27) సైతం పెళ్లి సంబంధాలు కుదరడం లేదని ఈ నెల 6న రాత్రి గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.
- చెన్నేకొత్తపల్లి మండలం ప్యాదిండి గ్రామానికి చెందిన పార్వతి, గంగాధర్‌ల కుమార్తె అశ్విని(16) రామగిరి కేజీబీవీలో ఇంటర్ చదువుతుండేది. దసరా సెలవుల్లో ఇంటికొచ్చిన ఆ విద్యార్థిని తిరిగి కళాశాలకు వెళ్లడం ఇష్టంలేక ఈ నెల 8న ఇంటి పక్కనే ఉన్న షెడ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.

... ఇలా ఒకరిద్దరు కాదు... ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ 153 మంది బలవన్మరణాలకు పాల్పడడం ఆందోళన చెందే విషయం. గతంలో ఎన్నడూ ఈ స్థాయిలో ఆత్మహత్యలు చోటుచేసుకున్న ఘటనలు లేవు. సగటున ప్రతి రెండు రోజులకు ఒకరు ఆత్యహత్య చేసుకుంటున్నట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇవన్నీ అధికారికంగా వెలుగు చూసిన ఘటనలే. ఇక అనధికారిక లెక్కలు మరిన్ని ఉన్నట్లుగా తెలుస్తోంది.

ఇవీ హెచ్చరిక సంకేతాలు..

- ఒంటరిగా ఉండటానికి ఇష్టపడటం
- స్నేహితులకు, బంధువులకు దూరంగా ఉండటం
- విపరీతమైన కోపం, భయం ప్రదర్శిస్తూ సామాజిక కార్యక్రమాలకు దూరంగా ఉండటం.
- నిరంతరం నిస్సహాయతాభావాన్ని వ్యక్త పరుస్తుండడం.
- అతిగా మద్యం సేవించడం, ప్రతీకార కాంక్షతో మాట్లాడుతుండడం.
- ఏకాగ్రత, జ్ఞాపకశక్తి సమస్యలు, నిద్ర, ఆకలిలో మార్పులు ఉండడం.
- పండగలు, వివాహాల వంటి వేడుకల్లో పాల్గొనకుండా దూరంగా ఉండటం.
- స్నేహితులకు విషాదరకమైన మెజేస్‌లు పంపడం.
- చనిపోతున్నట్లు ముందుగానే వారి మాటల్లో పరోక్షంగా వ్యక్తపరుస్తుండడం.

కళకలం



కళావిహీనంగా కనిపిస్తున్న శేషపాన్పుపై ఉన్న విష్ణుమూర్తి కుడ్య చిత్రం

- శ్రీకూర్మనాథాలయంలో రూపు కోల్పోతున్న విశిష్ట చిత్రకళా సంపద
- 42 కుడ్య చిత్రాల పరిరక్షణపై లేఖ రాసినా స్పందించని వైనం



దీపపు పొగ ద్వారా పాడయిన చిత్రం

గార: శ్రీకాకుళం జిల్లాలోని ప్రఖ్యాత వైష్ణవ క్షేత్రం శ్రీకూర్మంలోని అపురూప చిత్రకళా సంపద అవసాన దశకు చేరుకుంటోంది. ఇక్కడి అరుదైన కుడ్య చిత్రాలు రానురాను రూపు కోల్పోతున్నాయి. 15 ఏళ్ల కిందట గోడలకు రంగులు వేసే సమయంలో సున్నపు పూతను తూర్పు గోడలపై వేసేశారు. దీంతో సుమారు 18 చిత్రాలు పది శాతం కూడా కనిపించని పరిస్థితి ఉంది. మరికొన్ని చిత్రాలపై దీపపు పొగ, తెలుపు రంగు పడి ఉంది. గోడపై సున్నపు పూత పెచ్చులూడి పడిపోతున్నాయి. ఎంతో విశిష్టత కలిగిన ఈ కుడ్య చిత్రాలు రూపుకోల్పోతున్నా అధికారులు స్పందించడం లేదు. ఇటీవల ఆలయానికి వచ్చిన గోవా గవర్నర్, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పూసపాటి అశోకగజపతి రాజు కుడ్య చిత్రాలు కాపాడుకోవాల్సి ఉందని, పూర్వీకుల నైపుణ్యాన్ని భావితరాలకు అందించాల్సి ఉందని తెలిపారు. జూలై 25వ తేదీ వచ్చిన దేవదాయ ధర్మాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తన పర్యటనలో చిత్రాల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని, ఆర్కియాలజీ సాంకేతిక బృందం త్వరలో వస్తుందని తెలిపారు. ఆలయాన్ని దేవదాయ శాఖ పర్యవేక్షిస్తున్నా, రాష్ట్ర ఆర్కియాలజీ మాన్యుమెంట్ (రక్షిత కట్టడం)గా గుర్తింపు ఉండటంతో ఆ శాఖ అనుమతి తప్పనిసరై ఉంది.

16 శతాబ్దానివి..

శ్రీకూర్మనాథాలయంలో 16, 17వ శతాబ్దాల్లో అప్పటి చిత్రకళా నిపుణులు ఈ చిత్రాలు వేసినట్టు చరిత్రకారుల అంచనా. బేడా మంటపంలోని దక్షిణ గోడకు ఉన్న చిత్రాలను దర్శించవచ్చు. చాలా చిత్రాలు రూపుకోల్పోయి పోల్చుకోలేని స్థితిలో ఉన్నాయి. విశిష్టమైన పురాతన కాలంనాటి కుడ్య చిత్రాలు (ఆకుపసర చిత్రాలు) కళావిహీనంగా తయారవుతున్నాయి. ఏటా చిత్రాలు స్పష్టత కోల్పోతూ వస్తున్నాయి. ప్రతి చిత్రం కింద భాగంలో వాటి ప్రాముఖ్యతను తెలిపే బోర్డులు కూడా ఏర్పాటు చేస్తే భక్తులు సులువుగా అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది. అలాకాకపోతే భక్తులు సాధారణ చిత్రాలుగానే భావిస్తారు రూపు రేఖలు కోల్పోయిన చిత్రాలు గుర్తించేందుకు కాకినాడకు చెందిన మంచెం సుబ్రహ్మణ్యేశ్వరరావు దాదాపు మూడేళ్ల పాటు దీనిపై పరిశోధన చేసి, కొన్ని చిత్రాలు పునఃసృష్టి చేసి పుస్తకం రూపంలో తయారు చేశారు. ఈ పుస్తకావిష్కరణ సభలో స్థానిక ఎమ్మెల్యే కూడా కుడ్య చిత్రాలు పరిరక్షిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఆ దిశగా పనులేవీ చేపట్టలేదు. పూర్వీకుల కళాకారుల సృజనాత్మకతను భావితరాలకు అందించడం బాధ్యతగా తీసుకొని, వీటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని చరిత్రకారులు, చిత్ర కళా ప్రేమికులు, భక్తులు కోరుతున్నారు.

ఆర్కియాలజీకి లేఖ రాశాం



దేవదాయ శాఖ మంత్రి పర్యటనలో ఆర్కియాలజీ నిపుణులతో ఫోన్‌లో మాట్లాడటంతో పాటు లేఖ రాయాలని ఆదేశాలివ్వడం జరిగింది. ఇప్పటికే లేఖ పంపించాము. త్వరలోనే రాష్ట్ర ఆర్కియాలజీ నిపుణులు ఆలయాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకుంటారు.
– కె.నరసింహనాయుడు, ఈఓ, శ్రీకూర్మనాథాలయం

కుడ్య చిత్రాలు పురాతన సంపద



శ్రీకూర్మనాథాలయంలోని కుడ్య చిత్రాలు అపురూపమైన పురాతన సంపద. అప్పటి చరిత్రకారులు సృజనాత్మకత, నైపుణ్యంతో పలు చిత్రాలను వేశారు. వీటిని భావితరాలకు అందించే పని ప్రభుత్వం చేపట్టాలి.
– మంచెం సుబ్రహ్మణ్యేశ్వరరావు, కుడ్య చిత్రాల పరిశోధకుడు, కాకినాడ

చలువ పిండి భలే ఆదాయమండి!



శరీరంలో వేడి చేస్తే కొబ్బరి నీళ్లు, నిమ్మ రసం తాగుతాం. ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతంలో గిరిజనులు మాత్రం పాలపిండి (బిత్తిరి పాలు) నీళ్లను తాగుతారు. శరీరంలో వేడిని తగ్గించడంలో దివ్య ఔషధంగా పనిచేస్తుందని వారు చెబుతుంటారు. గిరిజనులు కేవలం ఇంట్లో మాత్రమే వినియోగించే ఈ పిండికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉండటంతో సాగుపై ఆసక్తి చూపుతున్నారు. వాణిజ్యపరంగా సాగుకు ఐటీడీఏ సహకారం అందిస్తే మంచి ఆదాయ వనరుగా మారుతుందని వారు చెబుతున్నారు.



దుంప పాలతో తయారుచేసిన పాలపిండి పలుకులు



సేకరించిన దుంపలు

- సాగును ప్రోత్సహిస్తే గిరి రైతులకు సిరులు
- దుంప నుంచి తయారీ
- కిలో రూ 270 నుంచి రూ.300
- శరీరంలో వేడిని తగ్గించేందుకు వినియోగం
- మార్కెట్లో మంచి డిమాండ్

వర్షాకాలంలో నాటుతాం



పాలగుండ నీటిని తాగడం వల్ల చాలా చలువ చేస్తుంది. ఇంట్లో నిల్వ ఉంచుకుంటాం. గ్రామాల్లోకి మైదాన ప్రాంతాల నుంచి వచ్చి అధికంగా కొనుగోలు చేస్తున్నారు. వర్షకాలంలో దుంపలు నాటుతాం. వేసవి కాలం నాటికి పంట దిగుబడి వస్తుంది.
– వంతల రామో, వనుగుపుట్టు,ముంచంగిపుట్టు మండలం

ఎన్నో ఉపయోగాలు



పాలపిండి వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. ఎటువంటి రసాయనాలు వినియోగించకుండా ప్రకృతి వనరులతో పండించిన దుంపల నుంచి తయారు చేస్తున్నారు. ప్రభుత్వం, పాడేరు ఐటీడీఏ పాలపిండి సాగును ప్రోత్సహించాలి.
– ఎంఎం శ్రీను, గిరిజన సంఘం, ముంచంగిపుట్టు

ఐటీడీఏ ప్రోత్సహించాలి



పాలపిండి సాగును ఐటీడీఏ ప్రోత్సహించాలి. పూర్తిశాతం రాయితీపై దుంపను రైతులకు సరఫరా చేయాలి. అందుకు తగ్గట్టుగా సాగుకు అవసరమైన పెట్టుబడిని రుణ రూపంలో అందించాలి. సహకారంల లేకనే సాగును విస్తరించలేకపోతున్నాం.
– వి.సిద్ధేశ్వరరావు, దిగువ కుమడ, ముంచంగిపుట్టు మండలం

ముంచంగిపుట్టు: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లోని గిరిజనులు పాలపిండి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఒకప్పుడు శరీరంలో వేడి తగ్గించేందుకు ఉపయోగించే ఈ పిండిని ఇంట్లో వినియోగించేవారు. ఇప్పుడు మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నందున వాణిజ్యపరంగా సాగు చేస్తున్నారు. పాడేరు ఐటీడీఏ ప్రోత్సహిస్తే మంచి ఆదాయవనరుగా మారుతుందని గిరిజన రైతులు పేర్కొంటున్నారు. ఈ సాగును అల్లూరి జిల్లా ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల్లోని 152 గ్రామాల్లో చిన్నచిన్న కమతాల్లో చేస్తున్నారు. మొత్తంమీద సుమారు 1253 ఎకరాల్లో సాగు చేస్తున్నట్టు అంచనా. ఒడిశాలోని లంతాపుట్టు, మాచ్‌ఖండ్, ఒనకడిల్లీ, పాడువ ప్రాంతాల్లో కూడా విస్తారంగా పండిస్తున్నారు. ఇళ్ల వద్ద చిన్న చిన్న కమతాల్లో పెరటి పంటగా సాగు చేస్తున్నారు. పసుపు పంట మాదిరిగానే దుంపను నాటుకోవాలి. సీజన్‌తో సంబంధం లేకుండా ఏడాది పొడవునా పండించవచ్చని గిరిజన రైతులు తెలిపారు.

దుంప నుంచి..

మొక్క పక్వానికి వచ్చిన తరువాత దుంపను పైకి తీసి నీటితో శుభ్రం చేస్తారు. గరుకుగా ఉండే జల్లెడ వెనుక భాగంపై రుద్దితో వచ్చే పిప్పిని, రసాన్ని పాత్రలోకి సేకరిస్తారు. ఒక రాత్రంతా రసాన్ని ఊరబెడతారు. మరుసటి రోజు ఉదయం రసాన్ని పాత్రలో పోసి ఎండబెడతారు. వారం రోజులకు పూర్తిగా ఎండిపోయి, కేకు ఆకారంలో గట్టిగా తయారవుతుంది. అనంతరం వీటిని ముక్కలుగా కోస్తారు. ఇలా ఎంతో కష్టపడి పాల పిండిని గిరిజనులు తయారు చేస్తున్నారు. దీనిని మార్కెట్‌లో కిలో రూ.270 నుంచి రూ.300 వరకు అమ్ముతున్నారు. మైదాన ప్రాంత వాసులు నేరుగా గిరిజనుల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. వీరి నుంచి సేకరించిన పాలపిండి ముక్కలను మైదాన ప్రాంతంలో వ్యాపారులు రూ.400 ధరకు పైగా అమ్ముతున్నారు.

ప్రయోజనాలివీ..

పాల పిండిని నీటిలో కలుపుకొని తాగుతుంటారు. చిన్నపాటి చేదు అనిపించే వారు పంచదార కలిపి సేవిస్తారు. శరీరంలో వేడిని క్షణాల్లో తగ్గించి చలువ చేస్తుందని గిరిజనులు చెబుతున్నారు. పచ్చ కామెర్ల వ్యాధిగ్రస్తులు వినియోగిస్తారని తెలిపారు.

- సరిహద్దు గ్రామాల్లో ప్రతి గిరిజనుడి ఇంటి వద్ద పాలపిండి నిల్వ ఉంటుంది. వేసవి కాలంలో ఇంటికి వచ్చే అతిథులకు పాలపిండి నీటిని ఇవ్వడం ఆనవాయితీ. రోగనిరోధక శక్తి పెంపులో ఉపయోగపడుతుందని గిరిజనులు చెబుతున్నారు.

సాగును ప్రోత్సహిస్తే మంచి ఆదాయం

పాలపిండి సాగును వాణిజ్యపరంగా ఐటీడీఏ తగిన సహకారం అందించి ప్రోత్సహిస్తే గిరిజన రైతులకు మంచి ఆదాయ వనరుగా మారుతుందని పలువురు సూచిస్తున్నారు. గతంలో సరిహద్దు గ్రామాల్లో పర్యటించిన కలెక్టర్లు, ఐటీడీఏ పీవోలు సాగు గురించి తెలుసుకున్న సందర్భాలు ఉన్నాయి. అవసరమైన రుణ సౌకర్యం అందిస్తామని, సాగు విస్తీర్ణం పెంచాలని హామీఇచ్చినా కార్యరూపం దాల్చిన పరిస్థితులు లేవు.

దేశవ్యాప్తంగా హైడ్రోజన్ బస్సులు

33 వేల ఎలక్ట్రిక్ బస్సులకు టెండర్ దాఖలు చేసిన సీఈఎస్ఎల్
ఈఈఎస్ఎల్ సీఈఓ అఖిలేష్ కుమార్ దీక్షిత్ వెల్లడి



సాక్షి, అమరావతి: దేశంలో 33 వేలకు పైగా ఎలక్ట్రిక్ బస్సులను నడపడానికి కన్వర్జెన్స్ ఎనర్జీ సర్వీసెస్ లిమిటెడ్ (సీఈఎస్ఎల్) టెండర్లు దాఖలు చేసిందని ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) సీఈఓ అఖిలేష్ కుమార్ దీక్షిత్ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. సీఈఎస్ఎల్ తాజాగా హైడ్రోజన్ బస్సులపై దృష్టి సారించి, ప్రణాళికలు సిద్ధం చేస్తోందని ఆయన తెలిపారు. హైడ్రోజన్ బస్సులకు జాతీయ స్థాయిలో డిమాండ్ కల్పించి వాటి వినియోగాన్ని పెంపొందించడం ప్రణాళిక ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జాతీయ, రాష్ట్ర స్థాయి ఏజెన్సీలను ఆహ్వానిస్తున్నామన్నారు. హైడ్రోజన్ బస్సుల విస్తరణ, ఎలక్ట్రిక్ బస్సుల వినియోగంలో తిరుపతి, విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్, వరంగల్, బెంగళూరు, మైసూర్, చెన్నై, కోయంబత్తూర్, తిరువనంతపురం వంటి దక్షిణాది నగరాలపై సీఈఎస్ఎల్ ప్రధానంగా దృష్టి సారిస్తుందని ఆయన తెలిపారు.

చల్లంగా చూడమ్మ.. మంగమ్మ తల్లి



బుట్టాయగూడెం: ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం కామవరం సమీపంలో దట్టమైన అటవీ ప్రాంతంలో కొలువై భక్తుల పూజలందుకుంటున్న గుబ్బల మంగమ్మతల్లి గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక బస్సులు, లారీలు, కార్లు, జీపులు, ద్విచక్ర వాహనాల్లో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆంధ్ర, తెలంగాణ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో మంగమ్మ తల్లి గుడికి తరలివచ్చారు. వచ్చిన భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.

యూకే గ్లౌసెస్టర్‌లో ఘనంగా శ్రీనివాస కళ్యాణం



యునైటెడ్ కింగ్‌డమ్‌లోని గ్లౌసెస్టర్ శ్రీనివాస కల్యాణంలో ఏపీఎన్ఆర్‌టీ సభ్యులు

సాక్షి, అమరావతి: యునైటెడ్ కింగ్‌డమ్‌లోని గ్లౌసెస్టర్ వేదికపై టీటీడీ ఆధ్వర్యంలో 'శ్రీనివాస కళ్యాణం' శనివారం వైభవంగా నిర్వహించారు. స్థానిక ఏపీఎన్ఆర్‌టీ సభ్యులు కుటుంబాలతో సహా హాజరై శ్రీవెంకటేశ్వరస్వామి కళ్యాణాన్ని తిలకించారు. తొలుత టీటీడీ గ్లౌసెస్టర్ నుంచి కళ్యాణ షెడ్యూల్‌ను తొలగించింది. దీనిపై ఏపీఎన్ఆర్‌టీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా హైకోర్టును ఆశ్రయించడంతో అనుకూలంగా తీర్పు వచ్చింది. ఈ క్రమంలో ఏపీఎన్ఆర్‌టీ నిర్వాహకుల ఆధ్వర్యంలో టీటీడీ శ్రీవారి కళ్యాణాన్ని చేపట్టింది.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు



ముదినేపల్లి రూరల్: ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలంలోని సింగరాయపాలెం – చేవూరిపాలెం సెంటర్‌లో సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. జిల్లాలో పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఉదయమే ఆలయానికి చేరుకుని స్వామివారి పుట్టలో పాలు పోసి దర్శించుకున్నారు. మహిళలు పాలపొంగళ్లశాల వద్ద నైవేద్యాలను తయారు చేసి స్వామికి సమర్పించారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలూ కలుగకుండా పర్యవేక్షణ చేశారు.

సైకత శిల్ప వేదిక

• చంద్రభాగ బీచ్

**గండ శిలతో చెక్కిన శిల్పాలను చూస్తాం.
పూరీ చెక్కుకున్న దారు శిల్పాలను చూస్తాం.
చంద్రభాగలో సైకత శిల్పాలను కూడా చూస్తాం.
అశోకుడి తొలి బౌద్ధచిహ్నం ధవళగిరి స్థూపం...
దేశంలో పెద్ద ఉప్పునీటి సరస్సు చిలకాలేక్.
శిల్పరాజాలు కందగిరి... ఉదయగిరి గుహలు.
వీటన్నింటినీ ఒకే ప్యాకేజ్ టూర్‌లో చూస్తాం.
అది కోణార్క్ సాండ్ ఆర్ట్ ఫెస్టివల్ టూర్.
ఫెస్టివల్ ఎప్పుడు జరుగుతుంది?
డిసెంబర్ 1 నుంచి 5 వరకు...
టూర్‌కి టికెట్ బుక్ చేసుకుందాం.**








చంద్రభాగ బీచ్

ఇంటర్నేషనల్ సాండ్ ఆర్ట్ ఫెస్టివల్ 2025. ఇది 15వ ఇంటర్నేషనల్ సాండ్ ఆర్ట్ ఫెస్టివల్. ఈ వేడుకలకు వేదిక ఒడిశా రాష్ట్రం, కోణార్క్‌లోని చంద్రభాగ బీచ్.

1 వ రోజు


హైదరాబాద్ నుంచి బయలుదేరి భువనేశ్వర్‌కు చేరాలి. భువనేశ్వర్‌లోని బిజూ పట్నాయక్ ఎయిర్‌పోర్ట్‌లో టూర్ ఆపరేటర్‌లు రిసీవ్ చేసుకుంటారు. అక్కడి నుంచి పూరీకి ప్రయాణం. దారిలో ధౌలి స్థూప వీక్షణం. పూరికి చేరిన తర్వాత హోటల్ గదిలో చెక్ అవడం, రాత్రి బస.



ధవళ గిరి స్థూపం

ధవళ గిరి స్థూపం

కొండ మీద తెల్లటి స్థూపం. భువనేశ్వర్ నుంచి ఏడు కిలోమీటర్ల దూరాన పూరీకి వెళ్లే దారిలో ఉంటుంది. అశోక చక్రవర్తి బౌద్ధాన్ని స్వీకరించిన తర్వాత నిర్మించిన తొలి స్థూపం ఇది. కళింగ యుద్ధంలో జరిగిన రక్తపాతంతో మనసు కకావికలమైన అశోకుడు బౌద్ధం వైపు మరిలిన సంగతి తెలిసిందే. అశోకుడు శాంతి మార్గంలో జీవించడానికి నిర్ణయించుకున్న తర్వాత ఏర్పాటు చేసిన స్థూపం కావడంతో దీనికి శాంతి స్థూపం అని పేరు. బౌద్ధ సన్యాసులు ఈ స్థూపాన్ని సభక్తిగా దర్శించుకుంటారు.



పూరీ జగన్నాథుని ఆలయం

2 వ రోజు

తెల్లవారు జామున బయలుదేరి జగన్నాథుని దర్శనానికి వెళ్లాలి. ఇది ప్యాకేజ్‌లో వర్తించదు. పర్యాటకులు తమకు తాముగా వెళ్లి రావాలి. దర్శనం తర్వాత హోటల్‌కు వచ్చి బ్రేక్‌ఫాస్ట్ చేసిన తర్వాత టూర్ సత్పద వైపు సాగిపోతుంది. చిలకా సరస్సు వీక్షణం తర్వాత తిరిగి పూరీకి చేరాలి. రాత్రి బస పూరీలోనే.

జగన్నాథపురి

పూరీ అని పిలిచే పట్టణానికి ఆ పేరు రావడానికి జగన్నాథుని ఆలయమే ప్రధానం. జగన్నాథపురి అనే పేరు నుంచి పురి అనే పేరు వ్యవహారంలో పూరీగా మారిపోయింది. ఈ ఆలయంలో బలభద్ర, సుభద్ర, జగన్నాథులు పూజలందుకునే దైవాలు. బలరాముడు, శ్రీకృష్ణుడు, వారి చెల్లెలు సుభద్ర విగ్రహాలు దారుశిల్పాలు. విగ్రహాల రూపం అసంపూర్తి రూపాలతో విచిత్రంగా ఉంటుంది. ఏటా జరిగే జగన్నాథుని రథయాత్ర ప్రసిద్ధి. ఇక్కడ భగవంతుడికి నివేదన చేసే వంటకాలు తయారు చేసే గది 'రోసాఘర'ను కూడా చూడాలి. 56 రకాల పదార్థాలను వండుతారు. వంటకాల్లో ఉల్లి, వెల్లుల్లి వాడరు.



చిలకా సరస్సు

సముద్రమంత సరస్సు

చిలకా సరస్సు 11 వందల చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉంది. మనదేశంలో తీరప్రాంతంలో విస్తరించిన పెద్ద తీర సరస్సు ఇది. దయా నది, భార్గవి నది, మకర, మాలగుని, లూనా నదుల నీరు బంగాళాఖాతం సముద్రంలో కలిసే చోట ఆటుపోట్లకు సముద్రపు నీరు వెనక్కి తోసుకు రావడంతో ఏర్పడిన ఉప్పు నీటి సరస్సు ఇది. మన తెలుగు రాష్ట్రంలో పులికాట్ సరస్సు కూడా అలాంటిదే. పులికాట్ సరస్సుకు వచ్చినట్లే ఖండాంతరాల నుంచి పక్షులు ఇక్కడికి కూడా ఏటా వలస వస్తాయి. గుడ్లు పెట్టి, పిల్లల్ని పొదిగి వాటికి రెక్కలు వచ్చిన తర్వాత తమతో తీసుకెళ్లిపోతాయి. చిలకా సరస్సు మరో ప్రత్యేకత ఏమిటంటే క్రీస్తుపూర్వం మూడవ శతాబ్దం నుంచి విదేశీ వర్తక వాణిజ్యాలు జరిగిన ప్రదేశం ఇది. యునెస్కో సంస్థ చిలకా సరస్సును వరల్డ్ హెరిటేజ్ సైట్‌గా గుర్తించింది. సత్పద అనే ప్రదేశంలో సరస్సు మీద కొంత దూరం వెళ్లడానికి ఒక ప్లాట్‌ఫామ్ ఉంటుంది. నీటి మీద విహారాన్ని ఆస్వాదించవచ్చు.

3 వ రోజు

బ్రేక్‌ఫాస్ట్, హోటల్ గది చెక్ అవుట్ చేసిన తర్వాత కోణార్క్‌కు ప్రయాణం. కోణార్క్ సూర్యదేవాలయ వీక్షణం, సాండ్ ఆర్ట్ ఫెస్టివల్‌ను ఆస్వాదించడం. సాయంత్రం భువనేశ్వర్‌కు ప్రయాణం. హోటల్ చెక్ ఇన్. రాత్రి బస భువనేశ్వర్‌లో.



కోణార్క్ సూర్య దేవాలయం

రథచక్రాలయం

కోణార్క్‌ని వరల్డ్ హెరిటేజ్ సైట్‌గా గుర్తించింది యునెస్కో. సూర్యదేవాలయాన్ని చూడడం అంటే ఖగోళ శాస్త్రాన్ని శిల్పాల రూపంలో తెలుసుకోవడం. ఆలయం ప్రాంగణంలోని సన్‌టెంపుల్ మ్యూజియాన్ని చూడడం మర్చిపోవద్దు. కోణార్క్ డాన్స్ ఫెస్టివల్ ఏటా అలరించేది. ఇప్పుడు సైకత శిల్ప కళల వేడుక కూడా తోడవడంతో కోణార్క్ పర్యాటకధామంగా మారింది.

ఇసుక బొమ్మల కొలువు

కోణార్క్‌లోని చంద్రభాగ బీచ్‌లో సాండ్ ఆర్ట్ కొలువు దీరి ఉంటుంది. ఈ ఏడాది డిసెంబర్ ఒకటి నుంచి ఐదవ తేదీ వరకు జరిగే ఈ ఫెస్టివల్‌కు దేశ విదేశాల సాండ్ ఆర్టిస్టులు పాల్గొంటారు. ప్రపంచ శాంతి, ప్రకృతి పరిరక్షణ వంటి థీమ్‌లతో ఒక్కొక్క ఆర్ట్ ఒక్కో సందేశాన్నిస్తుంది. సుదర్శన్ పట్నాయక్ సరదాగా మొదలు పెట్టిన సైకత శిల్పకళకు చక్కటి ఆదరణ లభించింది. ఎంతగా అంటే... ముఖ్యమైన సందర్భాలు, సామాజిక సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు ఆ అంశాన్ని పట్నాయక్ ఎలా రూపొందించాడో చూడడానికి టెలివిజన్ వార్తలను ఫాలో అయ్యేంతగా. ఇప్పుడు సుదర్శన పట్నాయక్ సాండ్ ఆర్ట్‌కి బ్రాండ్ అంబాసిడర్ అయ్యాడు. అతడి బాటలో ఈ తరం యువతీయువకులు సాండ్ ఆర్ట్‌లో శిక్షణ పొంది, ఒకరిని మించి మరొకరు చక్కటి సైకత శిల్పాలకు రూపమిస్తున్నారు.

4 వ రోజు

బ్రేక్‌ఫాస్ట్ తర్వాత జాజ్‌పూర్‌కు ప్రయాణం. బిరజాదేవి శక్తి పీఠాన్ని దర్శించుకున్న తర్వాత రత్నగిరి బౌద్ధక్షేత్ర వీక్షణం. తిరిగి భువనేశ్వర్‌కు చేరాలి. రాత్రి బస భువనేశ్వర్‌లోనే.



రత్నగిరి బౌద్ధక్షేత్రం

బిరజాదేవి ఆలయం

ఒడిశాలో బిరజ అనే పదానికి అసలు ఉచ్చారణ విరజ. గిరిజాదేవినే ఒడియా వాళ్లు బిరజాదేవి అంటారు. ఇది దుర్గాదేవి శక్తిపీఠం. విరజ క్షేత్రం అని కూడా అంటారు. ఇప్పుడు మనం చూసే ఆలయం 13వ శతాబ్దం నాటిది. రత్నగిరి బౌద్ధక్షేత్రం ఒక పురాతత్వగని. తవ్వేకొద్దీ విషయాలను వెల్లడిస్తోంది. రత్నగిరి బౌద్ధ క్షేత్రమే కాని ఇక్కడ హిందూ పౌరాణిక పాత్రల శిల్పాలు అనేకం ఉంటాయి. ఈ బౌద్ధక్షేత్రంలోని నిర్మాణాలు ఐదవ శతాబ్దం నుంచి మొదలై పదవ శతాబ్దం వరకు కొనసాగినట్లు ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా తవ్వకాల్లో నిర్ధారణ అయింది. 16వ శతాబ్దంలో వరదల్లో కప్పబడి పోవడంతో ఇక్కడ ఇంత గొప్ప నిర్మాణాలున్నాయనే విషయాన్ని కూడా మర్చిపోయారు. తవ్వకాల్లో దొరికిన శిల్పాలతో ఈ ప్రాంగణంలో మ్యూజియం ఉంది. రత్నగిరి, లలిత్‌గిరి, ఉదయగిరి గుహలను కలిపి డైమండ్ ట్రయాంగిల్‌గా పిలుస్తారు.

5 వ రోజు

బ్రేక్‌ఫాస్ట్, గది చెక్ అవుట్ చేసిన తర్వాత లింగరాజ ఆలయానికి ప్రయాణం. ఆ తర్వాత ముక్తేశ్వర్ టెంపుల్, రాజారాణి టెంపుల్ వీక్షణం. మధ్యాహ్నం తర్వాత కందగిరి గుహలు, ఉదయగిరి గుహల్లో విహారం తర్వాత రాత్రి ఎనిమిది గంటలకు టూర్ నిర్వాహకులు పర్యాటకులను భువనేశ్వర్‌లో ఎయిర్‌పోర్ట్‌లో డ్రాప్ చేస్తారు.

ఆలయాల భువనం

భువనేశ్వర్‌లో ఏమి చూడాలని అడిగితే లింగరాజ ఆలయం, ముక్తేశ్వర్, రాజారాణి ఆలయాలు అని ఒక్కమాటలో చెప్పవచ్చు. భువనేశ్వర్ గొప్పశిల్ప నిలయం. లింగరాజ ఆలయాన్ని దర్శించిన వాళ్లు, ఆలయం గురించి వివరించేటప్పుడు మొదటి మాటగా నిర్వహణ లోపాన్ని ప్రస్తావిస్తారు. చాలా మురికిగా ఉంటుందని ఆవేదన చెందుతారు. భారీ నిర్మాణం. ఆలయ నిర్మాణకౌశలం ప్రత్యేకంగా ఉంటుంది. మన దక్షిణాది నిర్మాణాలు, ఉత్తరాది నిర్మాణాలకు భిన్నమైన కళింగ నిర్మాణశైలి ఇది. ముక్తేశ్వర్ ఆలయంలో ఏకరాతి శిలాతోరణ ద్వారం గొప్ప శిల్పచాతుర్యమనే చెప్పాలి. భువనేశ్వర్‌లోని రాజారాణి ఆలయం కూడా పుణ్యక్షేత్రమే. ఈ ఆలయ నిర్మాణం అంతా పసుపు, ఎరుపు సాండ్‌స్టోన్‌ల కలయిక. ఈ రెండు రంగుల రాళ్లను రాజారాణి రాళ్లుగా పిలుస్తారు. అందుకే ఇది శివాలయమే అయినా రాజారాణి ఆలయంగా వ్యవహారంలోకి వచ్చింది.



ముక్తేశ్వర్ ఆలయం



లింగరాజ్ ఆలయం

కందగిరి ఉదయగిరి గుహలు

కొండలను గుహలుగా తొలచడమే ఒక అద్భుతం అనుకుంటే గుహల్లోపల గోడల నిండుగా రకరకాల థీమ్‌లతో శిల్పాలుంటాయి. స్థూలంగా చూసినప్పుడు శిల్పాలన్నీ ఒకేరీతిలో ఉన్నట్లు అనిపిస్తాయి. కానీ నిశితంగా పరిశీలిస్తే పౌరాణిక కథల సన్నివేశాలు కళ్లకు కడతాయి. చేతికందే ఎత్తులో ఉన్న శిల్పాలు యుద్ధానంతర దాడుల్లో ధ్వంసమైన వైనం కూడా అవగతమవుతుంది. ఉదయగిరి గుహల్లో గణేశ గుహను గమనించడం మర్చిపోవద్దు. పదడుగుల ఎత్తున్న కొండను తొలిచి వరండాలాగ మలిచారు. ఎదురుగా చెరుకు తింటున్న ఏనుగులు, ద్వారపాలకుల్లాగ సైనికులు, వరండా పైకప్పుకి స్తంభాల్లాగ చెక్కిన రాతిని కలుపుతూ నమస్కార ముద్రలో ఉన్న సాలభంజికలు... చూడ చక్కగా ఉంటాయి.

టూర్ వివరాలివి

ఐఆర్‌సీటీసీ నిర్వహిస్తున్న ఈ టూర్ పేరు 'కోణార్క్ సాండ్ ఆర్ట్ ఫెస్టివల్'. ప్యాకేజ్ కోడ్ : ఎస్‌హెచ్‌ఏ42. ఇది ఐదు రోజుల టూర్. హైదరాబాద్ నుంచి మొదలై హైదరాబాద్‌కు చేరడంతో పూర్తవుతుంది. ఈ టూర్‌లో చిలకా లేక్, కోణార్క్ టెంపుల్, బిరజాదేవి ఆలయం, భువనేశ్వర్ ప్రదేశాలకు కవర్ అవుతాయి.


- నవంబర్ 30వ తేదీ 12.35 గంటలకు '6ఈ 6911' ఫ్లైట్ హైదరాబాద్ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 14.10 గంటలకు భువనేశ్వర్‌కు చేరుతుంది.
- డిసెంబర్ 4వ తేదీ రాత్రి '6ఈ 631' ఫ్లైట్ 22.10 గంటలకు భువనేశ్వర్ నుంచి బయలుదేరి రాత్రి 23.55 గంటలకు హైదరాబాద్‌కు చేరుతుంది.

టికెట్ ధరలిలాగ:
సింగిల్ ఆక్యుపెన్సీలో 43,950 రూపాయలు.
డబుల్ ఆక్యుపెన్సీలో ఒక్కొక్కరికి 34,800 రూపాయలు,
ట్రిపుల్ ఆక్యుపెన్సీలో ఒక్కొక్కరికి 32,650 రూపాయలు.

బుకింగ్ ఎలా:
సంప్రదించాల్సిన చిరునామా:
ఐఆర్‌సీటీసీ, సౌత్‌సెంట్రల్ జోన్,
ఐఆర్‌సీటీసీ 9-1-129/1/302, థర్డ్ ఫ్లోర్, ఆక్స్‌ఫర్డ్ ప్లాజా,
ఎస్‌డీ రోడ్, సికింద్రాబాద్, తెలంగాణ.
ఫోన్ నంబరు: 040- 27702407

- వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి





ఉదయగిరి గుహలు



పెద్ద కలలు కనండి.. బుడిబుడి అడుగులు వేయండి..
అన్నింటికంటే ముఖ్యం ఆరంభించడమే!
- సైమన్ సినెక్, ప్రఖ్యాత రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణులు

అమెరికా-చైనా టారిఫ్ వార్..
క్యూ2 ఫలితాలపై కన్ను!



- ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, రిలయన్స్ తదితర బ్లూచిప్ ఫలితాలపై ఫోకస్
- ఈ వారం మార్కెట్ గమనంపై విశ్లేషకుల అభిప్రాయం

న్యూఢిల్లీ: అమెరికా-చైనా మధ్య మళ్లీ భగ్గుమన్న టారిఫ్ వార్‌తో అమెరికా మార్కెట్లు కుప్పకూలిన నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్లు ఈ భౌగోళిక, రాజకీయ పరిణమాలపై ఫోకస్ చేయనున్నారు. మరోపక్క, దేశీయంగా విడుదల కానున్న ద్రవ్యోల్బణం గణాంకాలతో పాటు రెండో త్రైమాసిక (క్యూ2) ఆర్థిక ఫలితాలు కూడా మన మార్కెట్లకు దిశానిర్దేశం చేస్తాయని విశ్లేషకులు పేర్కొన్నారు. విదేశీ ఇన్వెస్టర్ల కార్యకలాపాలు, రూపాయి కదలికలపై ఇన్వెస్టర్లు నిశితంగా దృష్టి సారించనున్నారు.

అమెరికా సూచీలు విలవిల..

రేర్ ఎర్త్ ఎగుమతులపై చైనా తాజా ఆంక్షలతో పాటు పోర్టు ఫీజుల పెంపుపై తీవ్రంగా ప్రతిస్పందించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నవంబర్ 1 నుంచి 100 శాతం అదనపు సుంకాల మోత మోగిస్తున్నట్లు ప్రకటించారు అంతేకాకుండా, కొన్ని రకాల సాఫ్ట్‌వేర్ ఎగుమతులపైనా నియంత్రణలు విధిస్తామని బాంబు పేల్చారు. ఈ నేపథ్యంలో ఇరు దేశాల మధ్య మళ్లీ టారిఫ్ వార్ తారస్థాయికి చేరుకుంది. ఇరుదేశాలు ప్రతీకార సుంకాలకు దిగితే అది ప్రపంచ వాణిజ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ దెబ్బకు గత వారాంతం (శుక్రవారం) రోజున అమెరికా సూచీలు కుదేలయ్యాయి. నాస్‌డాక్ ఏకంగా 3.56 శాతం పతనం కాగా, ఎస్ అండ్‌పీ 500 సూచీ 2.71 శాతం, డోజోన్స్ 1.9 శాతం చొప్పున పడిపోయాయి. గ్లోబల్ మార్కెట్ల ట్రెండ్‌తో పాటు తాజా భౌగోళిక రాజకీయ పరిణామాలు ఈ వారం మన మార్కెట్‌పై ప్రభావం చూపవచ్చనేది నిపుణుల అభిప్రాయం. 'దేశీయంగా క్యూ2 ఫలితాలు, ప్రపంచ స్థూల ఆర్థిక గణాంకాలు, యూఎస్-చైనా మధ్య ముదిరిన టారిఫ్ వార్ వంటివి పలు అంశాలు ఈ వారం మన మార్కెట్ దిశను నిర్దేశించవచ్చు. వాణిజ్య ఉద్రిక్తతలతో విదేశీ ఇన్వెస్టర్లు మరింత అమ్మకాలకు పాల్పడవచ్చు. దీంతో వర్ధమాన మార్కెట్లతో పాటు కరెన్సీ విలువలపై కూడా ఒత్తిడి ఇంకా పెరిగే అవకాశం ఉంది' అని ఆన్‌లైన్ ట్రేడింగ్, వెల్త్ టెక్ సంస్థ ఎన్రిచ్ మనీ సీఈఓ పొన్ముడి ఆర్ అభిప్రాయపడ్డారు.

ద్రవ్యోల్బణం గణాంకాలూ కీలకమే...

గతవారమిలా...
మార్కెట్ వరుస పతనానికి ఆర్‌బీఐ పాలసీ తర్వాత బ్రేక్ పడింది. మళ్లీ లాభాల బాట పట్టిన దేశీ మార్కెట్లు వరుసగా రెండో వారం కూడా పుంజుకున్నాయి. సెన్సెక్స్ 1,294 పాయింట్లు (1.59%), నిఫ్టీ 391 పాయింట్లు (1.57%) చొప్పున ఎగబాకాయి.

గణాంకాలు.. ఫలితాలు..

సెప్టెంబర్ నెలకు సంబంధించిన రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాలు నేడు (13న) విడుదల కానున్నాయి. 14న టోకు ధరల ద్రవ్యోల్బణం డేటా వస్తుంది. మరోపక్క, 2025-26 జులై-సెప్టెంబర్ క్వార్టర్ (క్యూ2) ఫలితాల సీజన్ వేగం పుంజుకోనుంది. ఈ వారంలోనే ఐటీ దిగ్గజాలు హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ (13న), టెక్ మహీంద్రా (14న), ఇన్ఫోసిస్ (16న) విప్రో (16న) ఎల్‌టీఐ మైండ్‌ట్రీ (16న)తో పాటు యాక్సిస్ బ్యాంక్ (15న), రిలయన్స్ ఇండస్ట్రీస్ (17న) కూడా ఆర్థిక ఫలితాలను ప్రకటించనున్నాయి. ఇప్పటికే విడుదలైన టీసీఎస్ ఫలితాలు ఇన్వెస్టర్లను నిరాశపరిచిన నేపథ్యంలో మిగతా ఐటీ కంపెనీల పనితీరును ఇన్వెస్టర్లు నిశితంగా గమనించనున్నారు. మరోపక్క, అమెరికా ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ ఈ వారంలో (మంగళవారం) చేసే ప్రసంగం కూడా మానిటరీ పాలసీ విషయంలో ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లకు దిశానిర్దేశం చేస్తుందదని రెలిగేర్ బ్రోకింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా వ్యాఖ్యానించారు. 'అమెరికా-చైనా మధ్య మళ్లీ వాణజ్య ఉద్రిక్తతల ప్రభావంతో యూఎస్ మార్కెట్లు గత వారాంతంలో ఒక్కసారిగా కుప్పకూలాయి. దిగజారిన గ్లోబల్ సెంటిమెంట్ ఈ వారం మార్కెట్లను ప్రభావితం చేయొచ్చు. ఫెడ్ చైర్మన్ పావెల్ ప్రసంగంలో వ్యాఖ్యలు కూడా వడ్డీ రేట్లపై అంచనాలు, ద్రవ్యోల్బణం తీరుపై ఇన్వెస్టర్లకు సంకేతాలు ఇవ్వనుంది' అని స్వస్తిక ఇన్వెస్ట్‌మార్ట్ రీసెర్చ్‌హెడ్ సంతోష్ మీనా పేర్కొన్నారు.

ఎస్‌బీఐలో మహిళలకు మరిన్ని అవకాశాలు

- లింగ వైవిధ్యానికి ప్రాధాన్యం
- డిప్యూటీ ఎండీ కిషోర్ కుమార్



న్యూఢిల్లీ: ఎస్‌బీఐ మరింత మంది మహిళలకు ఉపాధి కల్పించనుంది. 2030 నాటికి తన సిబ్బందిలో మహిళల భాగస్వామ్యాన్ని 30 శాతానికి పెంచుకునేందుకు గాను లింగ వైవిధ్యం దిశగా ఒక వ్యూహాన్ని రూపొందించుకున్నట్టు సంస్థ డిప్యూటీ ఎండీ, చీఫ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కిషోర్ కుమార్ ప్రకటించారు. ''కస్టమర్లకు సేవలు అందించే విభాగంలో (ఫ్రంట్‌లైన్) ఇప్పటికే మహిళల ప్రాతినిధ్యం 33 శాతంగా ఉంది. కానీ, మొత్తం సిబ్బందిలో మహిళల వాటా 27 శాతమే ఉంది. దీన్ని మరింత పెంచుకోనున్నాం. దాంతో లింగ వైవిధ్యం మరింత మెరుగుపడుతుంది''అని చెప్పారు. ఎస్‌బీఐలో 2.4 లక్షల మందికి పైగా సిబ్బంది ఉన్నారు. బ్యాంకింగ్ రంగంలో ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తోంది. బ్యాంకులోని అన్ని స్థాయిల్లోనూ మహిళలు రాణించేలా చూసేందుకు బ్యాంకు కట్టుబడి ఉన్నట్టు కిషోర్ కుమార్ చెప్పారు. అలాగే, లక్షిత కార్యక్రమాల ద్వారా నాయకత్వం, ఉద్యోగం-వ్యక్తిగత జీవితానికి మధ్య సమతుల్యతకు పలు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

13-10-2025	
విశాఖ	500-00
చిత్తూరు	553-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	510-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	505-00
వరంగల్	507-00
రిటైల్ ధర	5.65

మన ఎగుమతిదార్లకు మంచి చాన్స్..

- అగ్రరాజ్యానికి ఎగుమతులు పెంచుకోవచ్చు
- అమెరికా-చైనా వాణిజ్య యుద్ధంపై నిపుణులు



న్యూఢిల్లీ: అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధంతో భారతీయ ఎగుమతిదార్లు లబ్ధి పొందేందుకు అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడ్డారు. దీనితో అగ్రరాజ్యానికి ఎగుమతులను మరింతగా పెంచుకోవడానికి చాన్స్ లభించవచ్చని పేర్కొన్నారు. 2024-25లో అమెరికాకు భారత్ సుమారు 86 బిలియన్ డాలర్ల ఎగుమతులు చేసింది. చైనాపై భారీ టారిఫ్‌ల వల్ల అమెరికన్ కొనుగోలుదారులు భారత్‌వైపు మొగ్గు చూపవచ్చని భారతీయ ఎగుమతి సంస్థల సమాఖ్య ఎఫ్‌ఐఈవో ప్రెసిడెంట్ ఎస్‌సీ రాల్హన్ అభిప్రాయపడ్డారు. ఆ విధంగా ఈ వాణిజ్య యుద్ధం ద్వారా మనం లబ్ధి పొందే అవకాశం ఉంటుందన్నారు. నవంబర్ 1 నుంచి చైనా ఉత్పత్తులపై అదనంగా 100 శాతం టారిఫ్‌లు విధించనున్నట్లు అమెరికా ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనితో చైనా దిగుమతులపై మొత్తం సుంకాలు 130 శాతానికి చేరతాయి. అమెరికా డిఫెన్స్, ఎలక్ట్రిక్ వాహనాలు మొదలైన వాటికి కీలమైన రేర్ ఎర్త్ ఎగుమతులపై అక్టోబర్ 9న చైనా తాజాగా ఆంక్షలు విధించిన నేపథ్యంలో అగ్రరాజ్యం ఈ విధంగా స్పందించింది. ప్రస్తుతం చైనాపై అమెరికా 30 శాతం సుంకాలు విధిస్తుండగా, భారత్‌పై అంతకన్నా ఎక్కువగా 50 శాతం వేస్తోంది. దీనితో మన ఉత్పత్తుల కన్నా చైనా ఉత్పత్తులే చౌకగా లభించే పరిస్థితి నెలకొంది. అయితే, చైనాపై 100 శాతం అదనపు సుంకాలు విధించడం వల్ల అమెరికన్ మార్కెట్లో చైనా ఉత్పత్తుల ధరలు, మిగతా దేశాలతో పోటీపడలేనంతగా పెరిగిపోతాయని ఓ ఎగుమతిదారు తెలిపారు. దీంతో సుంకాలు తక్కువగా ఉన్న దేశాల వైపు అమెరికన్ కొనుగోలుదారులు మొగ్గు చూపుతారని బొమ్మల ఎగుమతిదారు మను గుప్తా తెలిపారు. ఇప్పటికే టార్గెట్‌లాంటి రిటైల్ దిగ్గజాలు కొత్త ఉత్పత్తుల కోసం తమను సంప్రదించినట్లు వివరించారు.

ఈవీల రేట్లకు రెక్కలు..

అమెరికా-చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలతో అంతర్జాతీయ మార్కెట్లలో ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ), విండ్ టర్బైన్‌లు, సెమీకండక్టర్ల విడిభాగాల రేట్లకు రెక్కలొచ్చినట్లు మేధావుల సంఘం జీటీఆర్‌ఐ తెలిపింది. ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్, పాదరక్షలు, వైట్ గూడ్స్, సోలార్ ప్యానెళ్ల కోసం అమెరికా ఎక్కువగా చైనాపైనే ఆధారపడుతోందని పేర్కొంది. వరుసగా నాలుగో ఏడాది 2024-25లో కూడా భారత్‌కి అమెరికా అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా నిల్చింది. ఇరు దేశాల మధ్య 131.84 బిలియన్ డాలర్ల (86.5 బిలియన్ డాలర్ల ఎగుమతులు) ద్వైపాక్షిక వాణిజ్యం నమోదైంది. భారత్ ఎగుమతుల్లో అమెరికా వాటా 18 శాతంగా, దిగుమతుల్లో 6.22 శాతంగా ఉంటోంది. ఇరు దేశాలు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడంపై కసరత్తు చేస్తున్నాయి.

రూ.16 లక్షల కోట్లకు ఎన్‌పీఎస్, ఏపీవై ఆస్తులు

9 కోట్లు దాటిన చందాదారులు



న్యూఢిల్లీ: జాతీయ పింఛను వ్యవస్థ (ఎన్‌పీఎస్), అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) పథకాల కింద నిర్వహణ ఆస్తులు రూ.16 లక్షల మార్క్‌ను అధిగమించాయి. ఈ రెండూ పింఛను పథకాలే. ఎన్‌పీఎస్ ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు సహా అందరికీ అందుబాటులో ఉంది. ఏపీవై అన్నది ప్రధానంగా అసంఘటిత రంగ కార్మికుల ప్రయోజనాల కోసం తీసుకొచ్చిన పథకం. ఎన్‌పీఎస్ 2004లో ప్రారంభం కాగా, ఏపీవై 2015 నుంచి మొదలైంది. ఈ రెండింటి కింద చందాదారుల సంఖ్య 9 కోట్లు దాటినట్టు పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్‌ఆర్‌డీఏ) ప్రకటించింది. గిగ్ వర్కర్లకు (తాత్కాలిక కార్మికులు/డెలివరీ సిబ్బంది తదితర) సైతం పింఛను ప్రయోజనాలు అందించే ఎన్‌పీఎస్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ నమూనాను కూడా పీఎఫ్‌ఆర్‌డీఏ ప్రవేశపెట్టింది. రిటైర్మెంట్ తర్వాత ఎన్‌పీఎస్ నిధి నుంచి క్రమంగా చెల్లింపులు, సౌకర్యవంతమైన యాన్యుటీ ప్రయోజనాలపై ఒక సంప్రదింపుల పత్రాన్ని విడుదల చేసింది. రైతులు, ఎంఎస్ఎంఈలు, స్వయం సహాయక బృందాల సభ్యులకూ పెన్షన్ ప్రయోజనాలు విస్తృతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొంది.

దీపావళి పండుగ ప్రయాణాలకు డిమాండ్

- హోటళ్లలో పెరిగిన బుకింగ్‌లు
- 15-20 శాతం వృద్ధి అంచనా



న్యూఢిల్లీ: దీపావళి సందర్భంగా ప్రయాణాలు, హోటల్ బుకింగ్‌లకు బలమైన డిమాండ్ కనిపిస్తోంది. దీపావళి సోమవారం రావడంతో, వరుస సెలవుల నేపథ్యంలో పట్టణాలు, విహార ప్రదేశాలు, వివిధ పట్టణాల మధ్య బస్ సేవలకు జోరుగా బుకింగ్‌లు నమోదవుతున్నట్టు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో 95-100 శాతానికి చేరింది. జీఎస్‌టీ సంస్కరణలతో మధ్యశ్రేణి హోటళ్లకు డిమాండ్ ఏర్పడినట్టు హోటల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (హెచ్‌ఏఐ) ప్రెసిడెంట్ కేబీ కచ్రు తెలిపారు. ఈ ఏడాది దీపావళి కారణంగా వారాంతం ఎక్కువగా ఉండడంతో మెరుగైన పండుగ అనుభవం కోసం ఎక్కువ మంది ముందుగానే తమ ప్రయాణాలకు ప్రణాళిక వేసుకున్నట్టు ఎబిక్స్ ట్రావెలర్స్ చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ విక్రమ్ ధావన్ తెలిపారు. ప్రధానంగా టైర్-2, 3 పట్టణాల్లో వృద్ధి ఎక్కువగా ఉన్నట్టు చెప్పారు. ఎయిర్‌లైన్ బుకింగ్‌లలోనూ 65-70% విహార పర్యటనలకు సంబంధించే ఉన్నట్టు తెలిపారు. క్రితం ఏడాది దీపావళి సీజన్‌తో పోల్చితే ఈ విడత 15-20% బుకింగ్‌లు పెరిగాయని చెప్పారు.

పర్యాటక రంగంలో ఏటా 25 శాతం వృద్ధి

కేంద్ర మంత్రి షెకావత్

భోపాల్: భారత జీడీపీకి పర్యాటక రంగం రూ.20 లక్షల కోట్లు సమకూరుస్తున్నట్టు కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ తెలిపారు. ఏటా 25 శాతానికి మించి వృద్ధి చెందుతూ, 8.4 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్నట్టు చెప్పారు. పర్యాటక రంగాన్ని అనుబంధ పరిశ్రమగా కాకుండా జాతీయ ప్రాధాన్యంగా చూస్తున్నట్టు పేర్కొన్నారు. భోపాల్‌లో నిర్వహించిన 'ఎంపీ ట్రావెల్ మార్ట్' కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. ''గతేడాది 2 కోట్ల మంది పర్యాటకులు భారత్‌ను సందర్శించారు. దేశీ ట్రావెలర్ల ద్వారా 294 కోట్ల పర్యటనలు చోటుచేసుకున్నాయి. ఈ రంగం ఏటా 25 శాతం చొప్పున కాంపౌండెడ్ వృద్ధిని (సీఏజీఆర్) నమోదు చేస్తుందని అంచనా వేస్తున్నాం''అని మంత్రి చెప్పారు.

టీడీఎస్సు.. భాగస్వాములు..



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

2025 బడ్జెట్‌లో ప్రవేశ పెట్టబడి, చట్టంలో చోటు చేసుకున్న టీడీఎస్‌కి సంబంధించిన అంశాల రూల్స్ గురించి ఈ వారం తెలుసుకుందాం. ఇవన్నీ 2025-26 ఆర్థిక సంవత్సరానికి అంటే నడుస్తున్న సంవత్సరానికి అమల్లోకి వచ్చాయి. 2025 ఏప్రిల్ 1 నుంచి అమల్లో పెట్టారు. భాగస్వామ్య సంస్థల్లో భాగస్వాములకు జీతం లేదా పారితోషికం మొదలైనవి ఇవ్వడం పరిపాటి. సెక్షన్ 194 టీ కొత్తగా వచ్చింది. సంస్థ చేసే చెల్లింపులు సంవత్సరానికి రూ. 20,000 దాటితే టీడీఎస్ వర్తిస్తుంది.

ముఖ్యమైన అంశాలు..

- 2025 ఏప్రిల్ 1 నుంచి అమలు
- చెల్లింపులు అంటే జీతం, పారితోషికం, వడ్డీ, కమీషన్, బోనస్. సంస్థ నుంచి పార్ట్‌నర్స్ ఇలా డ్రా చేస్తుంటారు. ఒకప్పుడు వీటిని టీడీఎస్ పరిధిలోకి తీసుకురాలేదు. 2025 ఏప్రిల్ 1 నుంచి వీటన్నింటినీ టీడీఎస్ పరిధిలోకి తెచ్చారు.
- భాగస్వామ్య సంస్థలు, లిమిటెడ్ లయబిలిటీ పార్ట్‌నర్‌షిప్‌లకు వర్తిస్తుంది.
- దీనివల్ల కాంప్లయెన్స్, పారదర్శకత పెరుగుతుందని అంటున్నారు. నిజానికి పిలక ముందే దొరుకుతుంది. ముందర కాళ్లకు బంధం.
- పైన చెప్పిన ఐదు చెల్లింపులు వెరసి .. ఒక్కొక్కటి కాదు.. అన్నీ జాయింటుగా కలిపి సంవత్సరకాలంలో రూ. 20,000 దాటితే టీడీఎస్ వర్తిస్తుంది. ఎన్నో విషయాల్లో ఒక్కొక్క చెల్లింపునకు ఒక్కొక్క పరిమితి ఉంది. కానీ ఇక్కడ అన్నీ కలిపి రూ. 20,000 దాటితే, టీడీఎస్ అని అంటున్నారు. ఇది ఇటువంటి చెల్లింపుల మీద ఒక కన్నేసి చూడటమా లేదా కన్నెర్ర చేయడమా తెలియడం లేదు.
- పార్ట్‌నర్స్ సాధారణంగా విత్‌డ్రా చేస్తుంటారు. దీన్నే సొంత వాడకాలని అంటారు. ఇటువంటి విత్‌డ్రాయల్స్ మీద ఎటువంటి టీడీఎస్ లేదు. ఇక నుంచి ట్యాక్స్ ప్లానింగ్‌పరంగా ఆలోచించి, విత్‌డ్రాయల్స్ చేయండి.
- చెల్లింపులు చేతికి రావడం, లేదా అకౌంటుకి క్రెడిట్ చేయడం.. ఈ రెండు పద్ధతుల్లో ఏది ముందు జరిగితే అప్పుడు టీడీఎస్ వర్తిస్తుంది.
- టీడీఎస్ రేటు ఎంత అంటే 10 శాతం. వెరసి చెల్లింపులు రూ. 20,000 దాటితే 10 శాతం చొప్పున టీడీఎస్ చేసి, గవర్నమెంట్ ఖాతాలో జమ చేయాల్సిందే.
- వెరసి చెల్లింపులు సంవత్సరానికి రూ. 20,000 దాటకపోతే టీడీఎస్ రూల్స్ వర్తించవు.
- 194 టీ ప్రకారం .. జీతాలు, పారితోషికం, కమీషన్, బోనస్, వడ్డీ మొదలైన చెల్లింపులు టీడీఎస్ పరిధిలోకి వస్తాయి.
- పార్ట్‌నర్స్‌కి వారి మూలధనం మీద లేదా అప్పు మీద వడ్డీ ఇచ్చే సంప్రదాయం ఉంది. అందరు పార్ట్‌నర్స్ ఒక సమాన మొత్తం క్యాపిటల్‌గా పెట్టలేరు. అలాగే, అందరూ అప్పు ఇవ్వొచ్చు.. ఇవ్వకపోవచ్చు. అదనంగా పెట్టుబడి చేసినందుకు.. ఆదనపు రాబడే ఈ వడ్డీ.
- పని చేసినందుకు జీతం ఉంటుంది. స్లీపింగ్ పార్ట్‌నర్స్‌కి జీతం ఉండదు.
- అలాగే పారితోషికం లాభాల ఆర్జనను బట్టి ఉంటుంది. అలాగే బోనస్సు.. అలాగే కమీషనూ. అంటే బుక్స్ క్లోజ్ చేసి లాభాల్ని తేల్చాలి. మార్చి 31వి వెంటనే తేల్చాలి. గడువుతేదీ ఏప్రిల్ 30. అందుకే బుక్స్ వెంటనే రాయాలి. ఈ కొత్త అంశాల వల్ల బుక్ రాసే ప్రక్రియ సజావుగా, కరెక్టుగా, సకాలంలో పూర్తవ్వాలి. ఎప్పుడో రిటర్ను వేసే ముందు తీరిగ్గా అకౌంట్లు రాయడం, ఫైనలైజ్ చేయడం కుదరదు.
- టీడీఎస్ రికవరీ, చెల్లింపులు.. బుక్స్‌లో కనిపిస్తాయి.
- రిటర్నులు దాఖలు చేయాలి.

చివరిగా, పార్ట్‌నర్స్‌కి చెల్లింపులు టీడీఎస్ మేరకు తగ్గుతాయి. క్యాష్‌ఫ్లోలు తగ్గుతాయి. సంస్థలో టీడీఎస్ బాధ్యతలు పెరుగుతాయి. ఈ మేరకు సంస్థలు సిద్ధం కావాలి.



పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

నాణ్యమైన పెట్టుబడులకు వేదిక

ఎస్‌బీఐ లార్జ్‌క్యాప్ ఫండ్



ఇటీవలి కాలంలో రిటైల్ ఇన్వెస్టర్లు లార్జ్‌క్యాప్ కంటే మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లో పెట్టుబడుల కోసం ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. అధిక రాబడుల కాంక్షే వారిని అటువైపు నడిపిస్తోంది. నెలవారీ ఈక్విటీ ఫండ్స్‌లో నికర పెట్టుబడుల గణంకాలను పరిశీలిస్తే ఇదే విషయం స్పష్టమవుతోంది. కానీ, పెట్టుబడులకు రాబడులు ఒక్కటే ప్రామాణికం కాదు. స్థిరత్వం, ఆటుపోట్లను తట్టుకోగల సామర్థ్యాలు కూడా అవసరమే. లార్జ్‌క్యాప్ పెట్టుబడులు దీన్ని భర్తీ చేస్తాయి. లార్జ్‌క్యాప్‌కు అదనంగా మిడ్, స్మాల్‌క్యాప్ విభాగాల్లోనూ కొంత చొప్పున ఇన్వెస్ట్ చేసుకోవడం మెరుగైన నిర్ణయం అవుతుంది. దీనివల్ల అధిక రాబడులతో పాటు పోర్ట్‌ఫోలియోలో ఆటుపోట్లను తగ్గించుకోవడం సాధ్యపడుతుంది. లార్జ్‌క్యాప్ విభాగంలో వివిధ రంగాలకు చెందిన దిగ్గజ కంపెనీలు ఉంటాయి. కనుక ప్రతీ ఇన్వెస్టర్ తప్పకుండా లార్జ్‌క్యాప్ విభాగానికి తమ రిస్క్ సామర్థ్యానికి అనుగుణంగా 35-75 శాతం మధ్య కేటాయించుకోవచ్చు. ఈ విభాగంలో ఎస్‌బీఐ లార్జ్‌క్యాప్ ఫండ్ మంచి పనితీరు చూపిస్తోంది.

పెట్టుబడుల విధానం

క్రమశిక్షణతో నాణ్యమైన పెట్టుబడుల విధానాన్ని ఈ పథకంలో గమనించొచ్చు. బలమైన బ్యాలన్స్ షీట్లతో ఆర్థికంగా మెరుగైన స్థితిలో ఉన్న వాటిని ఎంపిక చేసి ఇన్వెస్ట్ చేస్తుంది. పెట్టుబడుల విషయంలో దూకుడు ప్రదర్శించదు. కనుక బుల్ ర్యాలీల్లో పనితీరు పరంగా వెనుకబడినట్టు అనిపించొచ్చు. కానీ, మార్కెట్ల పతనాల్లో ఇతర లార్జ్‌క్యాప్ ఫండ్స్‌తో పోలిస్తే నష్టాలను తక్కువకు పరిమితం చేయడాన్ని గమనించొచ్చు. పోర్ట్‌ఫోలియోలో 50 శాతం వరకు స్టాక్స్‌ను నిర్వహిస్తుంటుంది. తద్వారా వైవిధ్యానికి కూడా ప్రాధాన్యం ఇస్తుంటుంది. 2024 ఏప్రిల్‌లో ఈ ఫండ్ నిర్వహణ బృందంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఆ తర్వాత కూడా పనితీరు స్థిరంగా కొనసాగుతోంది.



రాబడులు

ఈ పథకం దీర్ఘకాల పనితీరును గమనిస్తే బలంగా ఉన్నట్టు తెలుస్తుంది. డైరెక్ట్ ప్లాన్ గత ఐదేళ్లలో ఏటా 19.6 శాతం చొప్పున కాంపౌండెడ్ రాబడిని అందించింది. బెంచ్‌మార్క్, లార్జ్‌క్యాప్ విభాగం పనితీరు కంటే ఐదేళ్ల కాలంలో ఈ పథకమే మెరుగ్గా ఉంది. పదేళ్లలో కాలంలోనూ ఏటా 13.6 శాతం చొప్పున రాబడితో లార్జ్‌క్యాప్ విభాగం కంటే అధిక రాబడిని ఇచ్చింది. ముఖ్యంగా గత ఆరు నెలల్లో 12 శాతం రాబడిని అందించింది. ఏడాది కాల రాబడి మాత్రం ఒక శాతం వరకే ఉంది. గత ఏడాదిగా మార్కెట్లలో ర్యాలీ లేకపోవడం ఇందుకు కారణం. మూడేళ్ల పనితీరును గమనిస్తే.. ఏటా 15 శాతం, ఏడేళ్లలోనూ ఏటా 15.88 శాతం వరకు రాబడిని తెచ్చిపెట్టింది.

పోర్ట్‌ఫోలియో

ఈ పథకం నిర్వహణలో ప్రస్తుతం రూ.52 వేల కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 96.81 శాతం మేర ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయగా, డెట్ సాధనాలకు 0.69 శాతం కేటాయించింది. 2.5 శాతం మేర నగదు నిల్వలు కలిగి ఉంది. పెట్టుబడులను గమనిస్తే.. 92 శాతం మేర లార్జ్‌కోయ్‌ప్ కంపెనీల్లోనే ఉన్నాయి. 7.65 శాతం మేర మిడ్‌క్యాప్ స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసింది. పెట్టుబడుల పరంగా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. 33 శాతం మేర ఈ రంగాలకు చెందిన కంపెనీల్లోనే ఉన్నాయి. ఆ తర్వాత మెటీరియల్స్ కంపెనీల్లో 10.84 శాతం, టెక్నాలజీ కంపెనీల్లో 10.59 శాతం, కన్స్యూమర్ డిస్క్రీషినరీ కంపెనీల్లో 9.68 శాతం చొప్పున పెట్టుబడులు ఉన్నాయి. ఈ పథకంలో ఏక మొత్తంలో అయితే రూ.5,000, సిప్ రూపంలో అయితే రూ.500 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడులు శాతం
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	9.25
రిలయన్స్ ఇండస్ట్రీస్	7.49
ఐసీఐసీఐ బ్యాంక్	7.40
ఎల్‌అండ్‌టీ	5.13
ఐషర్ మోటార్స్	4.08
ఇన్ఫోసిస్	3.98
ఏషియన్ పెయింట్స్	3.69
బ్రిటానియా ఇండస్ట్రీస్	3.49
కోటక్ బ్యాంక్	3.47
ఎస్‌బీఐ	3.16

యువ భారత్ జోరు

- వరుసగా రెండో మ్యాచ్‌లో విజయం
- 4-2 గోల్స్ తేడాతో న్యూజిలాండ్‌పై గెలుపు
- సుల్తాన్ జొహర్ కప్ హాకీ టోర్నమెంట్



జొహర్ (మలేసియా): సుల్తాన్ జొహర్ కప్‌లో భారత జూనియర్ పురుషుల హాకీ జట్టు జోరు కొనసాగుతోంది. తొలి పోరులో బ్రిటన్‌ను చిత్తు చేసిన యువభారత్... రెండో మ్యాచ్‌లో న్యూజిలాండ్‌ను మట్టికరిపించింది. ఆదివారం జరిగిన పోరులో భారత్ 4-2 గోల్స్ తేడాతో న్యూజిలాండ్‌పై విజయం సాధించింది. భారత్ తరఫున అర్ష్‌దీప్ సింగ్ (2వ నిమిషంలో), పీబీ సునీల్ (15వ నిమిషంలో), అరిజిత్‌సింగ్ హుండల్ (26వ నిమిషంలో), రోషన్ కుజుర్ (47వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. న్యూజిలాండ్ తరఫున గస్ నెల్సన్ (41వ నిమిషంలో), ఎయిడెన్ మ్యాక్స్ (52వ నిమిషంలో) చెరో గోల్ కొట్టారు. మ్యాచ్ ప్రారంభమైన రెండో నిమిషంలోనే ప్రత్యర్థి డిఫెన్స్ బలహీనతలను సొమ్ము చేసుకుంటూ అర్ష్‌దీప్ గోల్ సాధించడంతో యువ భారత జట్టు ఖాతా తెరిచింది. న్యూజిలాండ్ కీపర్ బంతిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా... రెండోసారి అవకాశం దక్కించుకున్న అర్ష్‌దీప్ విజయవంతంగా బంతిని నెట్‌లోకి పంపాడు. తొలి క్వార్టర్ ఆఖర్లో వచ్చిన పెనాల్టీ కార్నర్ అవకాశాన్ని సునీల్ సద్వినియోగం చేసుకోవడంతో భారత జట్టు 2-0తో ఆధిక్యంలో నిలిచింది. రెండో క్వార్టర్‌లో అరైజీత్ సింగ్ హుండల్ గోల్‌తో భారత్ ఆధిక్యం మరింత పెరిగింది. ఎట్టకేలకు 41వ నిమిషంలో న్యూజిలాండ్ తొలి గోల్ నమోదు చేసుకుంది. ఇక చివరి క్వార్టర్‌లో మరో పెనాల్టీ కార్నర్ అవకాశాన్ని రోషన్ కుజుర్ గోల్‌గా మలచగా... ఆఖర్లో న్యూజిలాండ్ మరో గోల్ చేసినా లాభం లేకపోయింది. టోర్నీలో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన భారత జట్టు... తదుపరి మ్యాచ్‌లో మంగళవారం దాయాది పాకిస్తాన్‌తో తలపడనుంది.

వారెవ్వా వాలెంటిన్...

- క్వాలిఫయర్‌గా వచ్చి చాంపియన్‌గా అవతరించిన మొనాకో టెన్నిస్ ప్లేయర్
- షాంఘై ఓపెన్ ఏటీపీ-1000 సింగిల్స్ టైటిల్ హస్తగతం
- మాస్టర్స్ సిరీస్ టైటిల్ గెలిచిన తక్కువ ర్యాంకర్‌గా గుర్తింపు



షాంఘై: ఊహకందని ప్రదర్శనతో ఆద్యంతం అదరగొట్టిన మొనాకో టెన్నిస్ ప్లేయర్ వాలెంటిన్ వాచెరోట్ తన కెరీర్‌లోనే చిరస్మరణీయ విజయాన్ని అందుకున్నాడు. ఆదివారం ముగిసిన షాంఘై ఓపెన్ ఏటీపీ మాస్టర్స్-1000 సిరీస్ టోర్నీలో ప్రపంచ 204వ ర్యాంకర్ వాలెంటిన్ చాంపియన్‌గా అవతరించాడు. క్వాలిఫయింగ్ రౌండ్‌లో రెండు మ్యాచ్‌ల్లో గెలిచి మెయిన్ 'డ్రా'లో అడుగు పెట్టిన వాలెంటిన్... మెయిన్ 'డ్రా'లోనూ మెరిపించాడు. ఫైనల్లో వాలెంటిన్ 4-6, 6-3, 6-3తో ఆర్థర్ రిండెర్‌నీచ్ (నెదర్లాండ్స్)పై గెలుపొంది తన కెరీర్‌లో తొలి టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. విజేతగా నిలిచిన వాలెంటిన్‌కు 11 లక్షల 24 వేల 380 డాలర్ల (రూ. 9 కోట్ల 97 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. 'కంటి నుంచి ఆనందభాష్పాలు వస్తున్నాయి. జరిగింది నమ్మశక్యంగా లేదు. ఏటీపీ సర్క్యూట్‌లో నాకిది నాలుగో సీజన్ మాత్రమే. నా విజయం వెనుక నా శిక్షణ సిబ్బంది పాత్ర ఎంతో ఉంది' అని ఏటీపీ సర్క్యూట్‌లో టైటిల్ నెగ్గిన తొలి మొనాకో ప్లేయర్‌గా గుర్తింపు పొందిన వాలెంటిన్ వ్యాఖ్యానించాడు.

క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో వాలెంటిన్ 7-6 (7/4), 6-3తో నిశేష్ బసవరెడ్డి (అమెరికా)పై, రెండో రౌండ్‌లో 4-6, 7-6 (7/5), 6-4తో లియామ్ డ్రాక్సెల్ (కెనడా)పై గెలిచి మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించాడు. మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో వాలెంటిన్ 6-3, 6-4తో లాస్లో జెరె (సెర్బియా)పై, రెండో రౌండ్‌లో 3-6, 6-3, 6-4తో 14వ సీడ్ అలెగ్జాండర్ బుబ్లిక్ (కజకిస్తాన్)పై, మూడో రౌండ్‌లో 6-0, 3-1తో 20వ సీడ్ టామస్ మఖాచ్ (చెక్ రిపబ్లిక్-రిటైర్డ్)పై, ప్రిక్వార్టర్ ఫైనల్లో 4-6, 7-6 (7/1), 6-4తో 27వ సీడ్ టాలన్ గ్రీక్‌స్పూర్ (నెదర్లాండ్స్)పై, క్వార్టర్ ఫైనల్లో 2-6, 7-6 (7/4), 6-4తో 10వ సీడ్ హోల్గర్ రూనె (డెన్మార్క్)పై, సెమీఫైనల్లో 6-3, 6-4తో నాలుగో సీడ్ నొవాక్ జొకోవిచ్ (సెర్బియా)పై విజయం సాధించాడు.

5 కెరీర్‌లో తొలి టైటిల్ 'మాస్టర్స్ సిరీస్' టోర్నీని సాధించిన ఐదో ప్లేయర్‌గా వాలెంటిన్ నిలిచాడు. గతంలో రొబెర్టో కార్రెటెరో, ఆల్బెర్ట్ పోర్టాస్, క్రిస్ వుడ్‌రఫ్, జాకుబ్ మెన్‌సిక్ ఈ ఘనత సాధించారు.

3 క్వాలిఫయర్ హోదాలో ఏటీపీ మాస్టర్స్ సిరీస్ టైటిల్ గెలిచిన మూడో ప్లేయర్‌గా వాలెంటిన్ నిలిచాడు. గతంలో రొబెర్టో కార్రెటెరో (స్పెయిన్: 1996లో హంబర్గ్ ఓపెన్), ఆల్బెర్ట్ పోర్టాస్ (స్పెయిన్: 2001లో హంబర్గ్ ఓపెన్) మాత్రమే ఈ ఘనత సాధించారు.

204 ఏటీపీ మాస్టర్స్ సిరీస్ (1990లో) టోర్నీలు ప్రవేశపెట్టాక మాస్టర్స్ సిరీస్ టైటిల్ గెలిచిన అతి తక్కువ ర్యాంకర్‌గా వాలెంటిన్ (204వ ర్యాంక్) గుర్తింపు పొందాడు.

గురి తప్పింది!

- భారత షూటర్ల వైఫల్యం
- ప్రపంచ షాట్‌గన్ చాంపియన్‌షిప్


రైజా ఢిల్లాన్

ఏథెన్స్: అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) షాట్‌గన్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్లు ఆకట్టుకోలేకపోయారు. పురుషుల, మహిళల స్కీట్ విభాగాల్లో భారత్ నుంచి ఒక్కరు కూడా ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయారు. మహిళల స్కీట్‌లో రైజా ఢిల్లాన్ అత్యుత్తమంగా 16వ స్థానంలో నిలిచింది. 58 మంది పాల్గొన్న పోటీల్లో 125 పాయింట్లకు గానూ రైజా 116 పాయింట్లు సాధించింది. ఫైనల్‌కు అర్హత మార్క్ 119 కాగా... మూడు పాయింట్ల తేడాతో భారత షూటర్ ఫైనల్‌కు దూరమైంది. పరినాజ్ ధలివాల్, గనీమత్ సెఖాన్ వరుసగా 44, 47వ స్థానాల్లో నిలిచారు. ఇక టీమ్ విభాగంలో 12 జట్లు పోటీపడగా... భారత్ ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకుంది. పురుషుల స్కీట్ విభాగంలో భవ్‌తేగ్ సింగ్ గిల్ 119 పాయింట్లతో 38వ స్థానంలో నిలవగా... మేరాజ్ అహ్మద్ ఖాన్ 53వ, అనంత్ జీత్ సింగ్ నరూకా 83వ స్థానాలు దక్కించుకున్నారు. పురుషుల టీమ్ విభాగంలో 27 జట్లు పాల్గొనగా... భారత్ 16వ స్థానంతో పోటీలను ముగించింది.

హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ తడబాటు



సాక్షి, హైదరాబాద్: ప్రైమ్ వాలీబాల్ లీగ్ నాలుగో సీజన్‌లో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ జట్టు వరుసగా మూడో ఓటమిని చవిచూసింది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ 15-9, 15-7, 9-15, 11-15, 8-15తో అహ్మదాబాద్ డిఫెండర్స్ జట్టు చేతిలో ఓడిపోయింది. హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ జట్టు మొత్తం 58 పాయింట్లు సాధించగా... ఇందులో సొంత సర్వీస్‌లో 18 పాయింట్లు, స్పైక్ షాట్‌లతో 32 పాయింట్లు వచ్చాయి. మరో మ్యాచ్‌లో ఢిల్లీ తూఫాన్స్ 15-11, 15-9, 15-11తో డిఫెండింగ్ చాంపియన్ కాలికట్ హీరోస్‌పై గెలిచింది. ఈ లీగ్‌లో కాలికట్ హీరోస్‌కిది వరుసగా నాలుగో పరాజయం కావడం గమనార్హం.

కోకోదే పైచేయి


కోకో గాఫ్

- వుహాన్ ఓపెన్ డబ్ల్యూటీఏ-1000 టైటిల్ నెగ్గిన అమెరికా స్టార్
- ఫైనల్లో అమెరికాకే చెందిన జెస్సికా పెగూలాపై విజయం

వుహాన్ (చైనా): ఆద్యంతం నిలకడగా రాణించిన అమెరికా టెన్నిస్ స్టార్, ప్రపంచ మూడో ర్యాంకర్ కోకో గాఫ్ ఈ ఏడాది తన ఖాతాలో రెండో టైటిల్‌ను జమ చేసుకుంది. ఈ సీజన్‌లో ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలిచిన కోకో గాఫ్... ఆదివారం ముగిసిన వుహాన్ ఓపెన్ డబ్ల్యూటీఏ-1000 టోర్నీలో చాంపియన్‌గా నిలిచింది. అమెరికాకే చెందిన ప్రపంచ 6వ ర్యాంకర్ జెస్సికా పెగూలాతో జరిగిన తుది పోరులో కోకో గాఫ్ 6-4, 7-5తో గెలుపొందింది. 1 గంట 42 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో కోకో నాలుగు ఏస్‌లు సంధించి, ఎనిమిది డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది. విజేతగా నిలిచిన కోకో గాఫ్‌కు 5,96,000 డాలర్ల (రూ. 5 కోట్ల 28 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

2 చైనా ఆతిథ్యమిస్తున్న రెండు డబ్ల్యూటీఏ-1000 టోర్నీల్లో (బీజింగ్ ఓపెన్, వుహాన్ ఓపెన్) విజేతగా నిలిచిన రెండో ప్లేయర్ కోకో గాఫ్. గతంలో ఫ్రాన్స్ ప్లేయర్ కరోలినా గార్సియా (2017లో) మాత్రమే ఈ ఘనత సాధించింది.

9 హార్డ్ కోర్టులపై తాను ఆడిన తొమ్మిది టోర్నీల ఫైనల్స్‌లోనూ కోకో గాఫ్ చాంపియన్ కావడం విశేషం.

రన్నరప్ రిత్విక్-అర్జున్ జోడీ



సాక్షి, హైదరాబాద్: భారత డేవిస్‌కప్ టెన్నిస్ జట్టు సభ్యుడు, హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ జినాన్ ఓపెన్ ఏటీపీ-125 చాలెంజర్ టోర్నీలో రన్నరప్‌గా నిలిచాడు. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో రిత్విక్ చౌదరీ-అర్జున్ ఖడే (భారత్) జోడీ ఫైనల్లో ఓటమి చవిచూసింది. టాప్ సీడ్‌గా బరిలోకి దిగిన రిత్విక్-అర్జున్ జంట తుది పోరులో 5-7, 6-7 (1/7)తో ఫిన్ రేనాల్డ్స్-జేమ్స్ వాట్ (న్యూజిలాండ్) జోడీ చేతిలో పోరాడి ఓడిపోయింది. 95 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిత్విక్-అర్జున్ ఐదు ఏస్‌లు సంధించి, ఆరు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. రిత్విక్-అర్జున్ జోడీకి 5,760 డాలర్ల (రూ. 5 లక్షల 11 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 75 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

భారత్‌కు నిరాశ


మానవ్ ఠక్కర్

భువనేశ్వర్: ఆసియా టేబుల్ టెన్నిస్ (టీటీ) టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల జట్టుకు నిరాశ ఎదురైంది. నేరుగా క్వార్టర్ ఫైనల్ ఆడిన భారత జట్టు 0-3తో హాంకాంగ్ చేతిలో ఓడిపోయింది. తొలి మ్యాచ్‌లో మనుశ్ షా 5-11, 9-11, 11-13తో వోంగ్ చున్ టింగ్ చేతిలో... రెండో మ్యాచ్‌లో భారత నంబర్‌వన్ మానవ్ ఠక్కర్ 8-11, 8-11, 12-10, 11-9, 8-11తో చాన్ బాల్డ్‌విన్ చేతిలో... మూడో మ్యాచ్‌లో అంకుర్ భట్టాచార్య 11-7, 9-11, 14-12, 6-11, 7-11తో లామ్ సియు హాంగ్ చేతిలో ఓటమి చవిచూశారు.

సెమీస్‌లో జోష్నా



యొకోహామా: జపాన్ ఓపెన్ ప్రొఫెషనల్ స్క్వాష్ అసోసియేషన్ (పీఎస్ఏ) చాలెంజర్ టోర్నీలో భారత సీనియర్ ప్లేయర్ జోష్నా చినప్ప సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ఆదివారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో 39 ఏళ్ల జోష్నా 11-8, 15-13, 11-9తో నార్దినె గారస్ (ఈజిప్ట్)పై విజయం సాధించింది. సెమీఫైనల్లో నాలుగో సీడ్ రానా ఇస్మాయిల్ (ఈజిప్ట్)తో ఆడుతుంది.

పాకిస్తాన్ 313/5

- మెరిసిన ఇమామ్, మసూద్, రిజ్వాన్, సల్మాన్
- దక్షిణాఫ్రికాతో తొలి టెస్టు


షాన్ మసూద్, ఇమామ్ ఉల్ హక్

లాహోర్: సొంతగడ్డపై ప్రపంచ టెస్టు చాంపియన్ దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టులో పాకిస్తాన్‌కు మెరుగైన ఆరంభం లభించింది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆదివారం ప్రారంభమైన తొలి టెస్టులో పాక్ భారీ స్కోరు దిశగా సాగుతోంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్తాన్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 313 పరుగులు చేసింది. ఇమామ్ ఉల్ హక్ (153 బంతుల్లో 93; 7 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా... కెప్టెన్ షాన్ మసూద్ (147 బంతుల్లో 76; 9 ఫోర్లు, 1 సిక్స్), మొహమ్మద్ రిజ్వాన్ (107 బంతుల్లో 62 బ్యాటింగ్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), సల్మాన్ ఆఘా (83 బంతుల్లో 52 బ్యాటింగ్; 2 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకాలతో ఆకట్టుకున్నారు. ఓపెనర్ అబ్దుల్లా షఫీఖ్ (2) విఫలం కాగా... ఇమామ్‌తో కలిసి షాన్ మసూద్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ జంట రెండో వికెట్‌కు 161 పరుగులు జోడించడంతో పాకిస్తాన్‌కు శుభారంభం దక్కింది. రెండేళ్ల తర్వాత టెస్టు ఆడుతున్న ఇమామ్... చక్కటి షాట్ సెలెక్షన్‌తో ఆకట్టుకున్నాడు. అయితే షాన్ మసూద్ అవుటైన అనంతరం ఒకే స్కోరు వద్ద పాకిస్తాన్ మూడు వికెట్లు కోల్పోయింది. 199 పరుగుల వద్ద ఇమామ్ ఉల్ హక్‌తో పాటు సౌద్ షకీల్ (0), బాబర్ ఆజమ్ (23) వెనుదిరిగారు. దీంతో పాక్ జట్టు 199/5తో కష్టాల్లో పడింది. మాజీ కెప్టెన్ బాబర్ ఆజమ్ క్రీజులో కుదురుకున్నట్లే కనిపించినా... హార్మర్ బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోయాడు. ఈ దశలో ప్రత్యర్థికి పైచేయి సాధించే అవకాశం ఇవ్వకుండా వికెట్ కీపర్ మొహమ్మద్ రిజ్వాన్, సల్మాన్ ఆఘా మెరుగ్గా ఆడారు. వీలు చిక్కినప్పుడల్లా భారీ షాట్‌లు ఆడిన ఈ జోడీ అబేధ్యమైన ఆరో వికెట్‌కు 114 పరుగులు జోడించింది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2025-27 సర్కిల్‌లో ఇరు జట్లకు ఇదే తొలి మ్యాచ్. దక్షిణాఫ్రికా బౌలర్లలో ముత్తుస్వామి 2 వికెట్లు పడగొట్టగా... రబడ, హార్మర్, ప్రెనెలన్ సుబ్రాయెన్ తలా ఒక్కో వికెట్ తీశారు. ప్రస్తుతం రిజ్వాన్, సల్మాన్ క్రీజులో ఉన్నారు.

మ్యాచ్ హోరాహోరీ... పుణేరిదే విక్టరీ

టైబ్రేక్‌లో ఓడిన దబంగ్ ఢిల్లీ



న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్-12)లో ఇప్పటికే ప్లేఆఫ్స్‌కు చేరిన దబంగ్ ఢిల్లీ, పుణేరి పల్టన్ మధ్య జరిగిన హోరాహోరీ పోరులో పుణేరి పైచేయి సాధించింది. స్కోర్లు సమమైన ఈ మ్యాచ్‌లో పల్టన్ జట్టు 'టైబ్రేక్' రెయిడ్‌లతో గెలుపొందింది. మ్యాచ్ ఆరంభం నుంచే పోటాపోటీగా సాగింది. దీంతో నిర్ణీత సమయం ముగిసే సరికి 38-38తో స్కోరు సమమైంది. పుణేరి రెయిడర్లలో పంకజ్ (7), ఆదిత్య షిండే (6), మోహిత్ (5) క్రమం తప్పకుండా పాయింట్లు తెచ్చిపెట్టారు. ఆల్‌రౌండర్, కెప్టెన్ అస్లామ్ ఇనామ్‌దార్ (6)తో పాటు, డిఫెండర్ గౌరవ్ ఖత్రి (4) కూడా రాణించాడు. దబంగ్ తరఫున రెయిడర్ అజింక్య పవార్ 10 పాయింట్లు సాధించాడు. మిగతా వారిలో డిఫెండర్ సౌరభ్ (6), ఆల్‌రౌండర్ నవీన్ (5), నీరజ్ నర్వాల్ (4) అదరగొట్టారు. మ్యాచ్ విజేతను నిర్ణయించేందుకు నిర్వహించిన టైబ్రేక్‌లో పుణేరి రెయిడర్లు అందరూ పాయింట్లు తెచ్చిపెట్టడంతో ఢిల్లీకి ఓటమి తప్పలేదు. ఈ విజయంతో పట్టికలో టాప్-2 స్థానాలు తారుమారు అయ్యాయి. అగ్రస్థానంలో ఉన్న దబంగ్ రెండో స్థానానికి, రెండో స్థానంలో ఉన్న పుణేరి పల్టన్ అగ్రస్థానానికి ఎగబాకింది. అనంతరం జరిగిన రెండో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 43-32తో బెంగాల్ వారియర్స్‌పై గెలిచింది. ఆల్‌రౌండర్ అలీ రెజా (18) చెలరేగాడు. రెయిడింగ్‌లో 16 పాయింట్లు, టాకిల్‌తో 2 పాయింట్లు తెచ్చిపెట్టాడు. మిగతా సహచరుల్లో రెయిడర్ ఆశిష్ మలిక్ (7), డిఫెండర్ దీపక్ శంకర్ (6)సైతం పోటీపడి పాయింట్లు తెచ్చారు. బెంగాల్ జట్టు రెయిడర్లలో కెప్టెన్ దేవాంక్ (13), హిమాన్షు నర్వాల్ (7) రాణించారు. నేడు జరిగే పోటీల్లో పట్నా పైరేట్స్‌తో హరియాణా స్టీలర్స్, యూ ముంబాతో యూపీ యోధాస్ తలపడతాయి.

సాక్షి ప్లస్
సోమవారం । 13-10-2025



జర్మనీలోని వాణిజ్య నగరం ఫ్రాంక్‌ఫర్ట్‌లోని ఓ పార్కులో కనువిందు చేస్తున్న రంగురంగుల చెట్లు. శరదృతువులో కొత్తరంగుల్లో కనిపించే చెట్లు నగరానికి ప్రత్యేక ఆకర్షణ.



జర్మనీలోని లుడ్విగ్స్‌బర్గ్‌లోని కోటలో ఆదివారం జరిగిన పోటీల్లో ఓ రైతు తీసుకువచ్చిన అతిభారీ గుమ్మడికాయ. తూకం యంత్రం వద్దకు తెచ్చినప్పుడు ఆసక్తిగా చూస్తున్న సందర్శకులు

డీప్‌ఫేక్, ఏఐలతో బాలికలకు వేధింపులు

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న ఆవేదన

- అరికట్టేందుకు తగిన చట్టాలు అవసరం
- బాలికలపై ఏఐ, ఇతర టెక్నాలజీల దుర్వినియోగాన్ని గుర్తించాలి
- ఇందుకు సలహా కమిటీ ఏర్పాటు అవకాశాలను సుప్రీంకోర్టు పరిశీలించాలి
- బాలికల హక్కులపై జరిగిన జాతీయ సదస్సులో జస్టిస్ బీవీ నాగరత్న సూచనలు



న్యూఢిల్లీ: డీప్‌ఫేక్, కృత్రిమ మేధ (ఏఐ) సంబంధిత సాంకేతికతతో బాలికలపై జరుగుతున్న అకృత్యాలు, వేధింపుల పట్ల సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న ఆదివారం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని అరికట్టేందుకు తగిన చట్టాలు అవసరమన్నారు. బాలికలపై జరుగుతున్న ఈ తరహా సాంకేతిక పరమైన దుర్వినియోగాలను గుర్తించి, తగిన చర్యలు తీసుకునే దిశలో ''ఏఐ సైబర్‌క్రైమ్ అడ్వైజరీ కమిటీ ఆన్ గర్ల్ చైల్డ్''అనే ప్రత్యేక సలహా కమిటీ ఏర్పాటు చేసే అవకాశాన్ని సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకోవాలని జస్టిస్ సూచించారు. న్యాయమూర్తులు, న్యాయ శాఖ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ అవసరమని పేర్కొన్నారు. లింగ ఆధారిత భ్రూణ, శిశు హత్యలపై ప్రస్తుత చట్టాలను కఠినంగా అమలు చేయాలని సూచించారు. వీటితోపాటు బాలికలకు పోషకాహారం అందించాల్సిన ఆవశ్యకతనూ ఉద్ఘాటించారు. ఆయా అంశాలు అన్నింటిపై తల్లిదండ్రుల్లో అవగాహన పెంపునకూ కృషి జరగాలని ఉద్బోధించారు. యూనిసెఫ్ ఇండియాతో కలిసి సుప్రీంకోర్టు జువెనైల్ జస్టిస్ కమిటీ (జేజేసీ) ఆధ్వర్యంలో 'భారతదేశంలో బాలిక రక్షణ– సురక్షిత, ప్రోత్సాహక వాతావరణం'అనే అంశంపై ఇక్కడ జరిగిన రెండు రోజుల జాతీయ వార్షిక భాగస్వామ్య సదస్సులో జస్టిస్ బీవీ నాగరత్న ముగింపు ఉపన్యాసం చేశారు. జేజేసీ సభ్యులు కూడా అయిన జస్టిస్ నాగరత్న ప్రసంగంలో కొన్ని ముఖ్యాంశాలు...

- తరచుగా మారుతున్న టెక్నాలజీల వల్ల కలిగే ప్రమాదాలు.. నిరంతరం తలపై వేలాడుతున్న ఖడ్గం లాంటిది. ఈ నేపథ్యంలో డీప్‌ఫేక్, ఏఐ ఆధారిత టెక్నాలజీల ద్వారా బాలల హక్కులు దుర్వినియోగం కాకుండా తగిన చట్టాలను రూపొందించాలి. ఆయా అంశాలపై 24 గంటల సమాచారం వ్యవస్థ, నిరంతరం స్పందించే జాతీయ ట్రాకింగ్ వ్యవస్థను తప్పనిసరి చేయాలి.
- చట్టం ఒక్కటే సమాజాన్ని మార్చలేదు. తల్లిదండ్రుల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉంది. బాలిక భారమనే అపోహను తొలగించే దిశలోకి తల్లిదండ్రుల దృక్పథం మారాలి.
- బాలికను కాపాడటం అంటే తరతరాలను కాపాడడమంటూ సదస్సులో వ్యక్తమైన అభిప్రాయం హర్షణీయం.
- ఆహారమే ఉత్తమ ఔషధం అనే విషయాన్ని పరిగణనలోకి తీసుకుని పిల్లలలో పోషకాహారంపై అవగాహన పెంచడానికి పాఠశాల సిలబస్‌లో పోషకాహార విద్యను చేర్చాలి. పాఠశాలల చుట్టూ జంక్‌ఫుడ్ ప్రకటనలను నిషేధించాలి.
- బాలికల అక్రమ రవాణా నిరోధక చర్యలు మరింత ఫలప్రదం కావాలంటే ఆయా నేరాలకు సంబంధించిన దర్యాప్తును ఫోరెన్సిక్, ఫైనాన్షియల్ ట్రేసింగ్‌తో అనుసంధానించి ప్రొఫెషనల్‌గా నిర్వహించాలి. అలాంటి బాలికల పునరావాసాన్ని ప్రభుత్వ బాధ్యతగా వ్యవస్థ పటిష్టం కావాలి. ఫలితాలను ఎప్పటికప్పుడు సమీక్షించే వ్యవస్థను నెలకొల్పాలి.
- బాధితుల సమస్యల పరిష్కారంపైనే దృష్టి కేంద్రీకరించే విధంగా ప్రతి జిల్లాలో పిల్లలకు, మహిళలకు వైద్య, మానసిక, న్యాయ సేవలు అందుబాటులో ఉండాలి.
- పోలీసులకు, న్యాయ వ్యవస్థ సిబ్బందికి తగిన శిక్షణ ఇవ్వడం, విభాగాల మధ్య సమన్వయం, బాధితుల సంతృప్తి తీరుపై వార్షిక సమీక్ష అవసరం.
- అణగారిన, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, వికలాంగుల విభాగాలకు సంబంధించిన బాలికలకు రాజ్యాంగం, అంతర్జాతీయ బాలల హక్కుల ఒప్పందాల ప్రకారం తగిన గుర్తింపు ఇవ్వాలి. ఆయా ప్రయోజనాలు వారికి అందేట్లు చూడాలి.
- లింగ నిష్పత్తి మెరుగుదల కోసం జాతీయ, రాష్ట్ర, స్థానిక స్థాయిలలో గణాంకాల ను సమీక్షిస్తూ సంస్థల పనితీరును నిరంతరం పరిశీలించాల్సిన అవసరం ఉంది.

సైబర్ నేరాలపై పటిష్ట దర్యాప్తు పద్ధతులు లేవు: జస్టిస్ పార్దీవాలా

సదస్సులో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేబీ పార్దీవాలా మాట్లాడుతూ క్లిష్టమైన సైబర్ నేరాలను ఎదుర్కొనే దర్యాప్తు విధానాలు దేశంలో సమర్థంగా లేవని అన్నారు. ప్రస్తుత సైబర్ యుగంలో బాలికలు బాధితులుగా మారే ప్రమాదం ఎక్కువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈశాన్య రాష్ట్రాలుసహా భారతదేశంలోని అనేక స్థానిక తెగలలో బాలిక పుట్టినప్పుడు సంతోషంగా ఉత్సవాలను జరుపుకుంటారని, అది అందరూ నేర్చుకోవాల్సిన విషయమని సూచించారు.

బీఎస్‌ఎఫ్ తొలి మహిళా

ఫ్లైట్ ఇంజనీర్‌గా భావనా చౌదరి

భావనా చౌదరి సహా అయిదుగురికి ఫ్లయింగ్ బ్యాడ్జ్‌లు



ఇన్‌స్పెక్టర్ భావనకు సర్టిఫికెట్ అందజేస్తున్న డీజీ దల్జీత్ సింగ్

న్యూఢిల్లీ: సరిహద్దు భద్రతా దళం వైమానిక విభాగం 50 ఏళ్లకు పైగా చరిత్రలో.. తొలి మహిళా ఫ్లైట్ ఇంజనీర్‌ను నియమించింది. ఈమె సంస్థలోనే తొలి అంతర్గత శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఘనత సాధించడం విశేషం. ఇన్‌స్పెక్టర్ భావనా చౌదరి సహా అయిదుగురు పురుష సబార్డినేట్ అధికారులకు.. బీఎస్‌ఎఫ్ డైరెక్టర్ జనరల్ దల్జీత్ సింగ్ చౌధరి ఇటీవల ఫ్లయింగ్ బ్యాడ్జ్‌లను అందజేశారు. సరిహద్దు దళం 1969 నుండి హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఏవియేషన్ యూనిట్‌ను నిర్వహణ బాధ్యతను నిర్వర్తిస్తోంది. ఇది అన్ని పారా మిలిటరీ దళాలు, ఎన్‌ఎస్‌జీ, ఎన్‌డీఆర్‌ఎఫ్ వంటి ప్రత్యేక దళాల కార్యాచరణ అవసరాలను తీరుస్తుంది. బీఎస్‌ఎఫ్ వైమానిక విభాగంలోని శిక్షకులు ఐదుగురు సబార్డినేట్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. వీరు ఇటీవలే రెండు నెలల సుదీర్ఘ శిక్షణను పూర్తి చేశారు.

130 గంటల తర్ఫీదు

ఆగస్టులో ప్రారంభమైన ఈ రెండు నెలల అంతర్గత శిక్షణలో ఐదుగురు సిబ్బందికి 130 గంటల పాటు నైపుణ్యం అందించారు. శిక్షణ సమయంలో, పంజాబ్‌తో పాటు ఇతర రాష్ట్రాలలో ఇటీవల సంభవించిన వరదల్లో సహాయక చర్యల్లో పాల్గొనడం ద్వారా.. వీరు బీఎస్‌ఎఫ్ వైమానిక విభాగంలోని వివిధ విమానాలపై అనుభవం పొందారు.

ఫ్లైట్ ఇంజనీర్లకు తీవ్ర కొరత

'బీఎస్‌ఎఫ్ వైమానిక విభాగం దాని ఎంఐ–17 హెలికాప్టర్ల ఫ్లీట్‌లో ఫ్లైట్ ఇంజనీర్ల తీవ్ర కొరతను ఎదుర్కొంటోంది. భారత వైమానిక దళం మొదటి బ్యాచ్‌లోని ముగ్గురు సబార్డినేట్ అధికారులకు శిక్షణ ఇచ్చింది, అయితే వివిధ పరిమితుల కారణంగా ఐదుగురు సిబ్బందితో కూడిన రెండో బ్యాచ్ అక్కడ శిక్షణ స్లాట్‌ను పొందలేకపోయింది'.. అని ఒక అధికారి తెలిపారు. దీంతో బీఎస్‌ఎఫ్, తన వైమానిక విభాగంలో ఫ్లైట్ ఇంజనీర్ల కోసం అంతర్గత శిక్షణ నిర్వహించడానికి అనుమతి ఇవ్వాలని ఎంహెచ్ఏను అభ్యర్థించింది. ఇన్‌స్పెక్టర్ చౌదరితో సహా ఐదుగురు సిబ్బంది ఇటీవల తమ శిక్షణను పూర్తి చేశారని ఆ అధికారి తెలిపారు. ఇన్‌స్పెక్టర్ చౌదరి, బీఎస్‌ఎఫ్ వైమానిక విభాగంలో మొదటి మహిళా ఫ్లైట్ ఇంజనీర్ అని ఆయన స్పష్టం చేశారు. ఈ యూనిట్ ఎంఐ17 1వి, ఎంఐ 17 వి5, చీతా, ఏఎల్‌హెచ్ ధ్రువ్ వంటి హెలికాప్టర్‌లతో పాటు, వీఐపీ విధుల కోసం ఫిక్స్‌డ్ వింగ్ ఎంబ్రేయర్ జెట్‌ను కూడా నిర్వహిస్తుంది. సుమారు 3 లక్షల మంది సిబ్బంది ఉన్న బీఎస్‌ఎఫ్ 1965 డిసెంబర్‌లో ఏర్పాటైంది. అంతర్గత భద్రతలో వివిధ విధులను నిర్వర్తించడంతో పాటు, ఇది ప్రధానంగా భారత్–పాకిస్తాన్, భారత్–బంగ్లాదేశ్ సరిహద్దుల పరిరక్షణ బాధ్యతలను నిర్వర్తించడంలో కీలకపాత్ర పోషిస్తోంది.

మనిషిలా మాత్రమే జీవిస్తా

- కులం, మతం వదిలేస్తున్నా
- జుబీన్ గార్గ్‌కు దహన సంస్కారాలు జరిపిన చోట ప్రతిన
- జంధ్యం తెంచి పడేసి బ్రాహ్మణ యువకుడి ప్రకటన

గువాహటి: అసోంలోని గువాహటిలో గాయకుడు జుబీన్ గార్గ్‌కు దహన సంస్కారాలు జరిపి ప్రాంతంలో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. ఓ బ్రాహ్మణ యువకుడు.. 'ఇకపై కేవలం మనుషులా మాత్రమే జీవిస్తా. కులమతాల ప్రస్తావన వదిలేస్తా'అంటూ తన జంధ్యాన్ని తెంపి, చెత్తలో పడేశాడు. సన్ భగవతి అనే 30 ఏళ్ల ఆ యువకుడు.. ఇకపై గార్గ్ నడిచిన బాటలోనే నడుస్తానని తెలిపాడు. కులమతాల అడ్డుగోడలను పగులగొట్టాలన్నాడు. 'పుట్టుకతో నా కులం బ్రాహ్మణ. ఇప్పుడిక నాకు కులం, మతం అంటూ ఏదీ లేదు'అంటూ తన దుస్తుల్లోపలున్న జంధ్యం తీసి, మీడియా చూస్తుండగానే తెంచి చెత్తలోకి వేశాడు. నా సోదరుడు జుబీన్ సాక్షిగా చెబుతున్నా. జంధ్యం మళ్లీ ధరించను. ఇటీవల సోషల్ మీడియాలో హిందూముస్లింలకు సంబంధించిన అంశాలే ప్రముఖంగా వస్తున్నాయి. హిందువుల్లోనూ చాలా కులాలున్నాయి. శూద్రుడు ఇచ్చిన వాటిని బ్రాహ్మణుడు పట్టుకోడు. ఇలాంటి ఆచారాలు, విశ్వాసాలు ఎన్నో. అందుకే జుబీన్ దా సాక్షిగా వాటన్నిటినీ వదిలేస్తున్నా. ఆరేళ్ల నా కుమారుడికి కూడా జంధ్య వేయను. మనుషుల్లాగా జీవించడం మనం నేర్చుకోవాలి. మానవత్వం అన్నిటికీ మించింది'అని పేర్కొన్నాడు. కాగా, బ్రాహ్మణ కుటుంబంలో జిబొన్ బొర్తాకుర్ పేరుతో జన్మించిన జుబీన్ గార్గ్ కూడా తనకు కులం–మతం లేదంటూ ప్రకటించుకున్నారు. జంధ్యాన్ని దోమ తెర కట్టేందుకు తాడు మాదిరిగా వాడుకున్నట్లు గతంలో ఓ సందర్భంలో తెలిపారు.

బంగారు పూత కలశం చోరీ

విలువ రూ.40 లక్షలు

ఢిల్లీలోని జైన దేవాలయంలో ఘటన

న్యూఢిల్లీ: ఈశాన్య ఢిల్లీలోని జ్యోతి నగర్ ప్రాంతంలో జైన దేవాలయం గోపురం నుండి సుమారు రూ.40 లక్షల విలువైన బంగారు పూత కలశం చోరీ అయ్యింది. ఆలయంలో అమర్చిన సీసీటీవీ కెమెరాల్లో నమోదైన చోరీకి సంబంధించిన రెండు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పోలీసులు ఆదివారం తెలిపిన వివరాలివి. జ్యోతి నగర్ ప్రాంత నివాసితులు శుక్రవారం అర్ధరాత్రి భారీ ఎత్తున కర్వా చౌత్ వేడుకల్లో నిమగ్నమై ఉన్నప్పుడు ఈ సంఘటన జరిగింది. నిందితుడు విద్యుత్తీగల ఆధారంగా ఆలయం పైకప్పు ఎక్కి, గోపురం పైకి చేరుకున్నాడు. అక్కడున్న బంగారు పూత కలశాన్ని చోరీ చేసి పారిపోయాడు.

అష్ట ధాతువులతో కలశం తయారీ

చోరీ అయిన కలశం **'అష్ట ధాతువులు'** (ఎనిమిది **లోహాల** మిశ్రమం)తో తయారైంది. **దీని** తయారీకి సుమారు 200 **గ్రాముల** బంగారం వినియోగించారు. **కలశం** విలువ సుమారు రూ.35–40 **లక్షలు ఉం**టుందని అంచనా. కలశం **సుమారు 25** నుండి 30 కిలోగ్రాముల **రాగి, బంగారు** పూతతో తయారైందని **పోలీసులు** తెలిపారు. చోరీపై ఆలయ **కమిటీ** అధ్యక్షుడు నీరజ్ జైన్ **శనివారం** ఉదయం ఈస్ట్ జ్యోతి **నగర్ పోలీస్** స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు **మేరకు కేసు** నమోదైంది. నిందితుడిని **పట్టుకోవ**డానికి గాలింపు **బృందాలను** ఏర్పాటు చేశామని, అతని **కదలిక**లను తెలుసుకోవడానికి **సాంకేతిక** నిఘా ఉపయోగిస్తు**న్నామని** పోలీసులు తెలిపారు.

150 ఏళ్లు బతకడం సైన్స్ ఫిక్షన్ కాదు

రష్యా శాస్త్రవేత్త వ్యాఖ్య

మాస్కో: వందేళ్లు హాయిగా జీవించిన వ్యక్తులను పూర్ణాయుశ్కులు అంటుంటాం. అయితే అంతకంటే మరో 50 ఏళ్లు ఎక్కువే జీవించగల ఎంతో మంది వ్యక్తులు మన మధ్యే ఉన్నారని రష్యా శాస్త్రవేత్త విటాలీ కోవల్యోవ్ వ్యాఖ్యానించారు. రష్యాలోని వోల్గోగ్రాడ్ ప్రభుత్వ వైద్య విశ్వవిద్యాలయంలో శాస్త్రవేత్తగా సేవలందిస్తున్న ఈయన ఈయన తాజాగా వైద్య, ఆరోగ్య సంబంధ విషయాలను వివరించే బయోపాలిటిక్స్ ఛానల్‌లో వ్యాఖ్యాతగా వ్యవహరిస్తూ పలు అంశాలపై మాట్లాడారు. ''వృద్ధాప్య ఛాయల్లోకి పడిపోవడం ఇటీవల తగ్గింది. 150 ఏళ్లు జీవించడం అనేది సైన్స్ ఫిక్షన్ కానేకాదు. 150 ఏళ్లు జీవించగల సత్తా ఉన్న మనుషులెందరో ఇటీవల పుట్టారు. వాళ్లలో కొందరు ఇప్పుడు 20 ఏళ్లు, 30 ఏళ్లు, 40 ఏళ్ల వయసులో ఉన్నారు. వృద్ధాప్యాన్ని నెమ్మదింపజేసే ప్రయోగాలెన్నో జరుగుతున్నాయి. వృద్ధాప్య వేగాన్ని తగ్గించడం అసాధ్యం అనేది తప్పుడు భావన. 150 ఏళ్లు పైబడిన తర్వాత కూడా మనిషి హాయిగా జీవించగలిగే ఔషధాల సృష్టికి ప్రయోగాలు జరుగుతున్నాయి''అని ఆయన అన్నారు. గత నెలలో బీజింగ్‌లోని తియాన్మెన్‌స్క్వేర్‌లో జరిగిన చైనా సైనిక పరేడ్‌లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్ మధ్యే అచ్చం ఇలాంటి అంశంపైనే మాటామంతీ జరగడం తెల్సిందే. ''జీవసాంకేతిక శాస్త్రం అద్భుతంగా పురోగమిస్తోంది. ముసలివైపోతున్న, పాడవుతున్న అంతర్గత అవయవాలను ఎప్పటికప్పుడు మార్పిడి చేసుకుంటూ మనిషి చాన్నాళ్లు జీవించవచ్చు. ఇలా నూతన అవయవాలతో యవ్వన ఛాయతో మెరుగైన జీవనం సాధ్యమే. బయోటెక్నాలజీతో సాధ్యమైతే చివరకు మృత్యువునూ జయించవచ్చు''అని జిన్‌పింగ్‌తో పుతిన్ వ్యాఖ్యానించడం తెల్సిందే.

ఢిల్లీలో దీపావళి ధమాకా..?

క్రాకర్స్‌పై నిషేధం పాక్షిక ఎత్తివేతకు సుప్రీంకు వెళ్లనున్న బీజేపీ

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో దీపావళికి టపాసుల మోత మోగే అవకాశాలున్నాయి. వాయు కాలుష్యం దృష్ట్యా ఏళ్లుగా కొనసాగుతున్న సంపూర్ణ నిషేధంపై బీజేపీ ప్రభుత్వం పునరాలోచనలో పడింది. ప్రజల మతపరమైన, సాంస్కృతిక మనోభావాలను గౌరవిస్తూ, పర్యావరణానికి హాని కలగని రీతిలో హరిత (గ్రీన్) టపాసులకు అనుమతి ఇవ్వాలని యోచిస్తోంది. ఈ మేరకు టపాకాయలపై నిషేధాన్ని పాక్షికంగా ఎత్తివేయాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించనుంది.

గ్రీన్ కాకర్స్‌కే అనుమతి!

సంపూర్ణ నిషేధం బదులుగా, ప్రభుత్వం నిర్దేశించిన, ధ్రువీకరించిన గ్రీన్ క్రాకర్స్‌ను మాత్రమే పరిమిత సమయం పాటు కాల్చేందుకు అనుమతించాలని ప్రభుత్వం సుప్రీంకోర్టుకు విన్నవించనుంది. పండుగ ఉత్సాహాన్ని దెబ్బతీయకుండా, అదే సమయంలో కాలుష్య నియంత్రణకు పెద్దపీట వేసేలా ఈ మధ్యేమార్గం ఉత్తమమని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ తమ ప్రథమ ప్రాధాన్యాలని, అందుకే కేవలం తక్కువ ఉద్గారాలు వెలువరించే హరిత టపాసుల వైపే మొగ్గు చూపుతున్నామని అధికారులు పేర్కొంటున్నారు.

ఫలించని సంపూర్ణ నిషేధం

కొన్నేళ్లుగా అమలు చేస్తున్న సంపూర్ణ నిషేధం ఆశించిన ఫలితాలను ఇవ్వలేదని ప్రభుత్వం వాదించనుంది. నిషేధం ఉన్నప్పటికీ, ప్రజలు అక్రమ మార్గాల్లో ప్రమాదకరమైన, అధిక కాలుష్యాన్ని వెదజల్లే టపాసులను కొనుగోలు చేసి కాలుస్తున్నారని, దీనివల్ల కాలుష్య తీవ్రత తగ్గకపోగా కొన్నిసార్లు మరింత పెరుగుతోందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, కఠినమైన నిషేధం కంటే నియంత్రిత పద్ధతిలో గ్రీన్ క్రాకర్స్‌ను అనుమతించడమే ఆచరణాత్మక పరిష్కారమని బీజేపీ ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చింది.

ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

సుప్రీంకోర్టు సానుకూలంగా స్పందించి, గ్రీన్ క్రాకర్స్‌కు అనుమతిస్తే నిబంధనల అమలులో ఏమాత్రం ఉపేక్షించబోమని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నగరం అంతటా పటిష్ట నిఘా ఏర్పాటు చేయనున్నారు.

మోదీ పాలనలో సహ చట్టం బలహీనం

కాంగ్రెస్ చీఫ్ ఖర్గే ఆరోపణలు

సాక్షి, న్యూఢిల్లీ: మోదీ ప్రభుత్వ 11 ఏళ్ల పాలనలో సమాచార హక్కు(సహ) చట్టం బలహీన పడిందని, ప్రజాస్వామ్యాన్ని, పౌరుల హక్కులను దెబ్బ తీసిందని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. సహ చట్టం 20 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆదివారం ఎక్స్‌లో మోదీ సర్కార్‌పై విరుచుకుపడ్డారు. 'ఇరవయ్యేళ్ల క్రితం, అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్, సోనియా గాంధీ నాయకత్వంలో యూపీయే ప్రభుత్వం సమాచార హక్కు చట్టం –2005 (ఆర్టీఐ)ను అమలు చేయడం ద్వారా పారదర్శకత, జవాబుదారీతనం అనే కొత్త శకానికి నాంది పలికింది. గత 11 సంవత్సరాలుగా మోదీ ప్రభుత్వం ఆర్టీఐ చట్టాన్ని వ్యూహాత్మకంగా బలహీనపరిచింది. ప్రజాస్వామ్యాన్ని, పౌర హక్కులను దెబ్బతీసింది. 2019లో మోదీ ప్రభుత్వం సమాచార కమిషనర్ల పదవీకాలం, జీతాలను నియంత్రించి స్వతంత్ర పర్యవేక్షణ సంస్థలను బానిసలుగా చేసింది. ప్రధాన సమాచార కమిషనర్ లేకుండానే కేంద్ర సమాచార కమిషన్ పనిచేస్తోంది. ఈ కీలకమైన పదవి 11ఏళ్లలో ఏడోసారి ఖాళీగా ఉంది. ప్రస్తుతం ఇక్కడ 8 ఖాళీలున్నాయి. దీంతో అప్పీళ్ల ప్రక్రియ నిలిచిపోయి ప్రజలకు న్యాయం లభించడంలేదు. 'డేటా అందుబాటులో లేదు'అనే సిద్ధాంతం ఇప్పుడు ప్రబలంగా ఉంది. కోవిడ్ సమయంలో మరణాల సమాచారాన్ని ప్రభుత్వం ధైర్యంగా దాచిపెట్టింది. 2014 నుంచి 100 మందికి పైగా ఆర్టీఐ కార్యకర్తలు హత్యకు గురయ్యారు. ఇది సత్యాన్వేషకులను శిక్షించే, అసమ్మతిని అణచివేసే భయానక వాతావరణాన్ని సృష్టిస్తోంది'అని పేర్కొన్నారు.

నా పదవిని సదానందన్ మాస్టర్‌కు ఇవ్వండి

రాజీనామాకు సిద్ధమన్న కేంద్ర మంత్రి సురేశ్ గోపి

కన్నూర్(కేరళ): నటుడు, కేంద్ర మంత్రి సురేశ్ గోపీ ఆదివారం రాజీనామాకు సిద్ధమని ప్రకటించారు. ఇటీవల బీజేపీ నుంచి రాజ్యసభకు ఎన్నికైన సి.సదానందన్ మాస్టర్‌కు తనకు బదులుగా కేంద్ర కేబినెట్‌లో స్థానం కల్పించాలని ఆయన కోరారు. ఆదివారం కేరళలోని కన్నూర్‌లో జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో మంత్రి మాట్లాడారు. సదానందన్ కూడా ఇందులో పాల్గొన్నారు. 'నన్ను తొలగించి, సదానందన్ మాస్టర్‌కు మంత్రి పదవి ఇవ్వాలి. ఇది నేను నిజాయితీతో చెబుతున్న మాట. కేరళ రాజకీయ చరిత్రలో ఇది కొత్త అధ్యాయానికి నాంది అవుతుందని నా నమ్మకం' అని మంత్రి వ్యాఖ్యానించారు.

15న బిహార్ కార్యకర్తలతో మోదీ మాటామంతీ

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ బిహార్‌లో తన ఎన్నికల ప్రచారాన్ని పార్టీ కార్యకర్తలతో నేరుగా ముచ్చటించడం ద్వారా ప్రారంభించనున్నారు.'మేరా బూత్..సబ్‌సే మజ్‌బూత్'(నా బూత్ అత్యంత బలమైనది) కార్యక్రమం కింద ఈ నెల 15న బీజేపీ కార్యకర్తలతో ఆయన నేరుగా సంభాషించనున్నారు. ఈ విషయాన్ని ఆదివారం ఆయన 'ఎక్స్'ద్వారా వెల్లడించారు. 'బిహార్‌లో బీజేపీ–ఎన్‌డీయే విజయాన్ని నిర్ధారించడానికి అంకితభావంతో ఉన్న కార్యకర్తలు అహర్నిశలు పనిచేస్తున్నారు. వారితో సంభాషించడం ఎల్లప్పుడూ కొత్త స్ఫూర్తిని అందిస్తుంది. అక్టోబర్ 15న నేరుగా సంభాషించే అవకాశం నాకు లభించింది'అని మోదీ పేర్కొన్నారు. 'మీ సూచనలను నాతో పంచుకోండి. వాటిపై ముఖాముఖి మాట్లాడుకుందాం'అని ఆయన తెలిపారు.

ఇద్దరు ఆర్జేడీ ఎమ్మెల్యేల రాజీనామా

పట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రతిపక్ష ఆర్జేడీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. వీరిద్దరూ సీఎం నితీశ్ కుమార్ సారథ్యంలోని జేడీయూలో చేరతారని ప్రచారం జరుగుతోంది. నవాడా ఎమ్మెల్యే విభా దేవి, రజౌలి ఎమ్మెల్యే ప్రకాశ్ వీర్ ఆదివారం స్పీకర్ నంద్ కిశోర్ యాదవ్‌ను కలిసి రాజీనామా పత్రాలను సమర్పించారు. వీరి రాజీనామాలను స్పీకర్ ఆమోదించారని అసెంబ్లీ వర్గాలు తెలిపాయి. విభా దేవి భర్త, మాజీ ఎమ్మెల్యే రాజ్ బల్లభ్ యాదవ్ పోక్సో కేసులో కొన్నేళ్లుగా జైలులో ఉండి, ఇటీవలే బెయిల్‌పై బయటకు వచ్చారు. గత లోక్‌సభ ఎన్నికల్లో తమ కుటుంబంలోని వారికి టిక్కెట్ ఇవ్వలేదని ఆర్జేడీపై ఈయన ఆగ్రహంతో ఉన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ప్రకాశ్ వీర్ మరోసారి టిక్కెట్ ఇచ్చే అవకాశం లేకపోవడంతో పార్టీ వీడాలని నిర్ణయించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

మద్య నిషేధం ఎత్తివేస్తాం: జన్ సురాజ్

పట్నా: బిహార్‌లో తమకు అధికారమిస్తే మద్యం వినియోగం, విక్రయాలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తామని ప్రశాంత్ కిశోర్‌కు చెందిన జన్ సురాజ్ పార్టీ ఆదివారం ప్రకటించింది. నిషేధం తొలగింపుతో ఖజానాకు సమకూరే రూ.28 వేల కోట్ల అదనపు ఆదాయాన్ని ప్రపంచ బ్యాంక్ , అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నుంచి సుమారు రూ. 6 లక్షల కోట్ల వరకు రుణంగా తీసుకోవడానికి వినియోగిస్తామని తెలిపింది. రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మద్య నిషేధాన్ని తొలగిస్తుందని ప్రశాంత్ కిశోర్ గతంలోనే ప్రకటించారు. బిహార్‌లోని నితీశ్ ప్రభుత్వం 2016లో ఏప్రిల్‌లో మద్య నిషేధ విధానాన్ని తీసుకువచ్చింది.

సీఎం యోగి చొరబాటుదారు.. ఉత్తరాఖండ్‌కు పంపించేయాలి: అఖిలేశ్

లక్నో: ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌పై సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం యోగిని చొరబాటుదారుగా అభివర్ణించారు. ఉత్తరాఖండ్‌కు చెందిన ఆయన్ను వెంటనే రాష్ట్రం నుంచి వెనక్కి పంపించేయాలన్నారు. బీజేపీ చెప్పే గణాంకాలన్నీ తప్పులతడకలంటూ ఆయన.. వాటిని నమ్మి వారికి నష్ట తప్పదన్నారు. 'యూపీలోనూ చొరబాటుదార్లు ఉన్నారు. సీఎం యోగి ఉత్తరాఖండ్ వాసి. ఆయన్ను ఉత్తరాఖండ్‌కు తిరిగి పంపాలని డిమాండ్ చేస్తున్నాం. సైద్ధాంతికపరంగా చూసినా ఆయన చొరబాటుదారే. ఆయన బీజేపీలో సభ్యుడు కారు. మరో పార్టీ వ్యక్తి. ఇలాంటి వారిని ఎప్పుడు బహిష్కరిస్తారు?'అని అఖిలేశ్ ప్రశ్నించారు. చొరబాటుదార్లను రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా చూస్తున్నాయంటూ శనివారం హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై ఆయన ఈ మేరకు స్పందించారు.

ఏకాంబరనాథర్ ఆలయ మహా సంప్రోక్షణ డిసెంబర్ 8న

17 ఏళ్ల తర్వాత నిర్వహణ

చెన్నై: కాంచీపురంలోని 1,300 సంవత్సరాల పురాతన అరుళ్‌మిగు ఏకాంబరనాథర్ ఆలయ మహా సంప్రోక్షణ (కుంభాభిషేకం) డిసెంబర్ 8న నిర్వహించనున్నారు. పదిహేడేళ్ల తర్వాత ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి ఆదివారం తెలిపారు. తమిళనాడు ప్రభుత్వం ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలోని ఈ ఆలయ పునర్నిర్మాణ పనులను పూర్తి చేసినట్లు ఆ అధికారి తెలిపారు. ధర్మాదాయ శాఖ మంత్రి పి.కె.శేఖర్ బాబు అక్టోబర్ 12న కుంభాభిషేకం తేదీని అధికారికంగా ప్రకటించారు. సాధారణంగా ఆలయాలలో పన్నెండేళ్లకోసారి మహా సంప్రోక్షణ నిర్వహిస్తారని హెచ్ఆర్, సీఈ విభాగం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ముత్తులక్ష్మి తెలిపారు. 'కానీ ఏకాంబరనాథర్ ఆలయం విషయంలో, చేపట్టవలసిన 34 పునరుద్ధరణ పనులు ఉన్నాయి. ఈ ఆలయం వెయ్యేళ్లు దాటడంతో.. పునర్నిర్మాణ పనులు ఎలా చేపట్టాలనే అంశంపై నిబంధనలు ఉన్నాయి. ఇది సుదీర్ఘమైన ప్రక్రియ. ఇంకా కొంత పని మిగిలి ఉంది. డిసెంబర్ 8 నాటికి వాటన్నింటినీ పూర్తి చేస్తాం'.. అని ఆమె స్పష్టం చేశారు.

ఢిల్లీకి చేరుకున్న కెనడా మంత్రి అనితా ఆనంద్

న్యూఢిల్లీ: భారత సంతతికి చెందిన కెనడా విదేశాంగ శాఖ మంత్రి అనితా ఆనంద్ ఆదివారం ఢిల్లీకి చేరుకున్నారు. సోమవారం ఆమె మన విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో భేటీ అవుతారు. వాణిజ్యం, ఇంధనం, భద్రతా రంగాల్లో వ్యూహాత్మక సహకారాన్ని విస్తరించుకునేందుకు గాను వీరు ఒక కార్యాచరణను రూపొందిస్తారని భావిస్తున్నారు. మే నెలలో విదేశాంగ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనితా ఆనంద్ మొట్టమొదటి భారత పర్యటన ఇది. వాణిజ్య మంత్రి పీయూష్ గోయెల్‌తోనూ ఆమె సమావేశమవుతారు. మూడు వారాల క్రితం కెనడా జాతీయ భద్రతా సలహాదారు నథాలీ డ్రొయిన్ ఢిల్లీలో మన ఎన్ఎస్ఏ అజిత్ దోవల్‌తో విస్తృత చర్చలు జరిపారు.

పర్వత ప్రాంతాల్లో ఏర్పడే వైపరీత్యం ఏది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
విపత్తుల నిర్వహణ

విపత్తులు - ప్రాథమిక భావనలు

ఒక భౌగోళిక ప్రాంతంలో సంభవించిన దుర్ఘటన విపత్తు అవుతుందా/ కాదా అనే విషయాన్ని నిర్ధారించాలంటే విపత్తు నిర్వ హణకు సంబంధించిన కొన్ని ప్రాథమిక భావనల గురించి తెలుసుకోవాలి. అవి..

1. వైపరీత్యం (Hazard)
2. దుర్బలత్వం (Vulnerability)
3. సామర్థ్యం (Capacity)
4. ఆపద (Risk)

వైపరీత్యం

ఏదైనా భౌగోళిక ప్రాంతంలో ప్రజా జీవనానికి, ఆస్తులకు, పర్యావరణానికి నష్టాన్ని కలుగజేసే శక్తి ఉన్న ఆకస్మిక సంఘటనలనే వైపరీత్యాలు అంటారు. 'Hasard' అనే అరబిక్, Az-Zhar అనే ఫ్రెంచి పదాల నుంచి వైపరీత్యం (Haz-ard) అనే పదం వచ్చింది.

వైపరీత్యాలు అనేవి ప్రకృతి, మానవ చర్యల వల్ల లేదా రెండింటి వల్ల సంభవిస్తాయి. వైపరీత్యాలు సంభవించే కారణాల ఆధారంగా విపత్తులను కిందివిధంగా విభజించవచ్చు. అవి..

A) **భౌగోళిక వైపరీత్యాలు:** ఇవి భూనిర్మాణం లో వచ్చే మార్పుల వల్ల సంభవిస్తాయి. **ఉదా:** భూకంపాలు, సునామీలు, అగ్ని పర్వతాలు, భూపాతాలు, ఆనకట్టలు తెగిపోవడం, గనుల్లో అగ్నిప్రమాదాలు.

B) **నీరు, వాతావరణ సంబంధ వైపరీత్యాలు:** భూ వాతావరణంలో సంభవించే మా ర్పుల వల్ల ఏర్పడతాయి.
ఉదా: చక్రవాతాలు, టోర్నడోలు, వరదలు, కరువు, కుంభవృష్టి, భూపాతం, హిమ సంపాతాలు, వేడి, శీతల గాలులు.


C) **జీవసంబంధ వైపరీత్యాలు:**
ఉదా: అంటు వ్యాధులు, తెగుళ్ల దాడులు, కలుషిత ఆహారం, సామూహిక జనహనన ఆయుధాలు.

D) **పర్యావరణ సంబంధిత వైపరీత్యాలు: ఉదా:** పర్యావరణ కాలుష్యం, అడవుల నరికివేత, ఎడారీకరణ.

E) **మానవ నిర్లక్ష్యం వల్ల ఏర్పడే వైపరీత్యాలు:** పారిశ్రామిక దుర్ఘటనలు, అగ్ని ప్రమా దాలు, చమురు ప్రమాదాలు, గ్యాస్ లీకేజీలు, రోడ్డు/ రైల్వే ప్రమాదాలు, భవ నాలు కూలిపోవడం, తొక్కిసలాటలు.

F) **సామాజిక- సహజ విపత్తులు:** ఇవి ప్రకృతి పరమైన, మానవ ప్రేరేపిత కారణాలు రెం డింటి వల్ల ఏర్పడతాయి.
ఉదా: వరదలు, దుర్భిక్షం, భూపాతాలు.

వైపరీత్యాలు సంభవించే వేగం, ప్రభావ కాలం ఆధారంగా వీటిని రెండు రకాలుగా విభజించవచ్చు. అవి..



1) **Rapid-Onset Hazards:** ఇవి ఆకస్మి కంగా సంభవిస్తాయి. వీటి ప్రభావం స్వల్పకాలం లేదా దీర్ఘకాలం ఉండొచ్చు. **ఉదా:** భూకంపాలు, సునామీలు, వరదలు, చక్రవాతం, అగ్నిపర్వత విస్ఫోటనాలు.

2) **Slow - Onset Hazards:** ఇవి చాలా నెమ్మదిగా సంభవిస్తాయి. వీటి ప్రభావం సుదీర్ఘకాలం ఉంటుంది.
ఉదా: పర్యావరణ క్షీణత, తెగుళ్ల దాడి, దుర్భిక్షం.

విపత్తు నిర్వహణపై 1999లో కె.సి. పంత్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన 'అత్యున్నతాధి కారిక కమిటీ' (High Powered Com-mittee) దేశంలోని వివిధ ప్రాంతాల్లో 31 రకాల వైపరీత్యాలను గుర్తించి, వాటిని 5 సబ్ గ్రూపులుగా విభజించింది. 2005లో ఏర్పాటు చేసిన విపత్తు నిర్వహణ సంస్థ 'వేడిగాలులను' వైపరీత్యంగా పేర్కొనలేదు. అన్ని వైపరీత్యాలు విపత్తు రూపాన్ని పొందలేవు. కొన్ని మాత్రమే విపత్తు రూపాన్ని సంతరించుకుంటాయి. ఒక వైపరీత్యాన్ని విపత్తుగా గుర్తించాలంటే ఆ ప్రాంతంలో కింద తెలిపిన నష్టాలు జరిగి ఉండాలి. అవి..

1. ధన, ప్రాణ నష్టం అధికంగా ఉండాలి.
2. ప్రజల జీవనోపాధి దెబ్బతిని ఉండాలి.
3. ఆ ప్రాంత పర్యావరణ, సాంస్కృతిక వనరులు దెబ్బతిని ఉండాలి.
4. గాయాల బారిన పడినవారి సంఖ్య అధికంగా ఉండాలి.
5. వైపరీత్యం సంభవించిన ప్రాంతంలో జనాభా పరిమాణం, సాంద్రత అధికంగా ఉండాలి.

దుర్బలత్వం (Vulnerability)

ఏదైనా ఒకే భౌగోళిక ప్రాంతంలో సంభవించే వైపరీత్యం వల్ల అక్కడ ఉన్న సమాజంలో నష్ట తీవ్రతను పెంచే కారకాలనే ఆ ప్రాంత దుర్బలత్వం అంటారు. **ఉదా:** 2001 గుజరాత్ లోని 'భుజ్' ప్రాంతంలో సంభవించిన భూకంపం కారణంగా శివారు ప్రాంతాల్లో నివ సిస్తున్నవారి కంటే ఇరుకైన రోడ్లు, ఎత్తయిన, సురక్షితం కాని భవనాలు, అధిక జనసాంద్రత ఉన్న, నిరుపేదలు నివసిస్తున్న భుజ్ పాత నగరానికి చెందినవారే ఎక్కువ గాయపడ్డారు, మరణించారు. శివారు ప్రాంతాల ప్రజలు విశాలమైన రోడ్లను కలిగి ఉండటమే కాకుండా, జనసాంద్రత తక్కువగా ఉండి, ఒకటి లేదా రెండు అంతస్తుల భవనాలనే కలిగి ఉండటం వల్ల ఆయా ప్రాంతాల్లో నష్ట తీవ్రత తక్కువగా ఉంది.

సామర్థ్యం (Capacity)

ఏదైనా భౌగోళిక ప్రాంతంలో సంభవించే వైపరీత్యం వల్ల జరిగే నష్ట తీవ్రతను తట్టుకొని తిరిగి జీవనోపాధిని పునరుద్ధరించుకునే అవ కాశా లున్న ఒక సమాజం స్థితిని దాని సామర్థ్యంగా పేర్కొనవచ్చు. **ఉదా:** రిక్టరు స్కేలుపై 6 తీవ్రత ఉన్న భూకంపం మురికివాడలో సంభవించినప్పుడు ప్రాణనష్టం, గాయాల బారిన పడినవారి సంఖ్య, జీవనోపాధి ని పునరుద్ధరించుకోలేని వారి సంఖ్య అధికంగా ఉంటుంది. అక్కడి సమాజానికి దుర్బల పరిస్థితుల నుంచి కోలుకునే సామర్థ్యం తక్కువగా ఉండటమే దీనికి కారణం. అదే బంజారాహిల్స్ లాంటి ప్రాంతాల్లో రిక్టర్ స్కేలుపై 8 తీవ్రత ఉన్న భూకంపం సంభవించినా నష్ట తీవ్రత తక్కువగా ఉంటుంది. దీనికి కారణం అక్కడ పేదరికం, బలహీనమైన ఇళ్లు, ఇరుకైన రోడ్లు లాంటి దుర్బల పరిస్థితులు లేకపోవడం. అంటే ఈ ప్రాంతానికి దుర్బలత్వాన్ని ఎదుర్కొనే సామర్థ్యం ఎక్కువగా ఉంది అని అర్థం.

ఆపద (లేదా) విపత్కర స్థితి (Risk)

వైపరీత్యాలు, దుర్బల పరిస్థితుల మధ్య పరస్పర చర్యల కారణంగా ఒక సమాజ ఆర్థిక కార్య కలాపాల్లో అంతరాయం, పర్యావరణ క్షీణతతో పాటు మరణా లు, గాయాలు, ఆస్తి, జీవ నోపాధి దెబ్బతినడం లాంటి పర్యవసానాలు జరిగే సంభావ్యతనే ఆపద అంటారు. దీన్ని కిందవిధంగా వ్యక్తపరచ వచ్చు.

విపత్కర స్థితి (ఆపద) =
(వైపరీత్యం × దుర్బలత్వం)/ సామర్థ్యం

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో 'విపత్తు'కు సంబంధించి సరైన వాక్యాన్ని గుర్తించండి.
ఎ) అనుకోకుండా సంభవించే ఒక దుర్ఘటన
బి) నియంత్రించడానికి వీలు లేని దుర్ఘటన
సి) ప్రకృతి (లేదా) మానవ చర్యల వల్ల కలిగే దుర్ఘటన
డి) పైవన్నీ

2. భూనిర్మాణంలో వచ్చే మార్పుల వల్ల (విరూపాకార కారకాల వల్ల) సంభవించే వైపరీత్యానికి ఉదాహరణ ఏది?
ఎ) చక్రవాతాలు బి) వరదలు
సి) దుర్భిక్షం డి) భూకంపాలు

3. ఒక సమాజం విపత్తుకు గురయ్యే సున్నితత్వాన్ని లేదా ఘటనను ప్రతిస్పందించే సామర్థ్యాలను దెబ్బతీసే భౌతిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ కారకాల సమూహాన్ని ఏమని పిలుస్తారు?
ఎ) వైపరీత్యం బి) విపత్తు
సి) విపత్కర స్థితి డి) దుర్బలత్వం

4. కిందివాటిలో నాలుగు రకాల విపత్తులు (కరువు, వరదలు, చక్రవాతం, భూ కంపం) ఎదుర్కొనే రాష్ట్రం ఏది?
ఎ) ఉత్తరప్రదేశ్
బి) పశ్చిమబెంగాల్
సి) ఆంధ్రప్రదేశ్ డి) ఒడిశా

5. విపత్తులకు సంబంధించి కిందివాటిలో వాస్తవం ఏది?
ఎ) ఒక ప్రాంతం ఒకే రకమైన విపత్తుకు లోనవుతుంది
బి) విపత్తు సహజ లేదా మానవ తప్పి దాల వల్ల సంభవించవచ్చు
సి) విపత్తు ఎల్లప్పుడు మీడియాలో విస్తృతంగా ప్రసారమవుతుంది
డి) విపత్తు ముందుగా తెలిసి, క్రమంగా ప్రారంభమవుతుంది

6. కిందివాటిలో పర్వత ప్రాంతాల్లో ఏర్పడే వైపరీత్యం ఏది?
ఎ) భూకంపాలు
బి) భూపాతాలు
సి) కుండపోత వర్షాలు
డి) పైవన్నీ

7. కిందివాటిలో పర్యావరణ క్షీణత వల్ల ఏర్పడే వైపరీత్యం ఏది?
ఎ) వరదలు బి) దుర్భిక్షం
సి) భూపాతం డి) భూకంపాలు

8. 1999లో కె.సి. పంత్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన 'అత్యున్నతాధికారిక కమిటీ' దేశం లో ఎన్ని రకాల విపత్తులను గుర్తించింది?
ఎ) 20 బి) 10
సి) 21 డి) 31

9. కిందివాటిలో ప్రకృతి పరమైన, మానవ ప్రేరేపితమైన విపత్తు కానిదేది?
ఎ) అడవుల కార్చిచ్చు
బి) దుర్భిక్షం సి) భూపాతం
డి) అగ్నిపర్వతాలు

10. సునామీలను ఏ సంవత్సరం తర్వాత విపత్తుల జాబితాలో చేర్చారు?
ఎ) 2001 బి) 1989
సి) 2004 డి) 2005

11. ఏదైన భౌగోళిక ప్రాంతంలో ప్రజా జీవనా నికి, ఆస్తులకు నష్టాన్ని కలుగజేసే శక్తి ఉన్న ఆకస్మిక సంఘటనలను ఏమని పిలుస్తారు?
ఎ) విపత్తులు
బి) దుర్బలత్వం
సి) వైపరీత్యం
డి) విపత్కర స్థితి

12. 'ఆపద' అనే ఫలితాన్ని (Risk) కింది విధంగా వ్యక్తపర్చవచ్చు?
ఎ) (వైపరీత్యం × సామర్థ్యం)/ దుర్బలత్వం
బి) (వైపరీత్యం × దుర్బలత్వం)/ సామర్థ్యం
సి)(వైపరీత్యం × సామర్థ్యం)/ విపత్కర స్థితి
డి)(విపత్కర స్థితి× సామర్థ్యం)/ వైపరీత్యం

13. కింద తెలిపిన ఏ సందర్భాల్లో వైపరీత్యం విపత్తుగా మారుతుంది?
ఎ) సమాజంలోని ఒక వర్గం ప్రజల ఆస్తి, ప్రాణ నష్టాలకు వైపరీత్యం కారణమైనప్పుడు
బి) వైపరీత్యం మానవ సంచారం లేని ప్రాంతాల్లో సంభవించినా, దీర్ఘకా లంలో సమీప మానవ సమాజాల్లో దాని ప్రభావం ఉన్నప్పుడు
సి) ప్రభావిత ప్రాంత ప్రజల జీవనోపాధి దెబ్బతిని, వారు నిరాశ్రయులు అయినప్పుడు
డి) పైవన్నీ

14. అత్యంత దుర్బలత్వ ప్రాంతాల్లో, అతి తీవ్రత ఉన్న వైపరిత్యం సంభవిస్తే అది దేనికి దారి తీస్తుంది?
ఎ) బలమైన విపత్తు
బి) బలహీన విపత్తు
సి) ఏ ప్రమాదం ఉండదు
డి) ఏమీ చెప్పలేం

15. కిందివాటిలో మానవ నిర్లక్ష్యం వల్ల సంభవించే విపత్తులు?
ఎ) అడవుల కార్చిచ్చు
బి) అణు విస్ఫోటనాలు
సి) రోడ్డు, రైల్వే ప్రమాదాలు
డి) పైవన్నీ

సమాధానాలు

1) డి 2) డి 3) డి 4) బి 5) బి
6) డి 7) బి 8) డి 9) డి 10) సి
11) సి 12) బి 13) డి 14) ఎ 15) డి.

మాట్లాడే భాషలో సాధారణంగా కనిపించే లక్షణం



శాసన భాష

శాసనాల్లో వినియోగించిన భాషనే శాసన భాష అంటారు. ప్రాఙ్నన్నయ యుగం నాటి ప్రాచీనాంధ్ర భాషా స్వరూపాన్ని గుర్తించడానికి శాసనాలు ముఖ్య ఆధారాలు. క్రీ.పూ 200 నుంచి క్రీ.శ 1000 వరకున్న కాలాన్ని సాహితీ చరిత్ర కారులు ప్రాఙ్నన్నయ యుగంగా నిర్ధారించారు. నన్నయకు పూర్వం రాజులు, సామంతరాజులు తమ జైత్రయాత్రల్లో కొత్త రాజ్యాలు, భూభాగాలను గెలిచినప్పుడు పండితులు, పురోహితులకు అగ్రహారాలు దానం చేసేవారు. మత ధార్మిక విషయాలను చాటిచెప్పేందుకు శాసనాలు వేయించేవారు. శాసనాలు రెండు రకాలు. ఒకటి శిలా శాసనాలు. రెండు తామ్ర శాసనాలు.

శాసనాల స్వరూపాన్ని బట్టి భాషావేత్తలు ప్రాఙ్నన్నయ యుగాన్ని రెండు భాగాలుగా వర్గీకరించారు. క్రీ.పూ 200 నుంచి క్రీ.శ 575 వరకు ఉన్న కాలాన్ని తొలి దశగా, క్రీ.శ 575 నుంచి క్రీ.శ 1000 వరకు ఉన్న కాలాన్ని మలిదశగా పేర్కొన్నారు. తొలి దశలో శాసనాలన్నీ సంస్కృత, ప్రాకృత శాసనాలు. వాటిలో అక్కడక్కడా వ్యక్తి నామాలు, గ్రామ నామాలు, సంఖ్యా వాచకాలు, విశేషణాలు మాత్రం తెలుగులో ఉన్నాయి. క్రీ.శ 575లో కడప జిల్లా కమలాపురంలో ఎరుకల్ ముత్తురాజు వేయించిన ఎర్రగుడిపాడు శాసనాన్ని తొలి గద్య శాసనంగా భాషావేత్తలు గుర్తించారు. అదే కాలానికి చెందిన ధనుంజయుని కలమళ్ల శాసనాన్ని ఇటీవల కొందరు పరిశీలకులు తొలి గద్య శాసనంగా పేర్కొన్నారు. దీన్ని భాషావేత్తలు నిర్ధారించాల్సి ఉంది. పుణ్యకుమారుడి పొట్లదుర్తి మాలెపాడు శాసనం (క్రీ.శ 610)లో ఎక్కువ తెలుగు పదాలు ఉన్నాయి. జయసింహవల్లభుని విప్పర్ల శాసనం (క్రీ.శ 640)లో తెలుగు, సంస్కృతం కలిసిన పదాలు ఉన్నాయి.

తెలుగులో తొలి పద్య శాసనం అద్దంకి పండరంగని శాసనం (క్రీ.శ 848). అందులో తరువోజ పద్యాలు ఉన్నాయి. అదే కాలానికి చెందిన గుణగ విజయాదిత్యుని కందుకూరి శాసనం (క్రీ.శ 848)లో సీస పద్యం ఉంది.

బెజవాడ యుద్ధమల్లుని శాసనంలో (క్రీ.శ 885) మధ్యాక్కర పద్యాలు ఉన్నాయి. గూడూరు విరియాల కామసాని శాసనంలో (క్రీ.శ 1000) చంపక, ఉత్పలమాలలు ఉన్నాయి. ధర్మవరం శాసనంలో ఆటవెలది పద్యాలు ఉన్నాయి. కె.వి.సుబ్రహ్మణ్య అయ్యర్ ప్రచురించిన దక్షిణ హిందూ దేశ శాసనాల సప్తమ సంపుటి లో 27 తెలుగు శాసనాలు ఉన్నాయి. డా. బూదరాజు రాధాకృష్ణ ప్రాఙ్నన్నయ యుగంలోని 269 తామ్ర శాసనాలను నిశితంగా పరిశోధించి ప్రచురించారు. జయంతి రామయ్య పంతులు సంపాదకత్వంలో దక్షిణ హిందూ దేశ శాసనాల పదో సంపుటిలో 781 తెలుగు శాసనాలను ప్రచురించారు. 14వ శతాబ్దం నాటికి దాదాపు రెండువేల శాసనాలు ప్రచురితమైనట్లు భాషావేత్తలు నిర్ధారించారు. తొలిదశ శాసనాల్లో కొన్నింటిలో బ్రాహ్మీలిపి, ఇంకొన్నింటిలో కొంత భాగం దేవనాగరిలిపి, మరికొంత భాగం తెలుగు-కన్నడ లిపి ఉన్నాయి. కొన్ని శాసనాలు వేంగీచాళుక్యుల లిపిలో ఉన్నాయి. అప్పట్లో భాష ద్రవరూపంలో ఉన్నందున స్పష్టత, నిబద్ధత శాసన భాషలో కనిపించదు. శాసన భాషలో 23 హల్లులు, 10 అచ్చులు గల దేశ్య వర్ణమాల ఉండేది. వీటిలో లేఖన దోషాలు విరివిగా కనిపి స్తాయి. రేఫ బదులు వలపలి గిలక ఉపయోగిం చేవారు.

- శాసన భాషలో కనిపించే 'ఱ' వర్ణం క్రమేపి తెలుగులో డ కారంగా, రేఫగా మారింది.
- శాసనభాషలో అనుస్వరానికి బదులు వర్గ పంచమాక్షరాన్ని సంయుక్తంగా రాసేవాళ్లు.
ఉదాహరణ: పణ్డు (పండు)
- శాసనభాషలో శకట రేఫ ప్రయోగం విరివిగా ఉంది.
- నేటి భాషలో శకట రేఫకు బదులు సాధు రేఫను ఉపయోగిస్తున్నారు. శకట రేఫ అదృశ్యమైపోయింది.
- శాసన భాషలో ఉన్న 'ఙ', 'ళ'లు నేటి భాషలో 'న', 'ల' లుగా మారాయి.
ఉదా: ఆణ్తి – (ఆనతి), సంవత్సరంబుళ్తు (సంవత్సరంబుల్తు).
- సంస్కృత శాసనాల్లో గ్రామ నామాలను సంస్కృతీకరించిన రూపాలున్నాయి. ఉదా: చేబ్రోలు (తామ్రపురీ), కొలను (సారసపురీ)
- శాసన భాషలో ఎన్నో భాషా విశేషాలు గమనించవచ్చు.
- తొలి తెలుగు మాట 'నాగబు' పదం (క్రీ.శ.మొదటి శతాబ్ది) అని వేటూరి ప్రభాకరశాస్త్రి నిర్ధారించారు.
- తెలుగు భాష ప్రాచీనతను నిర్ధారించే సందర్భంలో ఫిబ్రవరి, 2006లో కొత్తూరు శాస నం (క్రీ.పూ 2 వ శతాబ్ది)లోని 'తమ్బయ' పదాన్ని తొలి తెలుగు మాటగా భాషా వేత్త లు నిర్ధారించారు.

గ్రాంథిక భాష

ఆదికవి నన్నయ నుంచి చిన్నయసూరి వరకు కావ్య రచనలో ఉపయోగించిన వ్యాకరణ నియమబద్ధమైన భాషనే గ్రాంథిక భాష అంటారు. 19వ శతాబ్ది ఉత్తరార్థం నాటికి గ్రాంథిక భాషే ప్రామాణిక భాషగా ఉండేది. గ్రాంథిక భాషను సమర్థిస్తూ, వ్యావహారిక భాషను నిరసిస్తూ జయంతి రామయ్య పంతులు ఆధ్వర్యంలో కాకినాడలో ఆంధ్ర సాహిత్య పరిషత్తు సంస్థ ఏర్పడింది. వేదం వేంకటరాయశాస్త్రి, కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి, వావిలకొలను సుబ్బారావు త దితరులు దీనిలో సభ్యులు. గ్రాంథిక భాషను సమర్థిస్తూ, గిడుగు రామ్మూర్తి, గురజాడ అప్పా రావుల వ్యావహారిక భాషోద్యమాన్ని అవహేళన చేస్తూ పానుగంటి లక్ష్మీనరసింహారావు 'గ్రామ్య వాదుల భాషాపవాదం' అనే గ్రంథాన్ని రచిం చారు.

మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో 1912, డిసెంబరు 11, 12 తేదీల్లో వావిలకొలను సుబ్బారావు అధ్యక్ష తన జరిగిన సదస్సులో తెలుగు భాష ఔన్నత్యాన్ని గొప్పగా ప్రశంసించారు. అక్షరసంఖ్యను బట్టి చూసినా తెలుగు.. ఇంగ్లిష్ భాష కంటే అభివృద్ధి చెందిందని అన్నారు. గ్రాంథిక భాష ఉత్కృష్టతను వివరిస్తూ, ఆ భాషలో అన్యదేశ్యాలు కొద్దిగా ఉన్నా మాండలి కాలు లేవన్నారు. వ్యావహారిక భాషకు వ్యాకర ణం, నిఘంటువు లేనందున వ్యావహారికంలో రచనలు చేయడం తగదని అధిక్షేపించారు.

జయంతి రామయ్య పంతులు.. గిడుగు వారి 'ఎ మెమోరాండమ్ ఆఫ్ మోడరన్ తెలుగు' వ్యాసాన్ని ఖండిస్తూ 'ఎ డిఫెన్స్ ఆఫ్ లిటరరీ తెలుగు' అనే వ్యాసాన్ని ప్రచురించారు.

గ్రాంథిక భాష మహాకవుల ప్రయోగాల నుంచి సిద్ధించినందున అది గొప్పదని, దాన్ని అనుసరించడం మంచిదని వాదించేవారు. వ్యావహారిక భాష శిష్టేతరుల వ్యవహారికం నుంచి సిద్ధించినందున దానికి ప్రామాణికత, సంస్కారం లేవని వారి ఆరోపణ. గ్రాంథిక భాష నన్నయ నుంచి ఆధునిక యుగం వరకు మారకుండా స్థిరంగా ఉన్నందున ప్రామాణిక వ్యవహారానికి అది అనుకూలమని వారి అభిప్రాయం. కందుకూరి వీరేశలింగం గారి ప్రత్యర్థి కొక్కొండ వెంకటరత్నం పంతులు నిత్య వ్యవహారంలో గ్రాంథిక భాషనే మాట్లాడేవారు.

సరళ గ్రాంథిక భాష

గ్రాంథికభాషలో మారుమూల తెలుగు పదాలు, కన్నడ పదాలతో అర్థం కాని సంస్కృత పదాలు, కఠోరమైన వ్యాకరణ నియమాలు, అన్యదేశ్యాలున్నందున గ్రాంథిక భాషావాదులు పనికట్టుకొని వాటిని తొలగించే ప్రయత్నం చేశారు. పెద్ద సంక్లిష్ట వాక్య నిర్మాణాలతో గ్రాంథిక భాష చదివేందుకు, రాసేందుకు కఠినంగా ఉన్నందున ఈ లోపాలను సవరించాలన్న నిర్ణయంతో సరళ గ్రాంథిక వాదులు చిన్నచిన్న సమాసాలు, సరళమైన సామాన్య వాక్యాలు, ప్రసిద్ధమైన తెలుగు, సంస్కృత పదాలతో రచనలు చేయాలని నిర్ణయించారు. అందమైన తెలుగు నుడికారాలు, జాతీయాలు, సామెతలతో, ఆకర్షణీయమైన శైలిలో తిరుపతి వేంకటకవులు, విశ్వనాథ సత్యనారాయణ, పుట్టపర్తి నారాయణాచార్యులు, రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, దివాకర్ల వేంకటావధాని, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, వేలూరి శివరామశాస్త్రి మొదలైనవారు సరళ గ్రాంథిక శైలిలో రచనలు చేసి పాఠకులను కొంతమేర ఆకర్షించ గలిగారు. 20వ శతాబ్ది పూర్వార్థంలో నవలలు, కథానికలు, పత్రికా రచనలు, ఆధునిక విజ్ఞాన శాస్త్ర గ్రంథాలు, వ్యాసాలు సరళ గ్రాంథిక శైలిలో వచ్చాయి.

గ్రాంథిక భాషా సమర్థనతో వచ్చిన రచనలు

1. ఎ డిఫెన్స్ ఆఫ్ మోడరన్ లిటరరీ తెలుగు
– **జయంతి రామయ్య పంతులు**
2. గ్రామ్యవాదుల భాషాపవాదం
– **పానుగంటి లక్ష్మీనరసింహారావు**
3. ఆధునికాంధ్ర వాఙ్మయ వికాస వైఖరి
– **జయంతి రామయ్య పంతులు**

మాదిరి ప్రశ్నలు

1. శాసనాల్లో తత్సమ శబ్దాలకు తెలుగు పద్ధతిలో సంధి చేయడానికి ఉదాహరణ?
ఎ) మన్స్యణ్ణ బి) నీలీశ్వర
సి) మీనవమ్మ డి) తిక్కనయ్య

2. శిష్టోచ్చారణలో జరిగే మార్పు?
ఎ) హ కారం పోతుంది
బి) చకారం సకారమవుతుంది
సి) శ-ష-సల భేదం ఉంటుంది
డి) హల్లులు సమీకరణ పొందుతాయి

3. క్రీ.శ 1100 ముందునాటి శాసనాల్లో కనిపించే దేశ్య తత్సమ మిశ్ర సమాసాలు?
ఎ) కణ్ణసామి, గొల్లపల్లు
బి) అమృతపడి జయమాడ
సి) చౌషష్ఠ, ఘనరాచమణి
డి) దేవానొజ్జ, మొగమాడున్

4. శాసనభాషలో స్త్రీ, పురుషోభయ వాచకాలైన ప్రత్యయాలు?
ఎ) అయ్య, అన్న బి) అవ, ఇయ
సి) పిడుగు, పోతు డి) అమ్మ, పోటి

5. భాషా చరిత్రకు ముఖ్యమైన జయసింహవల్లభుని శాసనం?
ఎ) బెజవాడ బి) అద్దంకి
సి) మైదవోలు డి) విప్పర్ల

6. శాసనాల్లో కనిపించని ప్రసిద్ధమైన ఛందస్సు
ఎ. ఉత్పలమాల బి. చంపకమాల
సి. శార్దూలం డి. కందం

7. శాసన భాషలో 'ళ' వర్ణం ఏ శతాబ్ది వరకు కనిపిస్తుంది?
ఎ) క్రీ.శ 5వ శతాబ్ది బి) క్రీ.శ 6వ శతాబ్ది
సి) క్రీ.శ 9వ శతాబ్ది డి) క్రీ.శ 10వ శతాబ్ది

8. గూడూరు కామసాని శాసనంలో ఉన్న పద్యాల ఛందస్సు?
ఎ) రెండు చంపకమాలలు- మూడు ఉత్పలమాలలు
బి) మూడు చంపకమాలలు – రెండు ఉత్పల మాలలు
సి) ఒక ఉత్పలమాల- నాలుగు చంపక మాలలు
డి) నాలుగు చంపకమాలలు-ఒక తేటగీతి

9. జన వల్లభుడి హర్కానల శాసనంలో ఉన్న పద్య ఛందస్సు?
ఎ) తేటగీతి బి) మధ్యాక్కర
సి) కందం డి) ఆటవెలది

10. పొట్లదుర్తి మాలెపాడు శాసనం వేయించిన రాజు
ఎ) ఎరుకల్ ముత్తురాజు
బి) జయసింహ వల్లభుడు
సి) రేనాటి పుణ్యకుమారుడు
డి) గుణగ విజయాదిత్యుడు

11. 1910లో ప్రారంభమైన భాషోద్యమం?
ఎ) గ్రాంథిక బాషోద్యమం
బి) ప్రామాణిక భాషోద్యమం
సి) అధికార భాషోద్యమం
డి) వ్యావహారిక భాషోద్యమం

12. గ్రాంథిక భాషలో 'ప్రొండెనుగు కమ్మ' పుస్తకం రచించిన పండితుడు
ఎ) గురజాడ అప్పారావు
బి) గిడుగు రామ్మూర్తి పంతులు
సి) కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రి
డి) జయంతి రామయ్య పంతులు

13. నిత్య వ్యవహారంలో గ్రాంథిక భాషనే మాట్లాడిన పండితుడు?
ఎ) కందుకూరి వీరేశలింగం
బి) వేదం వేంకటరాయ శాస్త్రి
సి) కొక్కొండ వెంకటరత్నం పంతులు
డి) జయంతి రామయ్య పంతులు

14. గ్రాంథిక భాషా పరిరక్షణకు నిర్వహించిన పత్రిక
ఎ) ఆంధ్ర భారతి బి) ఆంధ్ర పత్రిక
సి) భారతి డి) ఆంధ్ర సాహిత్య పరిషత్

సమాధానాలు

1. బి; 2. సి; 3. సి; 4. బి; 5. డి;
6. సి; 7. బి; 8. బి; 9.సి; 10. సి
11. డి; 12. బి; 13.సి; 14.డి.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. 'ప్రాణ సమానుండవైన చెలివి' అన్న శాసన ప్రయోగం
ఎ) నామవాచకం మీద ప్రథమ పురుష ఏకవచన ప్రత్యయం చేరింది.
బి) నామవాచకం మీద ఉత్తమ పురుష ఏకవచన ప్రత్యయం చేరింది.
సి) నామవాచకం మీద మధ్యమ పురుష ఏకవచన ప్రత్యయం చేరింది.
డి) నామవాచకం మీద ప్రథమ పురుష బహువచన ప్రత్యయం చేరింది.

2. శాసనభాషలో కనిపించే వెలసును అనే తద్ధర్మార్థక రూపానికి ధాతు రూపం?
ఎ) వెలుచు బి) వేచు
సి) వెలుగు డి) వెలయు

3. శాసనభాషలో క్రీ.శ 6వ శతాబ్దికి ఈ విశిష్టత ఉంది?
ఎ) శాసనంలో తెలుగురాజుల పేర్లుండటం
బి) శాసనాల్లో తెలుగు రాజ్యాల ప్రత్యేక ప్రస్తావన
సి) మొత్తం తెలుగులో ఉన్న శాసనాలు లభించడం
డి) శాసనాల్లో తెలుగు పదాలు ఉండడం

4. 100 సంఖ్యను సూచించే తెలుగు శబ్దాల్లో ప్రాఙ్నన్నయ యుగ శాసన భాషలో కనిపించని శబ్దం?
ఎ) శతము బి) నూట
సి) వంద డి) నూఱు

5. ఎక్కువమంది ప్రజలకు సమ్మతంగా ఉండటం లక్షణంగా కలది?
ఎ) జానపద భాష
బి) వ్యావహారిక భాష
సి) ప్రామాణిక భాష
డి) మాండలిక భాష

6. మాట్లాడే భాషలో సాధారణంగా కనిపించే లక్షణం?
ఎ) చందోబద్ధత
బి) సుదీర్ఘ వాక్య నిర్మాణం
సి) సమాచార పునరుక్తి
డి) దీర్ఘ సమాస భూయిష్ఠత

సమాధానాలు

1) సి 2) డి 3) సి
4) సి 5) సి 6) సి

సిగ్నల్స్‌లో ఎరుపు రంగు వాడటానికి కారణం?

పరమాణు నిర్మాణం

ద్రవ్యరాశి ఉండి కొంత ప్రదేశాన్ని ఆక్రమించే ధర్మమున్న దేనినైనా పదార్థం అంటారు. పురాతన కాలం నుంచే పదార్థ నిర్మాణాన్ని గురించి, పదార్థ మౌలిక కణాల గురించి వివిధ సిద్ధాంతాలు ప్రతిపాదించారు. పదార్థం అతిసూక్ష్మ కణాలైన 'అణువు', 'పరమాణువు'ల సమ్మిళితమని 'కణాదుడు' అనే మహర్షి వేదకాలంలోనే ప్రతిపాదించాడు. తర్వాత గ్రీక్ తత్వవేత్త 'డిమోక్రటిస్' పదార్థాలు అతి సూక్ష్మమైన 'పరమాణువులు' కలిగి ఉంటాయని ప్రతిపాదించాడు. గ్రీక్ భాషలో 'ఆ్టారు (పరమాణువు)' అంటే విభజించే వీలు కానిది అని అర్థం. ఒక సిద్ధాంత రూపంలో వివరించింది మాత్రం 'జాన్ డాల్టన్' (క్రీ.శ. 1808) అనే శాస్త్రవేత్త. ఈ సిద్ధాంతం ప్రకారం పదార్థం 'అవిభాజ్యమైన అత్యంత సూక్ష్మ కణమే' పరమాణువు. ఒక మూలకానికి చెందిన పరమాణువులన్నీ ఒకేరకంగా ఉండి ఒకే ధర్మాలను కలిగి ఉంటాయి. 20వ శతాబ్దం లో జరిగిన అనేక పరిశోధనల ఫలితాల్లో పరమాణువులో ఎన్నో మౌలిక కణాలున్నాయని తేలింది. వాటిలో ముఖ్యమైనవి ఎలక్ట్రాన్, ప్రోటాన్, న్యూట్రాన్‌లు. వీటినే ప్రాథమిక లేదా మౌలిక కణాలంటారు.

- జె.జె. థామ్సన్ 'విద్యుత్ ఉత్సర్గ నాళికా' ప్రయోగంలో కనుగొన్న 'రుణ విద్యుత్ కిరణాల'కు జె.జె. స్టోనీ అనే శాస్త్రవేత్త 'ఎలక్ట్రాన్‌లు'అని నామకరణం చేశాడు. ఏకమాత్ర రుణావేశం ఉన్న ఈ కణాలు అత్యంత తేలికైనవి. ప్రోటాన్ ద్రవ్యరాశిలో 1/1836వ వంతు ఉంటుంది.
- గోల్డ్ స్టెయిన్ కనిపెట్టిన ధన ధృవకిరణాలే ప్రోటాన్‌లు. ఇవి ఏకమాత్ర ధనావేశం ఉన్న ఎలక్ట్రాన్ల ద్రవ్యరాశి కంటే 1837 రెట్లు అధిక ద్రవ్యరాశిని కలిగి ఉంటాయి.
- ప్రాథమిక కణాల్లో అత్యంత భారమైన, ఆవేశ రహిత కణాలు న్యూట్రాన్లు. వీటిని జేమ్స్ చాడ్విక్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు.
- పరమాణువులో ఎలక్ట్రాన్లు, ప్రోటాన్లు, న్యూట్రాన్ల అమరికను 'పరమాణు నమూనా' అంటారు. జె.జె. థామ్సన్, రూథర్ ఫర్డ్, నీల్స్ బోర్‌లు ప్రతిపాదించిన పరమాణు నమూనాలు ముఖ్యమైనవి.
- 'పుచ్చపండు' నమూనాగా ప్రసిద్ధి చెందిన థామ్సన్ నమూనాలో పుచ్చపండు గుజ్జు లో గింజలు పొదిగినట్లు ధనావేశ పూరిత పరమాణు కేంద్రకంలో ఎలక్ట్రాన్‌లన్నీ పొ దిగి ఉంటాయని ప్రతిపాదించారు. వ్యతిరేక ఆవేశాలు ఉన్న ఎలక్ట్రానులు, ప్రోటాన్లను కలిపి ఉంచడం సాధ్యం కాదు. కా బట్టి ఈ నమూనా తిరస్కారానికి గురైంది.
- 'గ్రహమండల నమూనా'గా పేరు గాంచిన రూథర్‌ఫర్డ్ నమూనా ప్రకారం పరమాణు ద్రవ్యరాశి, ధనావేశ పరమాణు కేంద్రం వద్ద కేంద్రీకృతమై ఉంటుంది. దీన్నే పరమాణు కేంద్రకం అంటారు. దాని చుట్టూ ఎలక్ట్రాన్‌లు వృత్తాకార కక్ష్యల్లో తిరుగుతూ ఉంటాయని ప్రతిపాదించారు. ఈ నమూనాలోని లోపాలను



సవరిస్తూ కేంద్రకం చుట్టూ ఎలక్ట్రాన్‌లు సంచరించడానికి వృత్తాకార మార్గాల (కర్పరాలు)ను బోర్ నమూనా ప్రతిపాదించింది. బోర్ నమూ నా విజయవంతానికి కాంతి స్వభావం, పరమాణు వర్ణపటం, ప్లాంక్ క్వాంటం సిద్ధాంతం, ఐన్‌స్టీన్ కాంతి విద్యుత్ ఫలితం మొదలైన అంశాలు కారణమయ్యాయి.

కాంతి స్వభావం విద్యుదయస్కాంత వర్ణపటం

- కాంతికి కణ స్వభావంతో పాటు, తరంగ స్వభావం కూడా ఉంటుంది. కాంతి వివిధ విద్యుదయస్కాంత వికిరణాల సమూ హం. వీటి శక్తి తగ్గే క్రమం: కాస్మిక్ కిరణాలు > γ కిరణాలు > X – కిరణాలు > అతి నీలలోహిత(UV) కిరణాలు > దృగ్గోచర కిరణాలు > పరారుణ (IR) కిరణాలు > సూక్ష్మ తరంగాలు (Micro waves) టి.వి. తరంగాలు > రేడియో తరంగాలు.
- వీటి శక్తి తగ్గుతున్న కొద్దీ తరంగదైర్ఘ్యం పెరుగుతుంది. అంటే γ కిరణాల శక్తి ఎక్కు వ, తరంగదైర్ఘ్యం తక్కువ. రేడియో తరంగాలకు శక్తి తక్కువ,తరంగదైర్ఘ్యం ఎక్కువ.
- కోబాల్ట్-60 అనే రేడియో ధార్మిక మూలకం ఉద్గారం చేసే γ కిరణాలను క్యాన్సర్ కారక కణాలను నశింప చేయడానికి, కూరగాయలు, గింజ ధాన్యాలను ఎక్కువకాలం నిల్వ ఉంచేందుకు క్రిమిరహితం చేయడానికి ఉపయోగిస్తారు. లెడ్ నుంచి γ కిరణాలు ప్రయాణించవు.
- X కిరణాలను రాంట్‌జన్ కనిపెట్టాడు. కంటికి కనిపించని ఈ కిరణాలు మామూలు కాంతి చొచ్చుకుపోని పదార్థాల ద్వారా చొచ్చుకుని పోగలవు. విరిగిన ఎముకల గురించి, శరీరంలో ఇతర అంగవైకల్యాలు, పరిశ్రమల్లో పరికరాల్లోని పగుళ్ల గురించి తెలుసుకోవడానికి ఈ కిరణాలను విరివిగా వాడతారు. అణువుల నిర్మాణం, స్ఫటిక నిర్మాణం తెలుసుకోవచ్చు. కస్టమ్స్ శాఖ అధికారులు X–కిరణాలను ఉపయోగించి దొంగ రవాణా చేస్తున్న వస్తువులు, ఆయుధాల గురించి తెలుసుకుంటారు.
- అతినీలలోహిత కిరణాల (UV)ను నీటిని క్రిమిరహితం చేయడానికి, నకిలీ కరెన్సీ నోట్లను గుర్తించడానికి ఉపయోగిస్తారు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

రసాయన శాస్త్రం

- దృగ్గోచర కాంతి కంటికి కనిపిస్తుంది. ఇది VIBGYOR అనే ఏడురంగుల సమ్మిళితం.
- పరారుణ (IR) కిరణాలను టి.వి. రిమోట్‌లలో, చీకట్లో చూడడానికి ఉపయోగించే 'నైట్ విజన్' కళ్లద్దాలలో ఉపయోగిస్తారు.
- వంట చేయడానికి మైక్రో తరంగాలను ఉపయోగిస్తారు. నీరు, కొవ్వు కణాలను మైక్రో తరంగాలు కంపనం చెందించడం వల్ల వేడి జనించి పదార్థాలు ఉడుకుతాయి.
- అయనోస్ఫియర్ నుంచి అధిక తరంగ దైర్ఘ్యం ఉన్న రేడియో తరంగాలు పరివర్తనం చెందుతాయి. అందువల్ల వీటిని కమ్యూనికేషన్ల వ్యవస్థలో ఉపయోగిస్తారు.

మాదిరి ప్రశ్నలు

1. పరమాణు కేంద్రకంలో ప్రోటాన్లు ఉంటా యని తెలిపిన శాస్త్రవేత్త?
   1) బోర్ 2) రూథర్‌ఫర్డ్
   3) థాంసన్ 4) చాడ్విక్
2. మానవ శరీర అంతర నిర్మాణాన్ని చూడటానికి ఉపయోగించే కంప్యూటర్ టోమో గ్రఫీ (CT)కి ఆధారం?
   1) X–కిరణాలు 2) ధ్వని తరంగాలు
   3) అయస్కాంత అనునాదం
   4) రేడియో ఐసోటోపులు
3. రాత్రి చూడటానికి ఉపయోగించే పరికరాల్లో వాడే కిరణాలు?
   1) రేడియో తరంగాలు 2) మైక్రో తరంగాలు
   3) పరారుణ తరంగాలు 4) ఏవీ కావు
4. సిగ్నల్స్‌లో ఎరుపు రంగును వాడటానికి కారణం?
   1) ఎరుపు డేంజర్‌ను సూచించడానికి సింబాలిక్‌గా వాడతారు
   2) అల్ప తరంగదైర్ఘ్యం ఉండటం
   3) అధిక తరంగదైర్ఘ్యం ఉండటం
   4) చవకైంది
5. అయనోవరణం అనే భూ వాతావరణం లోని ఒక పొర, రేడియో కమ్యూనికేషన్లకు వీలు కలిగిస్తుంది. ఎందుకు?
   ఎ) ఓజోన్ ఉనికి వల్ల రేడియో తరంగాలు భూమిపైకి పరావర్తనం చెందడం
   బి) రేడియో తరంగాలకు సుదీర్ఘమైన తరంగదైర్ఘ్యం ఉండటం.
   పై వాటిలో సరైంది?
   1) ఎ మాత్రమే 2) బి మాత్రమే
   3) ఎ, బి 4) రెండూ కాదు
6. రాడార్‌లో ఉపయోగించే విద్యుదయ స్కాంత కిరణాలు?
   1) X–కిరణాలు 2) పరారుణ
   3) మైక్రో తరంగాలు 4) గామా
7. కాంతి విస్తరణను అధ్యయనం చేయడానికి ఉపయోగించే సాధనం?
   1) మైక్రోస్కోప్ 2) స్పెక్ట్రోమీటర్
   3) టెలిస్కోప్ 4) ఫొటోమీటర్
8. కిందివాటిలో సరైన వాక్యం?
   ఎ) కాస్మిక్ కిరణాలు అతి తక్కువ తరంగ దైర్ఘ్యం, అత్యధికశక్తి కలిగిన ఎలక్ట్రో మాగ్నటిక్ తరంగాలు
   బి) అన్ని విద్యుదయస్కాంతాలు కాంతి వేగం (3×10^8 మీ/సె)తో ప్రయాణి స్తాయి
   సి) ఓజోన్ పొర కాస్మిక్ కిరణాలను, అతి నీలలోహిత కిరణాలను భూమిని చేరకుండా ఫిల్టర్ చేస్తుంది
   డి) ఏదైనా పదార్థాన్ని మైక్రో తరంగాలు వేడి చేయాలంటే అందులో తప్పని సరిగా నీటి అణువులుండాలి
   1) ఎ మాత్రమే 2) ఎ, బి
   3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి
9. సూక్ష్మ తరంగ భట్టీ (Microwave Oven) ఏ గుణకాన్ని ఉపయోగిస్తుంది?
   1) నీళ్ల సూక్ష్మ తరంగ శోషణం
   2) వంటచేసే పాత్ర సూక్ష్మ తరంగ శోషణం
   3) వంట సూక్ష్మ తరంగ పరావర్తనం
   4) ఏదీ కాదు
10. సెల్‌ఫోన్‌లలో ఉపయోగించే విద్యుద యస్కాంత తరంగాలు?
    1) మైక్రో తరంగాలు 2) పరారుణ కాంతి
    3) రేడియో ఫ్రీక్వెన్సీ తరంగాలు
    4) కాస్మిక్ కిరణాలు

సమాధానాలు

1) 2; 2) 1; 3) 3; 4) 3; 5) 2;
6) 3; 7) 2; 8) 4; 9) 1; 10) 3

కాల్షియం, మెగ్నీషియం

ఆరోగ్యవంతమైన దంతాలు, ఎముకల కోసం కాల్షియం అత్యంత ఆవశ్యకమైంది. యుక్త వయసులో మానవ శరీరంలో సుమారు 25 గ్రాముల మెగ్నీషియం (Mg), 1200 గ్రాముల కాల్షియం (Ca) ఉంటాయి. శరీరంలో ఉండే కాల్షియంలో 99 శాతం ఎముకలు, దంతాల్లో ఉంటుంది. కండరాల్లోని నరాల పనుల్లోనూ, రక్తం గడ్డ కట్టడంలోనూ కాల్షియం ప్రముఖ పాత్ర పోషిస్తుంది.

కాల్షియం ముఖ్యమైన సమ్మేళనాలు: కాల్షియం కార్బొనేట్, కాల్షియం హైడ్రాక్సైడ్ సిమెంట్, జిప్సం, ప్లాస్టర్ ఆఫ్ పారిస్.

- సున్నపురాయి, సుద్ద, చలువరాతి ముక్కలను రసాయనికంగా 'కాల్షియం కార్బొనేట్ ($CaCO_3$)' అంటారు. సున్నపురాయిని బట్టీల్లో కాల్చినప్పుడు పొడిసున్నం (కాల్షియం ఆక్సైడ్) వస్తుంది. దీనికి పరిమితంగా నీటిని కలిపితే రాళ్లు పగిలి ముద్దగా మారుతాయి. ఈ ప్రక్రియనే 'స్లేకింగ్ ఆఫ్ లైమ్' అంటారు. ఇది కాల్షియం హైడ్రాక్సైడ్. విలీన కాల్షియం హైడ్రాక్సైడ్(సున్నపు తేట)ను మిల్క్ ఆఫ్‌లైమ్ అంటారు.
- గాజు తయారీ, చర్మం శుద్ధి, బ్లీచింగ్ పౌడర్ తయారీ, చక్కెర శుద్ధి ప్రక్రియల్లో కాల్షియం హైడ్రాక్సైడ్ ఉపయోగపడుతుంది.
- సున్నపురాయిని పొడిసున్నం తయారీలో వాడతారు.సిమెంట్ తయారీకి ప్రధాన ముడి పదార్థాలు- సున్నపురాయి, బంకమట్టి.
- ప్రత్యేకంగా అవక్షేపించిన కాల్షియం కార్బొనేట్‌ను మేలు రకం కాగితం తయారీలో, ఆమ్ల విరోధిగా, టూత్‌పేస్ట్‌లో సున్నితమైన అపఘర్షకంగా, చ్యూయింగ్ గమ్‌లో, సౌందర్య సాధనాల్లో పూరకంగానూ వాడతారు.
- కాల్షియం సల్ఫేట్ డై హైడ్రేట్ ($CaSO_4 . 2H_2O$)ను 'జిప్సం' అంటారు. దీన్ని ప్రత్యేక ఉష్ణోగ్రత 393K వద్ద వేడిచేస్తే 'ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ($CaSO_4 . ½H_2O$)' ఏర్పడుతుంది. దీన్ని గృహ నిర్మాణాల్లో, విరిగిన విగ్రహాలను అతికించడంలో, ఎముకలు కదలకుండా కట్టు కట్టడంలో, దంత వైద్యంలో, నగలు పోతపోయడానికి, విగ్రహాల తయారీలో ఉపయోగిస్తారు.
- సున్నం (కాల్షియం ఆక్సైడ్)తోపాటు సిలికా (SiO_2), అల్యూమినా(Al_2O_3), మెగ్నీషియం ఆక్సైడ్‌లతో కూడిన బంకమట్టి మిశ్రమమే 'సిమెంట్'.
- మొక్కల్లో ఉండే ఆకుపచ్చ వర్ణద్రవ్యం 'క్లోరోఫిల్'. ఇందులో ఉండే లోహ అయాన్ 'మెగ్నీషియం'.
- ఆమ్ల విరోధిగా పనిచేసే 'మెగ్నీషియం హైడ్రాక్సైడ్'ను 'మిల్క్ ఆఫ్ మెగ్నీషియా' అంటారు.
- ఎక్కువ బలం ఉన్న స్ప్రింగ్‌ల తయారీలో కాపర్-బెరీలియం మిశ్రలోహాలను ఉపయోగిస్తారు.
- మెగ్నీషియం పొడిని ఫ్లాష్ పౌడర్ తయారీలో, బల్బులు, సిగ్నల్‌లలో వాడతారు.
- రేడియం అనేది రేడియోధార్మిక మూలకం. దీని లవణాలను 'రేడియో థెరపీ' (కేన్సర్ చికిత్స)లో వాడతారు.
- ముత్యంలో కాల్షియం కార్బొనేట్, ఎమరాల్డ్‌లో బెరీలియం ఉంటాయి.

మాదిరి ప్రశ్నలు

1. ముత్యంలో ప్రధాన అనుఘటకాలేవి?
   1) సోడియం కార్బొనేట్, కాల్షియం కార్బొనేట్
   2) కాల్షియం కార్బొనేట్, మెగ్నీషియం కార్బొనేటు
   3) కాల్షియం ఆక్సైడ్, అల్యూమినియం ఆక్సైడ్
   4) కాల్షియం సల్ఫేట్, కాల్షియం కార్బొనేట్
2. కిందివాటిలో ఏది లోపించడం వల్ల ఎముకలు, దంతాలు బలహీనపడతాయి?
   1) కాల్షియం 2) ఫాస్ఫరస్
   3) ఫ్లోరైడ్ 4) పైవన్నీ
3. సిమెంట్ వేటి మిశ్రమం?
   1) కాల్షియం కార్బొనేట్, కాల్షియం సిలికేట్
   2) కాల్షియం సిలికేట్, కాల్షియం అల్యూమినేట్
   3) ఇసుక, సున్నం, నీరు
   4) జిప్సం, ప్లాస్టర్ ఆఫ్ పారిస్
4. మార్బుల్ రసాయన సంకేతం ఏది?
   1) $Ca(OH)_2$ 2) $CaCO_3$
   3) CaO 4) $CaHCO_3$
5. ఎమరాల్డ్‌లో ఉండే ప్రధాన మూలకం ఏది?
   1) కాల్షియం 2) మెగ్నీషియం
   3) బెరీలియం 4) సిలికాన్
6. సిమెంట్‌కు జిప్సం కలపడానికి కారణం?
   1) గట్టిదనం కోసం
   2) బూడిద రంగు కోసం
   3) నీరు కలిపినప్పుడు ప్రారంభ దశలో నెమ్మదిగా సెట్టింగ్ జరగడానికి
   4) బరువు తూగడానికి
7. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌ను ఏ పదార్థం నుంచి తయారు చేయవచ్చు?
   1) తడిసున్నం 2) జిప్సం
   3) సిమెంట్ 4) మార్బుల్
8. సముద్రపు నీటి నుంచి సంగ్రహించే లోహం?
   1) బంగారం 2) సిల్వర్
   3) మెగ్నీషియం 4) మెర్క్యురీ
9. బాణాసంచా కాల్చినప్పుడు మిరుమిట్లు గొలిపే తెల్లని కాంతినిచ్చే లోహం ఏది?
   1) మెగ్నీషియం 2) కాల్షియం
   3) స్ట్రాన్షియం 4) బేరియం
10. టపాకాయలు కాల్చినప్పుడు సింధూర ఎరుపు రంగునిచ్చే లోహం ఏది?
    1) మెగ్నీషియం
    2) కాల్షియం
    3) బేరియం
    4) స్ట్రాన్షియం

సమాధానాలు

1) 2	2) 4	3) 2	4) 2
5) 3	6) 3	7) 2	8) 3
9) 1	10) 4		

The antonym of Conciliatory is..

MODEL QUESTIONS

Directions (Q. No. 1 - 5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. The greater Hyderabad Municipal Corporation is caught in a catch 22 situation (1)/ to enforcing (2)/ its own flat on stoppage of road cutting (3)/ and evacuation work during monsoon. (4)/ No error (5)
2. The Supreme Court upheld the validity of a Income Tax law (1)/ amendment linking PAN with Aadhar for filling tax returns (2)/ and making Aadhar compulsory (3)/ to apply for a PAN card. (4)/ No error (5)
3. Numismatists felt (1)/ that the demonetization (2)/ exercise was a call on duty (3)/ for them. (4)/ No error (5)
4. Savings remained unclaimed in dormant EPF accounts (1)/ for seven years will be used (2)/ to fund a new scheme (3)/ for providing medical benefits to pensioners. (4)/ No error (5)
5. Sri Lanka skipper Angelo Mathews thanks (1)/ quite a few people (2)/ after the stunning win (3)/ over India on Thursday. (4)/ No error(5)

Directions (Q.No. 6 - 10) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. The media should not be <u>cowed by</u> the government's efforts to encroach upon its freedom.
   1) cowed for
   2) cowed down by
   3) cowed at 4) cowed by for
   5) No correction required
7. Despite her fear of heights, she was thrilled to be <u>up</u> the mountain.
   1) so up 2) far up
   3) so far up 4) on up
   5) No correction required
8. The minister also claimed that all the formalities had been completed and would be implemented <u>in immediate effects.</u>
   1) With immediate effect
   2) In immediate effect
   3) As immediate effects
   4) Immediately effect
   5) No correction required
9. Raghu moved <u>earth as well as heaven</u> to pass the exam but he could not.
   1) Earth as heaven
   2) Heaven as earth
   3) Earth and as heaven
   4) Earth and heaven
   5) No correction required
10. The yoga session on the international yoga day is <u>most likelihood to start at. 6.00 a.m.</u>
    1) Like to start from 6.00 a.m
    2) Most like to start at 6.00 a.m.
    3) Most likely to start at 6.00 a.m
    4) Likely to start on 6.00 a.m
    5) No correction required

Directions (Q.No. 11 - 15): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) The WHO paper asks to integrate traditional and complementary medicine services, where appropriate, into health care service delivery and self-

BANK EXAMS

ENGLISH LANGUAGE

health care and to promote an improved universal health coverage by doing so

B) WTO, WIPO and WHO ask for respect for both the economic value and the social and cultural significance of traditional knowledge


C) Traditional medicine has a long history of use in health maintenance and in disease prevention and treatment, particularly for chronic diseases

D) Traditional medicine, including Ayurveda, contributes significantly to the health status of many communities, and is increasingly used within certain communities in developed countries

E) Suitable recognition of traditional medicine is an important element of national health policies and has as well important basis for new products with significant export potential

F) And supports documentation of traditional medical knowledge and enhanced regulation of quality, safety and efficacy of such products

11. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F
12. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) F 5) E
13. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) E 5) F
14. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) D 4) C 5) E
15. What is the FIFTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F



Directions (Q.No. 16-20): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

16. A major tragedy was _____ after an Air India plane suffered a brake failure and skidded beyond the ____ before coming to a halt.
    1) occurred; aisle
    2) averted; runway
    3) halted; passage
    4) diverted; take off
    5) stopped; trajectory
17. The government is ____ a new data protection law to protect personal data of citizens.
    1) reporting
    2) considering
    3) mulling
    4) sharing
    5) responding
18. The _____ weather patterns of the tropical island meant tourists had to carry both umbrellas and sunglasses.
    1) impertinent 2) supplicant
    3) preeminent 4) illustrative
    5) kaleidoscopic
19. The eager members of the audience found the lecture topic ____, but unfortunately the lecturer' droning voice had a _____ effect.
    1) Interesting; rousing
    2) Advantageous; beneficial
    3) Rudimentary; reassuring
    4) Insipid; bland
    5) Stimulating; soporific
20. Hari's ability to analyze issues fairly and competently has earned him the ____of even his most _____ peers.
    1) solicitation; unbiased
    2) attention; sympathetic
    3) suspicion; discerning
    4) reputation; knowledgeable
    5) respect; exacting

Directions (Q.No. 21-25) Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

With Brexit negotiations set to commence soon, the result will also raise fundamental questions about Britain's Brexit strategy, though perhaps not in the way some had foreseen. The collapse of support for the right-wing UK Independence party had been expected to benefit just the Conservatives, but labour gained from them too, suggesting that the disillusionment that UKIP in part reflected did not necessary involve policies focused around cutting immigration. While Labour has pledged "fair rules and reasonable management of migration", its immigration strategy would be big departure from the tough Conservative approach, making allowances for family reunions and a more welcoming environment for students. However, the results also suggested that there was limited public **appetite** for the Liberal Democrat pledge to hold a second referendum on the terms of the Brexit deal, as the party failed to make the comeback it had hoped to. At the same time, Labour has pledged to **rip up** the Conservatives' white paper and adopt a more **conciliatory** approach to the negotiations, which would include retaining the benefits of the single market and customs union.

21. Which statement is true?
    a) Family reunions and student friendly programs are going to have a tough time.
    b) The immigration policy of the Labour falls in line with the Conservative approach.
    1) Only a 2) Only b
    3) Both a & b 4) Either a or b
    5) Neither a nor b
22. Identify the statement which is false.
    a) The collapse of support for the right-wing UK Independence party had been expected to benefit the Conservatives.
    b) The collapse of support for the right-wing UK Independence party was expected to benefit both the Conservatives and the Labour.
    1) Only a 2) Only b
    3) Both a & b 4) Either a or b
    5) Neither a nor b
23. The antonym of Conciliatory is:
    1) Provocative 2) Pacifying
    3) Appeasing 4) Pacific
    5) Placatory
24. The meaning of the phrase "rip up" is:
    1) Through away 2) Down size
    3) Tear into pieces
    4) Collide together 5) Conjoin
25. The synonym of Appetite is:
    1) Taste 2) Hunger
    3) Food 4) Eatery 5) Desire

KEY

1) 2	2) 1	3) 3	4) 1	5) 1
6) 2	7) 3	8) 1	9) 4	10) 3
11) 2	12) 5	13) 3	14) 3	15) 5
16) 2	17) 3	18) 5	19) 5	20) 5
21) 5	22) 3	23) 1	24) 3	25) 5